వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 6 సంచిక : 10 హైదరాబాద్ 87 అక్టోబర్ 2008 పేజీలు : 60 రు. 10

- ఫోకస్ : ప్రజారాజ్యం పార్టీ - విభిన్న కోణాలు
  ఐదు వ్యాసాలు
- వర్తమాన ప్రపంచం - ఆహార సమస్య
- ఆదివాసులపై నిర్బంధకాండ
- చర్చిలపై దాడులు
- జీవించే హక్కు లేదా?
- మహిళా సాధికారత - రిజర్వేషన్లు

వీక్షణానికి మీ చేయూతనందించండి !

ఆరు సంవత్సరాలుగా ప్రతినెలా మీతో సంభాషిస్తూ, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపై కొత్త ఆలోచనలను, వైవిధ్యపూరితమైన చర్చను ప్రోత్సహిస్తూ, మీ ఆదరణ చూరగొంటూ వస్తున్న వీక్షణం తన ఆర్థికస్థితిని కూడ మీతో పంచుకోదలచుకుంటున్నది.

వీక్షణం ఇప్పుడు నడుస్తున్న పద్ధతిలో, పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరలు, ప్రింటింగ్ ఖర్చులు, కార్యాలయ నిర్వహణ, పోస్టింగ్ వంటి ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక్కొక్క ప్రతికి ఉత్పత్తివ్యయం రు. 14 గా ఉంటున్నది. కాగా ప్రతి సంచికకూ చందాదారులు చెల్లించేది రు. 10. అందులో పోస్టేజి ఖర్చులు మినహాయిస్తే వాస్తవంగా చెల్లిస్తున్నది రు. 9 కన్న తక్కువ. పత్రిక విడిప్రతిని దుకాణాలలో కొనుక్కునేవారు రు. 10 చెల్లించి కొనుక్కున్నపటికీ, ఏజెంట్ కమిషన్ పోగా వారి నుంచి పత్రికకు అందేది ఒక్కొక్క ప్రతికి రు. 6 మాత్రమే. అంటే పత్రిక ఒక్కొక్క ప్రతి చందాదారుల విషయంలో రు. 5 లోటుతో, విడిప్రతి కొనుగోలుదారుల విషయంలో రు. 8 లోటుతో నడుస్తున్నదన్నమాట. పత్రిక ఎన్ని ప్రతులు ఎక్కువ అమ్మకమైతే అంత ఎక్కువగా లోటు పెరుగుతుందన్నమాట. ప్రస్తుతానికి ప్రతినెలా రు. 25,000 లోటుతో పత్రిక నడుస్తున్నది. ఏ పత్రిక అయినా తన ఉత్పత్తి వ్యయాన్నంతా పాఠకులనుంచే రాబట్టడం జరగదు. ఉత్పత్తివ్యయంలో కొంతభాగాన్ని ధరగా నిర్ణయించి మిగిలిన భాగాన్ని వ్యాపార ప్రకటనల రూపంలో సేకరించడం ఆనవాయితీ. ఎన్ని ఖర్చులు పెరిగినా గత నాలుగు సంవత్సరాలుగా ధరనుగాని, వార్షిక చందాను గాని పెంచలేదని, వీక్షణంకు ఇప్పటివరకూ ప్రభుత్వ ప్రకటన తప్ప ఇతర ప్రకటనలు కూడా ఎక్కువగా రావడం లేదని మీకు తెలుసు. వీక్షణం ను నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సర్వేలు చేయడం ద్వారా సంపాదించిన నిధులను వీక్షణం కొరకు ఖర్చుపెడుతున్నది. ఆ పరిస్థితి ఇంకా ఎక్కువ కాలం కొనసాగే అవకాశం లేదు.

ఈ పరిస్థితిలో వీక్షణంను ఆదుకొని, ఆర్థికవనరులను కల్పించి, మనుగడను సుస్థిరం చేయవలసింది మీరే. ఇది మీ పత్రిక, దీన్ని కాపాడుకోవడం, పది కాలాలపాటు నిలిచేలా చూడడం మీ బాధ్యత.

అందుకోసం

- పాఠకులందరూ చందాలు కట్టవచ్చు.
- ప్రతి చందాదారూ మరొకరిని చందాదారుగా చేర్పించవచ్చు, లేదా మిత్రులొకరికి వీక్షణం సంవత్సర చందా కానుకగా ఇవ్వవచ్చు.
- మీ గ్రామంలో, పట్టణంలో మీకు తెలిసిన దుకాణదారు వీక్షణం తెప్పించేలా, సక్రమంగా బకాయిలు చెల్లించేలా చూడవచ్చు.
- మీకు తెలిసిన వారెవరయినా వ్యాపార ప్రకటనలు ఇవ్వగలిగిన స్తోమత, అధికారం కలిగి ఉంటే వారిద్వారా వీక్షణంకు ప్రకటనలు ఇప్పించవచ్చు.

వీక్షణంను ఆదుకోండి

తెలుగునాట ఇటువంటి పత్రిక ఇది ఒక్కటే, దీని మనుగడకు, విస్తరణకు మీ చేయూతనందించండి

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120	మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550	పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com

సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

వీక్షణం 87

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

అక్టోబర్ 2008
సంపుటి : 6
సంచిక : 10

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్:
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

కొత్త దుర్మార్గం కోస్తా కారిడార్

రాష్ట్రంలో ఒక పక్క వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్య చేసుకుంటున్న రైతులు, వ్యవసాయం చేయదలచుకున్నా ఎరువులు దొరకక హాహాకారాలు చేస్తున్న రైతులు, ఏజెన్సీ ప్రాంతాలన్నిటిలో అనారోగ్యంతో, విషజ్వరాలతో అల్లాడుతున్న ఆదివాసులు, ఒక ఉద్యోగానికి వేలాదిగా పోటీపడుతున్న నిరుద్యోగులు, విద్యా, వైద్య–ఆరోగ్య రంగాలలో ప్రైవేటీకరణ వల్ల సాగుతున్న అక్రమాలతో అకాల బలవన్మరణాల పాలవుతున్న ముక్కుపచ్చలారని పిల్లలు, అనారోగ్య పీడితులు – ఒక్కరేమిటి, సమాజం యావత్తూ సంక్షోభమయంగా ఉంటే, ప్రభుత్వం మాత్రం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించుకుంటూ కూచున్న నీరో చక్రవర్తి లాగ తనమానాన తాను వేలాది ఎకరాల భూములను దేశదేశాల సంపన్నులకు కట్టబెట్టే పనిలో తలమునకలయి ఉంది. ప్రత్యేక ఆర్థిక మండలాల పేరు మీద వందలాది ఎకరాల భూమి అప్పగించే పని ఒకవైపున సాగుతుండగానే, రాష్ట్రం 94 సెజ్‌లతో దేశంలోకెల్లా అగ్రభాగాన ఉండగానే, హైదరాబాద్ ను ఒక మహాసెజ్‌గా మార్చడానికి ప్రయత్నాలు సాగుతుండగానే, కోస్తా కారిడార్ పేరుతో అటు కొసన ఇచ్ఛాపురం నుంచి ఇటు కొసన తడవరకు నలభై – యాభై లక్షల ఎకరాల మహామహా మహమ్మారి సెజ్‌ను నిర్మించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. మూడుకోట్ల మంది కోస్త ప్రజల బతుకులను, ఉపాధిని, భవిష్యత్తును ధ్వంసం చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. నిజానికి కోస్తా కారిడార్ అనే కొత్త పేరుతో వస్తున్న ఈ భూదురాక్రమణ కార్యక్రమం తెలుగుదేశం పాలనాకాలంలోనే విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం, తీరం పొడవునా పదికి పైగా చిన్న ఓడరేవులు నిర్మించాలనే విధానంతో మొదలయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధానాన్ని మరింత పెంచి, దానికి ప్రత్యేక ఆర్థిక మండలాల విధానాన్ని కూడ కలిపి అసలు మొత్తం సముద్రతీరాన్నే కబళించడానికి, బహుళజాతి సంస్థలకు, వారి దళారీలకు అప్పగించడానికి ప్రయత్నిస్తోంది. తొమ్మిదివందల కిలోమీటర్లకుపైగా సముద్ర తీరానికీ జాతీయ రహదారికీ మధ్యన ఉన్న కోస్తా ప్రాంతాన్ని ముక్కలుముక్కలుగా విడగొట్టి, ఆకర్షణీయమైన పేర్లు పెట్టి, అక్కడినుంచి ప్రజలను వెళ్లగొట్టి, దశలవారీగా సంపన్నులకు అప్పగించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ మహా సెజ్‌లో ఇప్పటికే 21 చిన్న సెజ్‌లకు అనుమతి ఇచ్చి ఉండగా, ఇప్పుడు కొత్తగా భీమునిపట్నం నుంచి కాకినాడ వరకు పెట్రోలియం, కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్, మచిలీపట్నంలో థర్మల్ విద్యుత్ కేంద్రం, వాడరేవు నుంచి నిజాంపట్నం దాకా వాడరేవు – నిజాంపట్నం పోర్ట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ కారిడార్ అనేవి రాబోతున్నాయని ప్రభుత్వం ప్రకటించింది. వీటివల్ల పద్నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఈ ప్రాంతంలో ప్రవహించి, ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని కూడా ప్రభుత్వం అర్థంలేని అంచనాలు వేస్తున్నది. ఆ పెట్టుబడులు, ఉపాధి అవకాశాల మాట ఏమోగాని, ఈ మహా సెజ్ వల్ల ఇప్పటికే సంపన్నమైన, సారవంతమైన లక్షలాది ఎకరాల పంటభూములు, ఆస్తులు, నగరాలు, పల్లెలు ధ్వంసమైపోతాయి. అక్కడ బతుకుతున్న కోట్లాది ప్రజలకు ఉపాధి కరువైపోతుంది. రెండు ప్రధానమైన ఉదాహరణలు చెప్పాలంటే, ఈ మహాసెజ్ తీరప్రాంతం మొత్తాన్నీ దేశదేశాల సంపన్నుల విలాస కేంద్రాలకు అప్పగించి లక్షలాది మత్స్యకార కుటుంబాలను అక్కడినుంచి తరిమివేస్తుంది. ఆ మత్స్యకారులు ప్రస్తుతం సాలీనా కనీసం ఆరుకోట్ల రూపాయల జలచరాల వ్యాపారం సాగిస్తూ తమ జీవనోపాధి పొందుతున్నారు. అక్కడ పరిశ్రమలు వస్తే గిస్తే ఈ మత్స్యకారులకు ప్రత్యమ్నాయ జీవనోపాధిని కల్పించవు సరిగదా, ఆ ఆరుకోట్ల రూపాయల వ్యాపారం కూడ రద్దయిపోతుంది. అలాగే ఈ మహాసెజ్ వల్ల ధ్వంసమైపోయే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు రాష్ట్రం మొత్తం వరి ఉత్పత్తిలో మూడో వంతును, సాలీనా 26లక్షల టన్నుల వరిధాన్యాన్ని అందిస్తున్నాయి. ఈ వరి భూములన్నీ కారిడార్‌లో భాగమై ఆ వ్యవసాయదారుల జీవితాలు, వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజల జీవితాలు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, తెలుగు ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడతాయి. ఐదు సంవత్సరాలు పాలించమని తమను ఎన్నుకున్న ప్రజల బతుకులను, భవిష్యత్తును ధ్వంసం చేసి అయినా సరే, సంపన్నుల ప్రయోజనాలు నెరవేర్చి, తమ ముడుపులు పొందగలిగితే చాలునని అనుకుంటున్న పాలకుల దుర్మార్గాన్ని అడ్డుకోగలిగినది ప్రజల సంఘటిత ప్రతిఘటనా కృషి మాత్రమే. వీ

ఖైర్లాంజి తీర్పు

ఖైర్లాంజిలో నలుగురు దళితులను అత్యంత దారుణంగా చంపిన నేరస్తులకు ఒక న్యాయస్థానం ఎట్టకేలకు కఠినమైన శిక్షలు విధించింది. నలుగురు నేరస్తులకు మరణశిక్షను, ఇద్దరు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్షను భండారా జిల్లా సెషన్స్ న్యాయస్థానం ఖరారు చేసింది. మరణశిక్షలను సూత్రరీత్యా వ్యతిరేకించేవారు కూడా ఆహ్వానించలవలసిన తీర్పు ఇది. ఈ తీర్పు అమలు కావాలంటే పైన హైకోర్టు, సుప్రీంకోర్టు, క్షమాభిక్ష దరఖాస్తు మీద రాష్ట్రపతి నిర్ణయం వంటి అవరోధాలన్నీ ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటయినా నేరస్తులకు శిక్ష అమలు జరగకుండా అడ్డుకోవచ్చు కూడా. కాని ఒక దళిత కుటుంబంలోని తల్లిని, కూతురిని అవమానించి, వారిపై అత్యాచారం చేసి, ఇద్దరు కొడుకులను చిత్రహింసలు పెట్టి చంపిన నేరస్తులకు ఇటువంటి శిక్ష పడవలసిందే. మరణశిక్షల వల్ల నేరాలు ఆగవనీ, మరణశిక్ష అమానుషమైనదనీ అంగీకరిస్తూనే, సమాజంలో నేరం అనేది ఉన్నంతవరకూ శిక్ష అనేది ఉండక తప్పదని గుర్తించవలసి ఉంది. పాలకులు, చట్టాలు గుర్తించిన నేరాలు మాత్రమే నేరాలు కాదు. కొన్నిసార్లు చట్టాలు నేరాలుగా గుర్తించినవి అసలు నేరాలు కాకపోవచ్చు కూడా. కాని ఖైర్లాంజి మారణకాండ ఎవరయినా గుర్తించవలసిన నేరం. అది ఇటీవలి కాలంలో జరిగిన అమానుషమైన హత్యాకాండ. ముగ్గురు బిడ్డల తల్లి అయిన నలభై ఐదు సంవత్సరాల స్త్రీని ఊళ్లో పరుగెత్తించి, అత్యాచారం జరిపి హత్య చేశారు. పదిహేడేళ్ల కూతురి మీద అత్యాచారం జరిపి చంపేశారు. ఆమెమీద అత్యాచారం జరపమని ఇద్దరు అన్నల మీద ఒత్తిడి చేశారు. ఆ ఇద్దరు అన్నలలో ఒకరు వికలాంగుడు. అంత నీచమైన పని చేయబోనని ప్రతిఘటించినందుకు ఆ ఇద్దరినీ చిత్ర హింసలు పెట్టి చంపేశారు. ఇంత అమానుషత్వం శిక్షించబడకుండా పోగూడదు. ఇంతకూ ఆ నేరాలు చేసినవారు సాంప్రదాయిక అర్థంలో అగ్రవర్ణాలు కూడా కాదు. నయాసంపన్నులైన శూద్రకులాల వారు. మనుధర్మం బోధించిన అంతరాలు, తమకన్న కింది అంతస్తులమీద ఉన్న వాళ్లను ఏమయినా చేయవచ్చుననే అహంకారం కొనసాగినన్నాళ్లు ఖైర్లాంజిలు జరుగుతూనే ఉంటాయి. వాటిని ఆపడానికి శిక్షలు మాత్రమే సరిపోవు. కులనిర్మూలనా చైతన్యం కావాలి. ఏ రూపంలోనైనా అసమానతలను వ్యతిరేకించే విలువలు కావాలి.

మళ్లీ బాంబు పేలుళ్లు

దేశ రాజధానీ నగరంలో ఐదు చోట్ల వరుస బాంబు పేలుళ్లు జరిగి ఎనిమిది మంది అక్కడికక్కడ మరణించడంతో దేశంలో మళ్లీ ఒకసారి 'ఇస్లామిక్ తీవ్రవాదుల' హింస గురించీ, దాన్ని అరికట్టడానికి తీసుకోవలసిన కఠినచర్యల గురించీ చర్చ మొదలయింది. ఇటువంటి సందర్భాలలో ప్రభుత్వ సంస్థలు విడుదల చేసే ప్రకటనలు కాక స్వతంత్ర, విశ్వసనీయ సమాచారం ఉండదు గనుక బాంబులు పేల్చారనీ, కుట్ర పన్నారనీ ప్రభుత్వం ఎవరిమీద ఆరోపణలు చేస్తే వాటిని నమ్మవలసిందే గాని గత్యంతరం లేదు. ఇప్పటికే దేశంలో 'అనుమానం తయారీ' పరిశ్రమ భారీగా నడుస్తున్నది గనుక ప్రతి దురంతానికీ ఇస్లామిక్ తీవ్రవాదులనే కారణంగా చూపవచ్చు. పరిశోధన కూడా చేయనక్కర లేదు. ఒకవేళ పరిశోధన చేసినట్టు నటించినా ముందే ప్రకటించిన అనుమానాన్ని బలపరచడానికే చేయవచ్చు. అసలు ఒక్క ఢిల్లీ బాంబు దాడుల సందర్భంలో మాత్రమే కాదు, అంతకు ముందు జరిగిన అన్ని దాడుల విషయంలోనూ ఇదే తంతు పునరావృతమవుతోంది. ఆ దాడుల్లో బలి అయిపోయిన అమాయకులకోసం కన్నీరు కారుస్తూనే, తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలుపుతూనే, ఇటువంటి అర్థరహిత, అమానుషదాడులకు పాల్పడుతున్న వారెవరయినా వారిని తీవ్రంగా ఖండిస్తూనే, ఈ దాడులపై ఇంకా లోతయిన ప్రశ్నలు వేయవలసి ఉంది. ఈ దేశంలో సంపన్నులకు ఒక న్యాయం, పేదవారికి ఒక న్యాయం అమలవుతున్నట్టుగానే, హిందువులకు ఒక న్యాయం, మైనారిటీలకు ఒక న్యాయం అరవై సంవత్సరాలపాటు అమలు చేసిన హిందుత్వ భావజాల ప్రభుత్వాల నిర్వాకం ఫలితంగానే మైనారిటీ మతస్తులలో అభద్రతా భావం వ్యాపించింది. బాబ్రీ మసీదు విధ్వంసకుల మీద, గుజరాత్ మారణకాండ బాధ్యులమీద, మైనారిటీలు ఊచకోతకు గురయిన అనేక సందర్భాలలో సకాలంలో సరయిన చర్య తీసుకొని ఉంటే, ఇవాళ్టి బాంబుదాడులను ఎంత తీవ్రంగానైనా ఖండించవచ్చు. ఇటువంటి సంఘటనలు జరగగానే, కఠిన చట్టాలు, చర్యలు అని ఇల్లెక్కి అరిచేవారు మైనారిటీలమీద అమలవుతున్న వేధింపులను, హింసను, వివక్షను ఆపాలని కూడ అంతే తీవ్రతతో అడగాలి. హింసాకాండకు పాల్పడిన హిందుత్వ సంస్థలమీద కఠిన చట్టాలు అమలు జరగనప్పుడు, చట్టం అదరినీ సమానంగా చూడనప్పుడు, చట్టం తమపట్ల వివక్ష ప్రదర్శిస్తున్నదని అనుమానించేవారు తప్పనిసరిగా చట్టవ్యతిరేక మార్గాలనే వెతుక్కుంటారు. అందువల్ల, ఈ వరుస బాంబు పేలుళ్లు, ఎంత చట్టవ్యతిరేకమయినవైనా, అమానుషమైనవైనా అవి మన చట్టం, రాజకీయ, పాలనావ్యవస్థలలో అమలవుతున్న తప్పుడు ధోరణుల ఫలితాలేనని గుర్తించవలసి ఉంది.

అమెరికా ఆర్థిక సంక్షోభం

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం లేదనీ, సోషలిజం కుప్పకూలిపోయి, ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడిదారీ విధానం అప్రతిహతంగా పురోగమిస్తున్నదనీ పగటికలలు కంటున్నవాళ్లకు తాజా అమెరికన్ ఆర్థిక సంక్షోభం భారీగా బద్దలయి నిద్రాభంగం చేసింది. రెండు రోజుల్లో లేమన్ బ్రదర్స్ అనే మదుపు సంస్థ, ఎఐజి అనే భారీ బీమా వ్యాపార గృహం కుప్పకూలిపోయి, వాటిని కాపాడడానికి అమెరికన్ ప్రభుత్వం స్వయంగా డెబ్బై బిలియన్ డాలర్ల (మూడు లక్షల కోట్ల రూపాయల) ప్రజాధనాన్ని సహాయంగా ఏర్పాటు చేయవలసి వచ్చింది. అసలు మొత్తం ఆర్థిక వ్యవస్థలోని తనఖా వ్యాపారాన్ని సంక్షోభం నుంచి కాపాడడానికి 700 బిలియన్ డాలర్ల సహాయ ప్రతిపాదనలు సాగుతున్నాయి. ఆ సహాయం అందకపోతే ఎఐజి కి 130 దేశాలలో ఉన్న కార్యాలయాలు మూతబడిపోయి వేలాది ఉద్యోగులు వీథుల్లో పడతారు. అంతకన్న ముఖ్యంగా ఎఐజి పెట్టుబడులు పెట్టిన వందలాది పారిశ్రామిక, వ్యాపార సంస్థలు కూడ పేకమేడలలాగ కూలిపోయి రాత్రికి రాత్రి లక్షలాది మంది ఉద్యోగులు రోడ్డున పడతారు. సరుకుల, సేవల ఉత్పత్తి పడిపోతుంది. అమెరికా విదేశ వాణిజ్యం గందరగోళంలో పడుతుంది. ఈ పరిణామాన్నంతా ఒక్కమాటలో చెప్పాలంటే మహాబల సంపన్నమైన అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎంతగా తుమ్మితే ఊడే ముక్కులా ఉన్నదో ఈ ఉదంతం బయటపెట్టింది. ఇప్పటికి ఆ ముక్కు ఊడకుండా ఒక ప్లాస్టర్ వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది గాని, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలోని అనుసంధానం వల్ల ఆ ముక్కు ఊడడమే కాదు, అక్కడ తుమ్మితే ఎక్కడెక్కడో కూడ ముక్కులు ఊడిపోతాయి. సామ్రాజ్యవాదం కాగితపు పులి అనీ, మట్టికాళ్ల మహారాక్షసి అనీ మరొకసారి రుజువవుతున్నది. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : ప్రజారాజ్యం పార్టీ : విభిన్న కోణాలు

ప్రజారాజ్యం పార్టీ రానున్న ఎన్నికలలో అఖండ విజయం సాధిస్తుందనీ, ఆ ప్రభంజనంలో ఇప్పటిదాకా పాలించిన పార్టీలు రెండూ కొట్టుకుపోతాయనీ, చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవుతారనీ కొందరు ఊహిస్తున్నారు. చిరంజీవికి ప్రజాజీవితం గురించి, తెలుగు సమాజ సమస్యల గురించి ఏమీ తెలియదనీ, అందువల్ల ఆ పార్టీ రాజకీయ రంగంలో ఏమీ సాధించజాలదనీ, ఎక్కువలో ఎక్కువ కొన్ని స్థానాలు మాత్రం గెలుచుకోవచ్చుననీ మరికొందరు భావిస్తున్నారు.

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028












- **విభిన్న** – హరిపురుషోత్తమరావు – పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ – 304 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ – 500 001. ఫోన్ : 040 – 24744580
- **స్వాతంత్ర్య పోరాటం – జర్నలిస్ట్ యోధులు – జైలు శిక్షలు** – సి.వి. రాజగోపాలరావు – ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ప్రచురణ – 191 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు : ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 5–9–166, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్ – 500 001. ఫోన్ : 23298672, 23298673; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **బొడ్డుమల్లె చెట్టు** – కవిత్వం – అన్నవరం దేవేందర్ – తెలంగాణ రచయితల వేదిక – 107 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : 9–5–148, సప్తగిరి కాలనీ, కరీంనగర్ – 505 001. సెల్ : 9440763479
- **రెక్కలు పొదిగిన చూపు** – కవిత్వం – సుహాసిని – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : డా. డి.ఎల్. సుహాసిని, తెలుగు రీడర్, డి.ఆర్.డబ్ల్యు కాలేజ్, గూడూరు, నెల్లూరు జిల్లా. సెల్ : 9885288443; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **చరిత్రలో క్రైస్తవం** – శంబుక – 80 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : ప్రత్తిపాటి నవజీవన్, నిడమర్రు (పోస్ట్), మంగళగిరి (మం), గుంటూరు – 522 503; మణి బుక్‌స్టాల్, సండే మార్కెట్ నెల్లూరు; మైత్రి బుక్‌హౌస్, మ్యూజియం రోడ్, విజయవాడ
- **బత్తుల స్మృతిపథంలో...** – రజతోత్సవ సంచిక – బత్తుల వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ , 118 పేజీలు, 1/4 క్రౌన్, రు. 40, ప్రతులకు : బి.వి. మెమోరియల్ ట్రస్ట్, సత్తుపల్లి, ఖమ్మం – 507 303; ప్రజాపంథా, మార్ఫ్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్; నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్; సహచర బుక్‌మార్క్, సుందరయ్య పార్క్ దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్; దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్
- **చెలిమి చందనం చంద్రశేఖరం** – మీడియాహౌస్ పబ్లికేషన్స్, 304 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : మీడియాహౌస్ పబ్లికేషన్స్, 304, శ్రీ దత్త హోమ్స్, బాగ్‌అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013; విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్
- **పెన్షన్ దోపిడిని ప్రతిఘటిద్దాం** – అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ప్రచురణలు – 28 పేజీలు, 1/8 డెమీ, రు. 3, ప్రతులకు : పబ్లిక్ సెక్టర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్, ఎ.పి., 5–9–1112, ఎ.పి.ఎన్.జి.ఒ. హోం, చైతన్య, గన్‌ఫౌండ్రి, ఆబిడ్స్, హైదరాబాద్
- **ఐరేనికుండలు** – డా. మలయశ్రీ కథలు – నవ్యసాహిత్య పరిషత్ , 133 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్ – 500 001
- **బరువెక్కిన బతుకు** – అంబటి నారాయణ – మానస సాహితీ ప్రచురణలు – 66 పేజీలు, 1/8 డెమీ, రు. 35, ప్రతులకు : సుకన్య నారాయణ, సెంది డిపో దగ్గర, నిర్మల్ – 504 106, అదిలాబాద్, సెల్ : 9849326801; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




అణు ఒప్పందం విషయంలో 'వీక్షణం' తీసుకున్న వైఖరి, సంపాదకీయంలో ప్రకటించిన వైఖరి సరైనదేననుకుంటున్నాను. కాని సెప్టెంబర్ సంచికలో దినకర్ గారి ఉత్తరానికి జవాబుగా సంపాదకుల వ్యాఖ్యలో మీ వైఖరి మీద మీకే అనుమానం ఉన్నట్టుగా రాశారు. మీ వైఖరిని సమర్థించుకుంటున్న పద్ధతిలో కాకుండా, 'పాఠకుల విజ్ఞతకే వదిలేస్తున్నాం' అని తటస్థంగా రాశారు. అది ఎందువల్లనో అర్థం కాలేదు.

– ఎన్. రవికుమార్

ఒంగోలు

సెప్టెంబర్ సంచికలో వచ్చిన కె. పుణ్యవతి గారు రాసిన 'తెలుగు భాష–సంస్కృతి' వ్యాసం 'వీక్షణం' ప్రమాణాలకు తగినట్టుగా లేదనిపించింది. 'పాశ్చాత్య భాషల్లో ఇటాలియన్ భాష కర్ణపేయంగా ఉంటుంది. అలాంటి లక్షణం కలదు గనుక, (ప్రాచ్య తూర్పు) భాషల్లో మన భాష ఇటాలియన్ భాష వంటిది అని పాశ్చాత్యులు చెప్పడం జరిగింది' అని ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ మాటకు వివరణ ఇచ్చారు. ఇది పూర్తిగా తప్పు. ఇక్కడ 'కర్ణపేయం' (చెవికి ఇంపుగా ఉండడం) అనే ప్రస్తావనే లేదు. నిజానికి అన్ని భాషలూ కర్ణపేయాలే. ఇంగ్లిష్ వారికి తెలిసిన యూరపియన్ భాషలలో అజంత భాష (ప్రతి పదమూ అచ్చుతో అంతమయ్యే భాష) ఇటాలియన్ ఒక్కటే. మిగిలినవన్నీ హలంత భాషలు. వారు భారత ఉపఖండంలోకి వచ్చినప్పుడు ఇక్కడ కూడ ఒక అజంత భాషగా తెలుగు కనబడగానే ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నారే గాని అది తెలుగు భాషను మెచ్చుకోవడమూ కాదు. దాని సొగసు గురించిన వ్యాఖ్యా కాదు. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్న మాట ఏదో మెచ్చుకోలు సర్టిఫికేట్ అన్నట్టుగా చాలా మంది ఉటంకిస్తున్నారు. 'వీక్షణం' వ్యాసంలో కూడా అట్లాగే రావడం విచారకరం.

– బి. ఎల్లారెడ్డి

కరీంనగర్

మైఖేల్ మీరొపొల్ రచన 'అర్థశాస్త్ర బోధన – అవసరమైన అంశాలు' అద్భుతంగా ఉంది. చదవడం అయిపోగానే మీకు నా అభినందనలు తెలియ జేస్తున్నాను. ఇటువంటి వ్యాసాలు విరివిగా అచ్చు వేయండి.

– పి. భరత్

గుంటూరు

వీక్షణం లాంటి నాణ్యతగల పత్రికలను ప్రజల పక్షాన నిలుచొని ప్రజల్ని చైతన్యం చేసే పత్రికలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. ఆగస్ట్ 2008 లోని మొత్తం వ్యాసాలను చదివాను. చాలా అద్భుతంగా ఉన్నాయి. ఇప్పుడున్న ప్రతి చందాదారుడు తమ నైతిక బాధ్యతగా ఒక స్నేహితుడికి సంవత్సర చందా కట్టి ఈ పత్రికను బహూకరిస్తే వీక్షణం చందాదారులు రెట్టింపవుతారు. పైగా, రచనలు మరింత ప్రచారమవుతాయి. నా వంతు బాధ్యతగా గుజరాత్‌లో ఉన్న నా స్నేహితుడికి ఉపాధ్యాయ దినం నాడు ఈ పత్రికను బహుకరించాల నుకున్నాను.

– ఎం. కేశవరావు

కోల్‌కతా

ఒక్కో పత్రికకు ఒక్కో స్టాండర్డ్ ఉంటుంది. అందులో పడ్డ వ్యాసాలకు గుర్తింపు, హోదా, ప్రత్యేకతలూ ఉంటాయి. దాని స్థాయిని చర్చా వేదికగా మార్చి, విభిన్న మత, రాజకీయ, దోపిడీ ఆర్థిక సమర్థకుల వ్యాసాల్నీ, విషయాల్నీ ప్రకటనల లాగా స్వీకరించగలరా? దినకర్ గారి విపులమైన విమర్శ లేఖను వేయగలిగినారే గాని, వారి సూచనలను గౌరవించలేదు. రచయితల అభిప్రాయాలను ఏకీభవించడం లేదని తప్పుకొనిపోయే అవకాశ పత్రికలు, రిపోర్ట్‌లు, గ్రంథాల స్థాయికి వెళ్లవద్దనే గదా ఆయన కోరింది. మోడినో, అద్వానీనో, మరో మత ప్రచారకుడి వ్యాసాలో మీ పత్రికలో చూడగలమా? అయితే వార ఫలాలూ వేసుకోండి. ఎడిటోరియల్‌లో గానీ, కె.జి. కన్నబిరాన్ వ్యాసంలో గాని 'ప్రజారాజ్యం' (చిరంజీవి పార్టీపై) తగినంత విమర్శ లేనేలేదు. వచ్చే సంచికలోనైనా చూడండి. ఫోకస్ అని ప్రతి చెత్తా రాయొద్దు. రెండు మహానగరాలు– స్వగతం కూడా అంతే. అర్థశాస్త్ర బోధన బాగున్నా ఆ పట్టికలే గందరగోళ పరిచాయి. కనీసం, రంగనాయకమ్మ కేపిటల్ లో వివరించినంతగా కూడా పెట్టుబడి– శ్రమ– లాభాలు వడ్డీలను వివరించినంతగా అర్థం కాలేదు. శుద్ధ అర్థశాస్త్ర–రాజకీయ అర్థశాస్త్ర అన్న విభజనతో, సాహిత్య పాఠాల్నీ సామాజిక పరిస్థితులను వివరిస్తూ విద్యార్థుల ఆలోచనల్ని పెంచేలా చెప్పేవాడిని. ఆ అన్వయం–సైన్స్ పాఠాలలోనూ, చరిత్రలోనూ అన్వయించ వచ్చునీ, కొడవటిగంటి రోహిణీప్రసాద్ గారి సింధు నాగరికత చెప్తుంది గద. హైదరాబాద్ వ్యాసాలు మూడు బాగున్నాయి. టి.ఎన్.ఆర్. పై వి.ఎచ్. గారి పరాధీన భారతం కూడా బాగుంది. ప్రతి వ్యాసం ఆ స్థాయిలో ఉండాలి.

– ఎస్. హజరత్ అలి

గుంటూరు

నేను మొదటినుంచి 'వీక్షణం' మాసపత్రిక చదువుతున్నాను. చాలా ప్రేరణ పొందాను. ప్రస్తుతం నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. అందుకు మీ మాసపత్రిక చాలా ఉపయోగపడుతుంది. నేను చాలా విషయాలు నేర్చుకుంటున్నాను. అంతేకాకుండా, ఇలా పత్రికలకు, మాస పత్రికలకు కొన్ని విషయాలు, వ్యాసాలు (చిన్నవి) రాయడం, తెలియజేయడంలో నాకు ఆసక్తి చాలా ఎక్కువ. అసహజ మరణాల గుర్చి అందరికీ తెలియజెప్పాలన్న మీ ఆలోచనకు చాలా సంతోషం. దీనివల్ల ప్రజల్లో కూడా కొంత చైతన్యం వస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం తన లోపాలను సరిదిద్దుకుంటుంది.

ఇక ఖమ్మం జిల్లా విషయానికి వస్తే అసహజమరణాలకు ముఖ్య కారణం నిర్దిష్టమైన, నాణ్యమైన వైద్యం అందకపోవడం. ఇది ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతుంది. జిల్లాకు ఇద్దరు వైద్య మంత్రులు ఉన్నా, చాలామందికి సరైన వైద్యం అందక చనిపోతున్నారు. పసిపిల్లలలో కూడా ఇది ఎక్కువగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులు సరిగాలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా నుంచి ఒక కేంద్రమంత్రి కూడా ఉన్నారు. అయినా కూడా సరైన చర్యలు చేపట్టక చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఉదాహరణకు, మా నియోజకవర్గం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు నలుగురే. మిగిలిన స్టాఫ్ కూడా తక్కువే. ఆసుపత్రి చుట్టూ పరిసర ప్రాంతాలు కూడా చాలా దారుణంగా ఉంటున్నాయి.

భద్రాచలం పరిసర ప్రాంతాలలోని గిరిజన గ్రామాలలో విపరీతంగా అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే ఐదుగురికి సరైన వైద్యం అందక చనిపోయారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం కూడా అంతంత మాత్రమే అమలవుతుంది. ప్రభుత్వం అనేక రకాల వ్యాధులకు అవసరమైన మందులను సరఫరా చేస్తుంటే, అవి ఇక్కడికి వచ్చేసరికి మధ్యలోనే మాయమైపోతున్నాయి. దీనికి సిగ్గుపడాల్సింది పోయి, వైద్య మంత్రులు సమర్థించుకుంటున్నారు. ఇది కాకుండా గురుకుల, గిరిజన పాఠశాలలో, హాస్టల్‌లో కూడా వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గురుకుల పాఠశాల హాస్టల్‌లో ఒక అమ్మాయి గత సంవత్సరం ప్రాణం పోయింది. రెండవ కారణం పంట నష్టాలు. చాలామంది రైతులు పంటలలో నష్టాలు పొంది, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత నెలలో, ఇల్లెందు మండలానికి చెందిన ఒక రైతుకి, ఎరువులు సరిగా లభించక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంకా చాలామంది రైతులు ఆత్మహత్యాప్రయత్నం చేసుకోవడం జరుగుతోంది. గత సంవత్సరంలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. విద్యుత్ కొరతతో కూడా చాలమంది ఇబ్బంది పడుతున్నారు. మూడవ కారణం కుటుంబహత్యలు. ఈ రోజుల్లో, ఇవి చాలా పెరిగిపోయాయి. ఖమ్మం జిల్లాలో, సరాసరి ఇప్పటికి ఈ సంవత్సరంలో ఆరుగురు చనిపోయారు. నాలుగవ కారణం రోడ్డు ప్రమాదాలు. రోడ్లు సరిగా ఉన్నా నియమాలు పాటించక చాలామంది ప్రాణాలు వదులుతున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామంలో గత సంవత్సరం ఒకే నెలలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరిగి పన్నెండు మంది ప్రాణాలు కోల్పోయారు. సరైన స్పీడ్‌బ్రేకర్స్ లేక ఇలా జరుగుతున్నాయి. వైద్యం తరువాత, ఇదే ముఖ్యకారణం. ఈ సంవత్సరం తొమ్మిది మంది మరణించారు. ఐదవ కారణం ప్రేమలో పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రేమించడం లేదని హత్యాప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఇద్దరు చనిపోయారు. (ఖమ్మంలో ఒకరు, కొత్తగూడెంలో ఒకరు). ప్రధాన కారణాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే, వరుసగా 1) వైద్యం విషయంలో (ఎక్కువగా), 2. రోడ్డు ప్రమాదాలు, 3) పంట నష్టాలు, 4) కుటుంబ హత్యలు, 5) ప్రేమ వ్యవహారాలు. ఇదీ ఖమ్మం జిల్లా పరిస్థితి. వైద్యం విషయంలో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీనికి సరైన చర్యలు చేపట్టకపోతే మరణాల సంఖ్య ఇంకా పెరుగుతుంది.

– కీసర కిషోర్ రెడ్డి

కొర్లగూడెం

సెజ్‌కు వ్యతిరేకంగా ధర్నా

ప్రజా ఉద్యమాల జాతీయ సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ సెజ్‌కు వ్యతిరేకంగా ఆగస్ట్ 25న హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో ప్రజా ఉద్యమాల నేత మేధాపాట్కర్, మానవహక్కుల వేదిక కన్వీనర్ బాలగోపాల్, రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు వినయ్‌కుమార్, పలువురు బాధితులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పాల్గొన్నారు. మేధాపాట్కర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమించాల్సిన సమయమిదని అన్నారు. ప్రభుత్వాలు మారినా విధానాలు ఒకటేనన్నారు. ప్రభుత్వం వేగంగా భూములను పంచుతోందనీ, ప్రజలు తీవ్రంగా ఉద్యమించాలని బాలగోపాల్ అన్నారు.

ప్రజారాజ్యం పార్టీ ప్రకటన

సుదీర్ఘ సస్పెన్స్‌కు తెరదించి చిరంజీవి తన పార్టీ పేరు, జెండా, ఎజెండాను ఆగస్ట్ 26న తిరుపతి అవిలాల సభ ప్రాంగణంలో ప్రకటించారు. పార్టీ పేరు 'ప్రజారాజ్యం' అని ప్రకటించి మూడొంతులు తెలుపు, ఒక వంతు ఆకుపచ్చ, తెలుపు భాగంపై 24 కిరణాలతో ఎర్రటి సూర్యుడు, సూర్యుడి చుట్టూ పసుపు పచ్చగీత కలిగిన జెండాను ఆవిష్కరించారు. జెండా ఉద్దేశ్యాలను వివరించి, తన పార్టీ లక్ష్యాలను వివరించారు. పది లక్షల దాకా జనం వచ్చినట్లు అంచనాలు తెలుపుతున్నాయి. వచ్చిన వారిలో డెబ్బై శాతం యువకులే ఉన్నారు.

నవ తెలంగాణ ప్రజాపార్టీ ఆవిర్భావ సభ

హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో ఆగస్ట్ 27న 'నవ తెలంగాణ ప్రజాపార్టీ (ఎన్.టి.పి.పి.)' ఆవిర్భావ సభ జరిగింది. ఆ పార్టీ అధ్యక్షుడు టి. దేవేందర్ గౌడ్ పార్టీ ఆవిర్భావ సందర్భంగా పార్టీ కార్యక్రమాన్ని, లక్ష్యాలను ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలోనూ, పార్లమెంట్‌లోనూ బిల్లుపెట్టి వెంటనే రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరించిన నవంబర్ ఒకటో తేదీ నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనీ, లేదంటే ఆ మర్నాటి నుంచే తెలంగాణ రాష్ట్రాన్ని మేమే ప్రకటించుకుంటామని అన్నారు.

నిధులు... విధులు... అధికారాల కోసం

నిధులు, విధులు, అధికారాల కోసం ఆగస్ట్ 28న పంచాయితీ సర్పంచ్‌లు హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నా అనంతరం అసెంబ్లీ వైపు దూసుకెళుతున్న సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకున్నారు. తీవ్ర ప్రతిఘటన అనంతరం ఎం.ఎల్.సి. యలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిందుల సత్యనారాయణ రెడ్డిలతో సహా వందలమందిని అరెస్ట్ చేశారు. స్థానిక సంస్థలకు అధికారాల బదలాయింపు డిమాండ్‌తో చేపట్టిన కార్యక్రమానికి కాంగ్రెస్ మినహా అన్ని పార్టీల నేతలూ, సర్పంచ్‌లూ హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు. ఆగస్ట్ 30న ముఖ్యమంత్రి హామీతో సర్పంచ్‌ల సంఘం నేతలు తమ నిరాహార దీక్షలను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు.

అందరిదీ ఇక సామూహిక గానం

తెలంగాణ పార్టీలు, ఉద్యమ సంఘాలు, శక్తులు సెప్టెంబర్ 19న హైదరాబాద్‌లోని సమావేశంలో ప్రత్యేక రాష్ట్ర సాధన దిశగా ఒక్కతాటిపైకి వచ్చి పని చేయాలని నిర్ణయించాయి. తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ శక్తుల ఏకీకరణ సదస్సు జరిగింది. వీరి ఆధ్వర్యంలో తెలంగాణ లక్ష్య సాధనకై తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ పేరిట ఉమ్మడి వేదికను ఏర్పాటు చేశారు. ప్రజాగాయకుడు గద్దర్ దీనికి నేతృత్వం వహించాలనే అభిప్రాయం వ్యక్తమైంది. టి.ఆర్.ఎస్., ఎన్.టి.పి.పి., టి.ఎస్.ఎస్., బి.జె.పి., బి.ఎస్.పి. పార్టీలతో సహా పలు తెలంగాణ ప్రజా సంఘాలు ఇందుకు అంగీకరించాయి.

స్పీకర్‌పై అవిశ్వాసం

రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అసెంబ్లీ స్పీకర్ సురేష్‌రెడ్డిపై టి.డి.పి., టి.ఆర్.ఎస్., బి.ఎస్.పి.లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. సెప్టెంబర్ 15 నాటి ప్రత్యేక సమావేశంలో ఈ తీర్మానం వీగిపోయింది. ఇరు పార్టీలకు చెందిన యాభై రెండు మంది ఎం.ఎల్.ఎ.లు ఏకతాటిపై నిలిచి అవి చర్చకు వచ్చేలా చేశాయి. 'సభ గౌరవ మర్యాదలను కాపాడడంలో విఫలమైనందుకూ, సభా కార్యక్రమాలను నిష్పాక్షికంగా నిర్వహించడంలో విఫలమైనందుకూ, భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ కింద పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైనందుకు సభాపతిని తొలగించాలంటూ ఈ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిపై సంయుక్తంగా పోరాడుతామని టి.డి.పి., టి.ఆర్.ఎస్., సి.పి.ఐ., సి.పి.ఎం., బి.ఎస్.పి. పార్టీలు ప్రకటించాయి.

ఆమ్వే ప్రకటనలపై నిషేధం

ఆమ్వే ప్రకటనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ప్రైజ్ చిట్, మనీ సర్క్యులేషన్‌కు సంబంధించి 'ఆమ్వే ఇండియా ఎంటర్‌ప్రైజెస్' ఎలాంటి ప్రచురణలు, వ్యాపార ప్రకటనలు విడుదల చేయరాదని స్పష్టం చేసింది. ప్రైజ్ చిట్స్, మనీ సర్క్యులేషన్ పథకాల నిషేధ చట్టం (1978)లోని 9వ నిబంధన ప్రకారం సెప్టెంబర్ 15న ఈ ఉత్తర్వులు జారిచేసింది. సంబంధింత చట్టంలోనే నిబంధనలకు వ్యతిరేకంగా ఉండే ఇతరత్రా స్కీంల ప్రకటనలన్నింటికీ ఈ ఆంక్షలు వర్తిస్తాయి. ఆమ్వేకు సంబంధించి ఇలాంటి ప్రకటనలు ప్రచురించిన పక్షంలో ఆ దినపత్రికలు, ఇతర ప్రచురణలు ప్రతులన్నింటినీ స్వాధీనం చేసుకుంటుందని అందులో స్పష్టం చేశారు.

ఇనుప ఖనిజ ఎగుమతిని రద్దు చేయాలి

ఓబులాపురం గనుల నుండి ఉత్పత్తి అయిన ఇనుప ఖనిజం కృష్ణాపట్నం ఓడరేవు ద్వారా విదేశాలకు ఎగుమతి కోసం నడుస్తున్న లారీల వలన ఇప్పటికే నెల్లూరు జిల్లాలో వంది మందికి పైగా చనిపోయారని, వందలాది మంది అంగవికలురు అయ్యారని అక్కడి ప్రజలు, ప్రజాసంఘాలు ఆందోళన వెలిబుచ్చుతున్నాయి. దారి పొడవునా లారీల నుండి వీచే ఇనుప ధూళితో ఇళ్లన్నీ నిండిపోయాయని, ఆహారంలో, గాలిలో, నీటిలో అంతటా కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీ

ప్రభుత్వాలు అసలు చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార సమస్య పెరిగిపోతున్నదని అంటున్నారు **ప్రొ. కె.ఆర్. చౌదరి**

వర్తమాన ప్రపంచం - ఆహార సమస్య

వర్తమాన ప్రపంచం మూడు విషయాల చుట్టూ తిరుగుతోంది. మొదటిది – గుత్తపెట్టుబడి పునాదిగా వర్గ సంబంధాలను పునః ఏర్పాటు చేసుకునే ఉద్దేశ్యంతో శ్రామికవర్గం పైనా, మొత్తం శ్రామిక ప్రపంచంపైనే పెట్టుబడి దాడి చేస్తోంది. రెండోది – ప్రపంచాన్నే మరల వలసప్రాంతంగా చేసి దాన్ని మరల జయించే ఆశతో ప్రజలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద శక్తులు దాడిచేస్తున్నాయి. మూడోది – ప్రపంచ వనరులను పంచుకునే క్రమంలో సామ్రాజ్యవాద శక్తుల మధ్య వైరుధ్యాలు, శత్రుత్వం నెలకొని ఉన్నాయి. అవి పెరుగుతున్నాయి.

ఈ పరిస్థితికి కారణాలేమిటి? మొత్తం ప్రజాపోరాటాలు, ముఖ్యంగా శ్రామిక, కమ్యూనిస్ట్ ఉద్యమాలు వెనుకడుగు వేయడమే. కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు కూలిపోయిన తర్వాత, అమెరికా నాయకత్వంలో పాశ్చాత్య సామ్రాజ్యవాద శక్తులు కొత్త అంతర్జాతీయ సంబంధాలను రూపుదిద్దుకున్నాయి. దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రపంచంపైనా ఆధిపత్యం సాధించడమే. దానికే 'ప్రపంచీకరణ' అనే పేరును తదుపరి పెట్టారు. వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక శక్తి, మిలిటరీ, ద్రవ్య పెట్టుబడులు మొదలైనవాటి ద్వారా తృతీయ ప్రపంచదేశాలపైన ఆధిపత్యం సంపాదించుకుంటున్నాయి. సామ్రాజ్యవాద తృతీయ ప్రపంచ దేశాల సహజ వనరులను, శ్రమశక్తిని దోచుకుంటున్నాయి. అయితే, పరిస్థితుల్లో మార్పులొస్తున్నాయి. రష్యా రాజకీయంగా, ఆర్థికంగా, సైనికపరంగా మరల బలపడుతోంది. చైనా అమెరికాకు సవాలుగా మారుతోంది. లాటిన్ అమెరికా దేశాల్లో సోషలిస్ట్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దేశదేశాల్లో సామ్రాజ్యవాదానికి, దానికి తొత్తులయిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచబ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.)లకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు, ఉద్యమాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ, వర్తమాన ప్రపంచంలో ద్రవ్య పెట్టుబడి (ఫైనాన్స్ క్యాపిటల్) రాజ్యమేలుతోంది. ఈ నేపథ్యంలో ఆహార సమస్యను గురించి చర్చించుకుందాం.

దేశదేశాల్లో ఆహార సమస్య

ఆహారం మానవహక్కు. కానీ పెట్టుబడిదారీ పాలకవర్గాలు ఈ హక్కును కాలరాసాయి. ప్రస్తుతం దాదాపు 80 దేశాల్లో ఆహార సమస్య తీవ్రంగా ఉందని నివేదికలు తెలుపుతున్నాయి. 33 దేశాల్లో ఆహార సంక్షోభం తీవ్రంగా ఉంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో ఆహార సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ఆకలితో మలమలమాడి పోతున్నారు. ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు వాషింగ్‌టన్‌లో మాట్లాడుతూ, '33 దేశాల్లో ఆహార ధరల పెరుగుదల సామాజిక అస్థిరతను కలిగించేదిగా ఉందని' చెప్పక తప్పలేదు. బంగ్లాదేశ్, ఈజిప్ట్, పాకిస్తాన్, థాయ్‌లాండ్, కేమరూన్, ఇథియోపియా, హోండురాస్, ఇండోనేషియా, నైజర్, ఫిలిపైన్స్, సెనెగల్, ఉజ్బెకిస్తాన్, జాంబియా మొదలైన దేశాల్లో ప్రజలు ఆహారం లభ్యంకాక అలమటిస్తున్నారు. ఈ సందర్భంలో ఒక బాధాకరమైన ఉదాహరణ ఇవ్వాల్సి ఉంది. హైతీ దేశంలో మెజారిటీ ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికి కావాల్సిన కేలరీలలో 22 శాతం తక్కువ తింటున్నారు. కొంతమంది ఆకలి బాధను దిగమింగడానికి 'మట్టితో చేసిన బిస్కెట్ల'ను తింటున్నారు. మట్టి, నీరు, కొంత వంటనూనె, ఉప్పు కలిపి ఈ బిస్కట్లు తయారు చేస్తారు. నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఒక ఉద్యమకారుడు ఏమంటారో వినండి, 'జీవన వ్యయాన్ని ప్రభుత్వం తగ్గించకపోతే, వెంటనే అధికారాన్ని వదలుకోవాలి. పోలీసులు, మిలటరీవాళ్లు మమ్మల్ని కాల్చాలనుకుంటే సరే, బుల్లెట్లతో మేం చావకుంటే, ఆకలితో చస్తాం'

ఎందుకు ఆహార సమస్య దేశదేశాల్లో ఇంత తీవ్రంగా ఉంది?

మొదటిది – గతంలో 30-40 ఏళ్లక్రితం ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో ప్రజలు తమకు అవసరమైన ఆహారధాన్యాలను పండించుకునేవారు. కొన్ని దేశాల్లో విస్తారమైన పచ్చికబయళ్లు ఉన్న కారణంగా పశుపోషణకు విశేష ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆ దేశాల ప్రజలకు ఆహార సమస్య ఉండేది కాదు. అయితే, సామ్రాజ్యవాద దేశాలు నేరుగానూ, ప్రపంచబ్యాంక్ ద్వారానూ ఆ దేశాల ప్రభుత్వాలు రైతుల పైన ఒత్తిడి తెచ్చి, ఆశలు కల్పించి ఆ దేశాల్లోని పంటల సరళిని మార్పించారు. సామ్రాజ్యవాద దేశాల్లోని ప్రజలకు అవసరమైన కాఫీ, కోకో, పువ్వులు, పండ్లు తదితర పంటలను పండించాలని చెప్పారు. ఆహార ధాన్యాల స్థానే వాణిజ్య పంటలను పండించమన్నారు. ఈ పంటలను అంతర్జాతీయ మార్కెట్లలో అత్యధిక ధరలతో, డాలర్లతో కొంటామని నమ్మబలికారు. ఆ డాలర్లతో ఆహారాన్ని కొనుక్కో వచ్చుని చెప్పారు. ఆయా దేశాల్లోని రైతులు ఈ మాటలు నమ్మి ఆహార ధాన్యాల సాగును తగ్గించి వేశారు. అరవై శాతం సాగుభూమిలో వాణిజ్యపంటలు వేశారు. మొదట్లో ఒక ఏడు ఎనిమిది సంవత్సరాలు వారి వాణిజ్య

పంటలకు మంచి ధరలే వచ్చాయి. తర్వాత కాలంలో వాణిజ్య పంటల ధరలను తగ్గించి వేశారు. ఆహార ధాన్యాలను కొనలేకపోయారు. వారి ఆహారోత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది. ఆహారధాన్యాల కొరతతో ప్రజలు ఆకలి మంటలకు గురయ్యారు. లక్షలాది మంది ఆకలి చావులకు గురి అయ్యారు. సొమాలియా, జాంబియా మొదలైన దేశాల్లో ఆహార సమస్య తీవ్రంగానే కొనసాగుతోంది. ఈ సమస్యకు కారణం – సామ్రాజ్యవాద దేశాల కుట్రలు, మోసాలే. ప్రపంచబ్యాంక్ వీటికి పలికిన వత్తాసే.

రెండోది – అమెరికా, యూరప్ దేశాలు ఆహారధాన్యాల స్థానే బయో–ఫ్యూయల్స్ తీసుకువచ్చాయి. జీవ ఇంధనాలకు పనికివచ్చే చెట్లను, మొక్కలను భారీ ఎత్తున సాగుచేస్తున్నాయి. మొక్కజొన్న, సోయ, గోధుమ పంటల స్థానే బయో–ఫ్యూయల్స్‌ను సాగుచేస్తున్నారు. ఆయా దేశాల ప్రభుత్వాలు వీటి సాగుకు ఎంతో ప్రోత్సాహమిస్తున్నాయి. అందువల్ల ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది.

మూడోది – ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోయింది. సామ్రాజ్యవాద శక్తులు, వ్యవసాయ వాణిజ్య సంస్థలు తమ లాభాల కోసం వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తున్నాయి.

నాలుగోది – ప్రపంచవ్యాప్తంగా ఆహారధాన్యాల ధరలు మునుపెన్నడూ లేనంతగా పెరిగాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని రకాల ఆహారధాన్యాలు, ముఖ్యంగా, గోధుమ, బియ్యం, మొక్కజొన్న ధరలు పెరిగాయి. అంతర్జాతీయ ఆహార, వ్యవసాయ సంస్థ లెక్కల ప్రకారం, కేవలం ఒక్క సంవత్సరంలోనే అంటే మార్చి 2007 నుండి మార్చి 2008 మధ్యకాలంలో ఆహార ధాన్యాల ధరలు 88 శాతం, నూనెలు 106 శాతం, పాలు, పాల ఉత్పత్తులు 48 శాతం పెరిగాయి. మొత్తంమీద ధరలు ఒక్క సంవత్సరంలోనే 57 శాతం పెరిగాయి.

ప్రపంచబ్యాంక్ లెక్కల ప్రకారం ఫిబ్రవరి 2008 నాటికి 36 నెలల్లో గోధమ ధరలు ప్రపంచ స్థాయిలో 181 శాతం పెరిగాయి. ఆహార ధరలు మొత్తంగా 83 శాతం పెరిగాయి. 2015 వరకు ధరలు పెరుగుతూనే ఉంటాయని ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తోంది.

థాయ్‌లాండ్‌లో బియ్యం ఐదేళ్ల క్రితం టన్నుకు 198 డాలర్లు ఉండేది. గత సంవత్సరం 323 డాలర్లు. ఏప్రిల్ 2008 నాటికి అది 1000 డాలర్లకు పెరిగింది. స్థానిక మార్కెట్‌లలో ధరల పెరుగుదల మరీ ఎక్కువగా ఉంటోంది. హైతీ దేశంలో ఒక వారంలోనే యాభై కేజీల బియ్యం ధర రెట్టింపు అయ్యింది. పెరిగే ధరలతో ప్రజలు ఆహారం కొనలేక ఆకలితో, అర్ధాకలితో అలమటిస్తున్నారు. రోజుకి రెండు డాలర్లకంటే తక్కువ ఆదాయం కలిగినవారు ప్రపంచంలో దాదాపు 300 కోట్లమంది ఉన్నారు. వారు అరవై శాతం నుండి ఎనభై శాతం ఆహారం పైనే ఖర్చు పెడుతున్నారు.

ఐదవది – ఆహారధాన్యాల పంపిణీ, వ్యాపారం గుత్తపెట్టుబడిదారీ కార్పొరేట్ సంస్థలు, సామ్రాజ్యవాద దేశాల బహుళజాతి కంపెనీల అధీనంలోకి వెళ్లిపోయాయి. ప్రపంచంలోనే మొత్తం ఆహారధాన్యాల వ్యాపారాన్ని ఐదు ఆరు బడా బహుళజాతి సంస్థలు శాసిస్తున్నాయి. కార్గిల్, బుంగే, ఆర్చర్ డేనియాల్స్ మిడ్‌లాండ్ మొదలైన కంపెనీల లాభాలు ఆశ్చర్యంగా ఉన్నాయి. 2008 మొదటి నాలుగు నెలల్లో కార్గిల్ కంపెనీ నికరాదాయం 1.03 బిలియన్ డాలర్లు. అంటే గత సంవత్సరం కంటే 86 శాతం పెరిగింది. బుంగే లాభాలు 867 మిలియన్ డాలర్లు అంటే 189 శాతం పెరిగాయి. ఆర్చర్ డేనియల్స్ మిడ్‌లాండ్ లాభాలు 1.15 బిలియన్ డాలర్లు పెరిగాయి. 85 శాతం ధరలు పెరిగాయి. బహుళజాతి కంపెనీలు లాభాల వేటలో ఉన్నాయి. అయితే ఆహారం కోసం ప్రజలు అలమటిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ఇటీవల ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. అదేమంటే, ఈనాడు అమెరికాతో సహా అనేక దేశాల్లో ఆహార సంక్షోభ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం, భారత చైనా దేశాల్లో ప్రజలు బాగా తిని బలిసిపోయారని, అందువల్ల విదేశాలకు భారత్ ఆహార ధాన్యాలు ముఖ్యంగా బియ్యం, గోధుమలను ఎగుమతి చేయడం లేదని అన్నారు. ఈ ప్రకటన నిజాలను నిలువునా పాతిపెట్టేదిగా ఉంది. నిజానికి అమెరికా ప్రజల ఆహార ధాన్యాలు, ఇతర ఆహార పదార్థాల వినియోగంతో పోల్చుకుంటే, భారత ప్రజల వినియోగస్థాయి అత్యంత తక్కువగా ఉన్నట్లు గణాంక వివరాలు తెలుపుతున్నాయి. భారత దేశంలో ఆహార ధాన్యాల తలసరి వినియోగం సగటున సంవత్సరానికి 178 కేజీలు, ఉంటే అమెరికాలో అది ఐదు రెట్లు ఎక్కువగా ఉంది. అది 1046 కేజీలు. పాల వినియోగం రెట్టింపుగా ఉంది. భారత్‌లో 36 లీటర్లు, అదే అమెరికాలో 78 లీటర్లు. వంటల నూనెల వినియోగం సగటున భారత్‌లో 11 లీటర్లు, అమెరికాలో 41 లీటర్లు, మాంసం భారత్‌లో 1.6 కేజీలు, అమెరికాలో 42.6 కేజీలు, అంటే దాదాపు 22 రెట్లు అధికం. భారత్‌లో బియ్యం, గోధుమ, జొన్నలు మొదలైన ఆహారధాన్యాల వినియోగం 2007–08లో 19.73 కోట్ల టన్నులు. అదే అమెరికాలో 31.4 కోట్ల టన్నులు. ఉభయ దేశాల్లోని జనాభాను పోల్చుకుంటే, భారత్‌లో ప్రజల ఆహార ధాన్యాల వినియోగం ఎంత తక్కువగా ఉందో గ్రహించవచ్చు. ఆఫ్రికా దేశాలకంటే భారత్‌లో ఆహార సమస్య తీవ్రంగా ఉంది.

అయినప్పటికీ, జార్జ్‌బుష్ అలాంటి ప్రకటన ఎందుకు చేశారు? భారత ప్రజలను కాలే కడుపులతో పస్తులుంచి, ఆహార ధాన్యాలను ముఖ్యంగా, బియ్యాన్ని అమెరికా ప్రజలను మేపడానికి ఎగుమతి చేయాలా? బుష్ ఆషామాషీగా ఆ ప్రకటన చేయలేదు. తెలికతనంతో చేయలేదు. విషయ పరిజ్ఞానం లేకనూ చేయలేదు. అన్నీ తెలిసే చేశాడు. ఈ ప్రకటనలో మోసం ఉంది. కుట్ర ఉంది. కుతంత్రం ఉంది. సామ్రాజ్యవాద శక్తుల అహంభావం, అహంకారం, దబాయింపు, బెదిరింపులను ఈ ప్రకటన తేటతెల్లం చేస్తోంది.

సామ్రాజ్యవాద దేశాలకు, ముఖ్యంగా అమెరికా దేశానికి చెందిన బహుళజాతి కంపెనీలు అనేక దేశాల్లో ఆహార ధాన్యాల వ్యాపారాన్ని తమ గుప్పెట్లో ఉంచుకున్నాయి. అవి దేశ దేశాల్లో ఆహారధాన్యాల ధరలతో పాటు ఎగుమతి, దిగుమతులను శాసిస్తున్నాయి. మన దేశంలో అమెరికాకు చెందిన కార్గిల్ కంపెనీ గోధుమ, బియ్యం వ్యాపారం చేస్తోంది. భారీ ఎత్తున గోధుమలను పంజాబ్ తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేసి సేకరిస్తోంది. గోధుమలను నిల్వ చేస్తోంది. పిండి తయారు చేసి దేశీయ మార్కెట్లో అమ్ముకుంటోంది. లక్షలాది టన్నుల గోధుమను ఎగుమతి చేసే ప్రయత్నంలో ఉంది. ఎగుమతికి భారత

ప్రభుత్వం అనుమతించడంలేదు. అందువల్లనే అమెరికా ఎగుమతికి అనుమతులివ్వాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వంపైన ప్రకటనలు, తదితర మార్గాల ద్వారా ఒత్తిడి చేస్తోంది. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు అత్యధిక లాభాలను ఆహార ధాన్యాల ఎగుమతుల ద్వారా సాధించి పెట్టడమే సామ్రాజ్యవాద శక్తులకు నాయకత్వం వహిస్తున్న అమెరికా కుటిల ప్రయత్నమని విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాదు, పేద దేశాల్లోని ప్రజలు ఏమితినాలి, ఏ మేరకు తినాలి అని శాసిస్తున్నారు. భారత ప్రజలు ఎక్కువగా తింటే, అది ధరల పెరుగుదలకు దారి తీస్తోందని, అందువల్ల ప్రపంచ ప్రజలు ఆకలికి గురికావాల్సి వస్తుందని బుష్ సెలవిస్తున్నారు. నిజానికి, భారత్ నుండి ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి అయ్యే ఆహార ధాన్యాల స్థాయి అత్యల్పం. బుష్ చెప్పినట్లు ఇది ప్రపంచ ప్రజల ఆహార వినిమయాన్ని ఏ మాత్రం ప్రభావం చేయజాలదు. ఇదంతా సామ్రాజ్యవాదుల మాయాజాలం. బహుళజాతి సంస్థల లాభాలమయం.

ఆహార సంక్షోభం తీవ్రత

మనదేశంలో దాదాపు 35 కోట్ల మంది పేదలకు ఆహారం అందుబాటు గగనతలమవుతోంది. ఆహారం కొరత, పోషకాహారం లేమి కారణాల వల్ల పేదప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, 1998-99లో 51.8 శాతం మంది స్త్రీలు, 74.3 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధ పడుతున్నారు. 2004లో ఐదు సంవత్సరాల పిల్లల్లో 1000కి 5 మంది, పుట్టిన సమయంలో 1000కి 62 మంది పిల్లలు చనిపోతున్నారు.

ఆహార అవసరాన్ని మహాకవి గురజాడ అప్పారావు గారు ఏమన్నారంటే -

తిండి కలిగితే కండ కలదోయ్ / కండ కలవాడేను మనిషోయ్
ఈసురోమని మనుషులుంటే / దేశమేగతి బాగుపడునోయ్

కాబట్టి దేశ ప్రజలందరికీ ఆహారం, ముఖ్యంగా పోషకాహారం అవసరం. ఆ ఆహారమే జనానికి దొరకటం లేదు.

ఆహార సంక్షోభానికి కారణాలేమిటి?

1) ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుకూలంగా మనదేశంలో గతంలో ఎప్పుడో పత్తికి అమలు చేసిన ఫ్యూచర్/ఫార్వర్డ్/భవిష్య మార్కెట్‌ను, ఆహార ధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, మిర్చి మొదలైన వ్యవసాయోత్పత్తులకు ప్రభుత్వం అమలు చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఈ ఉత్పుత్తుల వ్యాపారం జరుగుతోంది. భౌతికంగా మార్కెట్లో ఈ ఉత్పత్తులు ఉండవు. పేపర్ల మీదనే వ్యాపారం జరుగుతోంది. బడా బహుళజాతి సంస్థలు వందల కోట్ల రూపాయలతో ఈ వ్యాపారం చేయగలుగుతున్నాయి. ఫైనాన్స్ పెట్టుబడి ఆహార ధాన్యాల వ్యాపారంలోకి అత్యధికంగా రావడమే ఆహార సంక్షోభానికి మూలకారణం. ఇది స్పెక్యులేటివ్ (సట్టా వ్యాపారం) పెట్టుబడి అరవై శాతం వ్యవసాయోత్పత్తుల వ్యాపారాన్ని భవిష్య మార్కెట్లోనే చేస్తున్నారు. 2000లో కేవలం ఐదు బిలియన్ డాలర్ల వ్యాపారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జరిగేది. 2006 సంవత్సరానికి ఆ వ్యాపారం 175 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ వ్యాపారంలో అత్యధికంగా విదేశీ ఫైనాన్స్ పెట్టుబడి ఉంది. భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించి కంపెనీలు నిలువ చేస్తున్నాయి. తమకు అనుకూలమైన సమయంలో ధరలను పెంచుతున్నాయి. అధిక లాభాలను కొల్లగొడుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తిదారులను దోచుకుంటున్నాయి. పేద ప్రజలనూ (వినియోగదారులను) దోచుకుంటున్నాయి. కార్గిల్, కాంటినెంటల్, ఐటిసి, హిందుస్తాన్ లివర్స్, రిలయన్స్ మొదలైన కంపెనీలు ధాన్యాన్ని సేకరించి, ధరలను పెంచి, అధిక లాభాలకు అమ్ముకుంటున్నాయి. ప్రభుత్వ విధానం ప్రైవేట్ కంపెనీలకే ఊతమిచ్చేదిగా ఉంది.

2) సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌ను దేశీయ బడా పెట్టుబడి దారులకు బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసింది. అందువల్లనే, ఆహారధాన్యాల ధరలు పెరిగాయి, పెరుగుతున్నాయి.

3) ప్రభుత్వ విధానాల మూలంగా దేశంలో ద్రవ్యోల్బణం 12 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణం పెరగడానికి అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోల్, డీజిల్, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం కూడా కారణ మంటున్నారు. ఎప్పుడూ లేని విధంగా క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 147 డాలర్లకు చేరింది. ఇది ఆహార సంక్షోభానికి మరో ముఖ్యమైన కారణం.

4) రూపాయి కొనుగోలు శక్తి పడిపోవడం, 1990-91లో 37 పైసలకే కొనగలిగే వస్తువులకు ఇప్పుడు ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పెట్టాల్సి వస్తోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం మూలంగానూ, పెరుగుతున్న ఇంధనం ధరల వల్లనూ కూడా ఆహార ధాన్యాల ధరలు పెరుగుతున్నాయని విశ్లేషిస్తున్నారు.

5) మనదేశంలో ప్రజల, ముఖ్యంగా పేద ప్రజల కొనుగోలు శక్తి అతి తక్కువ స్థాయిలో ఉంది. దేశంలో దాదాపు 35 కోట్ల మంది పేదరికంలో జీవిస్తున్నారు. జాతీయ అసంఘటితరంగంపైన వేసిన జాతీయ కమిటీ అధ్యక్షుడైన అర్జున్‌సేన్ గుప్తా అంకెల ప్రకారం 77 శాతం శ్రామికులు రోజుకు ఇరవై రూపాయలకంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, అతి తక్కువ ఆదాయాలు, వనరుల లేమీ, పేదరికం మొదలైనవి ప్రజల కొనుగోలుశక్తిని దెబ్బతీస్తున్నాయి. పేదవారు పెరిగిన, పెరుగుతున్న ధరలతో ఆహార ధాన్యాల్ని కొని తినగలిగిన పరిస్థితి లేదు. ఆకలికి, అర్ధాకలికి గురి అవుతున్నారు. పెరిగిన ధరల సెగను మధ్యతరగతి ప్రజలు కూడా తట్టుకోలేకపోతున్నారు. ఆహార సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

6) సరళీకరణ విధానాలు అవలంబిస్తున్నందువల్ల ప్రభుత్వం అక్రమ నిల్వలను, చీకటి మార్కెట్‌ను నివారించలేకపోతోంది. నిత్యావసర వస్తువుల చట్టాన్ని అమలు చేయడంలేదు. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నారు. మధ్య దళారీల వలన స్వేచ్ఛా వాణిజ్యం వలన ఉత్పత్తిదారునికి ఉపయోగం లేదు. వినియోగదారునికి వెసులుబాటు లేదు. ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. భారత ఆహార సంస్థ, సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ మొదలైన ప్రభుత్వరంగ సంస్థలు ఆహార ధాన్యాల సేకరణను పూర్తిగా తగ్గించేశాయి. ప్రజాపంపిణీ విధానం అస్తవ్యస్తంగా ఉంది. ధరల అదుపు,

ప్రజాపంపిణీ విధానం మొదైలన వాటివల్ల ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించడంలేదు.

ఆహార ధాన్యాల ఉత్పత్తి

భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల రేటు తగ్గిపోతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదలరేటు 1980వ దశకంలో 3.33 శాతం ఉంటే, 1990-91 నుండి 2004-05 మధ్య 1.64 శాతానికి పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 18 కోట్ల టన్నుల నుండి 21 కోట్ల టన్నుల మధ్యలో ఊగిసలాడుతోంది. 24 కోట్ల టన్నుల ఆహారోత్పత్తి లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాం. 2020 నాటికి 30 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల అవసరముంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఈ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం. అందువల్ల ఆహార సమస్య భవిష్యత్తులో మరింత తీవ్రమవుతుంది. వ్యవసాయరంగ సంక్షోభమే ఆహార సంక్షోభానికి మూలకారణం.

వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణాలేమిటి?

ప్రపంచబ్యాంక్ విధానాలు అమలు వల్ల ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇవ్వడం లేదు. ప్రభుత్వ పెట్టుబడులు వ్యవసాయ రంగానికి అనుకూలంగా లేవు. వ్యవసాయరంగానికి సబ్సిడీలను అతి తక్కువగా ఇస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారం బహుళజాతి కంపెనీల చేతుల్లోకి పోయింది. ఈ కంపెనీలు వీటి ధరలను విపరీతంగా పెంచాయి. పైగా నకిలీ, కల్తీ విత్తనాలను కూడా సరఫరా చేస్తున్నాయి. రైతాంగాన్ని ఇవి నష్టాల ఊబిలోకి తోస్తున్నాయి. వ్యవసాయోత్పత్తుల అమ్మకంలో ప్రైవేట్ కార్పొరేట్లకి, బహుళజాతి కంపెనీలకి గుత్తాధిపత్యం కల్పించడానికి ప్రపంచబ్యాంక్ సలహా మేరకు రు. 695 కోట్ల ఆర్థిక సహాయంతో మన రాష్ట్రంలో 1110 మండలాలలో ప్రభుత్వమే మార్కెట్లను స్థాపించి అభివృద్ధి చేస్తోంది. ఈ మార్కెట్లలో విదేశీ బహుళజాతి కంపెనీలు కూడా ఏ మోతాదులోనైనా సరుకులు నేరుగా రైతుల నుండి తమకు అనుకూలమైన రేట్లతో కొనవచ్చు, నిల్వ చేసుకోవచ్చు, దేశంలోనే ప్రాసెసింగ్ చేసుకోవచ్చు, అమ్ముకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. అతి త్వరలోనే ఈ కంపెనీలు గుత్తాధిపత్యాన్ని పొందుతాయి. రైతులను, వినియోగదారులను ఉభయులనూ దోపిడీ చేసి లాభాలు దండుకుంటాయి. ఇవన్నీ కూడా ఆహారాన్ని సామాన్యుడికి అందకుండా చేస్తాయి. డబ్ల్యు.టి.ఒ. ఒప్పందాలు కూడా మన వ్యవసాయ ఆహారోత్పత్తిని దెబ్బతీస్తాయి.

హరిత విప్లవ సాంకేతిక పరిజ్ఞానానికి స్థిరత్వం లేదు. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతోంది. పైగా అమెరికా, కెనడా, యూరప్ దేశాలు జీవ ఇంధనం (బయో ఫ్యూయల్స్) కోసం విస్తారమయిన ఆహార పంటల భూములను మళ్లించాయి. మనల్ని కూడా అలా చేయమని ఉపదేశిస్తున్నాయి. 110 కోట్ల మంది జనాభా కలిగిన భారతదేశం ఈ విధానాన్ని అమలుచేస్తే, అత్యధిక జనాభా ముఖ్యంగా పేదవారు ఆకలి మంటలకు ఆహుతి కావాల్సిందే. దీంతో అమెరికాతో అణు ఒప్పందం విషయంలోనే కాదు, ఇంకా అనేక రంగాల్లో మన పాలకులు అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహ మయ్యారు. అదే మన వ్యవసాయ రంగాన్ని, ఆహార భద్రతను ఛిన్నాభిన్నం చేసింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుండి ఎగుమతులకు అనుకూలమైన పంటల వైపు మళ్లించగలిగింది. ఈ పరిస్థితులు మారాలి. ప్రజా పోరాటాల ద్వారానే ఇది సాధ్యమవుతుంది.

ఆకలి, పేదరికానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలు

ప్రజా సంఘాలు, చిల్లర వర్తకులు బియ్యం, తదితర ఆహార ధాన్యాల ధరలు తగ్గించాలని బర్కినొఫాసోలో రెండు రోజుల సార్వత్రిక సమ్మెను నిర్వహించారు.

- బంగ్లాదేశ్‌లో 20,000 మంది జౌళి కార్మికులు సమ్మె చేశారు. ధరలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పోలీసులు భాష్పవాయువు ప్రయోగించినందువల్ల, ప్రజలు ఇటుకలు, రాళ్లతో తిరగబడ్డారు.
- ఈజిప్ట్‌లో ధరలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెను భగ్నం చేయడానికి వేలాదిమంది పోలీసులను ప్రభుత్వం ప్రయోగించింది. ఈ పోరాటంలో ఇద్దర్ని చంపి, ఆరు వందల మందిని జైళ్లకు పంపించారు.
- అబిడిజాన్‌లో మహిళలు బారికేడ్లు కట్టి, టైర్లను కాల్చి, రోడ్లను మూసివేశారు. వేలాదిమంది దేశాధ్యక్షుని భవనానికి కదిలారు. 'మేం ఆకలితో ఉన్నాం, జీవనమే చాల ఖరీదైంది, మీరు మమ్మల్ని చంపుతున్నారు' అంటూ నినదించారు.
- పాకిస్తాన్, థాయ్‌లాండ్‌లలో బీద ప్రజలు పొలాల్లో, గోదాములను ముట్టడించకుండా సాయుధ సైనికులను ప్రభుత్వాలు పంపించాయి.
- ఆహార సంక్షోభానికి మహిళలు కోపోద్రిక్తులయ్యారు. ఉద్యమాలు నిర్మించారు. ఎల్ సాల్వడార్‌లో మహిళలు కుండలు, పళ్లాలు కొట్టుకుంటూ మేం ఆకలితో ఉన్నామని వీధుల్లోకి వచ్చారు. ఐవరి కోస్ట్‌లో మహిళలు వీధుల్లో కొట్లాటకు దిగారు.

అట్లాగే అనేక దేశాల్లో ఉద్యమాలు, పోరాటాలు చేశారు, చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ పోరాటాల్లో ముందున్నారు.

దాదాపు వంద కోట్ల మంది ప్రజలు తీవ్ర ఆహార సమస్యతో సతమతమవుతూ దౌర్భాగ్యపు జీవితాలను గడుపుతున్నారు. వీళ్లలో అత్యధికులు మహిళలే. ఈ ఆకలికి మూలకారణాలేమిటి? సామ్రాజ్య వాదుల అవసరాలు, పేరాశలకు అనుగుణంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆర్థిక కార్యక్రమాలు, విధానాలే కారణం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆహారోత్పత్తి సంక్షోభంలో పడింది. సామ్రాజ్యవాదశక్తులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ఆహారాన్ని, వనరులను కొల్లగొడుతున్నాయి, దోపిడీ చేస్తున్నాయి. అసమాన వాణిజ్య ఒప్పందాలు, ముఖ్యంగా డబ్ల్యు.టి.ఒ. వ్యవసాయ ఒప్పందాలకు లోబడి చేసినటువంటివి, వీటి వల్ల కూడా ఆహార సమస్య పేద దేశాల్లో తీవ్రమైంది. పెట్టుబడిదారీ దేశాల్లోని మహిళలు, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని మహిళలు సామ్రాజ్యవాద దాడిని తిప్పికొట్టడానికి చేతులు కలుపుతున్నారు. సామ్రాజ్యవాదుల దురాశకు కాక, ప్రజలకు ఆహారం అందచేసినప్పుడే ఆకలికి అంతం జరుగుతుంది.

తుమ్మల శేషగిరిరావు



అవినీతికి, అన్యాయానికి వ్యతిరేకంగా, వ్యక్తిగతస్థాయిలోను, సామాజిక స్థాయిలోను నిరంతరం పోరాడిన తుమ్మల శేషగిరిరావు జూలై 28న విజయవాడలో మరణించారు. కృష్ణా జిల్లా ముదునూరులో 1940 జనవరిలో పుట్టిన శేషగిరిరావు విజయవాడలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. గాంధేయ నిరాడంబరత్వానికి, విలువలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టుగా అతి సాధారణమైన జీవితశైలిని అనుసరించిన శేషగిరిరావు మాస్టారు ఒకవైపు హేతువాదిగా, నాస్తికుడిగా మరోవైపు విప్లవోద్యమాల అభిమానిగా కృష్ణా జిల్లాలో ఎన్నో ప్రజాఉద్యమాలతో సన్నిహిత సంబంధంలో కొనసాగారు. పౌరహక్కుల సంఘం కృష్ణా జిల్లా శాఖలో పనిచేశారు. విద్యారంగ పరిరక్షణ కమిటీలో కూడా క్రియాశీలంగా పాలుపంచుకున్నారు. నమ్మిన విలువలను నిత్య జీవితంలో ఆచరించాలనే ఆలోచనను స్థిరంగా, దృఢంగా నమ్ముతూ తాను పనిచేసిన విద్యా సంస్థలలో గాని, తనసమీప ప్రజాఉద్యమాలలోగాని మూఢాచార, హేతువిరుద్ధ, అనుచిత ప్రవర్తనలు తలెత్తినప్పుడు తీవ్రంగా విమర్శించి సవరించడానికి ప్రయత్నించేవారు. సైన్స్ టీచర్‌గా తరగతి గదిలో సైన్స్ చెప్పడం మాత్రమే గాక ఎక్కడైనా శాస్త్రీయ విజ్ఞాన బోధన చేసేవారు. ఖాదీ దుస్తులు, చేతిలో గుడ్డ సంచి దాంట్లో ఎప్పుడూ పుస్తకాలు, కరపత్రాలు, అనేక విషయాలపై ఇతరులతో చర్చించడానికీ, తనకొరకూ కూడా రాసుకున్న నోట్సూ, హోమియో వైద్యంపై అపారమైన నమ్మకం, పాత సైకిలు, నచ్చని విషయాల మీద అతి తీవ్రమైన కోపం, నచ్చిన విలువల కోసం ఎంతకైనా తెగించగల సాహసం కలిస్తే శేషగిరిరావు. వీ

క్యూబా మహా నాయకుడు ఫిడెల్ కాస్ట్రో చెప్పిన మాటలు మనం మననం చేసుకోవాలి – 'ప్రపంచంలో ఎక్కడా ఏ మారణహోమంలోనూ, ఏ యుద్ధంలోనూ ఒక నిమిషానికి, ఒక గంటకు, ఒక రోజుకి ఆకలితో, పేదరికంతో చచ్చినవారంతా ఎక్కువమంది ఉండరు'.

వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ ఇలా అంటున్నారు 'ఆహార సంక్షోభం పెట్టిబడిదారీ నమూనా గొప్ప అపజయమని రుజువైంది'.

లవయా కంపెస్సీన : ఈ సందర్భంలో లవయా కంపెస్సీన సంస్థ ప్రతిపాదించిన ఆహార సార్వభౌమత్వం ఆదర్శనీయమని విజ్ఞులు అంటున్నారు. ఆహార సార్వభౌమత్వం ఆహార భద్రతకు ప్రత్యామ్నాయం. ప్రజలకు ఆహార అందుబాటు మాత్రమే చాలదు. వారికి భూమి, నీరు, వనరుల అందుబాటు అవసరం. ఆహార విధానాలను గురించి తెలుసుకుని, నిర్ణయాలు తీసుకునే హక్కు సంబంధిత ప్రజలకు ఉండాలి. వ్యవసాయ వాణిజ్య వర్గాల కుట్రలకు, అంతర్జాతీయ మార్కెట్లకు ఆహార రంగాన్ని వదిలి వేయకూడదు. ఆహారోత్పత్తికి కీలకమైన చిన్న, మధ్య తరగతి కుటుంబ క్షేత్రాలను తిరిగి ఏర్పరిచినప్పుడు మాత్రమే ప్రపంచ ప్రజల ఆకలిని అంతం చేయవచ్చు. ఏ దేశంలోనయితే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తారో, ఆ దేశ ప్రజానీకానికి పోషక ఆహారం లభించాలి. స్వేచ్ఛా వాణిజ్యం, వ్యవసాయ ఎగుమతుల విధానాలను వ్యతిరేకిస్తూ, దేశీయాంగ వినిమయం, ఆహార స్వయం సమృద్ధిపైన దృష్టి కేంద్రీకరించాలి. ఆహార స్వయం సమృద్ధి, కుటుంబ క్షేత్రాల బలోపేతం, వీటికి అదనంగా కింద కనబరిచిన అంశాలను కూడా లవయా కంపెస్సీన సంస్థ ఆహార సార్వభౌమత్వానికి అవసరమని చేర్చించింది.

1. సంపూర్ణ గౌరవంతో ఆరోగ్య ప్రదమైన సుస్థిర జీవనం గడపడానికి సురక్షిత, పౌష్టిక, సాంస్కృతికంగా సముచితమైన ఆహారాన్ని నాణ్యతతో చాలినంతగా ప్రతి ఒక్కరికీ అందజేయడానికి గ్యారంటి ఇవ్వాలి.
2. తాము పనిచేస్తున్న భూమిపైన యాజమాన్యం, నియంత్రణ అధికారాన్ని భూమిలేని, వ్యవసాయం చేస్తున్న జనానికి, ముఖ్యంగా మహిళలకు ఇవ్వాలి. ఆదివాసులకు తిరిగి భూములను ఇవ్వాలి.
3. భూమి, నీరు, విత్తనాలు మొదలైన సహజ వనరులను కాపాడుకుంటూ జాగ్రత్తగా వాడుకోవాలి. రసాయనిక ఉత్పాదకాలు, ఏకైక వాణిజ్యపంటలు, సాంద్ర, పారిశ్రామిక ఉత్పత్తులపై ఆధారపడటాన్ని అంతం చేయాలి.
4. వ్యవసాయరంగంపై బహుళజాతి కంపెనీల నియంత్రణకు అనుకూలించే ప్రపంచ వాణిజ్యసంస్థ, ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల విధానాలను వ్యతిరేకించాలి.
5. స్పెక్యులేటివ్ పెట్టుబడి (సట్టా వ్యాపారాన్ని) నియంత్రించాలి. దానిపైన పన్ను వేయాలి. విదేశీ బహుళజాతి కంపెనీలపైన కఠిన నియమ నిబంధనలను అమలు పర్చాలి.
6. ఆహారాన్ని ఆయుధంగా వాడటాన్ని అంతం చేయాలి. నిర్వాసితం, బలవంతపు పట్టణీకరణ, రైతుల అణచివేతలను నిలిపివేయాలి.
7. అన్ని స్థాయిల్లోనూ వ్యవసాయ విధానాల రూపకల్పనలో రైతులు, ముఖ్యంగా చిన్నరైతులు, గ్రామీణ మహిళల భాగస్వామ్యానికి గ్యారంటీ ఇవ్వాలి.

ఈ సందర్భంగా ఒక శతాబ్దం వెనుక, కార్ల్‌మార్క్స్ రాసిన విషయాన్ని గుర్తుంచుకోవాలి, 'సాంకేతిక అభివృద్ధికి పెట్టుబడిదారీ వ్యవస్థ మద్దతునిస్తుంది. అయినప్పటికీ ఆ వ్యవస్థ హేతుబద్ధ వ్యవసాయానికి వ్యతిరేకం. ఇలాంటి వ్యవసాయానికి పెట్టుబడిదారీ వ్యవస్థ అనుకూలం కాదు'. మార్క్స్ అభిప్రాయాలు ఈనాటి ఆహార, వ్యవసాయ సంక్షోభాలను రూఢి చేశాయి. మానవ అవసరాలకంటే లాభాలకే ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను ఇచ్చింది. అందువల్ల లక్షలాది మంది రైతులు తమ భూములు వదలాల్సి వచ్చింది. భూమి ఉత్పాదకతను ఈ వ్యవస్థ విస్మరించింది. నేల, నీరు, గాలిని కలుషితం చేసింది. దాదాపు వంద కోట్ల మంది ప్రజలను ఎడతెగని ఆకలికి, పోషక ఆహార లేమికి గురిచేసింది.

ఆహార సంక్షోభం, వ్యవసాయ సంక్షోభం రెండూ హేతుబద్ధతలేని, మానవ వ్యతిరేక వ్యవస్థ వల్ల ఉత్పన్నమైనవి. ప్రపంచ ప్రజలకు ఆహారాన్ని అందించడానికి, పట్టణ, గ్రామీణ శ్రామికజనం చేతులు కలపాలి. ఈ వ్యవస్థను కూలదోయడానికి పోరాట బాటే ఏకైక మార్గం. వీ

ఎన్నికల నాటికి ఏదో ఒక మిషతో మతవిద్వేషాలు రగిల్చి మెజారిటీ వోటు బ్యాంకును కొల్లగొట్టాలనే ప్రయత్నంలో భాగంగానే ఒరిస్సాలో చర్చ్‌లపై దాడులు సాగుతున్నాయంటున్నారు **ఎన్. యాకయ్య, బేతమల్ల సుధాకర్**

ఒరిస్సాలో చర్చ్‌లపై దాడులు

గుజరాత్ ఫార్ములాను దక్షిణాది రాష్ట్రాల్లో అమలు చేయాలని సంఘ్ పరివార్ శక్తులు ఉవ్విళ్లూరుతున్నాయి. రామ మందిర నిర్మాణం నినాదానికి కాలం చెల్లిపోవడంతో ఆ శక్తులు కొత్త నినాదాలకు, వివాదాలకు ప్రాణం పోయాలని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఎన్నికల వరకు ఏదో ఒక మిషతో ప్రజల్లో మత విద్వేషం రగిల్చి మెజారిటీ ఓటు బ్యాంక్‌ను కొల్లగొట్టాలన్న ఎత్తుగడతో బి.జె.పి. పావులు కదుపుతోంది. ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలలో మైనారిటీలపై పాల్పడుతున్న వరుస దాడులే ఇందుకు నిదర్శనం. గోద్రా ఘటనను ఓ సందర్భంగా సాకుగా చేసుకొని ముస్లిం సమాజంపై సామూహిక మానవ హననానికి పాల్పడ్డ సంఘ్‌పరివార్ శక్తులు, ఒరిస్సాలో ఆగస్ట్ 23న మావోయిస్ట్‌ల చేతుల్లో హతమైన లక్ష్మణానంద ఉదంతాన్ని ఆసరాగా చేసుకొని క్రిస్టియన్లపై దాడులకు తెగించారు. స్వామి లక్ష్మణానంద సరస్వతిని తామే హత్యచేశామని సిపిఐ (మావోయిస్ట్) పార్టీ పేర స్పష్టమైన ప్రకటన మీడియాకు విడుదలైనప్పటికీ మతోన్మాద సంస్థలు క్రిస్టియన్లపై దాడులు ఆపలేదు.

కరువు కాటకాలకు నిలయమైన ఒరిస్సాలోని మారుమూల ప్రాంతాల్లో అనాధగా దరిద్రం తాండవిస్తోంది. ఒరిస్సాలోని కంధమాల్, కోరాపూట్ తదితర జిల్లాల్లోనైతే పరిస్థితి మరీ దయనీయం. దళితులు, గిరిజనులు జనాభా ఎక్కువగా ఉండే ఈ ప్రాంతాల్లో విద్య, వైద్యం లాంటి కనీస సౌకర్యాలు ప్రభుత్వపరంగా ఎక్కడా కనిపించవు. అలాంటి ఈ ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే క్రిస్టియన్ మిషనరీలు ప్రవేశించాయి. వాటి లక్ష్యాలు ఏమైనప్పటికీ ఇక్కడి ఆదివాసుల కోసం కొన్ని పాఠశాలలు, ఆసుపత్రులు, అనాధాశ్రమాలు నడుపుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ ప్రాంతంలో అనేక ప్రార్థనాలయాలు వెలిశాయి. వేలాదిగా క్రిస్టియానిటీని తమ మతంగా స్వీకరించారు. ఒరిస్సా ఏజెన్సీ ప్రాంతాల్లో మిషనరీల కార్యక్రమాలు ప్రారంభమైన నాటి నుంచే అక్కడ సంఘ్ పరివార్ సంస్థలు కూడా 'వనవాసీ కళ్యాణ మంచ్' పేరిట తమ శాఖలు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచే మిషనరీలను లక్ష్యంగా చేసుకుని ఆర్.ఎస్.ఎస్. లాంటి సంస్థలు దాడులకు తెగబడ్డాయి. ఇటీవల జరిగిన లక్ష్మణానంద హత్య ఈ శక్తులకు కలిసొచ్చింది. అందివచ్చిన అవకాశాన్ని జారవిడవకుండా క్రిస్టియన్లపై దాడులకు, చర్చ్‌ల విధ్వంసానికి పాల్పడ్డారు.

గోవధ నిషేధోద్యమంలో కీలక పాత్ర పోషించిన వి.ఎచ్.పి. నేత స్వామి లక్ష్మణానంద సరస్వతి, క్రిస్టియానిటీని స్వీకరించారన్న కోపంతో అనేకమంది దళితులపై, ఆదివాసులపై వేధింపులకు, దాడులకు పాల్పడ్డాడు.

ఒరిస్సాలో మైనారిటీలలో ఉగ్రవాదులని, లేదంటే మావోయిస్ట్‌లని ఆయన పనిగట్టుకొని ప్రచారం చేశాడు. ఆ రాష్ట్రంలో జరిగిన అల్లర్లలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్న సందర్భాలు అనేకం ఉన్నట్టు వినికిడి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకునే లక్ష్మణానందను, అతని నలుగురు శిష్యులను హతమార్చామని, ఆ హత్యకు తమ పిఎల్‌జిఎ బాధ్యత వహిస్తుందని పేర్కొంటూ మావోయిస్టులు రెండు దఫాలు ప్రకటనలు విడుదల చేసినప్పటికీ సంఘ్ పరివార్ శక్తులు క్రిస్టియన్లపై తమ దాడులు ఆపలేదు. అసలు ఈ హత్య ముమ్మాటికీ క్రిస్టియన్ సంస్థల పనేనన్నది విఎచ్‌పి భజరంగ్‌దళ్‌ల వాదన.

అయితే ఇప్పటి వరకు అక్కడ పనిచేస్తున్న మిషనరీల చరిత్రను చూస్తే అవి ఎక్కడా ఈ తరహా దాడులకు పాల్పడిన దాఖలాలు లేవు. కేవలం లక్ష్మణానంద హత్యను ఎలాగైనా తమకు అనుకూలంగా మల్చుకొని, మైనార్టీ మతస్తులను భయభ్రాంతులకు గురిచేయాలన్న ఏకైక లక్ష్యంతో దాడులకు దిగాయి. ఒకవైపు క్రిస్టియన్లపై దాడులు చేస్తూనే హిందూ మతోన్మాద శక్తులు కంధమాల్, కోరాపూట్ జిల్లాల్లో తమ చేతికి చిక్కినవారు మతం మార్చుకునేలా బెదిరింపులకు పాల్పడ్డారు.

విఎచ్‌పి నేత హత్య తరువాత జరిగిన విధ్వంసం, హత్యాకాండలో ఇరవై ఆరు మంది అసువులు బాశారు, ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. పదిహేను వేల మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో తలదాచుకోగా, సుమారు డెబ్బై వేల మంది తమ ప్రాంతాల్లోనే శరణార్థులుగా చెట్టుకొకరు, పుట్టకొకరు చెదిరిపోయారు. ఒక్క కంధమాల్ లోనే దాదాపు వెయ్యికి పైగా క్రైస్తవుల ఇళ్లు ధ్వంసమయ్యాయని అంచనా. ఆరు వందల చర్చ్‌లను ధ్వంసం చేయడమో, తగలబెట్టడమో చేశారు. ఒరిస్సాలో ఈ స్థాయిలో దాడులు జరుగుతున్నప్పటికీ బిజెపి కీలుబొమ్మగా మారిన బిజెడి నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భజరంగ్‌దళ్‌ల ఆకృత్యాలను అడ్డుకోకుండా ప్రేక్షక పాత్ర వహించింది. ఒరిస్సాలో ఇలాంటి దారుణాలకు పాల్పడం హిందూ మతోన్మాద శక్తులకు కొత్తేమీ కాదు. 1999 జనవరి 22న ఈ రాష్ట్రంలో జరిగిన ఫాస్టర్ గ్రాహమ్ స్టెయిన్స్ హత్య అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియా నుంచి మిషనరీ పనుల్లో భాగంగా కుష్టు వ్యాధిగ్రహస్తులకు

అటవీ విధ్వంసాన్ని ఎదురొంటూ, చరిత్ర పొడవునా వనరుల దోపిడీని అడ్డుకుంటూ ఉద్యమాలే ఊపిరిగా బతుకుతున్న ఆదివాసులపై అమలవుతున్న నిర్బంధాన్ని వివరిస్తున్నారు **వాకపల్లి స్నేహలత**

ఆదివాసులపై నిర్బంధకాండ

ఈ నాగరిక ప్రపంచానికి అడవంటే ఒక వినోదకేంద్రం, మనస్సునీ, శరీరాన్నీ, కళ్లనూ ఆహ్లాదపరిచే కొండలు, లోయలు, పొగమంచులు, సెలయేళ్లు. కానీ, ఆదివాసి ప్రపంచానికి అడవంటే జీవనాధారం. పోడు వ్యవసాయం, సమష్టి సమన్యాయం, పల్లవించే రేలా రేలా పాట, ఉమ్మడి సాంస్కృతిక గమనం. ఇంతటి ఆకృతిని, ప్రకృతిని, సంస్కృతిని దాచుకున్న అడవంటే నేడు అన్యాయం, ఆకలి, దోపిడీ, హింస. అంతేకాదు అక్రమ నిర్బంధం, అక్రమ అరెస్టులు, అత్యాచారాలు, హత్యలు.

ఏజెన్సీలో ఆదివాసుల మీద పెత్తనం, హింస, దోపిడీ ఇవాళ కొత్తకాక పోవచ్చు. బ్రిటిష్ కాలం నుండి శతాబ్దాలుగా కొనసాగుతున్నదే కావచ్చు. కానీ ఎప్పటికప్పుడు కొత్తగా చెప్పుకోవలసిన, తెలుసుకోవలసిన అవసరాన్ని ఈ ప్రభుత్వాలు మళ్లీ మళ్లీ మన ముందుకు తెస్తున్నాయి. ఎందుకంటే దీర్ఘకాలికంగా నడుస్తున్న విప్లవోద్యమాల వలన ఆదివాసుల శ్రమనీ, సంపదనీ, గనులనీ దోచుకునే అవకాశాలు చేజారిపోతాయని పాలకవర్గాలు బెంబేలెత్తుతున్నాయి. ఉద్యమాలను అణచివేసి ఆదివాసుల పై కొత్త కొత్త హింసాదాడులు ప్రయోగించి తమ దోపిడిని కొనసాగించ దలచుకున్నాయి.

భారత రాజ్యాంగం ఆదివాసులను వెనుకబడిన వర్గంగా గుర్తించింది. జాతీయ జీవన స్రవంతిలో భాగం చేయాలని వారి అభివృద్ధికి ప్రత్యేక చట్టాలను, సదుపాయాలను రూపొందించింది. కానీ ఈనాటికీ మౌలికమైన విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, పోషకాహారం వారికి కరువయ్యాయి. కనీసవసరాలు తీరని ప్రపంచంలో నిత్యం అనేక సవాళ్లతో బతుకుతున్నారు. పైగా ఈ ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ఆకలినీ, అనారోగ్యాన్నీ మిగులుస్తున్నాయి. అధికారంతో, ఆయుధంతో దాడులకు గురిచేస్తున్నాయి. ఈ రెండు రకాల రాజ్యహింసకు ఎన్నో అమాయక ఆదివాసుల గొంతులు వినిపించకుండా, కనిపించకుండా కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వాలు చేస్తోన్న ఈ ప్రత్యక్ష, పరోక్ష హింస గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ నిజాన్ని నిరూపించే వాకపల్లిలు, అమిదేలులు అడుగడుగునా ఏజెన్సీలో ఎన్నో ఎన్నెన్నో. అంతేకాదు, అటు నాగరికుల మీదా అణచివేత ధోరణినే అనుసరిస్తోంది ప్రభుత్వం. గంగవరం, ముదిగొండ తాజా తార్కాణాలు. అయినా ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించలేని మౌనం, అనైక్యత సమాజంలో పేరుకు పోయాయి.

అనాదిగా ఆదివాసులు అడవితల్లి నీడనే తమ భద్రతను, జీవనాన్ని వెతుక్కుంటున్నారు. బయట ప్రపంచంతో సంబంధం లేకుండానే జీవిస్తున్నారు. అయినా ప్రభుత్వాలు ఆదివాసుల అస్తిత్వాన్నీ, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. పోలీసు తుపాకులతో ప్రాణాలను హరిస్తున్నాయి.

విశాఖ ఏజెన్సీలో పోలీసులే పాలకులుగా, విధాతలుగా ఆదివాసులను ఏలుతున్నారు. మితిమీరిన ఆగడాలతో పాశవికంగా అణిచేస్తున్నారు. దేశానికీ, రాష్ట్రానికీ రక్షణ కవచాలుగా ఉండాల్సిన సి.ఆర్.పి.ఎఫ్., పారామిలిటరీ బలగాలు నేడు ఆదివాసి ప్రజలను ప్రభుత్వ విధానాల మాటున నిర్వాసితులుగావిస్తున్నాయి. గ్రామానికి ఐదుగురిని అరెస్ట్ చేయడం పోలీసు విధిగా భావిస్తోంది. దీనినే ప్రభుత్వం ఒక సంక్షేమ పథకంలా అమలు చేస్తోంది. పాడేరు, చింతపల్లి, జి. మాడుగుల, గూడెం, కొయ్యూరు, డుంబ్రిగూడ, పెద్దబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లోని అనేక గ్రామాల్లోని ఆదివాసులు చిన్నా పెద్దా, ఆడా మగా ఏదో ఒక రూపంలో పోలీసు జులుంకి బలి అవుతున్నవారే. భయంతో, అభద్రతతో బతుకుతున్నవారే. ఈ దౌర్జన్యానికి పరాకాష్ఠగానే వాకపల్లిలో పదకొండు మంది మహిళల మీద అత్యాచారం. ఈ ఘటన రాష్ట్ర ప్రజల్నెంతగా కుదిపేసిందో తెలిసిందే. ఇంకా మరెన్నో సంఘటనలు మరుగునపడిపోయాయి.

ఈ సంవత్సరకాలంలో విశాఖ ఏజెన్సీలో ఎన్ని హత్యలూ, ఎన్ని అరెస్టులూ, ఎన్ని అత్యాచారాలూ, ఎంత నిర్బంధం?

సేవలందించేందుకు భారత్‌కు వచ్చిన ఆయనను, ఆయన కుమారులను భజరంగ్‌దళ్ కార్యకర్త ధారాసింగ్ అత్యంత కిరాతకంగా నరికి చంపాడు. ధారాసింగ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించినప్పటికీ, ఆ రాష్ట్రంలో మైనారిటీలపై దాడులు తగ్గకపోగా, అంతకు రెట్టింపయ్యాయి.

కర్ణాటకకు విస్తరించిన దాడులు

ఒరిస్సా విద్వేషాగ్ని కర్ణాటక, మధ్యప్రదేశ్‌లకు విస్తరించాయి. మంగళూరు దాని పరిసర ప్రాంతాలైన ఉడిపి, చిక్‌మంగళూరు జిల్లాల్లో ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి, బిజెపి కార్యకర్తలు ఇరవై చర్చ్‌లను ధ్వంసం చేశారు. బెంగళూరులోని ఓ పురాతన చర్చ్‌కి నిప్పుపెట్టారు.

ఈ దాడుల పరంపరను గమనిస్తే బిజెపి పాలిత లేదా మద్దతిస్తున్న రాష్ట్రాల్లోనే ఇవి ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ అండతోనే సంఘ్ పరివార్ శక్తులు ఈ దాడులకు, హత్యాకాండకు ఒడిగట్టాయని స్పష్టమవుతోంది. ■

ఇవాళ ఆదివాసుల మీద ప్రభుత్వమే దుర్మార్గంగా కత్తిగట్టింది. దీనికి కారణాలను అన్వేషించడానికి అట్టే కష్టపడక్కరలేదు. ఎందుకంటే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ అభివృద్ధి పేరుతో సాగుతున్న విధ్వంసం తెలిసిందే. అలాంటి విధ్వంసమే బాక్సైట్ గనుల రూపంలో విశాఖ మన్యంలో ముందుకొచ్చింది. ఆదివాసులకి అడవే జీవనాధారం. బాక్సైట్ తవ్వకాల వలన పచ్చటి అడవే కాదు తమ గూడేలు, గుండెలు బద్దలవుతాయని గ్రహించారు. ఇప్పటికే దామన్‌జోడి, సీలేరు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టులు ఆదివాసులను నిర్వాసితుల్ని చేశాయి. ఈ అనుభవాలతోనే బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు. గ్రామాల్లో కొచ్చే అధికారులను నిలదీస్తున్నారు, నిర్బంధిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆదివాసుల కష్టాల్లో, నష్టాల్లో భాగమైంది విప్లవోద్యమం. అందుకే ఆ ప్రజల చైతన్యానికి, ప్రతిఘటనా పోరాటాలకి బాసటగా, అండగా నిలబడుతోంది. ఈ ప్రభుత్వాల విధానాల మీద పోరాడుతోంది. ఈ విధంగా బలపడుతోంది ఆదివాసుల వ్యతిరేకత. దానిని అణిచేసి, చిన్నాభిన్నం చేసి బాక్సైట్‌ను తవ్వాలనుకుంటోంది ప్రభుత్వం. సామ, దాన, భేద, దండోపాయ మార్గాల్లో ఆదివాసులను లోబరచుకుంటోంది. అనైక్యతను పెంచుతోంది. ఆదివాసీ ప్రజాప్రతినిధులనే దళారీలుగా మారుస్తోంది. వారి జాతికే అన్యాయం చేసేలా చేస్తోంది. ఈ రాజ్య కుటిలతకు, కుట్రకు వ్యతిరేకంగా ఆదివాసులు పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే 28 మే 2007న కాంగ్రెస్ జెడ్.పి.టి.సి. వైస్ చైర్మన్ సమిడ రవిశంకర్ హత్యకు గురయ్యాడు. సంవత్సరం తర్వాత అదే 28 మే 2008న గునుకురాయిలో నలుగురు మావోయిస్టులు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. ఇది యాదృచ్ఛికం కాదు. ఈ రెండు ఘటనల నడుమ ఎంతోమంది ఆదివాసులు, మావోయిస్టులు పోలీసుల కాల్పుల్లో బలి అయ్యారు, అవుతున్నారు.

ఆదివాసులు బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా సంఘటితమై వివిధ రూపాలలో ఉద్యమిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి కన్నెర్రయ్యింది. ఈ నేపథ్యంలో సమిడ రవిశంకర్ చావుని ఒక సాకుగా చూపింది. ఆదివాసుల మీద దాడులకు పూనుకుంది. ఇక్కడ మొదటగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ఆదివాసీ ప్రతిపత్తి సాధనా కమిటీ నాయకుల మీదే పోలీసులు నిర్బంధానికి పాల్పడ్డారు.

కూంబింగులు

గ్రేహౌండ్స్, పారామిలిటరీ బలగాలు 4 జూన్ 2007 నుండి కూంబింగ్‌ల పేరుతో మారుమూల గ్రామాల మీద దాడులు మొదలుపెట్టాయి. పెద్దబయలు మండలంలోని మత్స్యపల్లి, సొలభం, దిగకంఠవరం, పాడేరు, జి. మాడుగుల మండలాల్లోని దిగసంపల్లి, కిండంగి, వాకపల్లి, కిల్లంపల్లి, బొయితిలి, అమిడేలు, మద్దిగరువు గ్రామాల్లోని ఇళ్లలో జొరబడి సామాగ్రిని, ధాన్యాన్ని చిందరవందర చేసారు. వండుకున్నది తిన్నారు. దాచుకున్న డబ్బుని దోచుకున్నారు. ఒకర్నో, ఇద్దర్నో పట్టుకుపోయారు. కన్నతల్లులకి కడుపుకోత మిగిల్చారు. బంధువులింటికి వచ్చిన వెచ్చంగి భీమలింగాన్ని (ప్రధానపుట్టు నివాసి) మావోయిస్టుల అచూకీ చెప్పమంటూ చెట్టుకు కట్టేశారు. తుపాకీ మడమలతో హింసించారు. భార్య వేడుకోవడంతో ఐదు వందల రూపాయలు తీసుకొని విడిచిపెట్టారు. కాని నేడు భీమలింగం మానసికస్థితి ఎంతో ఆవేదనకు గురిచేసేలా ఉంది.

రీమల పూర్ణచంద్రరావు (ఆదివాసీ స్వయం ప్రతిపత్తి సాధనా కమిటీ కన్వీనర్)ని మూడురోజుల పాటు నిర్బంధించి, చిత్రహింసలు పెట్టారు. కొట్టి నడవలేని స్థితిలో విడిచిపెట్టారు. ఇంకా సల్లంగి సుగునాథం, సూర్యనారాయణ (ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం), జవ్వాది నీలకంఠం (కళాజాత కళాకారుడు), కిల్లో సోమేష్, ఉల్లి సింహాచలం, కుడుముల శేఖర్ మొదలైన ముప్పైమంది ఆదివాసీ విద్యార్థులను, ఉద్యోగులను, కూలీలను, రైతులను ఇంటి నుండి, పనుల నుండి తీసుకుపోయారు. ఆయుధాలతో, జిలెటిన్‌స్టిక్స్‌తో, మందు పాతరలతో పట్టుబడ్డారనే కట్టుకథలల్లారు. మానసికంగా, శారీరకంగా బాధించారు. అన్యాయంగా, అక్రమంగా రవిశంకర్ హత్య కేసుపెట్టి జైలుకి పంపారు. ఈ విచ్చలవిడి అరెస్టులతో ఏజెన్సీ అట్టుడికి పోయింది. నెలల తరబడి బెయిల్ రాలేదు. ఆదివాసీ ప్రజాప్రతినిధులంతా జైలులో మగ్గుతున్నవారిని పరామర్శించారు గాని మరేరకంగానూ ఆదుకోకపోవడం ఆ ప్రజల్నెంతో బాధించింది.

ఈ కూంబింగ్‌ల వేటలోనే గ్రేహౌండ్స్ బలగాలు వాకపల్లి గ్రామానికి చెందిన పాంగి సూర్యం, వంతల ప్రకాష్‌లను మాయం చేసారు. తర్వాత 20 ఆగస్ట్ 2007న వాకపల్లిలో పదకొండు మంది ఆదివాసి మహిళలపై అత్యాచారం చేసారు. గ్రామంలో విధ్వంసాన్ని సృష్టించారు. ఈ వాస్తవాన్ని పోలీసులు, కోర్టులు, ప్రభుత్వం నిస్సిగ్గుగా కప్పిపుచ్చాయి. ఈ నాటికీ ఆ గ్రేహౌండ్స్‌పై చర్యల్లేవు. అంతేకాదు 24 ఏప్రిల్ 2008న అమిడేలు గ్రామంలో పెళ్లిపందిరిలో గ్రేహౌండ్స్ జొరబడ్డారు. దంపతులు కాబోతున్న మనుగూరి శ్రీనుబాబు (18), దర్జా కనకాలమ్మ (16)ల పై దాడి చేసి కొట్టారు. పెళ్లి వంట సామాగ్రిని మంటల్లో పోశారు. గ్రామస్తులంతా కత్తులతో, కర్రలతో ఎదురు తిరిగారు.

విద్యా వాలంటీర్లకు ఇదే పరిస్థితి. రెండు మూడు గంటల కాలినడకన పాఠాలు చెప్పడానికి పోయే వీరిని మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ కొట్టి, తిట్టి బెదిరిస్తున్నారు. తద్వారా బడులు మూతపడడం మారుమూల గ్రామాల్లో సాధారణంగా జరుగుతోంది. పోలీసు బలగాలు 30, 40 మంది ఆధునిక ఆయుధాలతో బస్సులలో ప్రయాణిస్తుంటే ప్రజలంతా ప్రాణభయంతో ఆందోళన పడుతున్నారు. సంతలకెళ్లే వాళ్లని అడ్డుకుంటారు. కొన్ని గ్రామాలకి ఆర్.టి.సి. బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలని నిలిపివేస్తారు. కరెంట్ తీసేయడం, సంతలు జరగనివ్వక పోవడం ద్వారా ఆదివాసుల రోజువారీ జీవనాన్ని అనేక ఇక్కట్లపాలు చేస్తున్నారు. కష్టమొచ్చినా, నష్టమొచ్చినా నలుగురిని మాట్లాడుకోనివ్వరు. మీటింగ్‌లు పెట్టుకోనివ్వరు. పర్మిషన్ ఉన్నా మీటింగ్‌లకి వచ్చే ప్రజలను అడ్డుకొని, యజమానులను బెదిరించి వాహనాలు తిరగనివ్వరు. సంఘాల నాయకులను స్టేషన్‌కి రప్పించి హెచ్చరించడం పరిపాటిగా మారిపోయింది.

బూటకపు ఎన్‌కౌంటర్లు - అరెస్టులు

ఇవాళ పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి కొత్తగా చెప్పుకో వలసిందేమీ లేదు. అవన్నీ పోలీసుల హత్యలని జగమెరిగిన సత్యమే. ఇప్పుడు చెప్పాల్సిందంతా ఈ హత్యల నేపథ్యంలో ఆదివాసుల మీద జరుగుతోన్న కుట్ర. రవిశంకర్ హత్యానంతరం చుట్టుపక్కల గ్రామాల్లోని ఆదివాసి యువతను అరెస్ట్ చేయడమనే ప్రక్రియ గురించి మాత్రమే.

అమిడేలు

26 సెప్టెంబర్ 2007న తెలతెలవారుతోంది. అమిడేలు గ్రామం లో నలుగురు మావోయిస్టులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు, విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ సమయంలో పోలీసులు చుట్టుముట్టి పట్టుకున్నారు. తాళ్లతో కట్టారు, కొట్టి హింసించారు. గొడ్డలితో నరికారు. దారుణంగా కాల్చి చంపారు. పోలీసులు చంపిన విజయ, షకీలా, శ్వేత, చంటి నలుగురూ ఆదివాసి యువతే. ఈ ఘాతుకాన్ని కళ్లారా చూసిన అమిడేలు గ్రామస్తులు భయంతో వణికిపోయారు. ఈ దురాగతం ఇక్కడితో ఆగలేదు. పక్క గ్రామాల్లోని కిల్లో నర్సింగరావు, కిల్లో సన్యాసిరావు, తెరాంల నాగేశ్వరరావు, ఇంతంగి శ్రీనులను బలవంతంగా తీసుకెళ్లి మృతదేహాలను మోయించారు. రాత్రయ్యింది అన్నం తిని పడుకోమన్నారు. తెల్లారాక మందుపాతరలతో పట్టుబడ్డారనే అక్రమ కేసుతో చింతపల్లి కోర్టులో హాజరుపరిచి జైలుకి పంపారు. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు వాళ్లు ఏమయ్యారోనని వారం రోజులపాటు ఆందోళనకు గురయ్యారు.

కన్నవరం

కొయ్యూరు మండలం బొడ్డుమామిడి, నల్లబిల్ల గ్రామాలలో ముప్పై మంది రైతులు పంటపొలాల్ని నాశనం చేసే జంతువుల వేటకి 5 డిసెంబర్ 2007న వెళ్లారు. తిరిగొచ్చి కన్నవరం గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఏరులో ముఖాలు కడుక్కుంటున్నారు. అకస్మాత్తుగా సుమారు నలభై మంది పోలీసులు కాల్పులు జరిపారు. పారిపోతున్న వారి మీద గ్రెనేడ్లు విసిరారు. మామిడి గోపాలరావు, ముసిరి మోహనరావు, మర్రి నాగేశ్వరరావులని కాల్చి చంపారు. వీరంతా అమాయక రైతులు. ఈ సంఘటనలో పదిహేనేళ్ల తాంగుల బలరామ్‌ని మాయం చేసారు. జైల్లో ఉన్నాడని సుమారు రెండు నెలల తర్వాత తెలిసింది. అంతేకాదు కన్నవరం గ్రామస్తుడు మర్రి భాస్కరరావుని, కన్నవరపు లక్ష్మి (ముగ్గురు బిడ్డల తల్లి)ని అన్యాయంగా జైలుకి పంపారు.

గునుకురాయి

28 మే 2008న కామరాజు, సంతోష్, సుజాత, అశోక్‌లను గునుకురాయి గ్రామంలో గ్రేహౌండ్స్ పోలీసులు కాల్చి చంపారు. సుమారు వారం రోజులు గుర్తు తెలియని మృతదేహాలుగా పురుగులు పట్టించి కుళ్ల బెట్టారు. చివరకు బంధువులకు అప్పజెప్పారు. ఈ ఘటనలో తప్పించుకున్న మావోయిస్టుల సమాచారం చెప్పమంటూ జి.కె. వీధి బొడ్డలగొంది గ్రామస్తులను వేధించారు. కొర్రానీలన్న, కొర్రా నూకరాజు, కొర్రా సన్యాసిరావు, కొర్రా బొంజిబాబులను అరెస్ట్ చేసి అక్రమ కేసులతో జైలు పాలు చేశారు.

ఇలాంటి అనేక ఘటనల్లో ఆదివాసుల ప్రాణాలను పణంగా పెడుతోంది పోలీసు యంత్రాంగం. మావోయిస్టులు పాతిన ఎర్ర జెండాలను, స్థూపాలను ఆదివాసులే తొలగించాలి. మందుపాతరల భయంతో ఆదివాసులతో బలవంతంగా తీయిస్తున్నారు. ఇలాగే 16 జూన్ 2007న దారపురానికి (జి.కె. వీధి మండలం) చెందిన గుంట కృష్ణ జెండాతీస్తూ బాంబు పేలుడుకి గురయ్యాడు. ఎడమకన్ను పోగొట్టుకుని గాయాలతో హాస్పిటల్ పాలయ్యాడు. కనీసం నష్టపరిహారం కూడా ప్రభుత్వం చెల్లించలేదు. ఈ పనులకి తనిఖీ స్క్వాడ్‌లను ఉపయోగించడం లేదు. నిర్లక్ష్యంగా ఆదివాసులను బలిపెడుతున్నారు.

దొంగ సరెండర్లు

ఆదివాసులను భయపెట్టి, డబ్బాశ చూపి బలవంతంగా సరెండర్లకు ఒప్పిస్తున్నారు. తద్వారా ఆదివాసి యువతను దళాలతో తిరిగారనీ, దాడులు చేసారని మీడియా ముందు చూపుతున్నారు. ఆ తర్వాత విచారణ పేరుతో వేధిస్తున్నారు. వై. రామవరం మండలం బచ్చులూరి గ్రామంలో కావూరి వరహాలమ్మని మావోయిస్ట్ సభ్యురాలిగా ఒప్పుకోమని చేతిలో గ్రెనేడ్ పెట్టి చంపుతామన్నారు. చివరికి సరెండర్ చూపారు.

జైళ్లలో ఆదివాసుల పరిస్థితి

అన్యాయంగా జైళ్లలో మగ్గిపోతున్న ఆదివాసులంతా ఇరవై ఐదు ఏళ్లలోపు యువతే. వీరికి తమ మీద ఏ కేసు పెట్టారో, ఎన్ని కేసులు పెట్టారో తెలియదు. నెలల తరబడి బెయిల్స్ రావు. బెయిల్ వచ్చినా వేలల్లో ష్యూరిటీలు తెచ్చుకోవాలి. ఇదే అదనుగా లాయర్లు అమాయక ఆదివాసుల నుండి వేలకు వేలు ఫీజులు గుంజుతున్నారు. ష్యూరిటీలు లేనివాళ్లు జైలులో గడపాల్సిందే. ఈ కేసుల వలన ఉన్న పొలం, పంట అమ్ముకోవలసిందే. తమ వారికి తాము జైల్లో ఉన్నామనే సమాచారం తెలియజేయలేని నిస్సహాయస్థితి. ఒక జత బట్టలతో కాలం గడపాలి. అవసరాలు తీరవు. చిన్నచూపు, నిర్లక్ష్యం, వివక్ష ఎదుర్కోక తప్పడం లేదు. చదవడానికి పత్రికలు, పుస్తకాలు ఇవ్వరు. ఆదివాసులకు కేటాయించబడిన ఆహారం అందదు. స్వేచ్ఛగా తిరిగే వీరు జైలు నాలుగ్గోడల నడుమ నలిగిపోతున్నారు. పూట గడవటమే కష్టమైన తమ భార్యాబిడ్డలు ఏమైపోతున్నారో, పంటల కాలం జైల్లో గడిచిపోతుంది అంటూ ఆవేదనతో కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. మహిళల పరిస్థితి మరింత దుర్భరం.

తాంబేళ్ల కమల జి.కె. వీధికి చెందిన ఆదివాసి మహిళ. అనారోగ్యంతో దళాన్ని విడిచిపెట్టింది. ఊరిలో ఉంటున్న కమల మీద సంవత్సరం తర్వాత 22 కేసులు బనాయించి జైల్లో పెట్టారు. బెయిల్స్ రావడం లేదు. రోజూ పాడేరు, చింతపల్లి, విశాఖ, చోడవరం కోర్టులకి వాయిదాలకి తిరుగుతోంది. విశ్రాంతి లేక ఆరోగ్యం క్షీణిస్తోంది. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతోంది. ఆ కేసులన్నీ ఒకేచోట విచారించబడేలా చేయాలని విజ్ఞప్తి చేస్తోంది. కాని పట్టించుకునేవాళ్లు కరువయ్యారు.

జైలు నుండి వచ్చినా తప్పని పోలీసు వేధింపు

బెయిల్ మీద వచ్చిన ఆదివాసులను ఎన్నో ఇబ్బందులు పెడుతున్నారు. షరతుల బెయిల్ వలన స్టేషన్‌లో సంతకాలు పెట్టాలి. వెళితే గంటలు గంటలు నిర్బంధిస్తారు. అడిగితే బూతులు తిడతారు. అనధికారికంగా సంతకాలు తీసుకోవడం, పదే పదే ఫొటోలు తీసుకోవడం, ఆఫీసర్లు మారారంటూ పోలీసుస్టేషన్‌కి తరచు రప్పించుకుని విచారిస్తారు.

ప్రజా ప్రతినిధులు, వి.ఐ.పి.లు ఏజెన్సీ పర్యటనకో, మీటింగ్‌కో వచ్చారంటే బెయిల్ మీద వచ్చిన వారిని అక్రమంగా నిర్బంధిస్తారు. మావోయిస్టులు ఆ ప్రజాప్రతినిధులని ఏమన్నా చేస్తే మిమ్మల్ని

దొంతుల భాస్కర్



మెదక్ జిల్లా కొండపాక జూనియర్ కళాశాలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తూ, మెదక్ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమంలో గణనీయమైన కృషి చేసిన దొంతుల భాస్కర్ ఆగస్ట్ 2న రోడ్డు ప్రమాదంలో మరణించారు. వరంగల్ జిల్లా చేర్యాల మండలం ఐయ్యనపట్ల గ్రామానికి చెందిన భాస్కర్ మెదక్ జిల్లాలో 1979-80 నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ 2002లో జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నాటినుంచి జిల్లాలోని అన్ని పాఠశాలలు తిరిగి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎ.పి.టి.ఎఫ్.) కార్యకలాపాలు విస్తరించడానికి కృషి చేశారు. జిల్లా ఎ.పి.టి.ఎఫ్. ఉపాధ్యక్షుడుగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేశారు. విప్లవోద్యమాలతోను, తెలంగాణ ఉద్యమాలతోను, దళిత బహుజన ఉద్యమాలతోను సన్నిహితంగా మెలిగారు. నిరాండబరమైన కుటుంబ జీవితాన్ని గడుపుతూ బలహీనవర్గాలతో, దళితులతో మమేకమై వారి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. పేదరికం వల్ల చదువుకోలేకపోతున్న విద్యార్థుల కోసం విరాళాలు సేకరించి ఎంతో మంది విద్యార్థుల చదువు కొనసాగడానికి తోడ్పడ్డారు. ఆగస్ట్ 2న కళాశాల ముగిసిన తరువాత జీపులో ప్రయాణిస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని అక్కడికక్కడే మరణించారు. వీ

చంపేస్తామంటూ బెదిరించడం మామూలైపోయింది. (గ్రామం లో జాతర్లు, పండుగలు జరిగినా ఇదే స్థితి). మావోయిస్టు పార్టీ కరపత్రాలో, బ్యానర్‌లో, పోస్టర్లో గోడల మీద కనిపిస్తే వీరి ఇళ్లకి పోయి కాపలా కాస్తారు. పిల్లలనీ, కుటుంబ సభ్యులనీ, చుట్టుపక్కల వారినీ ఎంతో ఆందోళనకి గురిచేస్తున్నారు. అనధికార నోటీసులిస్తూ స్టేషన్‌కి రప్పిస్తారు. మళ్లీ మళ్లీ అరెస్టులు చేస్తున్నారు. ఇటీవల అనేక గ్రామాలలోని సర్పంచ్‌లు, ప్రెసిడెంట్లు, మరికొంతమందిని మావోయిస్టు సానుభూతి పరులుగా పేర్కొన్నారు. 24 గంటల్లో లొంగిపోవాలని లేకపోతే అరెస్టులు చేస్తామన్నారు. విశాఖ పోలీసు యంత్రాంగం వారి పేర్లతో సహా పత్రికల్లో ప్రకటించింది. ఆ ప్రజలంతా ఎంతగానో తల్లడిల్లిపోతున్నారు.

ఉద్యమించే ప్రజలను ఏమైనా చేయొచ్చుననీ చట్టవిరుద్ధంగా ఆ ప్రజల మీద మూకుమ్మడి దాడిని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. పోలీసులే ప్రజల్ని నేరస్తులుగా తయారు చేసే యంత్రాంగంగా పనిచేస్తున్నారు. బిసాయి (జగన్)ని 27 జూలై 2008న అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజులపాటు మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ హింసించారు. పౌరహక్కుల సంఘం నాయకుడు సుగునాథంను చంపమన్నారు. హత్యానేరానికి ప్రోత్సహించారు. ఉద్యోగమిస్తామనీ, డబ్బిస్తామనీ ఆశ చూపారు. అంగీకరించని జగన్ మీద కేసు పెట్టారు. జగన్ తనకి రక్షణ కల్పించాలంటూ పత్రికలకి మొరపెట్టుకున్నాడు.

చత్తీస్‌గఢ్‌లో సాల్వాజుడుం బాధితులుగా గుత్తికోయలు వలస వస్తున్నారు. వారిని అరాచక శక్తులుగా, నేరమే స్వభావం కలవారిగా చిత్రిస్తున్నారు. విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వారిని అడవి నుండి తరిమేయాలని స్థానిక ఆదివాసులను రెచ్చగొడుతున్నారు. ఆదివాసుల నడుమ యుద్ధవాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఇదే గనుక కొనసాగితే ఆదివాసులు ఎదుర్కోబోయే భవిష్యత్ పరిణామాలను ఊహించలేం.

ఆదివాసుల మీద, ప్రజల మీద విచ్చలవిడిగా పెత్తనం చెలాయించే అధికారం పోలీసులకు లేదు. శాంతిభద్రతల పేరుతో దారుణ మారణ నిర్బంధకాండను అమలు చేయకూడదు. ఆదివాసులు పోరాటమే జీవితంగా, జీవితమే పోరాటంగా బతుకుతున్నారు. వారి సమస్యలను అర్థం చేసుకుని కనీసం చట్టరీత్యా కొంతమేలైనా చేయడం ప్రభుత్వ బాధ్యత. మన రాజ్యాంగం ప్రకారం చట్టాలకు ఎవరూ అతీతం కాదు. ఈ మాట ఇటు ప్రభుత్వానికి, అటు పోలీసులకు కూడా వర్తిస్తుంది. ప్రజల జీవన్మరణ సమస్యలను శాంతిభద్రతల దృష్టి నుంచే చూడటం ప్రభుత్వానికి పరిపాటైపోయింది. దీనిని ఈ ప్రభుత్వాలు ఎంత త్వరగా మానుకుంటే అంత మంచిది.

మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు మేలుకొని ఆదివాసులతో గొంతు కలిపి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. ఇది మనందరి తక్షణ కర్తవ్యం. వీ

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికే 15 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

- సంపాదకులు

ఇంకా అధికారికంగా తన ప్రణాళికనూ, విధానాలనూ, రాజకీయ కార్యక్రమాన్నీ ప్రకటించలేదు. కాని అనేక అంశాల మీద అధినాయకుడు చిరంజీవి తమ వైఖరి ప్రకటించాడు. వేరువేరు పత్రికల నుంచి ఆ వ్యాఖ్యలు : **ప్రజారాజ్యం పార్టీ**

ప్రజారాజ్యం పార్టీ విధానాలు

ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించాలన్న తపన, వారు ఆశిస్తున్న మార్పును ఆచరణలో చూపాలన్న ఆకాంక్ష, పేదరికానికి శాశ్వత నిర్మూలన పరిష్కారం చూపాలన్న మనోనిశ్చయంతో, రాజకీయ ప్రవేశం చేశానంటున్న ప్రజారాజ్యం పార్టీ అధినేత, లక్షల మంది అభిమానులను సంపాదించి పెట్టిన సినిమాలను వదిలి, పార్టీని స్థాపించి, జనం సమస్యలను ఆకళింపు చేసుకోవడానికి వారి చెంతకు వెళ్లే ప్రయత్నాల్లో ప్రస్తుతం నిమగ్నమై ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజారాజ్యం కచ్చితమైన ఆధిక్యం సాధించి, అధికారంలోకి వస్తుందన్న దృఢ విశ్వాసం ఆయన మాటల్లో తొణికిసలాడుతోంది. పొత్తులకు వ్యతిరేకం కాదంటూనే, వాటి గురించి ప్రస్తుతం ఆలోచించడం లేదంటున్నారు. అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందకపోవడానికి అవినీతే కారణమంటూ, ప్రజల పేదరికమే ప్రజారాజ్యం పుట్టుకకు నేపథ్యమని వెల్లడించారు. దాని నిర్మూలనకు తాత్కాలిక జనాకర్షక పథకాలు కాకుండా, శాశ్వత పరిష్కార మార్గాలు చూపుతామని ఉద్ఘాటించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సంతృప్తికర స్థాయిలో అందుతుంటే ప్రజలు ఎదురొచ్చి తననెందుకు ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. మార్పు కోసమే ఎన్.టి.ఆర్. అప్పట్లో రాజకీయాల్లోకి వచ్చారని, తాము కూడా మార్పు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక భావన, అభివృద్ధి వేర్వేరని చెబుతూ, రానున్న ఎన్నికలు, ఇతర పార్టీల నుంచి వలసలు, పార్టీ అజెండా, కుటుంబ పాలన, భూసేకరణ, ప్రస్తుత సర్కారు విధానాలు, తదితర అంశాపై సాధికారికంగా, స్పష్టంగా తన భావాలను విశదీకరించారు :

- మార్పు అంటే జీవన విధానంలో కొత్త ఒరవడి. జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావడం. ఇది నిరంతర ప్రక్రియ. ఎన్.టి.ఆర్. ఇలాంటి మార్పు కోసమే వచ్చారు. మేం మార్పు చూపాక అందరూ ఒప్పుకొంటారు. అన్ని రకాల సమస్యలపై మాకు స్పష్టత ఉంది. అన్ని సమస్యల వెనుకనున్న కారణాలూ తెలుసు. వీటిని నిశితంగా పరిశీలిస్తున్న మాకు వాటి పరిష్కార మార్గాలూ కనిపిస్తున్నాయి.
- అభివృద్ధి పేరుతో ఎవరు లబ్ధి పొందుతున్నారో ప్రజలకు తెలుసు. ఎవరు ఎలా చెప్పినా, ఎలా చెప్పి సమర్థించుకున్నా, అది సమర్థింపే తప్ప సత్యం కాదు. ప్రజలు అభివృద్ధి చెందడం లేదన్న భావన రోజురోజుకూ పెరుగుతోంది. దారిద్ర్య రేఖకు దిగువనున్నవారు మరింతగా దిగజారుతున్నారు. సంపద కింది స్థాయికి అందడం లేదు. అందరికీ నాణ్యమైన జీవనం ఎందుకు సాధ్యం కావడం లేదు? అవినీతి, నాయకుల్లో చిత్తశుద్ధి లేమే దీనికి కారణం. రూపాయి ఖర్చు చేస్తే ఎన్ని పైసలు కిందకు వెళుతున్నాయి.? దీనిపై రాజీవ్ గాంధీ చెప్పిన విషయాలు అందరికీ తెలుసుకదా?
- అన్ని సమస్యలపై అధ్యయనం చేస్తున్నాం. స్పష్టతా ఉంది. రాష్ట్రంలో అపారమైన సహజవాయువు నిక్షేపాలున్నా, మనం వినియోగించుకోలేక పోతున్న వైనం తెలుసు. సరైన సంపాదన, కొనుగోలు శక్తి లేక వివిధ వర్గాలు పడుతున్న బాధలపైనా అవగాహన ఉంది. ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు మూసివేస్తున్న సంగతీ తెలుసు. ఎంత మందికి కార్పొరేట్ వైద్యం అందుతోంది? ప్రజాకర్షక పథకాలు ఏ మేరకు అందుతున్నాయో అవగాహన ఉంది.
- ఏదో ఒక ఆసరా కోసం వివిధ పార్టీల్లో ఉన్న నాయకులు మా విధి విధానాలు నచ్చి వస్తున్నారు. అందరినీ ఆహ్వానిస్తున్నాం. అంకిత భావం ఉన్న వారే చివరకు పైకొస్తారు. ఏ పార్టీకీ చెందని తటస్థులూ భారీగా వస్తున్నారు. ఎనభై శాతం మేర కొత్తవారికే అవకాశమివ్వాలన్న మా విధానంలో ఎలాంటి మార్పులేదు. పార్టీలోకి వచ్చే సీనియర్లతో వీరికెలాంటి ఇబ్బందీ ఉండదు. పదవులు ఆశించకుండా సేవాదృక్పథంతోనే అందరూ వస్తున్నారు.
- వ్యక్తిగతంగా ఎవరినీ దూషించం. రాజకీయాలకు గౌరవం తీసుకొస్తాం. స్వార్థపూరిత విధానాలు ఎండగడతాం. పైకి కనిపించకుండా అంతర్లీనంగా ఉండే దురుద్దేశాలు, విధాన లోటుపాట్లపై మాట్లాడతాం.
- మాకు ధనబలం లేకున్నా, ప్రజా బలముంది. ఎన్నికల్లో ధన ప్రభావాన్ని నిరోధించే బాధ్యత మాదికాదు. ప్రజలదే. మాపరంగా ప్రచారానికి కనీస స్థాయిలో ఖర్చు చేస్తాం. తప్పితే ఇతరత్రా ఎలాంటి వ్యయమూ ఉండదు.
- ప్రజలే నాయకుల్ని నడిపించాలన్నది మా విధానం. ప్రజల అజెండాతో మేం వారి వద్దకు వెళ్లాక, వారిచ్చిన తీర్పునకు అనుగుణంగా మా పాలన ఉంటుంది. కచ్చితంగా వారి అజెండా అమలవుతుంది. ఏ రకంగానూ వమ్ము చేయం. అదే ప్రజలు నడిపించే పాలన అంటే.
- కాంగ్రెస్ అధికారంలో ఉంది కనుక వాస్తవాల ప్రాతిపదికనే దానికి మేమే ప్రత్యామ్నాయని భావిస్తున్నాం.
- నన్ను అర్థం చేసుకుని నాకు సహకరించాలనే ఉద్దేశంతో నా కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. ఇది సహజం.

సర్వసాధారణం. వారి వంతు ధర్మం కూడా. నాతోపాటు క్రమంగా నాయకులు చేరడం, బాధ్యతలు తీసుకుంటుండడంతో కుటుంబ సభ్యులు వెనక్కి వెళ్లిపోతున్నారు. తమ్ముళ్లైనా, అరవింద్ సన్నిహితులైనా అర్హతలుండి, ప్రజల కోరిక మేరకు, ప్రజలు ఆహ్వానిస్తే రాజకీయాల్లోకి రావడం కుటుంబ పాలన ఏమీకాదు. వారికేమీ ఆశలు లేవు.

- పేదల ఆకలిని తీర్చేందుకు ప్రజాకర్షక విధానాల వంటివి తాత్కాలికంగా పనిచేస్తాయి. చేపలు చేతికందించడం కాదు. వాటిని పట్టే విధానం నేర్పాలన్నదే మా పద్ధతి. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు అవసరమైన విధానాలు అనుసరిస్తాం. ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారాలు చూపిస్తాం.
- పాత ప్రభుత్వ విధానాలను ప్రకచ్చితంగా పునఃసమీక్షిస్తాం. ఏ విధంగా, ఎలా చేస్తామన్నది ఇప్పుడే ప్రకటించలేం. ఏయే అంశాలపై పునఃసమీక్ష అవసరమో మేం నియమించిన కమిటీ అధ్యయనం చేస్తోంది. సెజ్‌ల కోసం భూమిని సేకరించడం నిర్బంధం కాకూడదు. అసలు భూసేకరణ ప్రభుత్వం చేయకుండా, పరిశ్రమల చేతులలో పెట్టి వారే చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు కదా! పరస్పర అంగీకారంతోనే జరగాలి. మా విధానాలు ఇలాగే ఉంటాయి.
- నాకు తెలియకుండానే రాజకీయ నాయకుడిగా రూపొందాను. ఒకసారి సినీరంగాన్ని విడిచిపెట్టాలనుకున్నాక, ఇక దానిపై ఎలాంటి ఆలోచనా ఉండదు. అభిమానులు నా నుంచి ఏదో కోల్పోయామన్న భావనలో ఉంటున్నారు.
- పొత్తులపై ఎలాంటి వ్యతిరేకతా లేదు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలో ప్రస్తుతం మాకెలాంటి ఆలోచనా లేదు. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయముంది. ప్రజల వద్దకెళ్లి నన్ను నేను ఆవిష్కరించుకోబోతున్నానీ, నా భావాలన్నీ వారికి తెలిపి, వారి కోరికల్ని తెలుసుకోబోతున్నాను. ఆ తర్వాతే పొత్తుల గురించి ఆలోచిస్తాం. మా విధి విధానాలు నచ్చిన వారెవరైనా స్నేహహస్తం. అందిస్తే, మా కమిటీ దానికి ఆమోదం తెలిపితే, అప్పుడు పొత్తులు పెట్టుకుంటాం.
- మా పార్టీ ఆవిర్భావానికి ప్రజల పేదరికమే నేపథ్యం. ఒకపక్క రాష్ట్రం సస్యశ్యామలంగా కనిపిస్తున్నా పేదరికం ఎందుకుంది? ప్రతి ఒక్కరికీ నాణ్యమైన జీవితం ఎందుకు లేదు? ఇదే మా వెనకున్న భావోద్వేగమైన అంశం.
- అలాంటి పరిస్థితులొస్తే, కలవడానికి అభ్యంతరాలు లేకపోతే తెలంగాణ పార్టీలతో కలుస్తా. కలవాలనే ఆలోచనతో మాత్రం ఇప్పుడు ముందుకు వెళ్లడం లేదు.
- రాష్ట్ర ప్రజలెప్పుడూ అద్భుత న్యాయనిర్ణేతలు. నాయకుల్లోనే తికమక ఉంది. ప్రజల్లో లేదు. వాళ్ల తీర్పు, నిర్ణయం బలంగా ఒక పక్షానే ఉంటుంది. గత చరిత్ర కూడా అదే చెబుతోంది. మహాకూటమి అవసరం లేదనుకుంటున్నాను. ఆ కూటమిలో మా పార్టీ చేరదు.
- చంద్రబాబునాయుడు, రాజశేఖరరెడ్డిల హయాంలో అభివృద్ధి జరుగలేదని అనను. కానీ జరగాల్సినంత జరగలేదు. మా పార్టీ అధికారంలోకొస్తే అభివృద్ధికి అన్ని రకాలుగా, అన్ని కోణాల్లో శ్రమిస్తాం. ప్రజల కష్టాలకు ఎలా భుజం పట్టాలన్నదే మా ఆలోచన. కచ్చితంగా మార్పు తెస్తాం.
- మా విధానాలు పూర్తిగా వేరు. మిగతా పార్టీలు వేరు. వాళ్ల విధానాలతో మా పార్టీని పోల్చుకోను.
- సమయం వచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకుంటాం. అభ్యర్థుల ఎంపికలో తగు జాగ్రత్తలు ఉంటాయి.
- మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తాం. అంకెలు చెప్పడం కాదు. గతంలో ఎవరూ ఇవ్వనంత ప్రాధాన్యమిస్తాం.
- వేర్పాటువాదం ఎలా రూపాంతరం చెందినా అభివృద్ధి అనివార్యం. విడిపోవలసి వస్తుంది కదాని అభివృద్ధి ఆపేయరాదు. అభివృద్ధి జరిగితే ప్రత్యేక భావన పోతుందనుకోలేం. అభివృద్ధి వేరు, సెంటిమెంట్ వేరు. ఆ రెండింటినీ వేర్వేరుగా చూస్తున్నాను.
- అందరికీ విద్య, వైద్యం అందించలేకపోతున్నాం. ప్రాథమిక పాఠశాలలు లేకుండా పోతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో మధ్యతరగతి ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చేది. ఇప్పుడు ధరల పెరుగుదల కారణంగా బతకలేని పరిస్థితి.
- తెలంగాణ, నక్సలిజం సమస్యలపై అధ్యయనం జరుగుతోంది. ఎన్నికలకంటే ముందే వాటన్నింటిపైనా స్పష్టమైన విధానం ప్రకటిస్తాం. సందిగ్ధం ఏమీ ఉండదు.
- మద్య నిషేధం విషయంలో మా విధానం జనామోదంగా ఉంటుంది. సత్వరం ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఆ తర్వాత ఏం చర్యలు తీసుకోవాలి. మద్యం పూర్తిగా లేకుండా ఉండటానికి ఏం చేయాలి. దీనికి ఎంత సమయం పడుతుంది. అన్న దానిపై శాస్త్రీయమైన అధ్యయనం జరుగుతోంది.
- బడుగు బలహీన వర్గాల మహిళలకు ఎలాగూ వారి బాధలు వారికీ ఉన్నాయి. ధరల పెరుగుదలతో కొత్తగా మధ్యతరగతి మహిళలూ ఆ జాబితాలో చేరారు. వారి సమస్యలపై ఎవరూ దృష్టి పెట్టడం లేదు. జీవితంలో రాజీపడలేక, దిగజారలేక మధ్యలో కొట్టుమిట్టాడుతున్న వారికి కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుంది. ఆ మహిళలను చూస్తుంటే నా తల్లి పడిన బాధలు నాకు గుర్తొస్తున్నాయి. మహిళలు గర్వపడేలా సాధికారత సాధిస్తాం. మైనారిటీలను అన్ని విధాలా ఆదుకుంటాం.
- ప్రజలు ఆశిస్తున్నదేమిటో కళ్లకు కనిపిస్తోంది. అపారమైన జలవనరులు, సహజసంపద అన్నీఉన్నా అనుకున్న స్థాయిలో జీవనప్రమాణాలులేవు. ఇలా ఉండాల్సిన అవసరంలేదు. సృష్టించిన సంపద చివర వరకు పంపిణీ కావాలన్నదే నేను పదేపదే చెబుతున్నది. అది జరగకపోవడానికి కారణం అవినీతి, ముఖ్యంగా రాజకీయ అవినీతి.
- నాకు 15-20 శాతం అనుభవజ్ఞులు కావాలి. నేను కొత్తదనం, మార్పు తీసుకొస్తానన్న నమ్మకంతో మా పార్టీలో చేరుతున్నారు. ఇమడలేని చోటి నుంచి మరోచోటికి వెళ్లడం ఇది మొదటి సారి కాదు. గతంలో కూడా వలసలు ఉన్నాయి.
- రాష్ట్రానికి ఏమిటన్నదే మా పార్టీకి ఉండే స్వార్థం. తమిళనాడు వాళ్లు ఎంతగా అభివృద్ధి చెందుతున్నారో చూడండి. కేంద్ర రాజకీయాలు, అక్కడ సమీకరణాలు వారికి ముఖ్యం కాదు. రాష్ట్రాభివృద్ధే ప్రధానం. అదే రకమైన పంథా అనుసరిస్తాం.
- ప్రజారాజ్యం సామాజికన్యాయమే ధ్యేయంగా ఏర్పడిన పార్టీ. బి.సి.లకు ఇతరులకంటే ఎక్కువే సీట్లు ఇస్తాం. ✦

భిన్న చైతన్యాలను సమీకరించే శక్తి లేదా అవకాశం ప్రజారాజ్యానికి ఉన్నప్పటికీ బలీయమైన ఆర్థికవర్గాలు ఆ ప్రభావాన్ని తమ ప్రయోజనాల పరిధిలోనే ఉంచుకుంటాయంటున్నారు జి. హరగోపాల్

ప్రజారాజ్యం - రాజకీయార్థిక నేపథ్యం

ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం ఆంధ్రరాష్ట్ర రాజకీయాలలో ఒక ప్రధానమైన మలుపే. ఈ కొత్త పార్టీ పాత పార్టీలన్నిటికీ ఒక సవాలే. ప్రతి పార్టీ తమ పార్టీ కాడర్ విశ్వాసం దెబ్బతినకుండా ఏవేవో ప్రకటనలు చేయడమే కాక పార్టీ భవిష్యత్తు గురించి, ఎన్నికలలో తమ పార్టీల విజయాల గురించి అతి విశ్వాసంతో మాట్లాడుతున్నాయి. రాజకీయ సమీకరణలు, పునఃసమీకరణలు ఒక స్థాయిలో అనివార్యమని అన్ని పార్టీలకు మనసులో ఉంది, భయమూ ఉంది. అయితే ఈ పార్టీ గతంలో తెలుగుదేశం పార్టీలాగా ఎన్నికలను స్వీప్ చేస్తుందా? ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కొత్తపార్టీకి పట్టం కడతారా? అన్న అంశాల మీద ఎవరు కచ్చితంగా అలా జరుగుతుంది అని అనడం లేదు. ప్రజారాజ్యం పార్టీకి కూడా ఈ విశ్వాసం సంపూర్ణంగా ఉన్నట్లుగా అగుపించడం లేదు. ఆంధ్రరాష్ట్ర రాజకీయాలలో ఇంత అనిశ్చిత స్థితి ఎందుకు నెలకొంది అనే ప్రశ్నకు జవాబు వెతికే క్రమంలోనే ఈ రాజకీయ ప్రక్రియ మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

ఈ రాష్ట్రంలో బలమైన ఐదు, ఆరు కులాలు ఉన్నాయి. వీటిలో స్థూలంగా రెడ్లు కాంగ్రెస్ పార్టీకి, కమ్మలు తెలుగుదేశం పార్టీకి, వెలమలు తెలంగాణ రాష్ట్ర సమితికి, కాపులు ప్రజారాజ్యం పార్టీకి మద్దతుగా ఉన్నారు. చాలాకాలంగా కమ్మలు కాంగ్రెస్‌ను సమర్థించడం వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ ఎదురులేని పార్టీగా మారింది. 1983లో కమ్మలు తమ మద్దతును తెలుగుదేశం పార్టీకి ఇవ్వడంతో రెండు బలమైన పార్టీలు రూపొందాయి. అధికారంలో సరియైన న్యాయమైన వాటా రాలేదన్న తెలంగాణ ఉద్యమానికి వెలమ నాయకత్వం లభించింది. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పుడు కమ్మ కాపుల సఖ్యతతో పుట్టింది. కాని అతి స్వల్ప కాలంలోనే కాపు నాయకుడైన ముద్రగడ పద్మనాభం తెలుగుదేశం పార్టీతో విభేధించాడు. అప్పటి నుండి ఇప్పటి దాకా కాపులు తమ వాటా గురించి తగాదా పడుతూనే ఉన్నారు. ఆ ప్రక్రియ నుండి పుట్టుకు వచ్చిన పార్టీయే ప్రజారాజ్యం. అయితే ఇంతవరకు రాజ్యాధికారంలో తమకు తగిన వాటా రాలేదని వాపోతున్నది వెనకబడిన కులాలు. వీరికి ఆర్థిక బలం మిగతా కులాలకున్నంత లేకున్నా వీళ్లలో కొంత సంపన్న కులాలు ఉన్నాయి. దానికి మంచి సంఖ్యాబలం ఉంది. ఈ కూలాల నాయకత్వాలన్నింటి మధ్య పోటీ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయన్నది వాస్తవం. ఏ కులం కూడా తమంతగా తామూ అధికారంలోకి రాలేదు కనక సమీకరణలు అనివార్యం. సమీకరణల సంక్లిష్టతే రాజకీయ అస్పష్టతకు ఒక కారణం.

ఇంత అస్పష్టతకు మరో కీలక అంశం నూతన ఆర్థిక విధానాలు. ఈ విషయంలో (ఇంతకు ముందు నేను రాసిన వ్యాసంలో పేర్కొన్నట్లు) రాజకీయ పార్టీలకు సైద్ధాంతికపర మౌలికమైన తేడాలు లేకపోవడం వలన దాదాపు అన్ని పార్టీలు ఈ విధానం పట్ల సుముఖంగా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ తాను అధికారంలో ఉన్నప్పుడు దాదాపు ప్రపంచ బ్యాంక్ ఏజంట్‌గా పనిచేసింది. వాళ్లు ఏది చేయమంటే అది చేసారు. నిజానికి ప్రపంచబ్యాంక్ ఈ రాష్ట్రాన్ని ఒక ప్రయోగశాలగా మార్చింది. దానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా సహకరించింది. అందుకే ప్రపంచబ్యాంక్ ఆనాటి నాయకుడు చంద్రబాబు పట్ల చాలా స్నేహంగా ఉండడమే కాక ఆయనకు అంతర్జాతీయ ప్రఖ్యాతి కల్గించడానికి ప్రయత్నం చేసారు. తెలుగుదేశం పార్టీ ప్రపంచబ్యాంక్ బానిస అని విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ, ఏ ఆలస్యం చేయకుండా ప్రపంచబ్యాంక్ అప్పును తీసుకుంది. అయితే తెలుగుదేశం పార్టీ సేవారంగానికి, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కలిగించే కార్యక్రమాలు రోడ్లు, ఫ్లై ఓవర్లు, భూమి, ఐ.టి, పవర్ తదితర సేవారంగ అవసరాలను తీర్చడానికి శ్రమ పడితే దానికి కాస్త భిన్నంగా కాంగ్రెస్ పార్టీ నీటిపారుదలకు, ప్రాజెక్టులకు కొంత ఎక్కువ ప్రాధాన్యత కల్పించింది. రెండూ ప్రపంచబ్యాంక్ అప్పులతోనే జరిగాయనేది వాస్తవం. స్థానిక వనరులను సమీకరించి, స్వావలంబన దిశగా కనీస ప్రయత్నం కూడాలేదు. ఆ చర్చకూడా ప్రధాన స్రవంతిలో లేకపోవడం ఒక విషాదం.

జాతీయ స్థాయిలో బి.జె.పి. నూతన ఆర్థిక విధానాలను పూర్తిగా ఆహ్వానించడమే కాక, పబ్లిక్‌రంగ పరిశ్రమలను అమ్మడానికి కేంద్రమంత్రి వర్గంలో ఒక మంత్రినే నియమించింది. చాలాకాలంగా ఆర్.ఎస్.ఎస్. లాంటి సంస్థలు తీవ్ర జాతీయవాదాన్ని ప్రభావం చేసినా, ఆ సంస్థలు బి.జె.పి.కి బలమైన మద్దుతుగా ఉన్న ఈ జాతీయతావాదం మతపరంగా, సాంస్కృతికంగా ఉందే తప్ప అంతర్జాతీయ పెట్టుబడిని, సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించడంలో కనబడలేదు. ఆర్థికరంగంలో చాలా వృద్ధి జరిగిందని భారతదేశం వెలిగిపోతోందని భ్రమింపజేసే ప్రయత్నం చేసింది. అంతర్జాతీయ పెట్టుబడి, నూతన ఆర్థిక విధానాల అమలుకు ఈ తీవ్రమైన మతతత్వ సాంస్కృతిక సైన్యం సహాయం ఉంటుందని పెట్టుబడి దేశంలో ప్రవేశించడానికి అడ్డుపడే శక్తులను ఈ సైన్యం ఎదుర్కుంటుందనే విశ్వాసం సామ్రాజ్యవాదానికి ఉంది. అంతర్జాతీయ

సామ్రాజ్యవాద శక్తులతో స్నేహహస్తాలు చాచడంతో బి.జె.పి., ఇతర మతపర శక్తులు తమ పాత సైద్ధాంతిక బలాన్ని కోల్పోయాయి.

ఇక వామపక్ష పార్టీలు, మన రాష్ట్రంలో నూతన ఆర్థిక విధానాలను వ్యతిరేకించినా, పశ్చిమబెంగాల్ పరిణామాలు ఈ పార్టీలను బాగా ఇబ్బంది పెడుతున్నాయి. ఇక ప్రపంచబ్యాంక్ పాలసీలను, నూతన ఆర్థిక విధానాలను సమూలంగా వ్యతిరేకించే నక్సలైట్ ఉద్యమాలు శాంతి చర్చల సందర్భంలో స్వావలంబనను చర్చకు పెట్టినా వాటి మీద చర్చ జరగకపోవడం అటు ఉంచి, శాంతి చర్చలు విఫలం కావడంతో చర్చ ముందుకు కొనసాగ లేకపోయింది. ఆ పార్టీలు ఎన్నికల రాజకీయాలలో లేకపోవడం వలన, ఈ చర్చ ఎన్నికల చట్రం బయటే ఉంది, ఉంటుంది.

ఇక నూతనంగా ముందుకు వచ్చిన ప్రజారాజ్యం పార్టీ ప్రపంచ బ్యాంక్ గురించి కాని, నూతన ఆర్థిక విధానాల గురించి గాని, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయక సంబంధాలను మౌలికంగా మార్చే అంశాన్ని గురించి కాని కచ్చితమైన ప్రతిపాదనలు ఏవీ చేయలేదు. ఆ సాహసం ఆ పార్టీకి ఉందని ఎవ్వరికి అనిపించడం లేదు. తిరుపతి సభలో రెండు అంశాలమీద పార్టీ అధినేత చిరంజీవి కొంత స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. ఒకటి, ప్రత్యేక ఆర్థిక మండలాలకు వ్యవసాయయోగ్య భూములను తీసుకోరాదని; రెండు, హైదరాబాద్ చుట్టూ ఉన్న భూమిని అమ్మకూడదని. అయితే ప్రత్యేక ఆర్థిక మండలాలను వ్యతిరేకిస్తామని అనలేదు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని భిన్న వర్గాలు దెబ్బతిన్నాయని వాళ్ల సంక్షోభానికి తమ పార్టీ స్పందిస్తుందని వాగ్దానం చేసారు. అయితే నేతపని వాళ్లని మొదలుకొని, రైతు ఆత్మహత్యల దాకా గ్రామీణ వ్యవస్థలో ఉండే ఎన్నో సమస్యలకు నూతన ఆర్థిక విధానాలు ఒక ప్రధాన కారణం. అది గుర్తించకపోతే, వాటికి పరిష్కారాలు రావు లేక లేవు అనేది ప్రజారాజ్యం పార్టీ అవగాహనలో ఉన్నట్లుగా ఎక్కడా కనిపించడం లేదు.

నాలాంటి వాళ్లు 'సలహాదారుల'ని మీడియా తప్పుడు ప్రచారం చేసినా, ఆయన సలహాదారులను బలమైన ఆర్థిక శక్తులు నిర్దేశిస్తాయే కాని ప్రజల పక్షాన ఆలోచించే వాళ్లు కాదు అనేది స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఒకవేళ సినీ జీవితం నుండి రావడం వలన 'రాజకీయాలు' పూర్తిగా ఒంటబట్టకపోవడం వలన మాలాంటి వాళ్లతో ఆయన చర్చించాలను కున్నా అది ఆయనకు అంత సులభం కాదు. ఆ రకంగా ఎన్.టి.ఆర్. కున్న మొండితనం, కొన్ని సందర్భాల్లో తెగింపు చిరంజీవి వ్యక్తిత్వంలో ఉన్నట్లుగా కనిపించడంలేదు. సున్నితమైన అంశాలమీద 'మేధావుల'తో చర్చించి అని అన్నాడే కాని ఎన్.టి.ఆర్.లా ఆవేశంగా ఏదో ఒక స్టాండ్ తీసుకోలేదు. ఎన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు 'నక్సలైట్లు దేశభక్తులు' అన్నాడు. రెండు రూపాయల కిలో బియ్యం కచ్చితంగా ఇస్తానని వాగ్దానం చేసాడు. అలాగే రెండవసారి పోటీలో మద్యపానాన్ని నిషేధిస్తానని అంతే కచ్చితంగా చెప్పాడు, చేసాడు కూడా. చేసాడు కాబట్టి బలమైన 'ఆర్థిక ప్రయోజనాలు' ఆయనను అధికారంలో నుండి బయటకు నెట్టేసాయి. ప్రజారాజ్యం పార్టీ కాని, దాని అధినేత కాని ఇలాంటి ప్రయోగాలను చేస్తారని చెప్పలేం. ఎన్.టి.ఆర్.తో వచ్చిన 'అనుభవం' వలన బలీయమైన ఆర్థిక వర్గాలు చాలా ముందు జాగ్రత్తలు తీసుకుంటాయనేది కూడా మనం గమనించాలి. వాళ్లందరూ చిరంజీవి రాజకీయ ప్రభావాన్ని తమ అవసరాల పరిధుల్లో ఉంచుకుంటారే తప్ప ఎన్.టి.ఆర్.లా అతన్ని ఎదురులేని నాయకుడిగా పెరగనివ్వరు.

ఇక ఎన్నికల రాజకీయాల సమీకరణలు, సామాజిక మద్దతులు ఎలా ఉంటాయన్న ప్రశ్నకూడా ప్రధానమే. గత యాభై, అరవై ఏళ్ల ప్రజాస్వామ్య ప్రక్రియ వలన, ముఖ్యంగా ఎన్నికల రాజకీయాల వలన, ఎన్నికల బయట జరిగిన బలమైన సామాజిక రాజకీయ ఉద్యమాల వలన తెలుగు సమాజపు రాజకీయ చైతన్యం భిన్న స్థాయిలో ఉంది. ఈ బహుళస్థాయి చైతన్యం (మల్టీలెవల్ కాన్షియస్‌నెస్) వలన ఎవరు ఎన్నికల్లో ఎలా ప్రవర్తిస్తారో అంచనా వేయడం కొంచెం సంక్లిష్టమైంది. వర్గపరంగా పేదలు, ధనికులు లేదా భూస్వాములు, కూలీలు అనే స్పష్టమైన విభజన ఉంటే విశ్లేషించడం సులభం. ఇప్పుడు ఇంతకాలం అణచివేయబడ్డ వర్గాలు చాలా వరకు కుల చైతన్యంలో, అస్తిత్వ ఉద్యమాల చట్రంలో చిక్కి ఉన్నారు. దానికి మంచి ఉదాహరణ ఉద్యమాలలో వచ్చిన చీలికలు.

ఒక కాలంలో దళితులు సంఘటితంగా ఏదో ఒక పార్టీవైపు నిలబడ్డారు. చాలా కాలం మన రాష్ట్రంలో దళితులు ఇందిరాగాంధీని సమర్థించారు. ఇప్పుడు పరిస్థితులు వేరు. అంతకంటే సంక్లిష్టమైన సామాజిక వర్గం వెనుకబడిన కులాలు. వాటి సంఖ్య కూడా చాలా పెద్దది. వాళ్లందరికి తమ కుల చైతన్యం ఉంది. కాని తమ కులాలు సంఘటితమైతే అది ఎంత చారిత్రాత్మకమైన మార్పో ఇంకా పూర్తిగా తెలియదు. ఆ వర్గాల నుండి నూతన నాయకత్వం వచ్చింది. ప్రజాస్వామ్య గొంతు ముందుకు వచ్చింది. ఈ కొత్తగా ఏర్పడుతున్న ఈ సామాజిక శక్తులే ఎన్నికల రాజకీయాలలో ఒక పెద్ద సవాలు అయ్యాయి. ఈ సామాజిక శక్తులు 'ప్రజారాజ్యం' పార్టీ వైపు మొగ్గుచూపుతాయా లేదా అన్నదే ప్రధానమైన ప్రశ్న. ఈ నేపథ్యం వల్లే కాంగ్రెస్ పి.సి.సి. అధ్యక్షుడ్ని ఎన్నుకోవడంలోనైనా, బి.జె.పి. రాష్ట్ర అధ్యక్షుడి నిర్ణయంలోనైనా ఈ సామాజిక ప్రభావాలున్నాయి. అయితే తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి ఇంతవరకు వెనుకబడిన తరగతుల నుండి వచ్చిన నాయకుడిని ప్రముఖంగా ముందు నిలబెట్టలేక పోయాయి. ఈ నేపథ్యంలో దేవేందర్ గౌడ్ నాయకత్వంలోని నవ తెలంగాణ పార్టీ రాజకీయాల్లో ఒక మార్పే. వామపక్ష పార్టీలు అసలు ఈ మార్పుకు స్పందిస్తున్నట్లుగా కూడా కనిపించడం లేదు.

బహుళ చైతన్య స్థితి ఎన్నికల రాజకీయాలకే కాక మావోయిస్టు పార్టీలాంటి పార్టీలకు కూడా సవాలే. ఈ ఉద్యమాలు చాలా దెబ్బతిన్నాయని అందరూ అనుకుంటున్నా ఆ దెబ్బ తినడమనేది రాజ్యం అణచివేత వలన కొంత దెబ్బ తిన్నది నిజమే. అయినా ఈ మారుతున్న సమీకరణలను, భిన్న చైతన్య స్థితులను ప్రజాస్వామ్య చైతన్యంగా ఎలా మార్చాలన్నది చాలా చిక్కు ప్రశ్న. ఈ ఉద్యమాలు ప్రారంభమైనప్పుడు కుల చైతన్యం కంటే తమ పట్ల జరుగుతున్న అన్యాయానికి, అవమానాలకు వ్యతిరేకంగా స్పందించే చైతన్యమే ఉండేది. అందుకే ఉద్యమాలకు చాలా పెద్ద ఎత్తున మద్దతు వచ్చింది. ఇప్పుడు ఆ సందర్భం, నేపథ్యం మారింది.

ఇప్పుడున్న రాజకీయాలలో బహుళ స్థాయి చైతన్యాన్ని ఎదుర్కోగల అవకాశం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి, ప్రజారాజ్యానికి ఉన్నది. దీనికి కారణం తెలంగాణ అస్తిత్వ పోరాటంలో భిన్న చైతన్యాలు తమ

అస్తిత్వాన్ని చూపే అవకాశం ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష అందుకే చాలా బలంగా ఉంది. కాని ఆ ఆకాంక్షను సమగ్రంగా వ్యక్తీకరించే సృజనాత్మక రాజకీయ శక్తిలేక పోవడమే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ బలహీనత. అయితే ప్రజారాజ్యం పార్టీకి తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి ఎలా స్పందించాలో తెలియడం లేదు. తెలంగాణవాదులకు ఈ పార్టీ పట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలో తెలియడం లేదు. ఒక స్థాయిలో ప్రజారాజ్యం పట్ల తెలంగాణ వాదులకు అనుమానాలు, భయాలే ఎక్కువ ఉన్నాయి. అందుకు ప్రధాన కారణం భిన్న చైతన్యాలను సమీకరించే శక్తి లేదా అవకాశం ప్రజారాజ్యానికి ఉండడమే. ఈ సమీకరణలో తెలంగాణ చైతన్యం, ఆకాంక్ష, అస్తిత్వం దెబ్బతింటాయేమో ననే అనుమానం చాలా బలంగా ఉంది. అందుకే తిరుపతి సభలో తెలంగాణ గురించి చిరంజీవి ఏం చెపుతాడో అని అందరూ ఆసక్తిగా విన్నారు. అయితే ఇది సున్నితమైన సమస్య అని, మేధావులతో సంప్రదించి నిర్ణయించవలసి ఉంటుందని అనడంతో అనుమానాలు పెరిగాయే కాని తగ్గలేదు.

ఈ వాస్తవాలతోబాటు, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ఆర్థిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి మరొక అంశం ఉంది. ఇది చాలా లోతైన అంశం. మన రాష్ట్రంలో ఒక కోటికి మించి భూమిలేని నిరుపేదలు ఉన్నారు. ఇందులో 30 నుండి 35 లక్షల దళితులు కాగా 60 నుండి 70 లక్షల దాకా వెనకబడిన కులాలకు చెందిన వాళ్లు. ఇది నిజానికి వర్గసమస్య. అలాగే 70 నుండి 80 లక్షల చిన్న, సన్నకారు రైతులున్నారు. ఈ రైతాంగానికి వ్యవసాయం, దుర్లభమైపోయింది. విత్తనాలు, ఎరువులు, కరెంట్, మందులు – అన్నింటికీ మించి పండించిన పంటకు ధరలు రాకపోవడం. ఇప్పుడున్న నూతన ఆర్థిక విధానాల వలన వీళ్ల సమస్యలకు పరిష్కారమటుంచి, ఇది మరింత క్లిష్టమైన దశకు చేరుకోనుంది. నూతన ఆర్థిక విధానాలతో దెబ్బతిన్న ఈ రైతాంగం తెలుగుదేశం పార్టీని పూర్తిగా క్షమించడానికి ఇంకా సిద్ధంగా లేదు. కాంగ్రెస్ పట్ల నిరసన భావంతో ఉన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే 'తమ' యథాతథ స్థితి కొనసాగింపుకు ఒప్పుకున్నట్లే. ఇలాంటి తరుణంలోనే ఆగ్రహంతో ఉద్యమాలకు మద్దతు ఇవ్వవచ్చు. విసిగిన రైతాంగం మూడో ప్రత్యామ్నాయానికి ఓటు వేయవచ్చు. ఇది ఏ మలుపు తిరగనున్నదో వచ్చే పది నెలల్లో చూడాలి. ప్రజారాజ్యం ఈ సమస్యకు సరిగ్గా స్పందించక లేకపోవడం కూడా అస్పష్టతకు దారి తీసింది.

ఇక రెండు ప్రత్యేక సామాజిక వర్గాల గురించి కూడా మాట్లాడుకోవాలి. ఒకటి యువత; రెండు స్త్రీలు. ఈ రాష్ట్రంలో ఓటర్లలో యువత సంఖ్య యాభై శాతం కంటే ఎక్కువ. ఇందులో నలభై నుండి నలభై ఐదు లక్షల దాకా చదువుకున్న నిరుద్యోగులు. ఈ సమస్య ఎంత జటిలమైందో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు కూర్చుంటున్న వాళ్ల సంఖ్యను చూస్తే అర్థమవుతుంది. ఒక వెయ్యి ఉద్యోగాలకు రెండు లక్షలకు మించి యువత పోటీ పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ఉద్యోగాలు అసలు ఉండవు అని ప్రకటించడం వలన పార్టీకి జరిగిన నష్టం నుండి ఇప్పటికీ బయటపడలేకపోతోంది. కాంగ్రెస్ కొంత ఊరట కలిగించింది. కాని భర్తీ చేస్తామన్న దాదాపు మూడు నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అలాగే ఖాళీగా ఉంచారు. ఈ యువత చాలా వరకు దారం తెగిన గాలిపటం లాంటి వాళ్లు. తిరుపతి సభకు హాజరైన వాళ్లలో వీళ్లదే అధిక సంఖ్య. ఈ యువతకు సీరియస్‌నెస్ లేదు, దిశలేదు, పునాదిలేదు, ఆదర్శాలు అంతకంటే లేవు. స్థూలంగా వీళ్లని 'లంపెన్' వర్గంగా భావించవచ్చు. ఈ యువత చాలావరకు ప్రజారాజ్యం అభిమానులే. అయితే వీళ్ల సంఖ్యలో ప్రజారాజ్యానికి బలం, ప్రవర్తనలో ప్రజారాజ్యానికి ప్రతిబంధకం. ఎన్నికల్లో గెలిచే వరకు ఒక సమస్య అయితే, గెలిస్తే వీళ్లను నియంత్రించడం అంత సులభం కాదు. ప్రత్యేక తెలంగాణను బలపరుస్తున్న యువత కొంతవరకు భిన్నంగా ఉంది. వాళ్లకు తక్షణలక్ష్యం ఒకటుంది కాబట్టి వాళ్లు ఇంకా కాళ్లమీదే నిలబడి ఉన్నారు. ఇక ఉద్యమ అభిమానులుగా ఉండే యువత ప్రజారాజ్యం రాజకీయంపట్ల అసహనంగా ఉండే అవకాశమే ఎక్కువుంది.

ఇక చివరిగా స్త్రీలు, ఎలాంటి పాత్ర నిర్వహిస్తారనేది చాలా కీలకమైన అంశం. అయితే మన రాష్ట్రంలో స్త్రీలు భర్తలను కాదని, కుటుంబాన్ని కాదని స్వతంత్రంగా ఓట్లు వేస్తున్నారా అన్నది ప్రశ్నే. అయితే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పుడు స్త్రీలు పెద్ద ఎత్తున ఎన్.టి.ఆర్.కు మద్దతునిచ్చారనే చర్చ ఉండేది. తర్వాత ఆ విషయ ప్రస్తావన తగ్గింది. తెలుగుదేశం పార్టీ లాగా ప్రజారాజ్యం కూడా మహిళల మద్దతును పొందుతుందా అన్నది స్పష్టంగా లేదు. అయితే నాకు తెలిసినంత వరకు సినిమాలు చూస్తున్న మధ్యతరగతి మహిళలు చిరంజీవికి ఓటు వేస్తామని అంటున్నారు. ఆ మద్దతు ఎంత విస్తృత స్థాయిలో ఉందో తెలియదు.

ఒక సంక్లిష్ట సామాజిక ఆర్థిక నిర్మాణంలో, అందులో సమాజం నిరంతరంగా మార్పుకు గురౌతూ కొత్త సామాజిక సమీకరణలో ఏర్పడుతున్నప్పుడు ఒక రాజకీయాల గురించి కచ్చితమైన, స్పష్టమైన అంచనా వేయడం శ్రమతో కూడుకున్న పని. అయితే ఈ వ్యాసం రాజకీయాలను అర్థం చేసుకోవడానికి ఎన్ని అంశాలను మనం దగ్గరగా చూడాలో, వాటి మధ్యన ఉండే పరస్పర వైరుధ్యాలను ఎలా చూడాలో చెప్పే ప్రయత్నం మాత్రమే. వీ

వచ్చే సంచికలలో...

- ఫోకస్ - నవంబర్ 2008 : ఆర్థిక సంక్షోభం - ధరల పెరుగుదల
- ప్రపంచీకరణ చరిత్ర - పి. భరత్
- ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య వ్యవస్థలు - పునర్నిర్మాణ విధానం - అనిసెట్టి శాయికుమార్
- పచ్చని పల్లెల్లో గుడుంబా గుబులు-మద్యం మత్తులో యువత - గుగులోతు దేవోజ

రాజకీయ పార్టీల సంఖ్య ఎంత పెరిగితే ప్రజలకు అంత మేలనీ, ఈ పోటీలో ఆంధ్ర నాయకత్వం తెలంగాణపై మరింత స్పష్టంగా వ్యవహరించాల్సి ఉంటుందని అంటున్నారు **ఎం. కోదండరాం**

పోటీ రాజకీయాలతో తెలంగాణకే లాభం

రాజకీయ పార్టీల సంఖ్య ఎంత పెరిగితే ప్రజలకు అంత లాభం. వాటి మధ్య ఏర్పడే పోటీ కారణంగా ప్రజల ప్రయోజనాలు కొంతమేరకైనా కాపాడబడతాయి. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంతో ఇటువంటి పరిస్థితే మన రాష్ట్రంలోను తలెత్తింది.

అయితే రాజకీయ పార్టీలు సామాజిక, ఆర్థిక పరిణామాల ఫలితంగా ఏర్పడతాయి. నాయకులు కోరుకున్నంత మాత్రాన పార్టీలు పుట్టవు. వారికి ఇష్టం లేకపోతే పార్టీల నిర్మాణం ఆగిపోదు. మన రాష్ట్రంలో 1983 వరకు కాంగ్రెస్ పార్టీ ఏకఛత్రాధిపత్యం చెలాయించింది. అప్పటికే ఎన్నో పార్టీలు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలనుకున్నాయి. స్వతంత్ర పార్టీ, జనతాపార్టీ, కమ్యూనిస్టు పార్టీలు అటువంటి ప్రయత్నంచేసినాయి. కానీ నిలబడలేక పోయాయి. చివరకు తెలుగుదేశం పార్టీ ఏర్పడి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించింది.

తెలుగుదేశం ఎదుగుదలకు మూడు కారణాలు దోహదపడినాయి. హరితవిప్లవం కారణంగా ఎదిగిన సంపన్న రైతాంగం, నక్సల్బరీ ఉద్యమం వలన దొరల ఆధిపత్యం నుండి విముక్తి చెందిన ప్రజానీకం, సినిమాల వలన విశేషంగా ప్రజాభిమానాన్ని పొందిన ఎన్.టి.ఆర్. నేతృత్వంలో రాజకీయ శక్తిగా ఎదగగలిగారు. తెలుగుదేశం కొత్త ప్రచార శైలిని ప్రారంభించింది. క్యాసెట్ల ద్వారా, సినిమా ప్రకటనల ద్వారా నేరుగా ప్రజలకే అప్పీలు చేసింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం అంతమైపోయింది. అయితే సరళీకరణ శకం ప్రారంభమయ్యాక రెండు పార్టీల పాత్ర మారిపోయింది. ప్రజల కొరకు కొన్ని సంక్షేమ విధానాలను ప్రవేశపెట్టినాయి. అభివృద్ధి పేరుతో వనరులను కొన్ని వర్గాలకే కేటాయించాయి. ఈ విధానాల వల్లనే హైదరాబాద్ చుట్టూ భూములు, ప్రభుత్వ పెట్టుబడులు కొందరి వశమయ్యాయి. సరళీకరణ యుగంలో ప్రభుత్వం ఆర్థిక రంగం నుండి ఉపసంహరించుకొని మొత్తం ప్రైవేటురంగానికి వదిలేస్తుంది అనుకున్నాం. కాని వాస్తవంలో జరిగింది వేరు. పబ్లిక్‌రంగ సంస్థలు మూతబడి పోయినాయి. ప్రభుత్వ సహాయంతో ప్రైవేట్ కంపెనీలు ఎదిగినాయి. ప్రభుత్వంలో సాన్నిహిత్యం ఉండి కాంట్రాక్టులు, వనరులు, తెచ్చుకోగలిగారో ఆ వర్గాలు మాత్రమే ఆర్థికంగా బాగా వృద్ధిలోకి వచ్చినాయి. ప్రైవేట్ రంగంలో కరెంట్ ఉత్పత్తి మొదలుపెట్టిన కంపెనీలు, ప్రైవేట్ కాలేజీలు, కార్పొరేట్ ఆసుపత్రులు, సాఫ్టవేర్ కంపెనీలు, రియల్ ఎస్టేట్ డీలర్లు, మౌలిక సదుపాయాలను నిర్మించే కంపెనీలు ప్రభుత్వం వల్లనే లాభపడినారు. కరెంట్ ఉత్పత్తిదారులను తీసుకోండి. బయట దొరికే ధరకన్నా రెట్టింపు ధరకు ఈ కంపెనీల నుండి కరెంట్ కొనడానికి అంగీకరించింది. అందువలన వాటికి మేలు జరిగింది. ప్రభుత్వం విద్యారంగానికి కేటాయింపులను, కాలేజీల ఏర్పాటుకు సంబంధించిన, విద్యార్థుల సంఖ్యకు సంబంధించిన కేటాయింపులను ఆపి రూల్స్‌ను సరళతరం చేయడం వల్లనే కార్పొరేట్ కాలేజీలు ఎదిగినాయి. ఇట్లా ప్రతి కార్పొరేట్ వ్యవస్థ ఎదుగుదల వెనుక ప్రభుత్వం పాత్రను చూడవచ్చు. అయితే పైన చెప్పినట్టు అధికార పార్టీకి దగ్గరగా ఉన్న వర్గాలే ఈ కేటాయింపుల వలన లాభపడినాయి. తెలుగుదేశం తన వాళ్లను పైకి తీసుకువస్తే, కాంగ్రెస్ తన వర్గాలను ఆదుకోవాలని నిర్ణయించింది.

ఈ రెండు పార్టీలు విస్మరించిన, పట్టించుకోకుండా వదిలేసిన వర్గాలే ఇవాళ అవకాశాల కొరకు ప్రయత్నాలు చేస్తున్నాయి. వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వంతో పరిచయమే పెద్ద పెట్టుబడి. ఆ పెట్టుబడి పెంచుకోకుండా పైకి రాలేమని గ్రహించడం వల్లనే రాజకీయాధికారాన్ని పొందడానికి ప్రజారాజ్యం రూపంలో కొన్ని వర్గాలు ముందుకొస్తున్నాయి.

అయితే మన రాష్ట్రంలో వామపక్షాలు తప్ప ఏ పార్టీ నిర్మాణం కూడా ప్రజాస్వామిక పద్ధతిలో జరగడం లేదు. నాయకుల చుట్టూ అల్లుకొని పార్టీల నిర్మాణం జరుగుతున్నది. ఆ నాయకుల ప్రజాకర్షణపై ఆధారపడి పార్టీలు ఓట్లను పొందాలని చూస్తున్నాయి. అందుకే పార్టీ నిర్మాణం ఆలోచన రాగానే నాయకున్ని వెదుక్కోవడం మొదలుపెట్టారు. అందుకు చిరంజీవి యోగ్యుడని నిర్ణయించుకున్నారు. అట్లా చిరంజీవి నేతృత్వంలో, ఆయనకున్న ప్రజాకర్షణే ప్రధానమైన బలంగా ప్రజారాజ్యం పార్టీ ఏర్పడింది.

ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంతో అటు కాంగ్రెస్, ఇటు తెలుగుదేశం సంక్షోభంలో పడిపోయాయి. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వచ్చే వ్యతిరేకతను సొమ్ముచేసుకొని అధికారంలోకి రావచ్చుననుకున్న తెలుగుదేశం పార్టీ వ్యూహం దెబ్బతిన్నది. కాంగ్రెస్ అవినీతిపైన ప్రచారం చేసి ప్రజలు కూడగట్టి అధికారంలోకి రాగలననుకున్న తెలుగుదేశం దిక్కుతోచని స్థితిలో ఉంది. మరోవైపు కాంగ్రెస్‌ది కూడా ఇదే పరిస్థితి. వందరోజుల పని, వృద్ధాప్య, వితంతు పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి ప్రజాకర్షక, సంక్షేమ విధానాల సాయంతో గెలువగలనన్న ధీమాతో రాజశేఖరరెడ్డి ఉన్నారు. ఆయన ఆశలూ దెబ్బతిన్నాయి. ఇది ఇలా ఉండగా మరొకవైపు సరళీకరణ విధానాల వలన విద్య, వైద్య సౌకర్యాలు అందక, ఉపాధి అవకాశాలు లేక అనేక రూపాల్లో ప్రజలు ఉద్యమిస్తున్నారు. తెలంగాణ పోరాటానికి, దళిత, బహుజన ఉద్యమానికి, కార్మిక వర్గ, రైతాంగ ఆందోళనలకు ఇదీ నేపథ్యం.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారనీ, అయితే ఆ మార్పు ముఖ్యమంత్రి మార్పో, అధికార పార్టీ మార్పో కాదనీ, పేదరికం, ఆకలి, అవమానాలు, ఆత్మహత్యలు లేని సమాజం కోసమనీ అంటున్నారు దుడ్డు ప్రభాకర్

దోపిడీవర్గాల మరో ముసుగే 'ప్రజారాజ్యం'

'స్వర్ణాంధ్రను సృష్టిస్తా', 'హరితాంధ్రను ఆవిష్కరిస్తా', 'ప్రజల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమే'లాంటి మాటలగారడీలు ఆకలితో అలమటించే ప్రజలను ఊరడించలేకపోతున్నాయి. ఆకలిచావులు, అనారోగ్య మరణాలు, నిరుద్యోగం, ఆత్మహత్యలు, ఆకస్మిక ప్రమాదాలు, దోపిడీ దౌర్జన్యాలు, అత్యాచార హత్యలు, మతమారణహోమాలతో రాష్ట్ర ప్రజలు అభద్రత, అశాంతితో తల్లడిల్లుతున్నారు. ఈ సందర్భంగా ప్రజల్ని మరింతగా నమ్మించడానికి, కొత్త ఆశలు చిగురింపజేయడానికి అగ్రకుల భూస్వామ్య పెట్టుబడిదారీ పాలకవర్గ శక్తులు తీవ్రప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగానే ప్రజలకు సేవ చేయడానికేనంటూ వస్తున్న నూతన రాజకీయపార్టీల ఆవిర్భావ కోలాహలం రాష్ట్రంలో సందడి వాతావరణాన్ని సృష్టింస్తోది.

పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తినందుకు ముడుపులు కావాలని డిమాండ్ చేసి ప్రత్యక్షంగా 'ఆపరేషన్ దుర్యోధన' కెమెరాలకు పట్టుబడిన పదకొండుమంది పార్లమెంట్ సభ్యుల దిగజారుడుతనం ప్రపంచ ప్రజల్ని నివ్వెరపరచింది. ఇటీవల జరిగిన విశ్వాస పరీక్షలో యు.పి.ఎ. విజయం వెనుక ముడుపులు, ప్రలోభాలు, రహస్య ఒప్పందాలు, క్రాస్ ఓటింగ్ బాగోతాల నుండి పార్లమెంట్‌లో నోట్ల కట్టల ప్రదర్శనల దాకా యు.పి.ఎ. వికృత రూపాన్ని దేశ ప్రజలు టి.వి.ల ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు. మరోవైపు రాష్ట్రంలో నీవు దొంగంటే నీవు దొంగని అన్ని పార్టీలు ఒకరి గుట్టు ఒకరు బయట పెట్టుకుంటూ ఉన్న సందర్భంలో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వైనం. రోజు రోజుకో వెలుగు చూస్తున్న కుంభకోణాల్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలలో దోపిడీదారుల గిల్లికజ్జాలు ప్రజలకు జవాబుదారీతనం లేకపోవడం, వీధి రౌడీలు కూడా సిగ్గుపడే విధంగా ఉండే గలాటా లాంటి దృశ్యాలతో చట్టసభలు భ్రష్టుపట్టాయి. అసెంబ్లీ, పార్లమెంట్ భవనాల సాక్షిగా ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థపై ప్రజలకు నమ్మకం క్షీణిస్తోంది. ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వస్తున్నా, సామాజిక అన్యాయానికి బలై, ప్రాంతీయ వివక్షకు గురై పార్టీ మారుతున్నా! అనే మాటల్ని ప్రజలు ఏవగించు కుంటున్నారు. జేబు దొంగను పట్టుకొని కొట్టి, హింసించి,

---

వ్యవసాయం చితికిపోయి, పరిశ్రమల్లో ఉద్యోగావశాకాలు సన్నగిల్లి, అసంఘటిత రంగంలోనూ బతుకుదెరువు లేక తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోకి వచ్చినారు. ఆంధ్ర సంపన్న వర్గాలకు జరుగుతున్న వనరుల తరలింపును ఈ ఉద్యమాలు నిరసిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడితే తమవనరులతో బతుకుదెరువు అవకాశాలను పొంద వచ్చునని ఆశిస్తున్నాయి. ఈ పోరాటానికి టి.ఆర్.ఎస్. ఒక్కటే ప్రతినిధి కాదు. ఇతర ప్రజాసంఘాలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహిస్తున్నాయి.. తెలంగాణ ఉద్యమానికి టి.ఆర్.ఎస్. రాజకీయ ముఖం మాత్రమే. ఇన్ని సంఘాలు ఉద్యమంలోకి పాల్గొంటున్నందునే తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయ లేకపోతున్నారు.

తెలంగాణ ఉద్యమం రాష్ట్ర రాజకీయాలను గణనీయంగా ప్రభావితం చేస్తున్నది. ఆంధ్ర ప్రాంతంలోని సంపన్న వర్గాల మధ్య విభజన కారణంగా ఇవ్వాళ ఆ పార్టీల గెలుపు తెలంగాణపై తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఏ పార్టీ తలెంగాణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోగలిగితే, తెలంగాణ ఉద్యమకారులతో ఒప్పందం చేసుకోగలిగితే ఆ పార్టీకే తెలంగాణలో లాభం కలుగుతుంది.

ఇప్పటికే తెలుగుదేశం పార్టీ తెలంగాణ విషయమై నిర్ణయాన్ని రూపొందించడానికి ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ అందరినీ సంప్రదించి తెలంగాణకు అనుకూలంగా నిర్ణయాన్ని సూచిస్తుందని ఆ పార్టీ కార్యకర్తలు ఆశిస్తున్నారు. దానికితోడు తెలుగుదేశం పార్టీకి తెరాసకు మధ్య ఒప్పందం కుదరవచ్చునని అనుకుంటున్నారు. అట్లాంటి ఒప్పందం కుదిరితే తెలంగాణలోని అన్ని స్థానాలను తెలుగుదేశం, తెరాసలె గెలుస్తాయన్న అభిప్రాయం ఒకటి రాజకీయ కార్యకర్తల్లో ఉన్నది.

ఈ అభిప్రాయాల కారణంగానే తెలుగుదేశం నుండి తెలంగాణ ప్రాంత నాయకులెవ్వరు వదిలిపోవడం లేదు. ప్రజారాజ్యం పార్టీలోకి తెలంగాణ ప్రాంతంలో పెద్దగా వలసలు లేవు. పైగా ప్రజారాజ్యం పార్టీ లోపల చెప్పుకోదగిన తెలంగాణ నాయకులులేరు. మరి ఈ పరిస్థితుల్లో తెలంగాణపై తనవైఖరిని స్పష్టం చేసి, తెలంగాణ ఏర్పాటుకు పూనుకుంటే తెలంగాణ ప్రాంతంలోను తన అవకాశాలను మెరుగు పరుచుకోవచ్చును.

కనుక ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటుతో రాజకీయాలలో పోటీ పెరిగింది. ఈ పోటీలో తమను తాము నిలబెట్టుకోవడానికి ఆంధ్ర నాయకత్వం తెలంగాణపై స్పష్టమైన వైఖరిని తీసుకోవలసి వస్తున్నది. తెలంగాణపార్టీలు ఐక్యమై, సంఘటితంగా తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయగలిగితే ఆంధ్ర నాయకత్వంలోని పార్టీలపై ఒత్తిడి మరింతగా పెరుగుతుంది. కనుక తెలంగాణ రాష్ట్ర సాధనకు పరిస్థితి సానుకూలంగా ఉన్నది. తెలంగాణ పార్టీలు చొరవ తీసుకుంటే పూర్తిగా అనుకూలంగా మలుచుకోవచ్చు. ఆ దిశగా తెలంగాణ శక్తులు కదలాలి. వీ

పోలీసులకు పట్టించే ప్రజలకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్న రాజకీయ దొంగల్ని శిక్షించే అవకాశం లేకుండా ఖద్దరు బట్టకి ఖాకీ గుడ్డ, నల్లకోటు, లాఠీ, తూటాలు రక్షణ కల్పిస్తున్నాయి. ఆ విధంగా దోపిడీ చేసి కూడా గౌరవంగా బతకడానికి నేడు పార్లమెంటరీ రాజకీయాలు ప్రధాన వనరుగా విరాజిల్లుతున్నాయి. అందుకే రౌడీలు, గూండాలు, ఫ్యాక్షనిస్టులు, మాఫియాలు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలతోపాటు, సినీస్టార్ల రాజకీయ రంగప్రవేశం వెల్లువలా జరుగుతోంది. వీళ్లు ప్రజల 'చేవ' తీయడానికి రాజకీయాల్లోకి వస్తున్నారనే విషయం అరవై ఏళ్ల స్వతంత్ర భారతంలో ప్రతి పౌరుడికీ అనుభవమే. రాజకీయాలు నేరమయమవుతున్నాయనే రోజులు మారాయి. నేరాలే రాజకీయాలుగా వర్ధిల్లుతున్న రోజులు దాపురించాయి. అనివార్య పరిస్థితుల్లోనే ప్రజలు రాజకీయ నాయకుల్ని గౌరవిస్తున్నట్లు, వాళ్ల విధానాలను నమ్ముతున్నట్లు నటించాల్సిన స్థితికి నెట్టివేయబడ్డారు. ఈ నేపథ్యంలోనే సంతోషాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా ప్రకటిస్తూ కొణిదల శివశంకర వరప్రసాద్ తన జీవితం ప్రజాసేవకే అంకితమంటూ ఆగస్ట్ 26న తిరుపతిలో ప్రజారాజ్యం పార్టీని ఆవిష్కరించారు.

సంక్షోభంలో రాష్ట్ర రాజకీయాలు

తొమ్మిదేళ్ల తెలుగుదేశం నియంతృత్వ పాలనకు చరమగీతం పాడిన రాష్ట్ర ప్రజలు 2004లో కాంగ్రెస్‌కు పట్టం గట్టారు. వై.ఎస్. ముఖ్యమంత్రి అయిన ఆరునెలల గడవక ముందే ఉద్యమించే ప్రజల గొంతు నొక్కి రాష్ట్రాన్ని బహుళజాతి కంపెనీలకు తెగనమ్ముతూ రియల్టర్ అవతారమెత్తాడు. ఈ నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భూకబ్జాల ద్వారా ఎవరికి వీలైనంత వాళ్లు దోచుకుతిన్నారు. ఔటర్ రింగ్‌రోడ్ అక్రమాలు, జలయజ్ఞంలో అవినీతి పరాకాష్టకు చేరింది. పేదల భూములు కబ్జా చేసినవారికే హక్కు కల్పించే విధంగా చట్టంలో మార్పులు చేశారు. రాష్ట్రంలో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ మిగులు, బంజరు భూములు వక్ఫ్‌బోర్డ్ భూములు, దేవాదాయ భూములు, రైతుల పచ్చని పంట పొలాలు, పేదల అసైన్డ్ భూములను బహుళజాతి కంపెనీలకు విదేశీ పారిశ్రామిక వేత్తలకు సెజ్‌ల పేరుతో ధారాదత్తం చేస్తున్నారు. మరోవైపు ముదిగొండలో గూడులేని జనం అరవై గజాల నేలకోసం దోసిళ్ళ కొద్ది నెత్తురు కార్చితే స్మశానంలో ఆరడుగుల స్థలం ఇచ్చారు. భవిష్యత్‌లో వ్యవసాయనికి కాదు గదా గుడిసె వేసుకోవడానికి, కనీసం శవాల్ని పూడ్చడానికి సెంటు భూమి కూడా రాష్ట్రంలో మిగలకుండా వై.ఎస్. ప్రభుత్వం భూముల్ని అమ్ముతోంది. ఆ అమ్మగా వచ్చిన డబ్బులో కొంతభాగం మహిళలకు, రైతులకు, చేనేత కార్మికులకు పావలా వడ్డీకి రుణాలిస్తున్నారు. ఎవరడిగినా పావలా వడ్డీకి రుణాలిచ్చేస్తామంటూ వై.ఎస్. వడ్డీ వ్యాపారస్తుడిగా మారారు. ముఖ్యమంత్రిగా, రియల్టర్‌గా, వడ్డీ వ్యాపారస్తుడిగా రకరకాల పాత్రలు పోషిస్తూ తన అనుచరుల ద్వారా ఏసుక్రీస్తుగా, వినోబాభావేగా కీర్తించబడుతున్న ముఖ్యమంత్రి 'అన్ని మేమే చేశాం. మరి చిరంజీవి రాజకీయాల్లోకొచ్చి ఏం చేస్తాడం'టున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉందనీ, వెలిగిపోతోందనీ, అభివృద్ధిలో అందనంత ఎత్తులో ఉందనీ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ప్రజలు మాత్రం గొర్రెలు తినేటోడ్ని వదిలించుకొని బర్రెలు అనేటోడ్ని తగిలించుకున్నందుకు తలలు పట్టుకొని ఉన్నారు. ఆ విషయాన్ని అధికార పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ విశ్లేషకులు, మేధావులు గుర్తించారు. అందుకే ఏ ఒక్క పార్టీ కాంగ్రెస్ సరసన నిలబడ్డానికి కూడా సిద్ధంగా లేదు. అదే విధంగా మళ్లీ చంద్రబాబుని నమ్మే స్థితిలో ప్రజలు లేరు. ఈ రాజకీయ శూన్యం లోకి జొరబడ్డానికి పార్టీలన్నీ ఎవరి వ్యూహాల్లో వారు నిమగ్నమై ఉన్నారు. కొత్తగా పార్టీలు పుట్టుకొస్తున్నాయి. చిరంజీవి పార్టీ ప్రకటించకముందే లోక్‌సత్తా పార్టీ, మనపార్టీ ప్రజల ముందుకొచ్చాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అనేక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో వికటించిన ఉత్తరప్రదేశ్ ఫార్ములా

ఉత్తరప్రదేశ్‌లో మాయావతి ఒక రాజకీయ ప్రయోగం చేసి పదహారు సంవత్సరాలుగా కొనసాగుతున్న సంకీర్ణపాలనకు ఫుల్‌స్టాప్ పెట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన అగ్రకులాలను (ప్రధానంగా బ్రాహ్మణులను) కలుపుకొని బహుజన వాదానికి తిలోదకాలిచ్చి సర్వజనవాదాన్ని అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 2007 జూన్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పరిశీలకులకు అంతు చిక్కని అద్భుత ఫలితాన్ని సాధించారు. ఆ ఎన్నికల్లో బి.ఎస్.పి. తరపున పోటీచేసిన వారిలో 139 మంది అగ్రకులాలకు చెందినవారు, 110 మంది బి.సి.లు, 93 మంది దళితులు, 61 మంది ముస్లింలు ఉన్నారు. ఇది భారతదేశ రాజకీయాలకు సరికొత్త ఫార్ములా ఏమీకాదు. అగ్రకుల పాలకవర్గాలు అనాదిగా అవలంబిస్తున్న వ్యూహమే. కాకుంటే బహుజనవాదం, సర్వజనవాదంగా మార్చి దళిత-బ్రాహ్మణ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో మాయావతి సక్సెస్ అయ్యారు. ఈ ఫార్ములాని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయడానికి అగ్రకుల బ్రాహ్మణీయ శక్తులు తీవ్రప్రయత్నాలే చేశాయి.

అంతకుముందు నుంచే చిరంజీవి రాజకీయరంగప్రవేశం గురించి రాష్ట్ర వ్యాపితంగా విస్తృతమైన, ఉత్కంఠభరితమైన చర్చ జరుగుతూ ఉంది. అప్పటికే రాజకీయ నిరాదరణకు గురైన బ్రాహ్మణ, వైశ్య, కాపు కులాల్లోని పెత్తందారీ ధనికవర్గం, దళిత, గిరిజన, బి.సి. సంఘాలను కలుపుకొని సర్వజన సమ్మేళనాలు, సభలు, సమావేశాలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించారు. ఆ సందర్భంగా చిరంజీవిని బి.ఎస్.పి.లోకి ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటన కూడా చేశారు. కానీ చిరంజీవి ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర్‌ప్రదేశ్ ఫార్ములా అమలు చేయాలనే ప్రయత్నం ఫలించలేదు. అందుకు ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా. 1) ప్రస్తుత బి.ఎస్.పి. పొత్తులకు వ్యతిరేక వ్యూహాన్ని అవలంబిస్తుంది. బి.ఎస్.సి.తో చెలిమి అంటే విలీనమే. నరేంద్ర కూడా తన పార్టీని బి.ఎస్.పి.లో విలీనం చేస్తానని ప్రకటించిన తర్వాత మాత్రమే హైదరాబాద్‌లో జరిగిన మాయావతి సభలో వేదిక మీదికి అవకాశం దొరికింది. ఆ విధంగా చూస్తే చిరంజీవి రాజకీయ పార్టీ ప్రకటించకుండా బి.ఎస్.పి.లో చేరాలి. అది చిరు రాజకీయ శిబిరానికి రుచించలేదు. 2) ఒక జాతీయ పార్టీ సుప్రీం, కాబోయే ప్రధానిగా ప్రచారంలో ఉన్న వ్యక్తికి లోబడి మిగిలిన రాష్ట్ర నాయకుల్లో ఒకరిగా ఉండడం చిరు అభీష్టానికి భిన్నమైంది. 3) సామాజిక న్యాయం పునాదిగా దళిత ఉద్యమాలు బలంగా నడిచిన ఆంధ్రప్రదేశ్‌లో దళిత-అగ్రకుల సమ్మేళనాన్ని ఒక రాజకీయ నినాదంగా ముందుకు తేవడాన్ని దళిత బహుజనులు జీర్ణించుకోలేక పోయారు.

ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో బి.ఎస్.పి. నిలువునా చీలడం, ప్రచారం బలహీనపడడం, కుల సంఘాల నాయకుల్ని వివిధ రాజకీయ పార్టీలు ఆదరించడంతో సామాజిక న్యాయం నినాదం చీలికలు పేలికలైంది. చివరకు చట్టసభల్లో సీట్లు కేటాయించడమే సామాజిక న్యాయంగా అర్థం మార్చేశారు. అదే సమయంలో సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా ప్రకటించుకొని చిరంజీవి రాజకీయ రంగప్రవేశం చేశారు. పార్టీ పేరు ప్రకటించకముందే దళిత బహుజన ఉద్యమాలలో పనిచేసిన వ్యక్తుల్ని మొదటిగా పార్టీలోకి ఆహ్వానించి సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నట్లు బహుజనుల్ని నమ్మించే ప్రయత్నం చేశారు.

వైరుధ్యభరిత అడుగులు

చిరంజీవి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్, పూలే, గాంధీ, మదర్‌థెరిస్సా చిత్రాలు గీయించడం, పార్టీ ఆవిర్భావ సభలో పార్టీకి సంబంధించి జెండా రంగులకు సంబంధించి, సూర్యబింబానికి, కిరణాలకు సంబంధించి చిరంజీవి ఇచ్చిన వివరణ, దానిపై మీడియాలో జరిగిన చర్చ తదితర పాలిట్రిక్స్‌ను పక్కన బెడితే చిరంజీవి పదే పదే ప్రకటిస్తున్న సామాజిక న్యాయ సాధన, పవిత్రమైన రాజకీయాలు, అవినీతిపై పోరాటం లాంటి డైలాగులపై ప్రజారాజ్యం పార్టీ వేస్తున్న అడుగులపై చర్చ జరగాలి.

కులనిర్మూలన కోరుకున్న అంబేద్కర్, వర్ణాశ్రమ ధర్మాలు సజీవంగా ఉండటానికి జీవితాంతం ఆరాటపడ్డ గాంధీ ఇద్దరూ చిరంజీవికి ఆదర్శమెలా అవుతారు. దళితుల అభివృద్ధిని ఓర్వలేని, అవమానాలకు గురిచేసిన బుడ్డా వెంగళరెడ్డి కొడుకు, తోట త్రిమూర్తులు లాంటి వాళ్లు దళిత ఆత్మగౌరవం కోసం కృషి చేసిన కత్తిపద్మారావు, జె. గౌతం లాంటి వాళ్లు ప్రజారాజ్యం పార్టీ నాయకులుగా ఉన్నారు. విభిన్న శిబిరాలకు నాయకత్వం వహించిన వ్యక్తుల ద్వారా సామాజిక న్యాయాన్ని సాధిస్తానని చిరంజీవి చెప్పినా, ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరు. ఈ సందర్భంగా ఒక్క విషయం గుర్తు చేస్తాను. బహుళజాతి కంపెనీకి చెందిన కోకాకోలా బ్రాండ్ శీతల పానీయాలలో ఆరోగ్యానికి హాని కలిగించే గుణాలున్నాయని వైద్య నిపుణులు అనేకసార్లు పత్రికల్లో ప్రకటించారు. అలాంటి విదేశీ పానీయాలను తాగండంటూ చిరంజీవి యాడ్ ఇచ్చి డబ్బు సంపాదిస్తూనే మరోవైపు బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేస్తారు. రక్తాన్ని కలుషితం చేసే పానీయాలను తాగమంటూనే రక్త నిధి ఏర్పాటు చేసి రక్తదానం చేయమనడాన్ని ఏమనాలి. భిన్న ధోరణులు, వ్యక్తులు, వ్యక్తీకరణలు ఇనుమడించుకొని ప్రజల్ని నమ్మించే విధంగా సామాజిక న్యాయం, అవినీతి నిర్మూలన, రాజకీయాల ప్రక్షాళన పట్ల విస్తృతమైన ప్రచారం చేయడంలో ప్రజారాజ్యం పార్టీ మిగిలిన అన్ని పార్టీలకంటే ముందుందనే చెప్పాలి. కొత్తగా ఏర్పడిన పార్టీకాబట్టి ప్రజారాజ్యం పార్టీపై దళిత బహుజనులు కొన్ని ఆశలు పెట్టుకున్న మాట వాస్తవమే. కానీ, పార్టీలోకి చేరుతున్న వ్యక్తుల్ని చూసి నిరాశ పడుతున్నారు.

ప్రజలు మార్పుకోరుతున్నారు

ప్రతి రాజకీయవేత్త ఆలోచిస్తున్నట్లు, నూతనంగా పార్టీలు ప్రకటించుకున్న అధినేతలు పదే పదే ప్రకటిస్తున్నట్లు నిజంగానే ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. అది ముఖ్యమంత్రి మార్పో, అధికార పార్టీ మార్పో మాత్రం కాదు. అరవై ఏళ్లుగా అగ్రకుల పాలకుల ఏలుబడిలో బడుగులు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ దోపిడీకి గురయ్యారనేది నగ్నసత్యం. దానికి తోడు నూతన ఆర్థిక విధానాలు భారతదేశంలోకి ప్రవేశించింది మొదలు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ బడుగుల బతుకుల్ని చిన్నాభిన్నం చేశాయి. స్వదేశీపరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు ధ్వంసమై సామాజిక జీవన విధానం అస్తవ్యస్తమయ్యింది. పేదరికం, ఆకలి, అవమానాలు భరించలేక కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందరికీ కూడు, గూడు, గుడ్డ అందించగల రాజకీయ విధానాల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న ప్రజారాజ్యం పార్టీ పేదల బతుకుల్ని చిదిమేస్తున్న ప్రపంచ బ్యాంక్ ఆర్థిక విధానాల ఊసే ఎత్తడంలేదు. సెజ్‌లకు అవసరమైన భూమిని పారిశ్రామికవేత్తలే రైతుల నుండి కొనుగోలు చేయాలని ప్రజారాజ్యం పార్టీ ప్రతిపాదిస్తోంది. సెజ్‌లు రైతు–పారిశ్రామిక వేత్తలకు మధ్య సమస్య మాత్రమే కాదు, సమస్త పీడిత ప్రజల జీవన్మరణ సమస్య. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో జరుగుతున్న మానవ విధ్వంసం.

ప్రస్తుతం రాష్ట్రం సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సంక్షోభాలు బద్దలై అగ్రకుల పాలకులు, పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులకు పెను సవాలుగా మారకముందే ప్రజల్ని మభ్యపెట్టడానికి, భ్రమల్లో విహరింపజేయడానికి రాజకీయంగా ఒక కొత్త ముఖం దోపిడీ శక్తులకు నేటి అనివార్య అవసరం. అందులో భాగంగానే ప్రజల్లో సినీ గ్లామర్, ఆర్థిక బలం, అంగబలం ఉన్న ఆధిపత్య కులానికి చెందిన శివశంకర వరప్రసాద్ రంగం మీదకొచ్చారు. కాపునాడు అండదండలు, అభిమాన సంఘాల రూపంలో ప్రచార దళంతోపాటు ఎన్.ఆర్.ఐ.లు, బహుళజాతి కంపెనీల ప్రోత్సాహం కూడా చిరంజీవికి మెండుగా ఉంది. అందుకే ప్రజారాజ్యం పార్టీ ప్రతిరోజూ మీడియాలో ప్రధానవార్తా శీర్షికల్లో ఉంటోంది.

చివరిగా

ఎవరెన్ని ఆదర్శాలు వల్లించినా కులం పునాదుల మీద నిర్మితమైన ఈ వ్యవస్థలో అధికారం దక్కించుకోవడం కోసం ఆధిపత్య శక్తులు కుల సమీకరణపై ఆధారపడుతున్నాయనేది ఒక చారిత్రక వాస్తవం. అందులో భాగంగానే ఇప్పటిదాకా రాష్ట్రాన్ని ఏలిన రెడ్లు, కమ్మలతో పాటు కాపులు కూడా ఆ దిశగా పావులు కదుపుతున్నారు. పార్టీ ఆవిర్భావానికి ముందే రాష్ట్ర వ్యాపితంగా కాపు కులానికి చెందిన భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు, మేధావులతో హైదరాబాద్‌లో సమావేశం వేసి కులబలాన్ని పటిష్ఠపరిచి, పదిలపరచుకున్నారు. ఎన్నికల్లో గెలవడానికి అవసరమైన మనీ, మాఫియా, మీడియా సమృద్ధిగా రెడ్డి, కమ్మ, కాపు కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలకుంది. వాటిని విచ్చలవిడిగా వినియోగించడంలో ఎవరు ముందుంటే వాళ్లకే అధికారం దక్కేలా అవకాశం ఉంటుందనేది జగమెరిగిన సత్యమే. ఈ ఎన్నికల కుల కురుక్షేత్రంలో బలికాకుండా సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి పీడిత ప్రజలు సంసిద్ధం కావాలి. రాష్ట్రంలో జరుగుతున్న నిర్వాసిత, ఆదివాసీ, దళిత ఉద్యమాలను, మైనారిటీ మతస్తులు బి.సి.ల సామాజిక ఉద్యమాలను, విద్యార్థి, కార్మిక, కర్షక, మహిళా పోరాటాలను సమన్వయం చేస్తూ బలమైన ప్రజా ఉద్యమాన్నే నిర్మించాల్సి ఉంది. రాజీలేని పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలగుతామని ఎలుగెత్తి చాటుదాం. వీ

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరు మీద సాగుతున్న రాజకీయాలకూ, ప్రజలకూ సంబంధం చాలా తక్కువనీ, ఉన్న పార్టీలకు ప్రజారాజ్యం ఏమీ భిన్నమైంది కాదనీ అంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

ఎవరి కోసమీ ప్రజారాజ్యం పార్టీ?

ముప్పై సంవత్సరాలుగా తెలుగు చిత్రసీమలో కథానాయకుడిగా విజయవంతంగా కొనసాగుతున్న సుప్రసిద్ధ నటుడు చిరంజీవి (కొణిదెల శివశంకర వరప్రసాద్) రాజకీయ రంగంలోకి రావాలని చేసుకున్న నిర్ణయంతో ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసి ఇంకా నెల నిండలేదు. ఆ పార్టీ తరఫున అధికారికంగా కార్యక్రమం గాని, విధివిధానాలు గాని, ఎన్నికల ప్రణాళిక గాని ఇంకా ప్రకటించలేదు. ఇప్పటికయితే స్థాపకుడు, అధినాయకుడు చిరంజీవి ఆగస్ట్ 17న హైదరాబాద్ పత్రికా సమావేశంలో చేసిన ప్రకటనలు, ఆగస్ట్ 26న తిరుపతి బహిరంగసభలో చేసిన ప్రసంగం, ఆ తర్వాత ఆయనగాని, ఆ పార్టీ అధికార ప్రతినిధులుగాని వేరువేరు సందర్భాలలో చేసిన వ్యాఖ్యలు, ఇంటర్వ్యూలలో వెలిబుచ్చిన అంశాలు మాత్రమే ఆ పార్టీ గురించి అంచనా వేయడానికి ఆధారాలుగా ఉన్నాయి.

ప్రజారాజ్యం పార్టీ రానున్న ఎన్నికలలో అఖండ విజయం సాధిస్తుందనీ, ఆ ప్రభంజనంలో ఇప్పటిదాకా పాలించిన పార్టీలు రెండూ కొట్టుకుపోతాయనీ, చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవుతారనీ కొందరు ఊహిస్తున్నారు. చిరంజీవికి ప్రజాజీవితం గురించి, తెలుగు సమాజ సమస్యల గురించి ఏమీ తెలియదనీ, అందువల్ల ఆ పార్టీ రాజకీయ రంగంలో ఏమీ సాధించజాలదనీ, ఎక్కువలో ఎక్కువ కొన్ని స్థానాలు మాత్రం గెలుచుకోవచ్చుననీ మరికొందరు భావిస్తున్నారు.

ఈ అభిప్రాయాలలో వృత్తిపరమైన రాజకీయవేత్తల చౌకబారు ప్రకటనలను, పైపై పరిశీలకుల వ్యాఖ్యలను పక్కనపెట్టినా, తెలుగు సమాజంలో ఎంతో కొంత ప్రభావం ఉన్న రాజకీయ విశ్లేషకుల, మేధావుల, రాజకీయ పక్షాల అభిప్రాయాలనైనా పరిగణనలోకి తీసుకోవలసి ఉంది. అలాంటి అభిప్రాయాలు అటుకొసనుంచి ఇటుకొసదాకా, అతిశయోక్తులతో కూడిన పొగడ్తల నుంచి తెగడ్తలదాకా ఉన్నాయి. చిరంజీవి రాజకీయ ప్రవేశంతో తాను ముప్పై సంవత్సరాలుగా వేచిచూస్తున్న ప్రత్యామ్నాయం ఆవిర్భవించిందని దళిత నాయకులు కత్తి పద్మారావు అనగా, చిరంజీవి రాజకీయాల్లోకి రావడానికి పదవీకాంక్ష తప్ప మరొక కారణమేదీ కనబడడం లేదని ముప్పై సంవత్సరాలుగా ఆయనను సినిమాల్లో చూస్తున్న తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. చిరంజీవి వల్ల సామాజిక న్యాయం సాధించగలమనే ఆకాంక్షతో తమ మహాజనపార్టీ రద్దు చేసుకుని ఉ. సాంబశివరావు, జె. గౌతమ్ ఆ పార్టీలో చేరగా, చిరంజీవి సామాజిక న్యాయం సాధించడం కల్ల అని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) అధికార ప్రతినిధి జనార్దన్ ప్రకటించారు (నెల తిరగకుండానే ప్రజారాజ్యం వల్ల సామాజిక న్యాయం సాధ్యం కాదని చెపుతూ ఉ. సాంబశివరావు బైటికి వచ్చారు). ఒకవైపున ప్రజారాజ్యం పార్టీ కొత్త రాజకీయాల గురించి, అవినీతి నిర్మూలన గురించి మాట్లాడుతుండగానే, ఇతర రాజకీయ పార్టీలలో దశాబ్దాలుగా పనిచేస్తూ అవినీతికి, హింసకు, ముఠా రాజకీయాలకు పేరుపొందిన రాజకీయ నాయకులు ప్రజారాజ్యంలోకి వలసలు సాగిస్తున్నారు. ఇంతకాలంగా రాజకీయాలతో సంబంధం లేని చిరంజీవి అభిమానులు, యువకులు వేలాదిగా ఈ పార్టీలో చేరుతూ ఉండగా, దశాబ్దాలుగా రాజకీయానుభవం ఉన్న నాయకులు కొందరు ఈ పార్టీ ప్రభావం పెద్దగా ఉండబోదని చప్పరిస్తున్నారు.

ఒకే పరిణామం భిన్న దృక్పథాలనుంచి, భిన్న ప్రయోజనాల భూమికల నుంచి భిన్నంగా కనబడుతుందన్న సత్యం చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ విషయంలో మరొకసారి రుజువవుతోంది. ఈ గందరగోళపు నేపథ్యంలో కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన, నిర్దిష్టమైన సమాధానాలు చెప్పుకున్నప్పుడే ప్రజారాజ్యం పార్టీని సరిగా అంచనా కట్టడం వీలవుతుంది.

ఆ ప్రశ్నలు :

- తెలుగుసీమ రాజకీయాలలోకి ఏ పూర్వరంగంలో ప్రజారాజ్యం పార్టీ ప్రవేశిస్తోంది?
- ఆ పార్టీ ప్రకటిస్తున్న లక్ష్యాలేమిటి? సాగించదలచుకున్న ఆచరణ ఏమిటి?
- అటువంటి లక్ష్యాలనే ఇతర పార్టీలు కూడ ప్రకటిస్తున్నప్పుడు ఈ పార్టీ విశిష్టత ఏమిటి?
- తెలుగు సమాజ ప్రత్యేకతలోని ఏ గుణాలకు, లేదా ఏ దోషాలకు ఈ పార్టీ ప్రాతినిధ్యం వహించబోతున్నది?
- ఇప్పటికి నడుస్తున్న పార్టీల విధానాలలోని, ఆచరణలోని ఏ మంచిని ఈ పార్టీ సంలీనం చేసుకోనున్నది? ఏ చెడును ఈ పార్టీ పరిహరించదలచుకున్నది?
- సామాజిక న్యాయం అని కొత్త పార్టీ వాడుతున్న మాట దాని నిజమైన, లోతయిన అర్థంలోనా? ఇతర పార్టీలు వాడుతున్నట్టుగా పైపైననేనా?
- ప్రజారాజ్యం పార్టీ ఇప్పటికి చేసిన కొన్ని ప్రకటనలలో వ్యక్తమయి

నట్టుగా అది నిజంగా ప్రజా రాజకీయాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు ప్రతినిధిగా ఉండగలుగుతుందా?

- తెలుగు సమాజంలోని ప్రధానమైన సమస్యలపైన, ప్రత్యేకతలపైన, ప్రజలను ఆందోళన పరుస్తున్న అంశాలపైన ప్రజారాజ్యం పార్టీ వైఖరులేమిటి?

అసలు ప్రజారాజ్యం పార్టీ గురించి చర్చించబోయే ముందు ఒకటి రెండు విషయాలు స్పష్టం చేసుకోవలసి ఉంది. మొట్టమొదట ప్రజారాజ్యం పార్టీ ప్రస్తుతం ఉన్న సామాజిక, రాజకీయార్థిక చట్రం లోపల పనిచేయ దలచుకున్న పార్టీనే గాని, సామాజిక సమస్యలకు పరిష్కారాలు ఈ చట్రానికి బయట కూడ ఉండవచ్చునేమోననే ఆలోచన ఉన్న పార్టీ కాదు. అటువంటి పరిష్కారాలను కనిపెట్టడానికి వస్తున్నది కాదు. సామాజిక సమస్యలను అర్థం చేసుకునే వైఖరిలోనే ఆ పార్టీకి ఇతర పార్లమెంటరీ రాజకీయ పక్షాలకన్న భిన్నమైన వైఖరి ఏమీలేదు. అందువల్ల ఈ పార్టీని ఒక ప్రత్యామ్నాయ రాజకీయపార్టీగా అంచనా వేయడం కష్టం. ఎక్కువలో ఎక్కువ, ఉన్న రాజకీయ పార్టీలకు సమాంతరంగా వస్తున్న మరొక పార్టీగా మాత్రమే గుర్తించవచ్చు. అంటే ప్రస్తుతం ఉన్న అన్ని రాజకీయ పక్షాలకు ఉన్న గుణాలతోనే, లోపాలతోనే ఈ పార్టీ కూడా ఉండబోతున్నదే గాని ఎంత మాత్రమూ భిన్నంగా ఉండే అవకాశం లేదని గుర్తించాలి. ఆ పార్టీ తనకు తాను భిన్నమైనదాన్ననీ, ఇతర పార్టీలు చేయలేకపోయిన పనులేవో చేయడానికి వస్తున్నాననీ చేస్తున్న ప్రకటనలన్నీ ఆదర్శాలో, కోరికలో, ప్రగల్భాలో కావచ్చు గాని వాస్తవాలు కావడానికి అవకాశం లేదు. అది ప్రవేశిస్తున్న సామాజిక, రాజకీయార్థిక రంగస్థలమే దానికి ఆ అవకాశం ఇవ్వదు. ఆ పార్టీకి ప్రత్యామ్నాయ సామాజిక, రాజకీయార్థిక రంగస్థలం మీదికి, అంటే నిజంగా ప్రజారాజకీయాలలోకి రావాలనే కోరిక ఏమీ ఉన్నట్టు కనబడడం లేదు.

ఆ మాటకు వస్తే భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరు మీద సాగుతున్న రాజకీయాలకూ, ప్రజలకూ సంబంధం చాలా తక్కువ. అది నానాటికీ తగ్గిపోతున్నది కూడ. ఆ రాజకీయాల పేరు మీద పాలకవర్గాల, సంపన్నవర్గాల, దోపిడీ వర్గాల, బహుళజాతి సంస్థల అనుకూల రాజకీయాలు నడుపుతున్న పార్టీలన్నీ ప్రజల పేరునో, భావజాలాల పేరునో వాడుకోవడం మాటవరుసకే తప్ప లోలోపలి నుంచి, సారాంశంలో కాదు.

గత అరవై సంవత్సరాల పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్ర స్పష్టం చేసే అంశం ఏమంటే ఏ ఒక్క పార్లమెంటరీ రాజకీయ పక్షానికీ ఈ దేశ ప్రజల మౌలిక సమస్యలను తీర్చే వ్యూహంగాని, తీర్చాలనే కోరిక గాని, తీర్చడానికి అవసరమైన విధానాలుగాని లేవు. అన్ని రాజకీయ పక్షాలూ ప్రజలలో ఏదో ఒక బృందాన్ని ఆకర్షించే విధానాలు ప్రకటించి, ఆకట్టుకుని అధికారంలోకి రాదలచుకుంటున్నవే. ఏవో పైపై ప్రజా సమస్యలను తీర్చడమో, సమస్యలను మరిచిపోయే అతుకులూ మాట్లూ వేయడమో తప్ప సమగ్ర సామాజిక మార్పును సాధించదలచుకున్నవి కావు. అన్ని పార్టీలూ అధికారం చేపట్టడానికి తాము అంతకాలమూ తమ మౌలిక విశ్వాసాలుగా ప్రకటిస్తున్న వాటిని వదులుకోవడానికి కూడ సిద్ధమవుతున్నాయని చరిత్ర చూపుతున్నది. కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, సిపిఐ, సిపిఎం, తెలుగుదేశం, సమాజ్‌వాదిపార్టీ, బహుజన పార్టీ వంటి అన్ని ప్రధాన పార్టీలూ మాటల్లో ఏమి చెప్పినప్పటికీ, తమ విశ్వాసాల గురించి, ఆదర్శాల గురించి ఏ ప్రకటనలు చేసినప్పటికీ, కొనసాగుతున్న సామాజిక, రాజకీయార్థిక చట్రాన్ని మౌలికంగా మార్చడానికి చిన్న మెత్తు ప్రయత్నం కూడ చేయడం లేదు. ప్రత్యామ్నాయ సామాజిక, రాజకీయార్థిక నిర్మాణాలను రూపొందించడానికి ప్రయత్నించడం లేదు.

అంతేకాదు, ఈ అన్ని పార్టీలు కూడ కేవలం అధికారం కోసమే తమ విశ్వాసాలకు భిన్నమైన విశ్వాసాలుగల పార్టీలతో పొత్తులు కుదుర్చుకుంటున్నాయి. అధికారం పంచుకుంటున్నాయి. తమను తాము ఎంతగా ప్రజానుకూల రాజకీయ పక్షంగా చెప్పుకున్నప్పటికీ, అలా అధికారం కోసం కుదుర్చుకునే అవకాశవాద పొత్తులవల్ల ప్రజోపయోగ కరమైన విధానాలను అమలులోకి తేవడం ఆయా పార్టీలకు అసాధ్యమవుతున్నది. అంటే అధికారం ద్వారా చేయదలచుకున్న, చేయగలిగిన మంచి పనులకు అధికార లాలసే ఆటంకమవుతున్నదన్న మాట. అదే సమయంలో ప్రజలను భ్రమల్లో ముంచడానికి, ప్రజలను పక్కదారి పట్టించడానికి మాత్రం కొన్ని నినాదాలను, ప్రకటనలను, విధానాలను పెదవులపైన ఉచ్చరించవలసి వస్తున్నది. ఇవాళ పాలకవర్గ పార్టీలన్నీ ప్రకటించే ఆదర్శాల ఉమ్మడి లక్షణం ఇది. ఆ ఆదర్శాలను ఆచరణలోకి తేవాలనే కోరిక గాని, తెచ్చే చిత్తశుద్ధి గాని ఒక్క పార్టీకి కూడ లేవని గత అరవై సంవత్సరాల చరిత్ర రుజువు చేస్తున్నది.

పార్లమెంటరీ రాజకీయాలలో పని చేయాలని నిర్ణయించు కోవడంతోనే ప్రజారాజ్యం పార్టీ ఈ పాలక, దోపిడీ వర్గాల రాజకీయ క్రీడలో మరొక భాగస్వామిగా మారాలని ఉత్సాహపడుతున్నదని అర్థమవుతున్నది. సామాజిక న్యాయం, అవినీతి నిర్మూలన, ప్రజారాజ్యం అనే ఆదర్శాలను పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్రంలోపల సాధించడం అసాధ్యమని తేలిపోయిన తర్వాత మళ్లీ అవే నినాదాలను చేపట్టి కొత్త నటనకు సిద్ధం కావడమంటే ప్రజలను భ్రమల్లో కొనసాగించే కొత్త అంకానికి తెరతీయడమే గాని, నాటకం మార్చే ప్రక్రియ మాత్రం కాదు.

సామాజిక న్యాయం నిజంగా, సుస్థిరంగా సాధించాలంటే ఆస్తి మీద, అధికారం మీద, హోదా మీద, సంస్కృతి మీద సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, సమాన ప్రతిపత్తి ఉండాలి. ఎటువంటి అంతరాలూ ఉండగూడదు. కాని మన సమాజంలో ఒకవైపు వర్గ సమాజపు ఆస్తి సంబంధాల వల్ల, మరొకవైపు మనుధర్మపు అంతరాల కుల వ్యవస్థ వల్ల, మతం వల్ల, ప్రాంతం వల్ల, భాష వల్ల, స్త్రీ-పురుష భేదం వల్ల, చివరికి వయోభేదం వల్ల కూడ దారుణమైన అసమానతలు రాజ్యం చేస్తున్నాయి. ఈ అసమానతలు వేల సంవత్సరాలుగా కొనసాగుతూ, భౌతిక వాస్తవికతగా మాత్రమే కాక, మన భావాలలో కూడ నిండి మన ఆలోచనలను కూడ కలుషితం చేస్తున్నాయి. సామాజిక న్యాయం సాధించాలనే ఆదర్శంఉన్న వారెవరయినా ఈ అంతరాలన్నిటినీ భౌతిక వాస్తవికతలోనుంచీ, ఆలోచనలలోనుంచీ కూడా తొలగించే ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ఇవి వేల సంవత్సరాలుగా కొనసాగుతూ స్థిరపడి ఉన్నందువల్ల, వాటి కొనసాగింపుతో ఆయా రంగాలలో ఆధిపత్య శక్తుల స్వార్థ ప్రయోజనాలు ఇమిడి ఉన్నందువల్ల,

వాటిని తొలగించడం సులభమైన పనేమీ కాదు. అవి ఎవరో ఒక 'ఠాగూర్' వచ్చి మంత్రదండంతో ఒక్క రాత్రిలో ఊడ్చిపారేయగల రుగ్మతలు కావు. వాటిని తొలగించే పని సుదీర్ఘ కాలం, గట్టి పట్టుదలతో సాగవలసి ఉంటుంది. ఆ పని అనేక రంగాలలో, అనేక స్థాయిలలో, అనేక రూపాలలో సాగించవలసి ఉంటుంది. వాటిలో ఒకానొక, ప్రభావశీలమైన రంగం రాజకీయాలు. కాని పార్లమెంటరీ రాజకీయాల స్వభావం వల్లనే అవి ఈ అంతరాలను వాడుకోవడం ద్వారానే మనుగడ సాగిస్తాయి గనుక పార్లమెంటరీ రాజకీయ చట్రానికీ, సామాజిక న్యాయసాధనకూ ఎక్కడా పొసగదు. సామాజిక న్యాయానికి వేల సంవత్సరాలుగా దూరమైన వర్గాలు, సామాజిక న్యాయాన్ని సాధిస్తామనే వాగ్దానంతో పార్లమెంటరీ రాజకీయాలలో ప్రవేశించి ఏ మనువాదం దగ్గర, ఏ అంతరాల సమర్థన వాదుల దగ్గర తేలాయో వర్తమాన చరిత్రలో ఎన్నో ఉదాహరణలున్నాయి. ఆయా పార్టీలన్నీ సామాజిక న్యాయం అనే మాట వాడుతున్నాయిగాని, నిజానికి అవి కోరుతున్నది అధికారంలో వాటా మాత్రమే. అధికారంలో వాటా అనేది న్యాయమైన డిమాండే గాని అది సామాజిక న్యాయంలో ఒకానొక భాగం మాత్రమే. అది ఒక్కటే సామాజిక న్యాయం కాదు. అధికారంలో వాటా అనేది అణగారినవర్గాలలో ఒక చిన్న సెక్షన్‌కు పాలకవర్గాలలో చేరే అవకాశం మాత్రమే ఇస్తుంది. పాలితులలో అసంఖ్యాకులుగా ఉన్న వారికి సామాజిక న్యాయాన్ని అందజేయడానికి అది ఒక్కటే సరిపోదు.

ఇక ప్రస్తుతం అవినీతి నిర్మూలన అనే ఆదర్శం వల్లిస్తున్న వారందరూ అసలు అవినీతి అనేదాన్ని పైపైన మాత్రమే, కేవలం దాని వ్యక్తీకరణ రూపాలలోనే చూస్తున్నారు గాని అసలు అంతరాల వ్యవస్థలో అవినీతి సహజంగా ఉంటుందనే మాట మరచిపోతున్నారు. సమాజంలో అంతరాలు ఉన్నప్పుడు, ఒకరు పైన, ఒకరు కింద ఉన్నప్పుడు, పైకి పోవడానికి అవినీతి అవలంబించక తప్పని స్థితి ఉన్నప్పుడు సహజంగానే అవినీతి ఉంటుంది. సామాజిక విలువల్లో ఒక జీవన ప్రమాణానికి, జీవనశైలికి, విలాసాలకు, ఆడంబరాలకు, ఆస్తి పోగుచేసుకోవడానికి, అధికారం మీద గుత్తాధిపత్యానికి, 'పైకి' పోవడానికి పెద్దపీట వేసి ఉన్నప్పుడు, ఆ జీవన ప్రమాణాన్ని, ఆ విలాసాన్ని, ఆ ఆడంబరాన్ని, ఆ ఆస్తిని, ఆ అధికారాన్ని పొందడానికి తీవ్రంగా ప్రయత్నించడం జరుగుతుంది. అంటే అవినీతి అనేది వ్యవస్థలో కొనసాగుతున్న విలువల వల్ల మొదలవుతుంది. ఆ అవినీతిని కేవలం వ్యక్తిగత స్థాయిలో మాత్రమే చూసి ఆకలి వల్ల, అవసరం వల్ల, అత్యాశవల్ల అవినీతి చేస్తారని నిర్వచించడం సమాజపు లోతులు తెలిసి చేసే వ్యాఖ్య కాదు. ఆ అవసరమో, అత్యాశో రావడానికి కూడ మూలమేమిటి? అవినీతికి మూలాన్ని వ్యవస్థలో చూడకపోతే అవినీతి ఎంతమాత్రం అర్థం కాదు. అసలు అవినీతి అర్థమే కానప్పుడు దాన్ని నిర్మూలించబూనుకోవడం అసాధ్యం. అవినీతి నిర్మూలన జరగాలంటే వ్యవస్థలో మార్పులు రావాలి. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామిక చట్రమే వ్యవస్థను కాపాడడానికి, వ్యవస్థను ఎవరూ ధ్వంసం చేయకుండా రక్షించడానికి ఉంది. అందువల్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్రంలో ఒక భాగస్వామిగా ఉంటూ అవినీతి నిర్మూలన చేస్తాననడం తూర్పు వైపు గమ్యాన్ని చూపెడుతూ పడమరకు ప్రయాణం చేయడమే అవుతుంది.

ఇక ప్రజారాజ్యం, ప్రజల పాలన అనే మాటలు పార్లమెంటరీ రాజకీయ చట్రంలో అపహాస్యమయిపోయి దశాబ్దాలు గడిచి పోయాయి. నిజానికి యూరప్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒక మనిషికి ఒక వోటు అనే ప్రాతినిధ్య భావనమీద, సమానత్వ భావన మీద ఆధారపడి రూపొందింది. కాని ఆ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఏర్పడిన క్రమమే ఒక వైరుధ్య భరిత క్రమం. భూస్వామ్య నిరంకుశత్వాన్ని ఎదిరించే క్రమంలో పెట్టుబడిదారీ వర్గం తీసుకొచ్చిన ఆదర్శాలలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సార్వత్రిక వోటు హక్కు, ప్రాతినిధ్య పాలన అనే మంచి లక్షణాలూ ఉన్నాయి. వాటితోపాటే, పెట్టుబడిదారీవర్గం తన నిరంకుశత్వాన్ని, ఆధిపత్యాన్ని, సంపదను, హోదాలను పరిరక్షించుకోవడానికి ఆ ఆదర్శాలను దుర్వినియోగం చేసిన, వక్రీకరించిన, తూట్లు పొడిచిన చరిత్ర కూడ ఉంది. అందువల్ల సమానత్వం లేకుండానే, అంటే ఒక మనిషికి ఒక వోటు అనేది లేకుండానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వచ్చింది. కొనసాగుతున్న అంతరాలను వాడుకుని ఆధిపత్య శక్తులు వందలాది, వేలాది వోట్లమీద అధికారం చలాయించగల స్థితి, కొన్ని అణగారిన వర్గాలు అసలు తమ వోట్లు తామే వేసుకోలేని స్థితి వచ్చింది. తమ ప్రతినిధిగా ఒకరిని ఎన్నుకుని చట్టసభలకు పంపించవలసిన జనబాహుళ్యం తమకు ఎంతమాత్రం ప్రాతినిధ్యం వహించని వ్యక్తి, తమ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తమ ప్రతినిధిగా ఊరేగుతుంటే మౌనంగా ఉండిపోవలసి వచ్చింది. అలా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపంలో మాత్రమే కొనసాగుతూ, సారంలో అది భూస్వామ్య, రాచరిక పాలనల లాగనే, మరొక అల్ప సంఖ్యాకవర్గ నిరంకుశ పాలనగా మిగిలిపోయింది. ఇక భూస్వామ్యం తొలగి పోకుండానే, ఆధునికతలోకి, ప్రపంచీకరణలోకి తొంగిచూస్తున్న భారత సమాజంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు మంచి లక్షణాలేమీ మిగలకపోగా, ఈ అవలక్షణాలే ప్రధానంగా మారిపోయాయి. భారతదేశంలో కొనసాగుతున్న పాలనాపద్ధతిని ప్రజాస్వామ్యం అని అనుకోవడం ఆ మాటకే అవమానం.

అందువల్ల ప్రస్తుతం ఉన్న స్థితిలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించడం గాని, అవినీతిని నిర్మూలించడం గాని, నిజమైన ప్రజారాజ్యాన్ని స్థాపించడం గాని అసాధ్యం. ఆ చట్రాన్ని మార్చకుండానే ఆ ఆదర్శాలను సాధిస్తామని ఎవరయినా నమ్మబలుకుతున్నారంటే వారు ఆత్మవంచన అయినా చేసుకుంటూ ఉండాలి. లేదా పరవంచనకోసమైనా ఆ మాటలు చెపుతూ ఉండాలి.

ఈ విషయం స్పష్టమైన తర్వాత, పార్లమెంటరీ రాజకీయ చట్రంలోపలనైనా, ముఖ్యంగా భారత రాజ్యాంగం ఆమోదించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల పరిధిలోనైనా ఒక కొత్త రాజకీయ పక్షం చేయగల పనులు లేవా, నిజంగా ఒక కొత్తపార్టీ చిత్తశుద్ధితో ఆ పనులు చేయడానికి ప్రయత్నిస్తే అడ్డుకోవడం ఎందుకు అనే ప్రశ్నలు వస్తాయి. అయితే దురదృష్టకరమైన అంశమేమంటే యాభై ఎనిమిది సంవత్సరాల రాజ్యాంగ చరిత్రలో ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను సంపూర్ణంగా, నిజాయితీతో అమలు చేసిన పాలనా కాలం అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ లేదు. ఒకటి రెండు అంశాలనైనా

అమలు చేయడానికి ప్రయత్నించిన ఒకరిద్దరు నాయకులనూ మన రాజకీయాలు బయటికి తోసివేశాయి. ఇంతవరకూ జరిగిన చరిత్ర అదే గనుక, ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నించడం కూడా సాధ్యం కాదేమో అని అనుమానించవలసి వస్తున్నది. అధికారంలోకి వస్తున్నవారికి, వారి జెండాలూ, నినాదాలూ ఏవైనా, ప్రజానుకూల పాలన కాకపోయినా రాజ్యాంగబద్ధ పాలన కూడా అమలు చేయాలనే కోరికలేదేమో అనిపిస్తున్నది.

ఈ నేపథ్యంలో ప్రజారాజ్యం పార్టీ ఏర్పడి చిత్తశుద్ధితో ఆ పనులు చేస్తానని వాగ్దానం చేస్తే తప్పనిసరిగా అది ఒక మార్పుకు సూచనే. తెలుగు సమాజ రాజకీయాలలో అటువంటి మార్పు రావాలనే ఆకాంక్ష ప్రజలలో బలంగా ఉన్నందువల్లనే ప్రజారాజ్యం ఏర్పాటు పట్ల అనూహ్యమైన ఆసక్తి కనబడుతున్నది. మార్పుకొరకు ప్రజలలో ఉన్న కోరిక ఎంత బలమైనదంటే, ఎవరయినా మార్పు మాట ఎత్తితే చాలు, ఆ మాట అంటున్నవాళ్ల చరిత్రను, చిత్తశుద్ధిని, నిజాయితీని కూడా పట్టించుకోకుండా వారిమీద ఆశలు పెట్టుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలుగు సమాజం మార్పుకోసం ఎంతగా ఎదురుచూస్తున్నదో ప్రజారాజ్యం పట్ల వ్యక్తమవుతున్న ఆశలతో, ఊహలతో బయటపడుతున్నది. ఇరవై ఐదు సంవత్సరాల కాంగ్రెస్ పాలనతో విసిగిపోయి, మార్పు కోసం ఎదురుచూస్తూ 1983లో తెలుగుదేశం పార్టీని ఆహ్వానించినట్టుగానే ప్రస్తుతం కూడ ప్రజలు ప్రజారాజ్యం పార్టీని ఆహ్వానిస్తున్నట్టున్నారు.

అయితే, 1983కూ 2008కీ చాల తేడాలున్నాయి. తెలుగుదేశం పార్టీని ఆహ్వానించినప్పుడు లేని అనుభవం ఇప్పుడు తెలుగు సమాజానికి ఉంది. అప్పటికి మార్పు తెస్తామని చెప్పి ఆశలు రేకెత్తించిన ప్రతిపక్షాలు ఉన్నాయి గాని అధికారం చేపట్టి ఆ ఆశలకు ద్రోహం చేసిన అనుభవం లేదు. తెలుగుదేశం పార్టీ ఆ పని కూడా చేసి, ఇక మరెవరు ఆశలు రేకెత్తించినా అనుమానంతో చూసే పరిస్థితి కల్పించింది. కనుక అధికార పక్షం చేతా, ప్రధాన ప్రతిపక్షం చేతా వంచనకు గురయిన ప్రజలు ఈ ఇద్దరూ కాక మరెవరయినా వస్తారా అని ఎదురుచూస్తున్న మాట నిజమే. కాని ఆ ఎదురుచూపులు అమాయకమైన ఎదురుచూపులు కాదు, చైతన్యయుతమైన, విమర్శనాత్మకమైన ఎదురుచూపులే.

ముఖ్యంగా ప్రపంచీకరణ తర్వాత, ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచబ్యాంక్ పాలన నడపాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించిన తర్వాత ప్రజా ఆకాంక్షలు, ప్రయోజనాలు, ప్రజా ప్రాతినిధ్యం, ప్రజల భాగస్వామ్యం, ప్రజల కొరకు పాలన అనే రాజకీయ భావనలన్నీ చెరిగిపోయాయి. బహుళజాతి సంస్థల, సంపన్నుల కోరికలు, ప్రయోజనాలు, పాలనలో కార్పొరేటీకరణ, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని వక్రీకరించడం, ప్రచార సాధనాలను నియంత్రించడం ప్రజా ఆకాంక్షల వ్యక్తీకరణ మీద హింస ప్రయోగించడం వంటి పాలనా పద్ధతులు మొదలయ్యాయి. అప్పటివరకూ పాలకుల ఎజెండాలో నామమాత్రంగా నైనా ఉన్న ప్రజలు పూర్తిగా కనుమరుగైపోయారు. రాష్ట్ర జనాభాలో అత్యధికులు గ్రామీణులు గనుక, బహుళజాతి సంస్థల దృష్టి గ్రామీణ మార్కెట్ మీదికి అప్పటికింకా ప్రసరించలేదు గనుక తెలుగుదేశం పార్టీ పాలక ఎజెండాలో గ్రామం అనేది లేకుండాపోయింది. పట్టణాలలో కూడ తెలుగుదేశం పార్టీ సాగించిన 'అభివృద్ధి' ఫలాలు అత్యధిక సంఖ్యాకులకు దూరంగానే ఉండిపోయాయి. తత్ఫలితంగానే 2004 ఎన్నికలలో తెలుగుదేశం ఓడిపోయింది.

ఆ ఎన్నికలలో ప్రజలు తెలుగుదేశం పార్టీని ఓడించదలచుకున్నారు గాని అదేమీ కాంగ్రెస్ అనుకూల వోటు కాదు. నిజానికి 1952 ఎన్నికలనుంచీ కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల వోటు తక్కువలో తక్కువ 33 శాతం, ఎక్కువలో ఎక్కువ 52 శాతంగా ఉంది. అంటే కాంగ్రెసేతర వోటు 48 శాతం నుంచి 67 శాతం దాకా ఉంది. తెలుగు సమాజంలో ఎన్నికల రాజకీయాలను బట్టి చూసినా కాంగ్రెస్ ఎప్పుడూ కనీసం మెజారిటీ స్థాయిలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించలేదు. అలాగే 2004 ఎన్నికలలో కూడా తెలుగుదేశం పార్టీ వ్యతిరేక వోటుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ తన ప్రత్యర్థి పాలనా విధానాలనే యథాతథంగా అనుసరించింది. కాకపోతే, తెలుగుదేశం పార్టీ పాలనకన్న భిన్నంగా గ్రామీణ ప్రాంతాల మీద, వ్యవసాయ రంగం మీద, నీటిపారుదల మీద దృష్టి పెడుతున్నట్టుగా ప్రకటించుకుంది. ప్రపంచబ్యాంక్‌కూ బహుళజాతి సంస్థలకూ గ్రామీణ మార్కెట్ మీద పెరిగిన ఆసక్తి వల్లనో, వేలకోట్ల రూపాయల నిధులు ప్రవహించడం వల్లనో, అందులో గణనీయమైన భాగం తన ఆశ్రితులకు చేరడం వల్లనో కాంగ్రెస్ ఈ విధానపరమైన మార్పు మీద కేంద్రీకరించింది. అలాగే తెలుగుదేశం పాలనా కాలంలో విస్మరణకు గురయిన, తగ్గిపోయిన సంక్షేమ పథకాలను కొత్త రూపంలో అమలు చేయడం మొదలుపెట్టింది. సామాజిక, సమష్టి సంక్షేమ పథకాలను రద్దుచేసి, వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చే పథకాలను ప్రవేశపెట్టింది. తెలుగుదేశం పాలనా కాలంలో ఉద్యోగకల్పన మీద ప్రకటించిన సెలవును పక్కకుపెట్టి కొన్ని ఉద్యోగాలనయినా భర్తీ చేయడం ప్రారంభించింది. మీడియా వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, పద్ధతి ప్రకారం ఒక్కొక్క ప్రత్యర్థినీ బలహీనపరచడం పై కేంద్రీకరించింది. వీటన్నిటికీ తోడు కాంగ్రెస్ పాలనాకాలంలో ఐదు సంవత్సరాలలోనూ వర్షాకాలం ఆ పార్టీకి అనుకూలించింది. ఈ కారణాలన్నీ కలిసి, మొత్తం మీద గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణ ప్రాంతాలలోనూ కాంగ్రెస్ పాలన మీద అసంతృప్తి ఉన్నప్పటికీ, తెలుగుదేశం పార్టీ మీద 2004లో వ్యక్తమయిన వ్యతిరేకత స్థాయికి అది ఇంకా చేరలేదు. తెలుగుదేశం పార్టీ పట్ల వ్యతిరేకత ఐదు సంవత్సరాల ప్రతిపక్ష పాత్ర తర్వాత కూడా ఇంకా తగ్గినట్టులేదు.

కనుక ఇటు కాంగ్రెస్ పట్ల అసంతృప్తినీ, అటు తెలుగుదేశం పార్టీ పట్ల వ్యతిరేకతనూ మాత్రమే కాక, ఐదు దశాబ్దాల ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు తమ బతుకులలో ఏ మార్పూ తేలేకపోయాయనే సాధారణ జనాగ్రహాన్ని కూడ కలగలిపితే కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించడానికి తగిన భూమిక ఉంది. ప్రజారాజ్యం ఆ రకంగా సారవంతమైన భూమిక మీదనే మొలకెత్తుతున్నది. కాని ఆ భూమికను ఉపయోగించుకోగల శక్తి సామర్థ్యాలు ఈ కొత్త రాజకీయ పార్టీకి ఉన్నాయా అనేది అసలు సమస్య.

ఈ స్థితిలో రాజకీయ రంగంలో ప్రవేశిస్తున్న ప్రజారాజ్యం అటు కాంగ్రెస్‌ను, ఇటు తెలుగుదేశాన్ని తోసి రాజనగల మేలయిన రాజకీయ విధానాన్ని ప్రకటించినప్పుడే దానికి ప్రజాదరణ దొరుకుతుంది. అలా మేలయిన విధానాన్ని ప్రకటించడం మాత్రమే కాదు కచ్చితంగా, చిత్తశుద్ధితో అమలుచేయవలసి ఉంటుంది. సమీపగతంలోని రెండు పాలనాకాలాల ప్రజావ్యతిరేక అంశాలను ప్రజల దృష్టికి తెచ్చి, తాను ప్రత్యామ్నాయం చూపగలుగుతానని, ఆ పాలనాలోపాలను సరిదిద్దుతానని వాగ్దానం చేయవలసి ఉంటుంది. భిన్న వర్గాల ఆకాంక్షలను, ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమన్వయపూరితమైన విధానాలను ప్రకటించవలసి ఉంటుంది. అంటే నీటిపారుదల, భూ సంబంధాలలో అసమానతలు, ఎరువుల కొరత, విత్తనాల కొరత, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్ సమస్యలు, గిట్టుబాటు ధరలు, రైతుల ఆత్మహత్యలు వంటి వ్యవసాయ సంక్షోభ అంశాలు, పారిశ్రామికీకరణ, నిరుద్యోగం, ప్రపంచీకరణ, ప్రత్యేక ఆర్థిక మండలాలు కల్పిస్తున్న సమస్యలు, తెలంగాణ ఆకాంక్షలు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ, రాజ్యహింస, విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణ, పాలనలో అవినీతి, విప్లవోద్యమం వంటి అనేక అంశాలమీద ప్రజారాజ్యం పార్టీ తన వైఖరిని, తాను తీసుకోబోయే చర్యలను ప్రకటించవలసి ఉంటుంది.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత, ముఖ్యంగా కారంచేడు మారణకాండ తర్వాత ఈ రాష్ట్రంలో దళితుల ఆత్మగౌరవ ఆకాంక్షలు ఉద్యమ రూపం తీసుకున్నాయి. అదే క్రమంలో బహుజన కులాల ఆత్మగౌరవ ఉద్యమాలు కూడా తలెత్తాయి. స్త్రీలు, మైనారిటీలు, ఆదివాసులు కూడ తమ హక్కుల కోసం నినదిస్తున్నారు. తెలుగు సమాజంలో ఈ భిన్న సామాజిక వర్గాల ఆకాంక్షల వ్యక్తీకరణ, అధికారంలో వాటా కొరకు లేవనెత్తుతున్న డిమాండ్లు ఒక విశిష్ట దృశ్యాన్ని ముందుకు తెస్తున్నాయి. ఆ దృశ్యానికి రెండు కోణాలున్నాయి. ఒకవంక ఇంతకాలం, వందల సంవత్సరాలుగానో, వేల సంవత్సరాలుగానో నిరాదరణకూ, వివక్షకూ, దోపిడీకీ, పీడనకూ గురయిన వర్గాలు తమ న్యాయమైన స్థానం కోసం ఎలుగెత్తడం కనబడుతోంది. మరొకవంక, సమాజంలోని ప్రతి సామాజికవర్గమూ తన ప్రయోజనాల గురించి మాత్రమే మాట్లాడుతూ, సాధించవలసిన విశాల ఐక్యతను, ఉమ్మడి శత్రువులను, ఉమ్మడి ప్రయోజనాలను విస్మరిస్తున్నాయి. ఇటువంటి స్థితిలో ప్రతి విధానమూ, ప్రతి చర్యా ఏకకాలంలో అనుకూల, ప్రతికూల స్పందనలను ఆకర్షించే అవకాశం ఉంది. ఈ సామాజిక నేపథ్యంలో పనిచేసే రాజకీయ పార్టీ చాల జాగ్రత్తగా, సున్నితంగా, సమ్యక్ దృక్పథంతో, సమన్వయపూరితంగా పనిచేయవలసి ఉంటుంది. అలా కాకపోతే ప్రస్తుత రాజకీయపక్షాలలాగ అవకాశవాద వైఖరి తీసుకోవలసి వస్తుంది. ప్రజారాజ్యం పార్టీ విశాలమైన, సమగ్రమైన సామాజిక అవగాహన వ్యక్తీకరిస్తుందా, కొనసాగుతున్న పార్టీల దారిలో నడుస్తుందా అనేది పెద్ద సవాలు.

ప్రజారాజ్యం పార్టీ స్థాపకుడికి స్వయంగా అంత సామాజిక, రాజకీయ అవగాహన, విజ్ఞత ఉండాలని ఎవరూ ఆశించనక్కరలేదు. ఆయనకో, ఆయన చుట్టూ ఉన్న నలుగురైదుగురికో వ్యక్తిగతంగా ఆ అవగాహన, విజ్ఞత ఉన్నా ప్రయోజనం లేదు. ప్రజలలో ఉన్న మార్పు ఆకాంక్షకు ఒక వ్యక్తీకరణగా ప్రజారాజ్యం పార్టీ వస్తున్నది గనుక, దాని అధినాయకుడు సామాజిక న్యాయం అని కూడా నినదిస్తున్నాడు గనుక నిజంగా సామాజిక న్యాయాన్ని ఆకాంక్షించే వాళ్లందరూ ఆ పార్టీలో చేరినా, ఆ పార్టీని నడపబోయేది వ్యక్తులుగా వాళ్లు కాదు. ఒక రాజకీయ పార్టీ అంటే కొందరు వ్యక్తులు మాత్రమే కాదు. ఒక రాజకీయ పార్టీ అది పనిచేస్తున్న సమాజంలోని కొన్ని రాజకీయార్థిక శక్తుల ప్రయోజనాలు సాధించడానికి ఏర్పడే ఒక నిర్మాణం. ఆ నిర్మాణం బలం కోసం అది ఎన్ని నినాదాలయినా ఇవ్వవచ్చు. స్థాపకుల, ప్రోత్సాహకుల ఆలోచనలకు భిన్నమైన ఆలోచనలు ఉన్న వాళ్లకు కూడ చోటు కల్పించవచ్చు. కాని నిర్ణాయక అంశం మాత్రం ఆ రాజకీయ పార్టీని ముందుకుతోస్తున్న రాజకీయార్థిక శక్తులు ఏ ప్రయోజనాల కొరకు, ఏ అవగాహనతో పనిచేస్తున్నాయనేదే. ఆ నిర్దిష్ట రాజకీయార్థిక శక్తుల అభిమతాన్ని బట్టే ఆ పార్టీ ప్రణాళికలు, ఆచరణ సాగుతాయి.

ఇప్పటికి కనబడుతున్న సూచనల ప్రకారం ప్రజారాజ్యం పార్టీని నడుపుతున్న, మద్దతు ఇస్తున్న, ప్రోత్సహిస్తున్న, నిధులు సమకూరుస్తున్న సామాజిక రాజకీయార్థిక శక్తులలో ఇంతకాలం పాలకులుగా ఉన్న రాజకీయార్థిక శక్తులే ఉన్నాయి. అవి, కోస్తా జిల్లాలకు చెందిన ఒకటి రెండు పెత్తందారీ కులాలు, ప్రపంచీకరణ వల్ల బలపడిన సేవారంగ సంపన్నులు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుంచీ ప్రభుత్వరంగ నిర్మాణాల కాంట్రాక్టర్లుగా బలపడిన వర్గాలు, ప్రవాసాంధ్రులు, సినిమా, రియల్ ఎస్టేట్ వంటి రంగాల లబ్ధిదారులు. ప్రజారాజ్యం అధినేత సినిమా రంగంలోనూ, సంపన్న వర్గంలోనూ చాలా కాలంగా ఉన్నారు గనుక ఆ వర్గాలు కూడా ఆయనమీద ప్రభావం వేసే స్థితికి చేరుకుంటాయి. అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల అసంతృప్తితో ఉన్న యువతరంలో ఎక్కువ భాగం బహుశా ప్రజారాజ్యానికి మద్దతు తెలుపుతుంది. బహుశా అభిమాన సంఘాలు, అభిమానుల బృందాలు ఆ పార్టీకి తొలి సామాజిక పునాది అవుతాయి. అంటే అటు ప్రోత్సహించే శక్తులవైపు నుంచి చూసినా, ఇటు పాల్గొనే శక్తులవైపు నుంచి చూసినా ప్రజారాజ్యం పార్టీ నిజంగా గ్రామీణ, పట్టణ శ్రామిక ప్రజా పునాది మీద, శ్రామిక ప్రజల అవసరాల కోసం పనిచేయగల రాజకీయ పక్షం కాజాలదని అనిపిస్తున్నది.

పార్టీ స్వభావం, పార్టీ వెనుక ఉన్న శక్తుల స్వభావం, పార్టీ కార్యకర్తల స్వభావం ఎలా ఉన్నా అధినాయకుడు లేదా నాయకత్వం మొండిగా ప్రవర్తించి కొంత భిన్నమైన ఎజెండాను కూడ రూపొందించి అమలు చేయవచ్చుచని తెలుగుదేశం పార్టీతో సహా కొన్ని ఉదాహరణలు చరిత్రలో ఉన్నాయి. ఆ ఉదాహరణలను తీసుకుని ప్రజారాజ్యం పార్టీ నిజంగా ప్రజానుకూల కర్తవ్యాలను నెరవేర్చగలదా, నెరవేర్చడానికి ప్రయత్నిస్తే ఏం జరుగుంది, లేదా పార్టీని నడిపిస్తున్న శక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తూ సంపన్నుల అవసరాలే తీరుస్తూ నినాదాలన్నిటినీ విస్మరిస్తుందా, వాగ్దానాలను నెరవేర్చకపోతే ఇవాళ ఆ పార్టీ మీద ఆశలు పెట్టుకుంటున్న ప్రజా సమూహాలు ఏం చేస్తాయి వంటి ప్రశ్నలకు కాలం త్వరలోనే జవాబు చెపుతుంది. వీ

అధికార మార్పిడి జరిగిందేకాని సామాన్యులకు స్వాతంత్ర్యం రాలేదనీ, రెండవ స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించాల్సిన పరిస్థితులు ఉన్నాయనీ వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

పరాధీనభారతం - నిన్న, నేడు

(గత సంచిక తరువాయి)

నాగిరెడ్డి అప్పట్లో అధ్యయనం చేసి తెలుసుకున్న విషయమేమంటే 1955 నాటికి ప్రైవేట్ రంగంలో అమెరికా పెట్టుబడులు మొత్తం విదేశీ పెట్టుబడిలో 8.7 శాతానికీ, 1968 నాటికి 27.5 శాతానికీ చేరుకొన్నాయి. ప్రపంచబ్యాంక్ ప్రధానంగా అమెరికా లెక్కల్లో చేర్చినట్లయితే అపుడు భారతదేశం ప్రైవేట్ రంగంలో మొత్తం విదేశీ పెట్టుబడుల్లో అమెరికా భాగం మరొక 34 శాతానికి పెరుగుతుంది. విదేశీ పెట్టుబడుల ఆధిక్యతను మరో కోణం నుంచి కూడా చూడాలని నాగిరెడ్డి అన్నారు. అధికార మార్పిడికి ముందు తర్వాత కొద్ది సంవత్సరాల పాటు మన దేశంలోని పరికరాల పరిశ్రమ ప్రధానంగా స్థానిక డిజైన్లు స్థానిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉండగా 1955-56 మధ్య పదేళ్లలో ప్రధానంగా విదేశీ నమూనా రూపకల్పన, విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడే స్థితికి దిగజార్చబడిందని నాగిరెడ్డి పేర్కొన్నారు. అమెరికన్ పెట్టుబడులు ఏయే షరతులతో వస్తాయో కూడా నాగిరెడ్డి పుస్తకంలో సమాచారం లభిస్తుంది. ఏ కంపెనీకైనా విదేశీ ఆర్థిక సహాయ సంస్థలు రుణాలిచ్చిన తర్వాత వాటిని వినియోగించిన తీరు మీద నిఘా, అంగీకృత పద్ధతుల ప్రకారమే ఆ రుణాలు వినియోగపడేటట్లుగా చూడడం, దీనికి సంబంధించి నిరంతర నివేదికలు తయారు చేయడానికి పెద్ద సంఖ్యలో అమెరికన్ అధికారుల పటాలం పనిచేస్తుంది. విస్తృతస్థాయిలో కంట్రోళ్ల విధానం అమలు చేయబడుతుంది. ఆ విధంగా ఏటా మేనేజ్‌మెంట్ ఉత్పత్తి, అమ్మకాల ధరలు, కార్మిక సంబంధాలు, జమా ఖర్చులు మొదలైన విషయాల గురించి నివేదికలు ఆరారా ప్రపంచ బ్యాంక్‌కు సమర్పించాలి. ఇచ్చిన సమాచారాన్ని తనిఖీ చేయడానికి బ్యాంకుకు, దాని అధికారులకు హక్కు ఎపుడూ ఉంటుంది. భారత ప్రభుత్వం కన్నా బ్యాంక్ శక్తివంతంగా మరింత లోతుగా తన అధికారాన్ని చలాయిస్తుంది. టాటాలు, బిర్లాలే ఆ రోజుల్లో అతి పెద్ద స్వదేశీ కంపెనీలని చెప్పుకునే వాళ్లం. ఈ 'స్వదేశీ' బండారాన్ని నాగిరెడ్డి పటాపంచలు చేశారు. టాటాకు ఆ రోజుల్లో ఉన్న మూడు కంపెనీల్లో ఆస్తులు మొత్తం విలువ రు. 271 కోట్లుంటుందని అందులో దాదాపు సగం అంటే రు. 140 కోట్లు బ్యాంకు నుండి అమెరికా సంస్థల నుండి రుణాలుగా పొందినవే. ఇది కాక భారత ప్రభుత్వం బడ్జెట్ నుంచి అందించే భారీ సహాయం ఉండనే ఉంది. ఇలా విదేశీ రుణాలపై ఆధారపడినపుడు ఆ పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టిన స్వదేశీ పారిశ్రామిక వేత్తలు సైతం తమ పెట్టుబడులపై అధికారాన్ని కోల్పోతారు. ఈ పరిశ్రమలు విదేశీ పెట్టుబడిదారులకు ఉప సంస్థలుగా మారిపోతాయి.

ఆనాడే విదేశీ పెట్టుబడులు దేశంలోకి ప్రవాహంగా వచ్చి పడుతూంటే ఆ పెట్టుబడుల మీద సంపాదించి తమ తమ దేశాలకు తరలించే నిధులు రకరకాల పేర్లతో ఉంటాయి. పెట్టుబడి పెట్టిన తర్వాత వచ్చే లాభం తరలిపోతుందంటే అర్థం చేసుకోవచ్చు. కాని 1) ఇంజనీరింగ్ సేవలు, 2) సాంకేతిక సమాచార సేవలు, 3) రాయల్టీలు, 4) లైసెన్సు ఫీజులు, 5) న్యూయార్క్, లండన్ లేదా ఇతర దేశాల్లోనైనా ఉన్న కార్యాలయాల ఖర్చులు, 6) లాభాల్లో వాటాలు (డివిడెండ్లు) - విదేశీ రుణాలపై వడ్డీలు, 7) కర్మాగారాన్ని, యంత్రాలను పాత వాటి స్థానంలో కొత్త వాటిని నెలకొల్పాలనే పేరుతో అరుగుదల ఖాతాకు జమకట్టే నిధులు వగైరా పేర్లతో నిధులు తరలిపోతూంటాయని 'పేట్రియాట్' పత్రికలో వచ్చిన వివరాలను నాగిరెడ్డి ఉదహరించారు. కేవలం ప్రైవేట్ రంగంలోనే కాక, ప్రభుత్వ రంగంలో కంపెనీలు కూడా పైన ఉదహరించిన పద్దుల కింద చెల్లింపులు, తరలింపులు జరుపుతున్నాయి. అందుకే నాగిరెడ్డి అన్నారు 'ప్రభుత్వ రంగం, స్వతంత్ర పారిశ్రామికాభివృద్ధికి సహాయకారిగా ఉండడానికి బదులు, ప్రధానంగా దేశీయ, విదేశీ గుత్తపెట్టుబడిదారుల చేతుల్లో చక్కని సాధనంగా మాత్రమే తయారయింది'. దిగుమతుల మీదే ఆధారపడుతూ వచ్చిందని నాగిరెడ్డి ఆనాడే రాసిన పుస్తకంలో హెచ్చరించారు.

ముడిచమురు

నేడు ముడిచమురు ధరలు చుక్కలు చూస్తుండడంతో డెబ్బై శాతం చమురు అవసరాలను దిగుమతి చేసుకొంటూండడంతో మన ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒత్తిడిలకు లోనవుతోంది. రవాణా చార్జీలు పెరగడం, దానివల్ల వినిమయ వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు కొనుక్కోలేని స్థితికి దిగజారడం మన నిత్యానుభవం. దిగుమతుల మీద ఆధారపడ కుండా మనకున్న సహజ వనరులను వెలికితీయడం మీద కేంద్రీకరించకుండా మొదటినుంచీ దిగుమతులమీద ఆధారపడే వ్యవస్థను అప్పటి ప్రభుత్వం పెంచి పోషించిందని నాగిరెడ్డి పుస్తకం చదివితే అర్థమవుతుంది. అప్పట్లో పెట్రోలియంశాఖ మంత్రి మాలవ్యా దేశీయ వనరులను వినియోగించు కోవాలనే ప్రయత్నంలో భాగంగా ఓ.ఎన్.జి.సి. సంస్థను ఏర్పాటు చేసి ఆ దిశగా ప్రయత్నిస్తుండగా, దేశం చమురు రంగంలో స్వయం పోషకత్వం సాధిస్తే తన చమురు ఎగుమతులను దెబ్బతీస్తుందని భావించిన అమెరికా మన ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొని వచ్చి మన ప్రయత్నాలకు గండి కొట్టింది. అమెరికాలో అమెరికా ఆధీనంలో వివిధ దేశాల్లో ఉన్న చమురు బహుళజాతి సంస్థల ప్రతినిధులను పిలిచి చమురు నిక్షేపాలెక్కడ ఉన్నాయో పరిశోధన చేయమని ప్రభుత్వం ఆహ్వానించగా వారు వచ్చి అక్కడక్కడ తవ్వకాలు జరిపి, 'అబ్బే మీ దేశంలో భూగర్భంలో చమురు నిల్వలు లేనే లేవని' చెప్పారు. అవును, మరి మన దేశంలో చమురు నిల్వలు బయటకు

వస్తే వాళ్ల పెట్రోలియం ఉత్పత్తులకు మార్కెట్ చేయి జారిపోతుంది కదా. కాని సోవియట్ నిపుణులు వచ్చి అస్సాంలో పరీక్షలు జరిపి భూగర్భంలో చమురు నిల్వలున్నాయని నిరూపించారు. దేశంలో సొంత చమురు ఖనిజ నిల్వలున్నా, ప్రభుత్వం మొదటి నుంచి విదేశాల పైనే ఆధారపడింది. నిన్నా మొన్నా కాదు లేదా సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత కాదు, మనమోహన్ సింగ్ కాదు, పరాధీనత అనేది కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే ఉన్నట్లుంది.

దిగుమతి చేసుకుంటున్న ముడిచమురును శుద్ధిచేసి పెట్రోల్, డీజిల్, గ్యాస్, కిరోసిన్ ఉత్పత్తి జరుగుతోంది. 1970కు ముందే కొచ్చిన్, మద్రాస్, హాల్దియాలలో ప్రభుత్వమే నూనె శుద్ధి కర్మాగారాలను నెలకొల్పింది. ఈ కర్మాగారాలకు ముడిచమురు సరఫరా చేసే విదేశీ ఆయిల్ కంపెనీలకు అసాధారణ రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చిందని ప్రభుత్వమే నియమించిన కమిటీ వెల్లడించిన విషయాన్ని నాగిరెడ్డి ఉదహరించారు. ఉదాహరణకు కొచ్చిన్ కర్మాగారాన్ని విస్తరించడానికి ఫిలిప్స్ పెట్రోలియం అనే విదేశీ సంస్థతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం 'నూనె శుద్ధి కర్మాగారంలో శుద్ధి చేసే వ్యయం పెరుగుదలతో నిమిత్తం లేకుండా, ఆదాయం పన్ను లేకుండా డాలర్ రూపాయి మారకం రేటులో వచ్చే మార్పులతో నిమిత్తం లేకుండా ఫిలిప్స్ కంపెనీ వాటాలపై పది శాతం లాభం కల్పించబడింది'. ఇలాంటి ప్రోత్సాహకాలిచ్చి, నెత్తినెక్కించుకొన్న తర్వాత వాళ్లు కిందకు దిగుతారా? ఈ బహుళజాతి కంపెనీలు ప్రభుత్వాన్ని తమ చెప్పుచేతుల్లోకి ఎంత దూరం తీసుకొని వెళ్లాయంటే ఆ సమయంలో మధ్య ఆసియా తదితర చోట్ల పెద్ద ఎత్తున ఆయిల్ నిక్షేపాలు కనుగొనబడినప్పటికీ, తక్కువ ధరలకు రూపాయిల్లో చెల్లించే వీలు కల్పిస్తూ ముడిచమురును సరఫరా చేయడానికి సోవియట్ యూనియన్ సంసిద్ధతను వ్యక్తం చేసినప్పటికీ భారతదేశం తనకు కావాల్సిన క్రూడాయిల్‌ను సరైన ధరకు స్వంత వనరుల నుండి కొనుగోలు చేయకుండా నిరోధించబడింది. ప్రపంచబ్యాంక్ లాంటి అత్యంత శక్తివంతమైన అంతర్జాతీయ శక్తులు జోక్యం చేసుకొని అడ్డుకోవడం వలన భారత ప్రభుత్వానికి ప్రభుత్వ కమిటీయే చేసిన సిఫార్సును అమలు చేసే శక్తి లేకపోయింది. ఈ అంతర్జాతీయ శక్తులు ప్రభుత్వరంగ శుద్ధి కర్మాగారాల్లో కూడా ప్రత్యక్షంగా ప్రవేశించి ఈ రంగంలోని ఉత్పాదక శక్తిపై కంట్రోల్ చేయడంలో కృతకృత్యులయ్యాయి'. ఇది స్వతంత్ర దేశ ప్రభుత్వమేనా?

బోగస్ భూసంస్కరణలు

రాష్ట్రంలోని భూమికోసం, ఇళ్ల స్థలాల కోసం అందోళనలు నేడు ఉధృతంగా సాగుతున్నాయి. కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు, అరెస్టులు, లాఠీచార్జీలు షరామామూలే. ఈ ఉద్యమాలను పక్కదారి పట్టించడానికి అపుడపుడు లక్ష ఎకరాల చొప్పున ప్రభుత్వం పంపకం చేయడం, ఇదంతా ప్రజలను వంచించడానికేనని ప్రతిపక్షాల విమర్శలు. ఒక పక్క భూ పంపకం చేస్తున్నామంటూనే రెండో పక్క పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసమంటూ రైతుల భూములు లాక్కోవడం, సెజ్‌ల కోసమని రైతులను తమ భూముల నుంచి బేదఖల్ చేయడం గురించి ప్రతిరోజూ పత్రికల్లో వార్తలు చదువుతున్నాం. భూస్వాములకు, ధనిక రైతాంగానికి ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం భూస్వాములను భూముల నుంచి వెళ్లగొట్టే కార్యక్రమం చేపడుతుందనుకోవడం వట్టి భ్రమ. మొదటి ప్రణాళిక నుంచి 11వ ప్రణాళిక వరకు భూ సంస్కరణల పాట పాడుతుండడమే భూ సంస్కరణలు అమలుకావడం లేదనడానికి తిరుగులేని సాక్ష్యం. ఈ నాటకం ఇపుడే కాదు, మొదటి నుంచి సాగుతూనే వస్తోంది. ఈ బండారం గురించి నాగిరెడ్డి తన పుస్తకంలో వివరంగా, సుదీర్ఘంగా చర్చించారు.

భూస్వామ్య విధానానికి పునాది ఫ్యూడలిజం. జమీందారీ విధానం ఫ్యూడలిజంలో భాగమే. ఈ ఫ్యూడల్ శక్తులతో జాతీయ నాయకత్వానికి సన్నిహిత సంబంధాలున్నాయి. అలాంటి నాయకత్వం 'ఫ్యూడల్ వ్యతిరేక సంస్కరణలను కొంతయినా అమలుపరుస్తుందని ఆశించడం వొట్టి అవివేకం మాత్రమే. జమీందారీ విధానం రద్దు కోసం తీసుకొన్న చర్యలు కూడా కన్నీటి తుడుపే' నని నాగిరెడ్డి చెబుతూ 'జమీందారీలను రద్దుచేయడం వలన ప్రధానంగా భారతదేశపు సామాజిక ఆర్థిక పునాదిలో ఎటువంటి ప్రాథమిక మార్పులు సంభవించలేద'న్నారు. ఈ సందర్భంలో గున్నర్ మిర్థాల్‌ను ఉదహరించారు. 'మోటుగా చెప్పాలంటే భారత్, పాకిస్తాన్‌లలో దళారీల రద్దుకోసం తీసుకున్న చర్యలు వాస్తవంగా దున్నేవారికి భూమి ఇవ్వడానికి ఉద్దేశించినవి కావు'. అలాగే 1960లలో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ పత్రిక ఈ భూ సంస్కరణల తీరు గురించి రాస్తూ 'రాజకీయ ప్రజాస్వామ్యం మేలిముసుగు కింద చలామణి అవుతున్న ఈ భూసంస్కరణల తతంగం ప్రజల ముందు ప్రదర్శనకు వినియోగపడే నిరుపద్రవమైన చట్టం తప్ప వేరు కాదు' అని స్పష్టం చేసింది. కనీసం ప్రణాళికా సంఘాన్ని కూడా ప్రభుత్వం తన నిజాయితీ గురించి సంతృప్తిపరచ లేకపోయింది. 'రెవిన్యూ అధికారులు అనాలోచితంగానే వ్యతిరేక దృక్పథం అనుసరిస్తున్నారని' ప్రణాళికా సంఘం నియమించిన భూసంస్కరణల సంఘం చెప్పింది. అక్కడితో ఆగకుండా కౌలుదారి చట్టం అమలు గురించి కూడా తీవ్ర విమర్శ చేసింది. 'ఈ చట్టంలో నిర్వచించబడిన విధంగా తమ హక్కులను రక్షించుకోగోరిన కౌలుదార్లను నిరాఘాటంగా ఉద్వాసన చెప్పేందుకు ఈ చట్టం అనుమతించింది. కౌలు చెల్లించడంలో ఏపాటి ఆలస్యం జరిగినా కౌలుదార్లను భూమి నుంచి వెళ్లగొట్టడానికి భూస్వాములకు ఈ చట్టం అవకాశమిచ్చింది. తత్ఫలితంగా కోరుకున్న మార్పులు సాధించబడలేదు. ఈ నేపథ్యంలో పంచాయితీరాజ్ సంస్థలు ప్రారంభమయ్యాక గ్రామస్థాయిలో సైతం రూపొందించిన రాజకీయాధికారం ద్వారా తమ ఆర్థిక పెత్తనాన్ని సుస్థిరం చేసుకోవడం వల్ల గ్రామీణ జీవితం పై బడా భూస్వాముల పట్టు మరింత బలపడింది. ఈ పరిణామాలపై అలాగే గిరిజన ప్రాంతాల్లో పెచ్చరిల్లిన అశాంతిపై కూడా వ్యాఖ్యానిస్తూ 'గ్రామీణ ప్రాంతాల్లో ధనవంతులుగా ఉన్న కొద్దిమంది పెద్ద వ్యవసాయదారులకు, పెద్ద సంఖ్యలో ఉన్న చిన్న వ్యవసాయదారులు, భూమిలేని వ్యవసాయ కూలీలకు మధ్య పెరిగి పోతున్న అంతరాల వల్ల రాబోవు నెలల్లో, సంవత్సరాల్లో ఉద్రిక్తతలు మరింత పెరగవచ్చు' నని ప్రణాళికా సంఘం హెచ్చరికను ప్రభుత్వం పెడ చెవిన పెట్టడం వల్లనే నేడు దేశంలో చిన్న, సన్నకారు రైతాంగం, వ్యవసాయ కూలీలు తమ సహనాన్ని కోల్పోయి ఉద్యమాల్లోకి వస్తున్నారు. ఈ అసంతృప్తి జీవులను మిలిటెంట్ పోరాటాల్లోకి మళ్లించాలి. కేవలం ధర్నాలు, రాస్తారోకోలు వారి సమస్యల పరిష్కారానికి తోడ్పడవు.

బహుళ ప్రచారం పొందిన సస్య విప్లవం అధికోత్పత్తిని సాధించడానికి తోడ్పడిన విషయం కాదనలేం. అయితే అది సాధించిన ఫలితాలు ఎవరికి దక్కాయి అనే ప్రశ్నకు అప్పటి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఏం జవాబిచ్చారో చూడండి – 'సస్య విప్లవం ప్రయోజనాలు చిన్న వ్యవసాయదారుల కంటే ఇప్పటికే వాణిజ్య పంటలు పండించే వ్యవసాయదారులకు వారిలో సైతం చిన్న ఉత్పత్తిదారులకంటే పెద్ద

ఉత్పత్తిదారులకు మాత్రమే అందే అవకాశముంది. క్రమంగా పెద్ద ఉత్పత్తిదారుల చేతుల్లో చిన్న ఉత్పత్తిదారులు నలిగి నశించిపోయే అవకాశం, కౌలుదార్లు బేదఖల్ చేయబడే అవకాశం ఉంది. (భారతదేశంలో చేసిన అధ్యయనాన్ని ఉదహరిస్తూ ఆయన ఇలా అంటాడు) పంజాబ్‌లో సాపేక్షకింగా అతికొద్దిమంది వ్యక్తులు (వ్యవసాయ కుటుంబాల్లో రెండు శాతానికి మించని కుటుంబాలు) సస్య విప్లవం వల్ల ప్రయోజనం పొందారు. అప్పటి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి జగజీవన్ రాం కూడా 'గ్రామీణ ప్రాంతాల్లో సగభాగంగా ఉన్న పేద ప్రజానీకానికి వీటివల్ల ఎలాంటి ఫలితాలు చేకూరటం లేదు' అని అన్నారు. స్వయాన కేంద్ర మంత్రే ఈ విషయాన్ని అంగీకరించాడని అనుకొంటున్నారేమో. అదేమీ కాదని నాగిరెడ్డి అంటున్నారు. అధికార పార్టీ నుండి వస్తున్న ఈ సానుభూతి ప్రకంపనాలు ప్రజలను జోకొట్టి కర్తవ్య విముఖుల్ని చేయడానికి. ఇందిరాగాంధీకి, ఆమె ముఠాకు అభ్యుదయ మేలిముసుగు వేయటానికి ఉద్దేశించబడ్డాయి. ఒకవైపున దారిద్ర్యం పెరుగుదల గురించి, భూ సంస్కరణల ఆవశ్యకత గురించి అంతులేకుండా మాట్లాడడం, ఇంకోవైపున భూస్వాములకు పంపిణీ చేసేందుకై అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ (ఐడిఏ) నుండి రుణంగా వేలకొలది ట్రాక్టర్లను దిగుమతి చేయటం – ఇదీ ఇందిరాగాంధీ అండ్ కంపెనీ వారి మోసపూరిత రెండు నాల్కల కార్యక్రమం' పరిష్కారం? 'రాజకీయాధికారం విప్లవ వర్గాల హస్తగతం కాకుండా దున్నేవారికే భూమి హక్కు సాధించడం అసాధ్యమని దేశవ్యాప్తంగా రైతాంగానికి బోధించి అందుకై వారిని సన్నద్ధం చేసినపుడే రైతాంగ వ్యవసాయ విప్లవం నిజం కాగలదని' అన్నారు నాగిరెడ్డి. కాని నేడు ఈ వామపక్షాలతో సహా అన్ని పార్టీల నోటి వెంట 'దున్నేవారిదే భూమి' అని నినాదమే వినరావడం లేదు.

నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' పేరుతో రాసిన పుస్తకంలో (అది కేవలం పుస్తకం కాదు, అదొక పరిశోధనా గ్రంథం) – రాజకీయ, ఆర్థిక కోణంలో దేశంలో పరిణామాలను విమర్శనాత్మకంగా విశ్లేషించారు. నా ఉపన్యాసంలో ప్రధానంగా ఆర్థిక పరిణామాలు, విశ్లేషణకే పరిమిత మయ్యాను. వ్యవసాయ కూలీలు, గిరిజనులు ప్రభుత్వ, భూస్వామ్య వర్గాల హింసాకాండ లాంటి విషయాల గురించి కూడా ఆయన విశ్లేషించారు. స్థలాభావం, సమయాభావం వల్ల ఈ విషయాలను నేను ప్రస్తావించలేదు. నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వారు నన్ను ప్రసంగిచమని కోరుతూ ఏ విషయం గురించి ప్రస్తావిస్తారని అడిగినపుడు వెంటనే తడుముకోకుండా ఆయన రాసిన పుస్తకం గురించే మాట్లాడతానని అన్నారు. ఎందుకంటే ఈ రోజు మనం చూస్తున్న దేశ ఆర్థిక పరిణామాల గురించి నాలుగు దశాబ్దాల క్రితమే నాగిరెడ్డి ప్రస్తావించాడనిపించింది. ఈ రోజున ఇలా జరుగుతుందని ఆనాడే ముందుచూపుతో హెచ్చరించాడనిపించింది. ఈ రోజు దేశ ఆర్థిక పరిస్థితి, ప్రజల జీవనస్థాయి పతనోన్ముఖంగా పయనిస్తోందంటే, దీనికి ప్రారంభం 1991లో ప్రవేశపెట్టిన సంస్కరణలు మాత్రమే కాదని, 1947లో అధికార మార్పిడితోనే పడ్డాయని, ఆయన సమీక్షించిన 15, 20 సంవత్సరాల కాలంలోనే ఈ పతనవేగం పుంజుకొందని – దేశాన్ని నయావలస దేశంగా పరాధీనదేశంగా మార్చడానికి అమెరికా ప్రభుత్వం, దాని ప్రోద్బలంతో ప్రపంచబ్యాంక్ కుట్ర ఆనాడే ప్రారంభమయ్యిందని ఆయన చేసిన విశ్లేషణలను మీతో పంచుకోవాలనిపించింది.

ఆర్థిక సంస్కరణలు

అయితే 1991లో ప్రవేశపెట్టిన 'సంస్కరణల'తో పతన వేగం పుంజుకొంది, గుణాత్మకంగా తీవ్రతరమైంది. దేశం అత్యంత క్లిష్టమైన ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కున్న సమయంలో ప్రపంచబ్యాంక్ మోకాలడ్డం పెట్టి రక్షిస్తామని చెబుతూ అదే సమయంలో అలా రక్షించడానికి షరతులు విధించింది. అయినా, వాటిని అమలు పరచడం ప్రారంభించింది, నేడు బుష్ విషకౌగిలిలో అంటకాగుతున్నదీ ఆ మన్మోహన్‌సింగే. విశేషమేమంటే ఈ మన్మోహన్‌సింగ్ ప్రధాన కార్యదర్శి ఉన్న సౌత్ కమీషనే ఈ సంస్కరణల వెనుక ఉన్న ప్రమాదాన్ని గురించి 1990లోనే హెచ్చరించింది. ఆ కమిషన్ ఇలా చెప్పింది.

'వర్ధమాన దేశాల పాలిట రుణం అన్నది ఒక గుదిబండగా మారింది. రుణగ్రస్త దేశాలు కట్టుబానిస వ్యవస్థలుగా మారాయి. ఈ పరిస్థితి నయావలస వాదానికి అద్దం పడుతుంది. ప్రైవేటీకరణ పెక్కు సందర్భాల్లో ప్రజలకు దక్కాల్సిన అధికారం ఒక్క ప్రైవేట్ వ్యక్తికే దఖలు చేస్తుంది. అందువల్ల ప్రైవేటీకరణలో పరిష్కారం దొరకదు. ప్రగతి పథకాలపై చేసే ఖర్చును అధిగమించి పోయి ఆయుధాల మీద, రక్షణ వ్యవస్థ మీద పెట్టుబడుల్ని పెంచుకోవడం జరిగింది. భూ సంస్కరణలు, ఉన్న భూమిని మరింతి సామర్థ్యంతో వినియోగించడమూ వ్యవసాయోత్పత్తికీ ఆహార భద్రతకు అనివార్యం. భూమిపై యాజమాన్యం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించి ఉండడం వల్ల సాగుభూమి విస్తరణ నత్తనడక సాగి, వ్యవసాయ ఉత్పత్తి కుంటుబడిపోతోంది. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వాలు ఇన్నేళ్లుగా అశ్రద్ధ చేసినందుకు హానికరమైన ఫలితాలు వచ్చాయి. సంపన్న దేశాలు తమ రైతులకు భారీ ఎత్తున సబ్సిడీలు ఇవ్వడం ద్వారా ప్రపంచ మార్కెట్‌లో ఆహార ధరలను కుదించి వేశాయి. నేడు వర్ధమాన దేశాలు వివిధ స్థాయిల్లో అనుభవిస్తున్న ఆర్థిక పెత్తనాన్ని తాము వలస పాలనలో మగ్గిపోతూ ఏ స్వయం సాధన ద్వారా ఏ ధృడదీక్షతో, ఏ మనో నిబ్బరంతో కష్టాలను కడతేర్చి వచ్చారో అదిగో, ఆ స్వయం సాధనా దీక్షతోనే ఇప్పుడు ఈ పెత్తనాన్ని కూడా వదిలించుకోవడానికి శుభారంభం చేయాలి. వర్ధమాన దేశాలు స్వేచ్ఛగా తమ సార్వభౌమాధికారాన్ని చలాయించకోలేక పోతున్నాయి. నిశ్చింతగా నిలబడే అభివృద్ధి విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువు కాదని గుర్తించాలి' సౌత్ కమిషన్ నివేదికలో నుంచి ఉటంకించిన కొన్ని భాగాలివి. ఆ మన్మోహన్‌సింగ్ ఎక్కడ? ఈనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎక్కడ? కాంగ్రెస్ తీర్థ పుచ్చుకొని తర్వాత ఇలా మారిపోతారు కాబోలు. ఆయన సంతకం పెట్టిన నివేదికలో ఆయన చేసిన ఉద్ఘాటనకు, నేడు అమలు చేసిన, చేస్తున్న సంస్కరణలను పోల్చి చూస్తే ఆయన ఎంత దిగజారిపోయాడో స్పష్టమవుతుంది. కాగా ఈ ఆర్థిక సంస్కరణల ప్రభావం ఏమిటో చూద్దాం. నాగిరెడ్డి చేసిన విశ్లేషణ, చేసిన హెచ్చరికలు ఎలా వాస్తవరూపం ధరించాయో అర్థమవుతుంది.

సంస్కరణల ప్రభావం

1991లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అంతటి ముఖ్యమైన సంస్కరణలను పార్లమెంట్‌లో ప్రకటించి, ఆమోదాన్ని తీసుకొని ఉండాల్సింది. కాని అలా జరగలేదు. ఈ సంస్కరణల గుర్రాన్ని కళ్లాలు పట్టుకొని నడిపించింది, ఇప్పటి ప్రధాని, అప్పటి ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగే. అవును, సౌత్ కమిషన్ నివేదిక మీద సంతకం పెట్టిన మన్మోహన్‌సింగే, ఈ సంస్కరణలు కొత్తలో కరుస్తాయి గాని తర్వాత ముద్దుముద్దుగానే ఉంటాయని నమ్మబలికారు. అసలీ సంస్కరణలేమిటి? ఏ నేపథ్యంలో ప్రవేశ పెట్టబడ్డాయి?

1980లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వ మెదుర్కొంటున్న ఆర్థిక క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ నుంచి ఐదువేల డాలర్ల రుణం తీసుకోవడానికి నిర్ణయించుకొని, మొదటి కంతు రుణం తెచ్చుకోవడానికి విధించిన షరతులు కఠినంగా ఉన్నాయని భావించి తర్వాత కంతల రుణాన్ని తీసుకోలేదు. తదనంతరం అధికారంలోకి వచ్చిన రాజీవ్‌గాంధీ ఆధునికత అనే పట్టాల మీద '21వ శతాబ్దంలోకి' దేశాన్ని నడిపించాలనే నినాదం ఇచ్చారు. ప్రైవేటీకరణను అనుమతించి, విదేశాల నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొని పరిశ్రమలను ఆధునీకరించి వీలయినంత త్వరగా అభివృద్ధి చెందిన దేశాల సరసన భారతదేశాన్ని నిలబెట్టాలని ఆయన లక్ష్యం. ఆయన పరిపాలనలోనే ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల మీద విమర్శనా బాణాలను సంధించటం ప్రారంభమైంది. కాని, అనూహ్యంగా హత్యకు గురికావడంతో ఆ విధానం అమలుకు బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెసేతర సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో ఈ మార్పులు చేర్పులు మందగించాయి. అదే సమయంలో ఆర్థిక పరిస్థితి ఎంతగా దిగజారిందంటే చంద్రశేఖర్ ప్రధాని పదవినలంకరించిన తర్వాత మన దేశం బంగారం నిల్వలను కుదువపెట్టి నిధులు తెచ్చుకోవాల్సి వచ్చింది. అంతేకాదు, ప్రపంచబ్యాంక్ నుంచి తెచ్చుకున్న రుణం, ముఖ్యంగా అంతర్జాతీయ ప్రైవేట్ బ్యాంక్ నుంచి తెచ్చుకొన్న రుణాలు వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ చెల్లింపులు డాలర్లలో జరగాలి కాని మన ఖజానాలో డాలర్లు నిండుకొన్నాయి. దేశంలోకి దిగుమతులు తక్కువగా ఉండి, ఎగుమతులు ఎక్కువగా ఉంటే, మన ఇనప్పెట్లో డాలర్లు జమ అవుతాయి. ఆ డాలర్లతో రుణాలు చెల్లించవచ్చు. కాని అది జరగలేదు. డాలర్ల నిల్వలు రెండు వారాల దిగుమతుల చెల్లింపులకు కూడా చాలని సంకటస్థితి.

ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన పి.వి. నరసింహారావు ప్రభుత్వం ప్రపంచబ్యాంక్ వద్ద రుణం తీసుకొని అర్జంటుగా తీర్చాల్సిన రుణాలు తీర్చి సంక్షోభం నుంచి బయటపడింది. అయితే ప్రపంచబ్యాంక్ ఈ రుణాన్ని ఊరకనే ఇవ్వలేదు. కొన్ని షరతులు విధించి సంతకం పెట్టించుకొని మరీ ఇచ్చింది. ఆ షరతుల ముద్దుపేరే సంస్కరణలు. ప్రపంచబ్యాంక్ (ఇకనుంచి బ్యాంక్ అని అంటూంటా) షరతులను కేంద్ర ప్రభుత్వం తాను ప్రవేశపెడుతున్న సంస్కరణలే అని ముద్ర వేసుకుంది. ఆ షరతులు మన స్వయం సాధికారిత విధానానికే విరుద్ధం. ప్రభుత్వం అంగీకరించిన ప్రధాన షరతులు :1) ప్రభుత్వం తన బాధ్యతను, పరిపాలనను పరిమితం చేసుకోవాలి. వ్యాపారం చేయడం ప్రభుత్వం పని కాదు. 2) ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలి; 3) సబ్సిడీలు కుదించాలి; 4) పన్నుల ద్వారా ప్రభుత్వాదాయాన్ని పెంచాలి; 5) తలబరువుగా ఉన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదించాలి; 6) విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవాలి; 7) బ్యాంకులను విజాతీయం చేయాలి. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించాలి. 8) కొత్తగా భారీ నీటిపారుదల ప్రాజెక్టులు చేపట్టదలిస్తే వాటి ఆర్థిక భారాన్ని రైతులే మోయాలి; 9) ప్రభుత్వం అందించే ప్రతిసేవకు యూజర్‌చార్జీలు వసూలు చేయాలి; 10) ద్రవ్యలోటును తగ్గించాలి. ఇవన్నీ ఈ రోజున ప్రభుత్వ విధానాలుగా చలామణీ అవుతున్నాయంటే, అది ప్రపంచబ్యాంక్ చలవే. షరతులనే గొలుసులతో మన దేశాన్ని కట్టిపడేసి బ్యాంక్ మన సర్వసహాధికారాన్ని పూర్తిగా హరించివేస్తోంది. రుణం పేరుతో మన దేశ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటోంది. పేదరికాన్ని పారద్రోలడానికి సహాయం చేస్తానన్న పేరుతో పేదరికాన్ని పెంచిపోషిస్తోంది. మనజాతీయ సంస్కృతిని కలుషితం చేస్తోంది. మన వ్యవసాయం కార్పొరేట్ పరం అవుతోంది.

సంస్కరణల పేరుతో (సరళీకరణ అని కూడా పిలుస్తారు) ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు కూడా దేశంలో కాలుపెట్టాయి. ప్రైవేటీకరణ అంటే కేవలం ప్రభుత్వరంగ పరిశ్రమలే కాదు, యావత్ ఆర్థిక విధానాల్ని ప్రైవేట్ రంగం స్వాధీనం చేయడమే. ప్రైవేటీకరణ చేస్తే నష్టమేమిటి అని అనవచ్చు. ఉత్పత్తుల ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుంది. ప్రైవేట్ రంగానికి వదిలిపెడితే ధరలను మార్కెట్ నియంత్రిస్తుంది. ప్రైవేట్ రంగానికి లాభాలార్జించడం ప్రధానం కాబట్టి, ధరలను వారిష్టం వచ్చినట్లు నియంత్రిస్తారు. ఉదాహరణకు ఆర్.టి.సి. ప్రైవేటీకరిస్తే చార్జీలు పెరుగుతాయి. అందుకే సామాన్య ప్రజలు, ప్రభుత్వోద్యోగులు కార్మికులు వ్యతిరేకిస్తుండగా ప్రైవేటీకరణ, మార్కెటీకరణ చేస్తే వస్తువుల, ఉత్పత్తి క్రమంలో సమర్థత ఆధునీకత సాధ్యపడుతుందని, ప్రైవేట్ సంస్థలు మార్కెట్‌లో పోటీ పడతాయి కాబట్టి వినియోగదారులకు లాభమని ప్రైవేటీకరణనే తన విధానంగా చేపట్టింది. కంట్రోళ్లు ఎప్పుడో ఎత్తివేసింది. తిండి గింజలు, మందులు లాంటి కొన్ని వినియోగ వస్తువుల మీద ప్రభుత్వ ధరల నియంత్రణ కొనసాగుతోంది. అయితే ఈ ఉత్పత్తుల వ్యాపారంలో ఉన్న ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ విధానాలను తమకనుకూలంగా మార్చుకోవడానికి, ప్రభుత్వ ప్రమేయం పూర్తిగా తొలగించడానికి విశ్వప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

సరళీకరణ విధానాన్ని ప్రకటించడంతో వెనువెంటనే నూతన పారిశ్రామిక విధానాన్ని కూడా ప్రకటించాలి. బ్యాంక్ సూచనల మేరకు ప్రకటించిన విధానం ప్రకారం –

1. విదేశీ వాణిజ్యంలో లైసెన్సింగ్ విధానాన్ని ఉపసంహరించారు.
2. పారిశ్రామిక విధానంలో గత యాభై సంవత్సరాలుగా కొనసాగిన విదేశీ పెట్టుబడుల నిష్పత్తి శాతంపై ఉన్న ఆంక్షలను తొలగించారు. ఎవరు ఏ పరిశ్రమలోనైనా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు.
3. ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన కొన్ని పరిశ్రమల్లో ప్రైవేట్ భాగస్వామ్యం అవుతోంది. ప్రభుత్వరంగ సంస్థల ఈక్విటీలను ప్రైవేట్ వ్యాపార సంస్థలు కొనుగోలు చేయవచ్చు. అవి విదేశీ సంస్థలయినా ఫర్వాలేదు.
4. ద్రవ్యలోటును తగ్గించటం కోసం అనవసర ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలి. అంటే సబ్సిడీలను ఎత్తివేయడం, విద్య, ఆరోగ్యం, సంక్షేమం లాంటి రంగాలపై కోత విధించడం చేపట్టాలి. ద్రవ్యలోటును జాతీయ ఆదాయంలో అయిదు శాతానికి తగ్గించాలి.
5. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించాలి. వాటి ఈక్విటీని అమ్మేయాలి.
6. పోటీని, సమర్థత పెంచుకోవటానికి ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించాలి.
7. గతంలో ఉన్న ఎం.ఆర్.టి.పి. చట్టాన్ని కుదించి, అది విధించే పరిమితులను తగ్గించాలి.
8. విదేశీ సాంకేతిక ఒప్పందాలకు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు.
9. కంపెనీల చట్టం సవరించి ఇపుడున్న శ్రామికుల పెట్టుబడి సంబంధిత అడ్డంకులను తొలగించాలి.
10. విదేశీ నిపుణుల, కన్సల్టెంట్ల సలహాలను వాడుకోవాలి.

క్లుప్తంగా చెప్పాలంటే పారిశ్రామిక రంగం నుంచి ప్రభుత్వం పూర్తిగా వైదొలగి, సర్వం విదేశీ సంస్థలకు, ప్రైవేట్ రంగానికి వదలిపెట్టాలి. ఇది మళ్లీ పారిశ్రామిక పరాధీనతకు దారి తీస్తుంది.

ప్రపంచీకరణ

ఈ మాట పత్రికల్లో కనబడని రోజు, ఉచ్చరించని నాయకుడు లేడు. ఆంగ్లంలో గ్లోబలైజేషన్ అంటారు. డబ్బు, ఉత్పత్తులు, మనుషులు దేశాల సరిహద్దులను మరచి ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రపంచమంతా నిర్నిబంధంగా ప్రయాణించడమే ప్రపంచీకరణ. వివిధ దేశాలు పరస్పరాధారంగా నివసించడమే దీని అర్థం. సోవియట్ యూనియన్ ప్రపంచ పటం నుంచి నిష్క్రమించిన తర్వాత అమెరికా ఏక ధృవ ప్రపంచంగా తయారై ప్రపంచాన్నంతటినీ తన అధికార ఛత్రచ్ఛాయల్లోకి తీసుకోవాలని సంకల్పించి ఆ దిశగా పావులు కదపటమే ప్రపంచీకరణ. ఈ సాలెగూడులోకి మన దేశాన్ని ఇరికించటమే మన్మోహన్‌సింగ్ లక్ష్యం.

అమెరికాలో, బహుళజాతి సంస్థల వద్ద టన్నుల డబ్బు మూలుగుతోంది. ఆ డబ్బును ఆ దేశంలోని బ్యాంకుల్లో దాచుకుంటే రెండు శాతం వడ్డీయే వస్తుంది. అంతకన్నా ఎక్కువ వడ్డీ ఇచ్చే దేశాల్లో పెట్టుబడి పెట్టాలని ఆ పనిని బ్యాంకుకు అప్పగించింది. అలాగే దేశాల మధ్య తగవులు పెట్టి, వాళ్లు పరిష్కరించుకోకుండా తగువును ఎగదోస్తూ ఇద్దరూ పీకల దాకా సాయుధీకరణ చేసుకొంటూంటే, వాళ్లకు అమెరికాలోని యుద్ధ పరిశ్రమ ఆయుధాలను తయారుచేసి సరఫరా చేస్తూ లాభాలు పండించుకోవాలి. దేశాల మధ్య సమస్యలు లేకుండా ఉంటే సమస్యలను సృష్టించాలి. అంటే అమెరికా తన సమస్యను ప్రపంచీకరణ చేయాలి. (భారత-పాకిస్తాన్ సంబంధాలు ఒక ఉదాహరణ. చైనాకు భారత్‌కు సంబంధాలు బెడిసి కొట్టే దశలో ఉన్నాయి. ఈ లక్ష్య సాధనకు ఆయా దేశాల్లో తనకు నిప్పుల్లో పప్పులేరి పెట్టే నాయకులను ఎంచుకుంటోంది. (ఉదాహణరకు మన్మోహన్‌సింగ్).

పై పద్ధతులను మన దేశం మీద బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్., డబ్ల్యుటివో లాంటి సంస్థల ద్వారా ఎలా అమలుపరుస్తోందో కనబడుతూనే ఉంది. సంస్కరణలు ప్రారంభించినపుడు 90 బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ రుణభారం నేడు 300 బిలియన్ డాలర్లు దాటింది. అది ఒక ఎత్తు అయితే, దాని మీద చెల్లించే వడ్డీలు మన ఆర్థిక వ్యవస్థను తలకిందులు చేస్తున్నాయి. వడ్డీలకిచ్చే షావుకార్లలాగా ఈ సంస్థలన్నింటికీ వడ్డీయే ముద్దు. అసలు తిరిగి చెల్లించడానికి 25 లేక 30 సంవత్సరాల సమయం ఇస్తాయి. ఎందుకు? ఆ కాలంలో అసలు అసలుగానే ఉంటుంది. వడ్డీ ఆదాయం అసలుకన్నా మించిపోతుంది. వడ్డీలు చెల్లించడానికి కూడా మళ్లీ అప్పు చేయాల్సి వస్తుంది. రెండో పక్క ద్రవ్యలోటు తగ్గించుకోవాలని ఒత్తిడి చేస్తుంది. అది తగ్గించుకోవడానికి ప్రభుత్వం ఖర్చులు, అంటే జీతభత్యాలు, పరిపాలనా వ్యయం తగ్గించుకోవాలి. అవి తగ్గించుకోలేక సంక్షేమ పథకాల ఖర్చు మీద వేటు వేస్తుంది. అటు బడ్జెట్‌ను సంభాళించుకోలేదు. ఇటు ప్రజల కోపాగ్నిని భరించక తప్పదు. ప్రభుత్వం బలహీనపడుతుంది. మళ్లీ అమెరికావైపు చూస్తుంది. బ్యాంకుకు కావాల్సింది సరిగ్గా ఇదే. ఇదంతా ప్రపంచీకరణ పుణ్యమే. ఇది మొదటి విషయం.

రెండవది పరిశ్రమలు స్థాపించి లాభాలు చేసుకోవడం కాని, పరిశ్రమలు పెట్టకుండానే డబ్బును రెండింతలు చేసుకోగలిగితే అంతకన్నా మరేం కావాలి? అందుకోసం రెండు పనులు చేసింది. డబ్ల్యుటివోను సృష్టించి దేశాల మధ్య వ్యాపారానికున్న అడ్డంకులను తొలగించుకొని స్వేచ్ఛగా అభివృద్ధి చెందిన దేశాల ఉత్పత్తులను వర్ధమాన దేశాలకు ఎగుమతి చేసి, ఆ దేశాల స్థానిక పరిశ్రమలను దెబ్బతీసి మార్కెట్‌ను కైవసం చేసుకుంటోంది. అంత సులువుగా లాభాలు చేసుకోగలిగినపుడు వచ్చి పరిశ్రమలెందుకు పెట్టాలి. అలాగని పరిశ్రమలు పెట్టడం లేదని అనలేం. వారి వారి దేశాల్లో కన్నా వర్ధమాన దేశాల్లో చవకగా కార్మిక లభ్యత, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సహకాలు, మినహాయింపుల లభ్యతను బట్టి ఉత్పత్తి ఖర్చు తగ్గించుకొని ఎక్కువ లాభాలు సంపాదించుకోవచ్చు. (ఉదాహరణకు కార్ల పరిశ్రమ).

మూడవది, ఒక చేత్తో ఆర్థిక సహాయం చేయడం, రెండో చేత్తో ఆ సహాయం డబ్బు మళ్లీ తమ తమ దేశాలకు చేరేలా చూసుకోవడం తామిచ్చిన రుణాలకు షరతులను తగిలించి రైతాంగానికి సబ్సిడీల కోత, విద్యుచ్ఛక్తి, నీటిపారుదల చార్జీల పెంపు, ధరల పెరుగుదల, యూజర్ చార్జీల ద్వారా ప్రజలమీద భారాలను మోపుతుంది.

నాలుగవది, కార్మికులు, మధ్య తరగతి ఉద్యోగులకు అదే బ్యాంకు షరతుల మేరకు, 1) యాజమాన్యాలకు హైర్ అండ్ ఫైర్ అధికారం, కాంట్రాక్ట్ కార్మిక పద్ధతి ప్రవేశపెట్టడం, 2) దశాబ్దాలపాటు పోరాటాల్లో బలిదానంతో సాధించుకొన్న సౌకర్యాలు, హక్కులు అన్నింటినీ ఉపసంహరించడం, 3) డౌన్‌సైజ్, రైట్‌సైజ్ లాంటి అనేకపేర్లతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం, కాంట్రాక్ట్ కార్మిక పద్ధతి ప్రవేశపెట్టడం, పనిభారాన్ని పెంచడం, ఉద్యోగంలో ఉన్న వారికి జీతాలు తగ్గించడం, ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే. క్లుప్తంగా చెప్పాలంటే ఉద్యోగాల లో ఉన్నవారికి రక్షణలేదు. లేని వాడికి ఉద్యోగవసతి కల్పించే ప్రశ్నేలేదు. ఇవన్నీ ప్రపంచీకరణ దుష్ఫలితాలే. ఇలాంటి ప్రపంచీకరణను బలపర్చాలట.

ప్రపంచీకరణలో మరో ముఖ్యమైన పరిణామం. వస్తువులనే కాదు డబ్బునే ఎగుమతి చేయడం. దీనినే ఫైనాన్స్ కాపిటల్ అంటారు. ప్రపంచదేశాల మధ్య కేవలం రెండు శాతం డబ్బు మాత్రమే వ్యాపారానికి సంబంధించిన లావాదేవీల ద్వారా పరాటా అవుతుండగా, మిగతాదంతా ఫక్తు డబ్బు పరాటాతో ప్రపంచదేశాల్లో ఎక్కడ ఎక్కువ లాభాలు వస్తే అక్కడకు టూర్ చేస్తుంటుంది. ఇదే డబ్బు ప్రపంచీకరణ. డబ్బే ఒక వ్యాపారవస్తువు అయిపోయింది. ఒక చోట నుంచి మరోచోటుకి అంటే ఎక్కడ ఆ డబ్బుతో స్పెక్యులేషన్ చేసి, డబ్బుతో పిల్లలను పెట్టించవచ్చునో అక్కడకు కంప్యూటర్ బటన్ నొక్కితే వెళ్లిపోతుంది. అయినా, ప్రభుత్వం అంటుంది కదా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ పెనవేసుకొని పోతున్నాయి, మనం మడికట్టుకొని కూర్చొంటే ఎలా? అందుచేత ప్రపంచీకరణలో మనం కూడా భాగస్వాములం కావాలంటోంది. దాని ఫలితం మన దేశంలోనే మిలియనీర్లు, బిలియనీర్లు వందల సంఖ్యలో పెరుగుతుంటే, కోట్లాది ప్రజలు దారిద్ర్యరేఖ కిందకు చేరిపోతున్నారు. వారి ఆదాయాలు కుంచించుకు పోతున్నాయి. ఎనభై శాతం మంది రోజువారి ఆదాయం ఇరవై రూపాయలని ప్రభుత్వమే నియమించిన కమిటీ చెప్పింది. ప్రపంచ మానవాభివృద్ధి నివేదిక ప్రకారం పెరుగుతున్న సంపద వెల్లువలో పెద్ద పడవలు తేలియాడుతుండగా, చిన్న తెప్పలు, దోనెలు ప్రవాహపు వాలుకు కొట్టుకొని మునిగిపోతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం చెర నుండి బయటపడ్డామనుకొంటే అమెరికన్ ఆర్థిక సామ్రాజ్యవాదుల వలలో చిక్కుకొన్నాం; కాదు మన్మోహన్ దేశాన్ని ఆ వలలో ఈడ్చుకొని వెళుతున్నారు. ఇదేమీ అనుకోని పరిణామం కాదని, అధికార బదిలీ చేసిననాడే ఈ పరిణామానికి విత్తనం వేసారని నాగిరెడ్డి తన గ్రంథంలో చెప్పారు. ఆయన ఇచ్చిన పిలుపుతోనే నా ఉపన్యాసాన్ని ముగిస్తా.

'జనాన్ని కదిలిస్తే తప్ప దోపిడీ, దౌర్జన్యాలు అంతం కావు' వీ

నిజాయితీతో కూడిన ఆత్మ విమర్శ ద్వారా, వివిధ అస్తిత్వ ఉద్యమాలను సంఘటిత పరచడం ద్వారా ప్రత్యామ్నాయ విధానాలతోనే విప్లవోద్యమం బలంగా నిలబడగలదని అంటున్నారు **కె. రవి**

ప్రత్యామ్నాయ విధానాలు కావాలి

చీకటిలో తచ్చాడుతూ చీకటిని తిట్టుకోవడం, మురుగ్గుంటలో నిలబడి దోమల్ని తిట్టుకోవడం సుదీర్ఘకాలంగా అనుసరిస్తూ వస్తున్న పాత పద్ధతులే. తరాలు మారినా, ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ నవ్యత లోపిస్తే నవ్యత అసంభవం.

ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవితంలోనూ, వీటిపై ఆధారపడిన సాంస్కృతిక జీవనంలోనూ యాంత్రిక ధోరణి మనిషికి జీవితం పట్ల ఆశ పెంచకపోగా, నిరాశా నిస్పృహల్లోకి తోసేస్తోంది. 'వేగాన్ని అందుకోలేక పోతున్నాం' అనే పేరున చతికిలపడిపోవడం ఎంత తప్పో, గాలివాటున కొట్టుకుపోవడమూ అంతే తప్పు. విలువలపట్ల నిబద్ధత, కార్యాచరణలో నిమగ్నత లోపిస్తే మనిషి పతన దిశలో ఆఖరిమెట్టు మీద మాత్రమే నిలబడతాడు.

సమాజంలోని అన్ని పార్శ్వాల్లో పతన విలువలనే ప్రతిపాదిస్తున్న వర్గాలకూ, ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలకూ, సంస్థలకూ ప్రజలు ఆలోచించడం, ఆలోచనల్లోంచి ప్రశ్నను సంధించడం ఇష్టముండదు. విమర్శను, వ్యతిరేకతను, నిరసనను, ప్రతిఘటనను సహించడమనేది తమ మనుగడను ప్రమాద స్థితిలోకి నెట్టనంతవరకే. ఏ మాత్రం ప్రమాదం ఉందని గ్రహించినా ప్రశ్న గొంతును నొక్కివేస్తారు. నిరసనను అణచివేత చట్టం చుట్టుముడుతుంది. ప్రతిఘటనపై రాజ్యం ఉక్కు పాదాలతో విరుచుకుపడుతుంది. స్మశాన నిశ్శబ్దాన్ని నెలకొల్పేందుకు సకల మార్గాలూ అన్వేషిస్తుంది.

ఈ స్పృహలోపిస్తే 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య' హడావుడంతా గుడి గంటలలాగే వినిపిస్తుంది. ధర్మం నాలుగు పాదాలా నడుస్తున్నట్టే కనిపిస్తుంది. సాధారణ జనజీవితం సాఫీగా సాగిపోతున్నట్లే భావిస్తుంది. మిత్ర వైరుధ్యాలనూ, శత్రువైరుధ్యాలనూ అర్థం చేసుకునే ప్రయత్నం మానేసి 'మర్యాదస్తుల' కూటమిలో చేరిపోవడానికి ఇక ఎంతోకాలం పట్టదు. 'మర్యాదస్తులను' రాజ్యం స్వాగతిస్తుంది. యోగక్షేమాలు కనుక్కుంటుంది. 'జనజీవనస్రవంతి'లో కలిసిపోయినందుకు అభినందనల వర్షం కురిపిస్తుంది. ప్రజల గురించి సలహాలిచ్చే పాత్రనూ అప్పగిస్తుంది. ప్రజలపక్షాన మోగిన, మోగాల్సిన గొంతుక కూనిరాగాలు, కోయిల పాటలు ఆలపిస్తుంటే రాజ్యానికి అంతకంటే క్షేమం ఏముంటుంది?

వాళ్ల సరే, అందరూ - ఇప్పటికే ఉన్న పార్టీలూ, పుట్టిన 'చిరు' పార్టీలూ (దేశమంతా ఎస్.ఇ.జెడ్.లు విస్తరించాలని కోరుకునే అబ్దుల్ కలాం వీరికి ప్రేరణ) నూతన ఆర్థిక విధానాల బాణీలోనే గానం చేస్తున్నారు. మెల్లమెల్లగా ఈ విధానాలే ప్రజలను అభివృద్ధి పథంలోకి నడిపిస్తాయని ప్రబోధిస్తున్నారు. సవరణలు ప్రతిపాదిస్తే సరి, అంతా సవ్యమై పోతుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ప్రాజెక్టయినా, పరిశ్రమయినా, రింగ్ రోడ్డయినా, మెట్రో రైలయినా అభివృద్ధి చిహ్నాలుగానే కీర్తిస్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, జండారంగేదయినా, పార్టీ పేరేదయినా జరుగుతున్న 'అభివృద్ధి'నీ, కొనసాగుతున్న 'అభివృద్ధి నమూనా'నూ ప్రశ్నించకుండానే, సమీక్షించకుండానే సాగిపోతున్నారు.

డబ్బు.... డబ్బు.... అవినీతి.... అవినీతి - సంపాదించుకున్నా, ప్రత్యర్థులపై ఆరోపించుకున్నా ఇవి తప్ప మరే ఎజెండా లేనప్పుడు తప్పుడు విధానాలపై ప్రశ్న, పేద ప్రజల భవిష్యత్తు పట్ల ఆలోచన కనుమరుగే అవుతాయి. రేషన్ కార్డులూ, పెన్షన్లూ, ఇన్సూరెన్సులూ మొత్తం సమస్యలు పరిష్కరించే మంత్రదండాలుగా ప్రచారమవుతాయి.

ఈ విధానం ఫలితంగానే -

బహుళజాతి సంస్థలన్నీ కళ్లముందే కరాళ నృత్యం చేస్తున్నాయి. కంపెనీలు మిలటరీ కవాతుతో ముందుకు సాగుతున్నాయి. డబ్బు చెట్టు ధనవంతుల పెరళ్లలో మిలియన్లు, బిలియన్లుగా పెరుగుతున్నది. పంట భూములు ప్రత్యేక ఆర్థిక మండలాలుగా పడగలెత్తుతున్నాయి. నదీ తీరాలు, సముద్ర జలాలు నౌకాయాన కేంద్రాలవుతున్నాయి. కాలకూట విషం చిమ్మే కారిడార్లవుతున్నాయి. డ్రీమ్ సిటీలు, ఆకాశ హర్మ్యాలు, స్టార్ హోటళ్లు, డాలర్ క్లబ్బులు, పబ్బులు, పొడవాటి కార్లు, విమానాశ్రయాలు, వెడల్పాటి రోడ్లు, యూజర్ ఛార్జీల వినోదాలు పరుచుకుంటున్నాయి. రహదారులన్నీ టోల్ గేట్లుగా మారి రక్తం తాగేస్తున్నాయి. గనులూ, ఖనిజాలన్నీ పరాన్నభుక్కుల పాలవుతున్నాయి.

అవును, సంపద పెరుగుతున్నది. సంపద పోగు పడుతున్నది. వందలమంది చేతుల్లో, కాదంటే కొన్ని వేలమంది చేతుల్లో మిగిలిన కోట్లమంది...?

నూటికి అరవై మంది ఉన్న పల్లెలింకా రోదిస్తూనే ఉన్నాయి. రైతులింకా తగలబడుతూనే ఉన్నారు. నీళ్లన్నీ సముద్రం పాలే. విత్తనం లేదు, ఎరువు లేదు, కరెంట్ లేదు, వాగ్దానాల వర్షమే తప్ప ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి లేదు. ప్రైవేట్ వడ్డీ బుసకొడుతూనే ఉంది. ఆరుగాలం

కష్టపడినా ఆకలి తీర్చేంత, అప్పులు తీర్చేంత పంటా రాదు. వచ్చిన పంటకు ధరా రాదు.

నిజమే, 'ఉపాధి హామీ పథకం' ఊరికింత పని తెచ్చింది. ఊళ్లోకి కొంత డబ్బు తెచ్చింది. వచ్చిన డబ్బు కూలీల ఆకలి కడుపునింపలేదు. బెల్టు షాపులు నోళ్లు తెరిచి, మద్యం వరదలై పారి, డబ్బంతా ప్రభుత్వ ఖజానాలోకి కొట్టుకు పోయింది. మళ్లీ ఎప్పటి దారిద్ర్యమే. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చడానికే రెండు రూపాయలకు కిలో బియ్యం. ధరలు పెంచే బాధ్యత ప్రైవేట్ కంపెనీలకూ, వ్యాపారులకూ అప్పగించేసి, 115 రూపాయలకే నిత్యావసర సరుకులనే క్రూరమైన హాస్యాన్ని ప్రభుత్వం వెదజల్లుతోంది. శ్రామికవర్గానికి చెందిన వారమనే వాస్తవాన్ని అంగీకరించడానికి నామోషీపడే మధ్య తరగతి కూడా తెల్లకార్డుల కోసం ఎగబడేంతగా ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.

సాగునీటి కోసం వర్షం మీదనే ఆధారపడే భూములు అత్యధికంగా ఉన్న మన రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు సంవత్సరం పొడవునా పని దొరకడం అసంభవం కనుకనే లక్షలాది మంది వలసలు పోయింది. 'ఉపాధి హామీ' వలసలను నివారిస్తుందని ప్రభుత్వాలు చెప్పిన మాటలు ఆచరణలో విఫలం కాగా ఈ పథకం గ్రామీణ ప్రాంతంలో మిత్ర వర్గాలుగా ఉండాల్సిన రైతులకూ, కూలీలకూ మధ్య (భూస్వాములను, ధనిక రైతులను మినహాయించినా) శత్రువైరుధ్యాన్ని పెంచింది. వ్యవసాయ పనుల కాలంలోనే, ఉపాధి హామీ పనులు జరిగిన చోట, వ్యవసాయానికి కూలీల కొరతను ఏర్పరిచింది. గ్రామీణ పేదలకు కనీస వేతనాలను ఇచ్చిందేమీ లేదుగానీ ఉపాధి హామీ పథకం పని సంస్కృతిలో మాత్రం విపరీతమైన మార్పులు తెచ్చింది. ఉపాధిహామీ నిధుల కేటాయింపుల మీద ప్రధానంగా ఆధారపడింది. నిధులాగిపోతే పనుగాలి పోతాయి. పనుల కోసం కూలీల మధ్య పోటీ పెరిగి సగటున కూలీరేటు పడిపోతుంది. ప్రపంచబ్యాంక్ విధానాలు వేగంగా ముందుకు వెళుతున్న కొద్దీ సంక్షేమ పథకాలకూ, ఉపాధి హామీ లాంటి పథకాలకూ, సబ్సిడీలకూ నిధులు మరింత తగ్గిపోతాయి. ధరలు మరింత పెరిగిపోతాయి.

ఉపాధి హామీ పథక పనులకు నిర్దిష్ట పని గంటలు లేవు. యూనిట్‌ను బట్టి, పని చేసిన కూలీల సంఖ్యను బట్టి పని గంటలు, కూలీ రేట్లు ఆధారపడి ఉంటాయి. వ్యవసాయ కూలీపనులతో పోల్చినప్పుడు ఉపాధి హామీ పనులను తేలికపాటి పనులుగా కూలీలు భావిస్తున్న పరిస్థితి ఉంది. వ్యవసాయరంగంలో పనులకంటే ఉపాధి హామీ పనుల వైపే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్న పరిస్థితి ఉంది. వ్యవసాయ పనుల సీజన్‌లో ఉపాధి హామీ పనులపై రైతుల నుండీ తీవ్ర నిరసన వ్యక్తమౌతోంది. కూలీల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయరంగంలో యాంత్రీకరణను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణ, మధ్యతరగతి రైతుల్లో కూడా కూలీల పట్ల నిరసన వ్యక్తమౌతున్న దశలో ప్రవేశిస్తున్న యాంత్రీకరణ అంతిమంగా వ్యవసాయ కూలీల ఉపాధిని ప్రమాదంలో పడేసే అవకాశం ఎక్కువగా ఉంది. అదే సందర్భంలో ఎరువులూ, పురుగుమందులూ వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను పెంచినట్లే యాంత్రీకరణ కూడా రైతులపై భారాన్ని పెంచుతుంది. ఆహార ధాన్యాల పంటలిప్పటికే తగ్గిపోతూ వాణిజ్య పంటలు రాజ్యమేలుతున్నాయి. వాణిజ్య పంటలంటేనే మార్కెట్ ఆధారితం. మార్కెట్ యిప్పటికే (ఎరువులూ, విత్తనాలూ, పురుగుమందులూ, పంట కొనుగోళ్లూ) బహుళ జాతి కంపెనీల చేతుల్లో ఉంది. యంత్రాలూ అంతే. యంత్రాలను రైతులందరు స్వయంగా సమకూర్చుకోలేరు. యంత్రాలు కూడా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతాయి. డీజిల్ ధరలు పెరిగిన కొద్దీ యంత్రాలు కూడా రైతులకు భారమైపోతాయి. రైతులను అంతిమంగా మరింత సంక్షోభంలోకి నెట్టడానికే ప్రస్తుత దశలో యాంత్రీకరణ పురికొల్పుతుంది. దీనికి తోడు వ్యవసాయ కూలీలకూ, పేద, మధ్యతరగతి రైతులకూ మధ్య ఉం(డే)డాల్సిన మిత్రవైరుధ్యం శత్రువైరుధ్యంగా మారే ప్రమాదం ఉంది. భూమి సంబంధాలలో గుణాత్మక మార్పు రాకుండా వ్యవసాయ రంగంలో వచ్చే ఆధునిక పద్ధతులు పేద వర్గాల మధ్య సమస్యలను సృష్టిస్తాయనడంలో సందేహం లేదు. గ్రామీణ పేద, మధ్య తరగతి ప్రజలనందరినీ సమీకరించాల్సిన విప్లవశక్తులు ఉనికిలో లేకపోతే రైతులు వివిధ పాలక వర్గాల గొడుగు (పడగ?) కిందికి చేరతాయి. కూలీలు కుల సంఘాలలో సమీకృతులౌతారు.

కులచైతన్యం వర్గచైతన్యానికి తొలిమెట్టు అనడం సందేహించాల్సిన అంశమే. కుల సంఘాల వనరుల పంపకానికి సంబంధించిన ప్రజాస్వామిక డిమాండ్లను లేవనెత్తడం వేరు. వర్గ స్పృహతో ఒక్కటవ్వడం వేరు. గత కొన్ని దశాబ్దాల చరిత్రను, పరిస్థితిని గమనిస్తే కుల సంఘాల ఉనికి నుండి ప్రారంభమైన కార్యకర్తలూ, నాయకులెవరూ వర్గ స్పృహతో పని చేసే విప్లవపార్టీల వైపురాలేదు. పైగా దీనికి విరుద్ధంగా వర్గ స్పృహను కోల్పోయిన అనేకమంది విప్లవోద్యమ కార్యకర్తలు కులసంఘాలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. నాయకులుగా చెలామణీ అవుతున్నారు. వీరు తమ ప్రయోజనాల సాధన, పరిరక్షణ పేరిట వివిధ పాలకవర్గపార్టీల పంచన చేరుతున్నారు. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య' విషవలయంలో పడి తాదాత్మ్యం చెందుతున్నారు. విప్లవ పార్టీలలోని మానసిక బలహీన శ్రేణులనే ప్రలోభపెట్టి లొంగదీసుకునే పాలకవర్గ పార్టీలకు, ప్రభుత్వాలకు, ఏ నిబద్ధతా, సమష్టి ప్రయోజనాన్ని రక్షించే వర్గ స్పృహలేని కులసంఘాల నాయకులను, కార్యకర్తలను మచ్చిక చేసుకోవడం పెద్ద కష్టం కాదు. 'కులమేవర్గం, వర్గమేకులం' అని ఎన్ని తాత్విక ఆలోచనలు బయలుదేరినా కులసంఘాలేవీ ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ, సామాజిక కార్యాచరణను ప్రతిపాదించలేదనీ, ఆచరించే ప్రయత్నం చేయలేదన్నదీ స్పష్టం. ఆర్థిక విధానాలను అడ్డుకునే ప్రయత్నం అంటుంచి, దేవలయాలూ, ప్రార్థనా మందిరాలూ, యాగాలూ, చివరికి 'దళిత గోవిందం'తో భక్తీ, బెల్టు షాపులతో మద్యం మత్తూ వరదలై రాష్ట్రమంతా ప్రవహిస్తున్నా అడ్డుకునే ప్రజా, కుల ఉద్యమాలేవీ లేకపోవడమే విషాదానికి పరాకాష్ఠ. 'ఉనికి' కోసం పరితపించే ప్రత్యేక అస్తిత్వ ఉద్యమాల పరిమితులకు ఇది నిదర్శనం. పాలకవర్గ ప్రతిపక్షపార్టీల 'ఆందోళనల' గురించి ప్రత్యేకంగా చెప్పుకునేదేమీ లేదు. విప్లవపార్టీల, విప్లవ ప్రజాసంఘాల కార్యాచరణ గురించే చర్చించవలసి ఉంది.

నగరాలూ, నగరాల చుట్టూ ఉన్న విశాల ప్రాంతాలూ,

పారిశ్రామిక వాడలూ లక్షలాది మంది కార్మికులను, చిన్న ఉద్యోగులను పీల్చి పిప్పిచేసే దోపిడీ కేంద్రాలుగా ఉన్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాంతాలు వేలాదిమంది కట్టుబానిసలను తయారు చేసే రోజు ముంగిట్లోనే ఉంది. లక్షలాది మంది మత్స్యకారులను, ఇతర పల్లెకారులను కబళించి వేసే కారిడార్లు మరో ముఖ్యమైన దోపిడీ కేంద్రాలుగా తలెత్తనున్నాయి. అడవి గుండెల్లో గునపాలు దించేందుకు సిద్ధమవుతున్న మైనింగ్ యంత్రాలు ఆదివాసుల బతుకులను ఆగం చేసే రాబందులుగా రాబోతున్నాయి.

నిజమే, పల్లె కన్నీరు పెడుతున్నా, నగరాలు నరక ప్రాయపు 'ఉపాధి'ని హామీనిస్తున్నాయి. నిర్దిష్ట పని గంటలు లేవు. కనీస వేతనాలు లేవు. చట్టబద్ధ హక్కులు లేవు. అన్నిటికీ మించి ఉపాధి భద్రత లేదు. పని చేసే యంత్రాల్లా, మానసిక ఒత్తిడికీ, అలసటకూ, నిద్రలేమికీ, ఆకలికీ, అనారోగ్యానికీ నిత్యం గురయ్యే జీవచ్ఛవాల్లా లక్షలమంది జీవితపు పరుగుపందెంలో ప్రాణాలొడ్డుతున్నారు. రాజ్యాంగ యంత్రమంతా నగరాల్లోనే తిరుగుతున్నా రాజ్యాంగం అమలు కాదు. అడిగే హక్కు లేదు. అడిగితే బతుకూ లేదు.

ఈ పరిస్థితులు అందరూ గమనిస్తున్నవే. కొందరు బాధ పడుతున్నారు. కొందరు విశ్లేషిస్తున్నారు. కొందరు నిస్సహాయుల్లా నిలబడి చూస్తున్నారు. పాలకవర్గ పార్టీలకు – తాము అనుసరిస్తున్న ప్రపంచబ్యాంక్ విధానాలే ఈ పరిస్థితులకు కారణమని స్పష్టంగా తెలిసినా నెపం దేవుడి మీదకో, ప్రత్యర్థి పార్టీ మీదకో నెట్టి చేతులు దులుపుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. వర్షాధార ప్రభుత్వాలకూ, కరువొచ్చి ప్రభుత్వం దిగితే తాము గద్దెనెక్కుదామని చూస్తున్న ప్రతిపక్ష పార్టీలకూ ఈ దుష్ఫలితాలకూ బాధ్యత ఉంది. అసంఘటిత గ్రామీణ పేదల గురించి మనం అనగలిగిందేమీ లేదు గానీ, ఆ విధానాలను ఆపలేమనీ, ఉన్నంతలో ఉద్యోగాల్లో ఉన్నవారి ఆర్థిక ప్రయోజనాల గురించి ఆలోచిస్తే చాలనీ నిర్ధారించేసుకుని పైరవీలతో, పరిమిత పోరాటాలతో ప్రభుత్వాలతో బేరసారాలు సాగిస్తున్న కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకూ, వాటి నాయకులకూ మాత్రం ('సంఘటిత శక్తి' అని చెప్పుకుంటారు గనుక) ఈ దుష్ఫలితాలకు బాధ్యత ఉంది. ప్రభుత్వరంగ పరిశ్రమలను, సంస్థలను (స్కూళ్లు, హాస్పిటళ్లతో సహా) ప్రభుత్వాలు పనిగట్టుకుని ధ్వంసం చేయడానికి ఆయా రంగాల్లో పని చేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం, అలసత్వం, వేతన శర్మల మనస్తత్వం కూడా కొంత కారణమని చెప్పక తప్పదు.

ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంలో ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు భాగమే అయినా, ఆయా సంస్థలు సమాజంలో ఉన్న అట్టడుగు పేదల ప్రయోజనాల కోసం ఎంతో కొంత ఉపయోగపడుతున్నంత కాలం ఆయా సంస్థలను కచ్చితంగా కాపాడుకోవాల్సి ఉంటుంది. వేలకోట్ల రూపాయి కుంభకోణాలకు ప్రధాన ప్రాతిపదికగా ఉన్న ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాలలోని లొసుగులను గురించి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి, అధికారి కూడా నోరువిప్పి మాట్లాడడం లేదంటే, ఒక్క ఉద్యోగ సంఘం కూడా అటువంటి విషయాలను బట్టబయలు చేసి ఉద్యమించడం లేదంటే, ఆయా రంగాల సిబ్బంది రాజ్యయంత్రంలో ఎంతగా మిళితమై ఉన్నారో అర్థమవుతుంది. రాజకీయ, సామాజిక చైతన్యం ఆయా రంగాల సిబ్బందికి ఎంత తక్కువ స్థాయిలో ఉందో, ఆ చైతన్యాన్ని అందించడంలో ఆయా సంఘాలు ఎంత నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతుంది. కుంభకోణాల గురించి ఉద్యోగ సంఘాలూ, ఉద్యోగులే మాట్లాడకపోతే, బూటకపు ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది నిజాల గురించి నోరు ఎప్పుడు విప్పాలి?

దోపిడీ, పీడనలు అంతరించాలంటే సమాజంలో మౌలిక మార్పులు అవసరమంటాయి విప్లవ పార్టీలు. సమసమాజం సిద్ధించాలంటే (దశలవారీగానే) సాయుధ విప్లవం అనివార్యమని చెబుతాయి. ఈ మార్గంలో సాగుతున్న కృషికి దశాబ్దాల చరిత్ర ఉంది. 'రాజ్యహింస' ఎంతగా విప్లవోద్యమాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించినా విప్లవపార్టీలు తమ ఎజండాను కాపాడుకున్నాయి. విప్లవోద్యమమే శ్రామిక ప్రజల ఆశ, శ్వాస. పీడిత ప్రజల విముక్తి కోసం నిజాయితీగా పోరాడింది విప్లవకారులు తప్ప మరెవరూ కాదు. వ్యక్తులుగా సమాజంలో, వివిధ పార్టీల్లో, వివిధ వర్గాల్లో నిజాయితీపరులు ఉండవచ్చు. కానీ మొత్తం సమాజంలోని శ్రామిక ప్రజల సంపూర్ణ క్షేమాన్ని కాంక్షించే శక్తి మాత్రం విప్లవోద్యమమే. సమాజంలోని విభిన్నశ్రేణులు ఆయా సందర్భాల్లో లేవనెత్తే ప్రజాస్వామిక డిమాండ్లను ఎటువంటి తటపటాయింపులు లేకుండా నిజాయితీగా బలపరిచేదీ, సంఘీభావం ప్రకటించేదీ విప్లవోద్యమం మాత్రమే.

ప్రజలు సంఘటిత పడుతున్నారన్నా, గొంతెత్తి నినదిస్తున్నారను కున్నా, తమపై జరిగే దోపిడీ, పీడనలను ప్రతిఘటిస్తున్నారనుకున్నా అందుకు ప్రత్యక్ష, పరోక్ష ప్రేరక శక్తిగా పనిచేస్తున్నది విప్లవోద్యమమే. పాలకవర్గ పార్టీల అవకాశవాదాన్ని అందరూ అవగాహన చేసుకున్నారు. ఆ మేరకు తీర్పులిస్తున్నారు (ఎన్నికల చట్రంలోనే కావచ్చు). విప్లవోద్యమం నుండి వ్యక్తమయ్యే కొన్ని చర్యల పట్ల అసంతృప్తి, అనంగీకారం ఉన్నా, విప్లవపార్టీలను మాత్రం అవకాశవాద శక్తులుగా ప్రజలు చూడడం లేదు. రాజ్య యంత్రంలో భాగస్వాములైన ప్రధానమంత్రి నుంచీ కింది స్థాయి వ్యక్తుల వరకూ, పరాన్నభుక్కులంతా విప్లవోద్యమాన్నే ప్రధాన ప్రమాదంగా భావిస్తున్నారంటే అది విప్లవోద్యమ మిలటరీ శక్తిని చూసి కాదు. విప్లవోద్యమ తాత్విక, సైద్ధాంతిక బలాన్ని చూసే.

విప్లవోద్యమానికి ప్రధాన పునాది వర్గ పోరాటాలు. వర్గ పోరాటాల నిర్మాణం జరగాలంటే శ్రామిక ప్రజలను వారి మౌలిక సమస్యలపై సమీకరించడం జరగాలి. శ్రామిక ప్రజలను సమీకరించాలంటే వారి మధ్య నిలబడి పనిచేయడం అవసరం. ఆయా వర్గాల ప్రధాన సమస్యల అధ్యయనం అవసరం. విభిన్నశ్రేణుల ప్రత్యేక డిమాండ్లను అర్థం చేసుకుంటూనే, అందరినీ ఐక్యంగా ముందుకు నడిపించగలిగిన సాధారణ (కామన్) డిమాండ్ల రూపకల్పన జరగాల్సి ఉంటుంది. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల అమలు వల్ల వచ్చిన మార్పులు, నిర్దిష్ట ప్రాంతంలో ముందుకొచ్చిన సమస్యలు ప్రత్యేకంగా అధ్యయనం చేసి డిమాండ్లు రూపొందించాల్సి ఉంటుంది. ఈ విషయాలన్నీ మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావో చెప్పినవే. భారత విప్లవకారులందరూ అధ్యయనం చేసినవే. పుస్తకాల్లో, కరపత్రాల్లో ప్రచురించినవే. కానీ ఈ వాక్యాలు ఆచరణకు మార్గదర్శకంగా గాక, కేవలం వల్లించేందుకు మాత్రమే పరిమితం కావడం విషాదం.

చట్ల శంకర్‌రావు



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఆదిలాబాద్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నేత చట్ల శంకర్‌రావు తన 85వ ఏట బోథ్‌లో సెప్టెంబర్ 1న మరణించారు. 1940లలో హైదరాబాద్ రాష్ట్ర ప్రజా ఉద్యమాలలో పాల్గొనడం ప్రారంభించిన శంకర్‌రావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట (1946-51) కాలంలో జైలు శిక్షను అనుభవించారు. సాయుధ పోరాట విరమణ తరువాత నుంచీ భారత కమ్యూనిస్టు పార్టీ లోనే కొనసాగుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా, బీడీ కార్మిక సంఘ నాయకుడుగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. 1980లలో స్వగ్రామం బోథ్ సర్పంచ్‌గా, పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 1990లలో జిల్లా పరిషత్ ప్రాదేశిక కమిటీ సభ్యుడిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర సహకార సంస్థ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఏడాదిన్నర కాలంగా తీవ్ర అస్వస్థతో కొనసాగుతూ సెప్టెంబర్ 1న స్వగృహంలోనే తుది శ్వాస విడిచారు. వీ

దశాబ్దాల చరిత్ర అనంతరం విప్లవోద్యమం తన స్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది. వర్గపోరాటాల నిర్మాణం ప్రజా పునాదిని స్థిరంగా, విస్తృతంగా ఏర్పరుస్తుంది. వర్గపోరాటాల నిర్మాణం జరిగేప్పుడే రాజ్యమూ, పాలక శక్తులూ విప్లవోద్యమాన్ని అంతం చేసేందుకు ప్రయత్నిస్తాయి. హింసను ప్రయోగిస్తాయి. ఉద్యమ ఫలితాలు ప్రజలకు దక్కకుండా చేయాలని విశ్వ ప్రయత్నం చేస్తాయి.

బహిరంగ జీవన విధానం, పార్లమెంటరీ భ్రమలు, సాయుధ పోరాట మార్గంపై సడలుతున్న విశ్వాసం, విప్లవోద్యమంలోని ఒక భాగాన్ని కుంగదీస్తే; పూర్తి రహస్య జీవితం, నిరంతర మిలటరీ చర్యలు, రాజ్యహింస, విప్లవ శక్తులను కలుపుకు పోవడంలో, ప్రజా జీవితంలోని ప్రజాస్వామిక శక్తులను బతికించుకోవడంలో నిరాసక్తత, నిర్లక్ష్యం, ఉద్యమ దశకు సంబంధించిన ఊహాత్మక అంచనాలు, సమీక్షించుకునే తీరికలేని ఘటనలపరంపర విప్లవోద్యమంలో మరోభాగాన్ని దెబ్బతీశాయి.

ప్రజా జీవితంలోని ప్రతి సంఘర్షణనూ పట్టించుకోవలసిన విప్లవ పార్టీలు, పాలకవర్గాల ప్రతి వినాశకర విధానాన్నీ ప్రతిఘటించాల్సిన విప్లవశక్తులు, స్వీయాత్మకంగా, రక్షణాత్మకస్థితిలో పడిపోయాయి. ప్రజల మధ్య స్థిరంగా నిలబడాల్సిన శక్తులు, ప్రజలను సమీకరించి, ఉద్యమించాల్సిన శక్తులు ప్రజాఉద్యమాల నిర్మాణంపట్ల నిర్లిప్తంగా ఉండి పోతున్నాయి. ప్రభుత్వాలూ, దోపిడీ శక్తులూ ఇంత దుకుడుగా ఎందుకు వ్యవహరిస్తున్నాయి? కేవలం విప్లవోద్యమం రక్షణాత్మక స్థితిలో ఉండడం వల్లనే. మిగిలిన ప్రతిపక్షపార్టీల 'ఆందోళన'ల వల్ల తమ విధానాల అమలుకు ఎటువంటి ఢోకాలేదని పాలకులకు స్పష్టంగా తెలుసు. వీరిలో ఎవరు గద్దెనెక్కినా, తమ ప్రయోజనాలకేమీ నష్టం లేదని సామ్రాజ్య వాదులకు, పాలకవర్గాలకు స్పష్టంగా తెలుసు. అందుకే విప్లవోద్యమాన్ని అణచివేయడంలో వారందరికీ ఏకీభావం ఉంది. ఎవరు ఎన్ని కబుర్లు చెప్పినా, అంతిమంగా 'రాజ్యహింస' మీదనే వాళ్లంతా ఆధారపడతారు.

పరిస్థితిని అంచనా వేసుకోవడంలో విప్లవోద్యమం స్పష్టంగా ఉందా? స్పష్టత ఉంటే తక్షణం ఉద్యమ స్థితిని సమీక్షించుకుంటుంది. విప్లవశక్తుల మధ్య ఘర్షణలు నివారించుకుంటాయి. ప్రజా సమస్యలపై కనీస ఐక్య కార్యాచరణకు ప్రాతిపదికను రూపొందించుకుంటాయి. విశాల, సుదీర్ఘ ఐక్య సంఘటనా రూపకల్పనకు ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతాయి. 'ఫేగ్' లాంటి సంస్థలను బతికించుకుంటాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా ఉమ్మడిగా ఉద్యమిస్తాయి. ఒకరు పని చేస్తున్న ప్రాంతంలోకి మరొకరు ప్రవేశించినా 'జాగీరు' సిద్ధాంతాలను విడిచి పెట్టి పరస్పరం సహకరించుకుంటాయి. ఉమ్మడిగా ప్రజ ఉద్యమాల నిర్మాణం కోసం ప్లాన్ రూపొందించుకుంటాయి. విప్లవోద్యమం ప్రవేశించాల్సిన ప్రాంతాలూ, కూడగట్టాల్సిన ప్రజలూ విస్తృతంగా ఉన్నప్పుడు ఉమ్మడి కార్యాచరణ, బలమైన వర్గపోరాటాలు ఉండడం కంటే కనీస కార్యాచరణలో పాల్గొనేలా విభిన్న శక్తులను ప్రోత్సహిస్తాయి. సాయుధ పోరాట మార్గం కమ్యూనిజం, గమ్యం మర్చిపోకుండా ఉంటే విప్లవోద్యమం ముందుకు పురోగమిస్తుంది.

నిజంగా విప్లవోద్యమం భూమ్మీద నిలబడి ఉండి ఉంటే, ఇంత దుర్మార్గ విధానాలు కొనసాగుతుండేవా? ఇన్ని సెజ్‌లు రాష్ట్రంలోకి వచ్చి ఉండేవా? తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఇంత దిక్కుతోచని స్థితిలో ఉండేదా? పోలవరం ప్రాజెక్ట్ పనులు కొనసాగేవా? నిర్వాసితులు ఇంత నిస్సహాయంగా మిగిలి పోయేవారా? మేధావులు, ప్రజాస్వామికవాదులు ఇన్ని సైద్ధాంతిక గందరగోళాలకు గురయ్యేవారా? వర్గీకరణ విషయంలో మాల-మాదిగల మధ్య ఇంత మానసిక దూరం, వైషమ్యాలు ఏర్పడి ఉండేవా? విప్లవోద్యమం బలంగా కొనసాగిన జిల్లాల్లోనే ఇంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారా? నిజంగా విప్లవోద్యమం ఐక్యంగా ముందుకు సాగితే ఈ రాష్ట్రం ఇప్పటికీ ఇలా ఉండేదా?

సమయం మించిపోలేదు. విప్లవోద్యమశక్తి ఉడిగిపోలేదు. కావాల్సిందల్లా నిజాయితీతో కూడిన ఆత్మవిమర్శ. పెటీ బూర్జువా 'అహాన్ని' వీడి కార్మికవర్గ దృక్పథంతో ఉద్యమ సమీక్ష. 'అస్తిత్వ' ఉద్యమాలను తనతో కలుపుకుని వెళుతుంది. రాజ్యాన్ని సంఘటితంగా ఎదిరిస్తుంది. విజయం వైపు పురోగమిస్తుంది. వీ

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీ ఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడం గాని వీలు కావడం లేదు.

బోధన గురించి, జ్ఞాన వినిమయ క్రమంలో సమస్యల గురించి చర్చిస్తూ ఒక మార్క్సిస్ట్ బోధనా సిద్ధాంతాన్ని తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నారు **బ్రూస్ రాపాపోర్ట్**

బోధన గురించి మార్క్సిస్టు సిద్ధాంతం - ఆచరణ

ఉపోద్ఘాతం

నన్ను నేను ఒక మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడిగా ఊహించుకోవడం ఉద్వేగపూరితంగా ఉంది. నాకు పాఠాలు చెప్పడమంటే ఇష్టం. అంటే సమాచారాన్ని అందజేయడం, పంచుకోవడం, తయారు చేయడం అంటే నాకు ఇష్టం. ఎన్నో సంవత్సరాల వెతుకులాట తర్వాత నిజంగా ప్రపంచాన్ని వివరించే, ప్రపంచాన్ని మార్చే అంశం ఒకదాన్ని – మార్క్సిజాన్ని– బోధించే అవకాశం నాకు దొరికింది.

ఇటువంటి బోధనకు ఏ సిద్ధాంతం ఉందో, ఏ ఆచరణ ఉందో విశ్లేషించే పని ఇప్పుడు చేయబోతున్నాను. ఈ విషయం మీద నా ఆలోచనను, భావాలను క్లుప్తంగా పంచుకునే ప్రయత్నం చేస్తాను. ఈ భావాలు నాతోటి అధ్యాపకులతో చర్చల క్రమంలో, పని క్రమంలో అభివృద్ధి అయ్యాయి.

విప్లవ లేదా మార్క్సిస్ట్ బోధనా పద్ధతుల గురించి ఇప్పటి వరకూ వెలువడిన రచనలన్నీ కూడా ప్రాథమికంగా వస్తు సమస్యల గురించే మాట్లాడతాయి. అంటే, పాఠ్యాంశాల ప్రణాళికలు, పుస్తకాలు, ఇతివృత్తాలు వగైరాల గురించే మాట్లాడతాయి. నేను ఈ వ్యాసంలో మాత్రం ఇంతవరకూ తక్కువగా చర్చించబడిన బోధనా పద్ధతి గురించి చర్చించదలచుకున్నాను. బోధన గురించి ఒక మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని తయారు చేసే ప్రాథమిక ప్రయత్నం చేయదలచుకున్నాను. ఆ సిద్ధాంతం ఆధారంగా జరిగే కొన్ని ఆచరణలను సూచించి వాటి గురించి చర్చించదలచుకున్నాను.

రెండు రకాల బోధనా శైలులు – వాటి సమస్యలు

సాంప్రదాయిక బూర్జువా బోధనా పద్ధతిని మనం స్పష్టంగానే తిరస్కరించవచ్చు. దానిలో నిరంకుశత్వం ఉంటుంది, ఉన్నతవర్గ, మేధో అభిజాత్యం ఉంటుంది. పెట్టుబడిదారీ సమాజానికి అతి కీలకమైన అంతరాల శ్రమ విభజనను పునరుత్పత్తి చేసే ఉద్దేశ్యపూర్వకమైన నమూనా ఉంటుంది. అయితే ఇంత స్పష్టంగా సమస్యలు బయటపడని బోధనా పద్ధతులను కూడా మనం జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది.

వాటిలో మొట్టమొదటిది సాంప్రదాయిక బోధనా పద్ధతి మీదనే ఆధారపడుతూ మార్క్సిస్ట్ వస్తువును బోధించే పద్ధతి. దీనిలో ఉపన్యాసాలను, తీవ్రమైన విమర్శను, తారతమ్య వర్గీకరణను ఉపయోగించడం జరుగుతుంది. ఈ పద్ధతులను వాడడంలో విద్యార్థుల మీద బూర్జువా పద్ధతిలోని ఆధిపత్యాన్ని చలాయించడమేమీ ఉండదు కాని 'ప్రజలు మార్క్సిజం నేర్చుకోవలసి ఉంది కదా' అనే నిజాయితీతో కూడిన తపనే ఉంటుంది. 'ఎట్లాగైనా సరే వాళ్లకిది నేర్పాలి' అనే తపన ఉంటుంది. ఈ ప్రవర్తన ఒకరకంగా చెప్పాలంటే రాజకీయాలను ఆధిపత్యంలో పెట్టడం కన్న ఆర్థిక విషయాలను ఆధిపత్యంలో పెట్టడంగా ఉంటుంది. మరో మాటల్లో చెప్పాలంటే ఇక్కడ శ్రద్ధంతా జ్ఞాన సమూపార్జన పైనే ఉంటుంది. దాని పద్ధతి మీద పట్టింపు ఉండదు. ఎట్లాగైతే సోవియట్ యూనియన్ లో 'పెట్టుబడిదారీ ప్రోత్సాహకాలను వాడినా సరే సోషలిస్ట్ సంచయనాన్ని సాధిస్తే చాలు' అనుకున్నట్టుగా ఇది ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలలో ఇటువంటి వైఖరిని మావో విమర్శించాడు. విద్యాపరమైన వ్యవహారాలలో ఈ వైఖరి, మనం చెప్పబోతున్న విషయపు సాధారణ రాజకీయ నేపథ్యాన్ని విస్మరిస్తుంది. మన లక్ష్యం మన విద్యార్థులకో, మనకో మార్క్సిస్ట్ జ్ఞానాన్నంతా పోగు చేసుకోవడం కాదు. మన లక్ష్యం విప్లవకారులను తయారు చేయడం. పోటీతత్వం లాంటి బూర్జువా విలువలు లేని మనుషులను తయారు చేయడం. నేర్చుకోవడమంటే వ్యక్తి ఒంటరిగా వీలైనంత కుక్కుకునే క్రమమే అనే పెట్టుబడిదారీ ధోరణిని వ్యతిరేకించడం.

రెండో ధోరణి మరొక కొసకి వెళుతుంది. సాంప్రదాయిక తరగతి గదిలో ఉండే నిరంకుశత్వాన్ని వదిలేయడానికి ఉపాధ్యాయుడు చాలా శ్రద్ధ పెడతాడు. 'మీ ఇష్టం వచ్చినది నేర్చుకోండి' అనే బోధనా శైలిని అనుసరిస్తాడు. పాఠ్యాంశాల మౌలిక వస్తువు ఏమిటో, దాని నిర్మాణం ఏమిటో విద్యార్థులనే నిర్ణయించమంటాడు. ఒక తరగతి అనేది విద్యార్థుల ప్రకటిత కోర్కెల ప్రకారమే ప్రవహిస్తుంది. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే ఇటువంటి శైలిని లెనిన్ 'యాదృచ్ఛికత' అని పిలిచాడు. అధ్యయనం చేస్తున్న విషయాల గురించి తక్కువ పరిజ్ఞానం ఉన్న విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలనే బాధ్యతను ఇక్కడ ఈ విప్లవకారుడు, లేదా ఉపాధ్యాయుడు విస్మరిస్తున్నాడు. ఇటువంటి వైఖరి నాయకత్వం వహించడానికి, ఆధిపత్యం వహించడానికి తేడా ఉందని గుర్తించడంలో గందరగోళపడుతుంది. ఒకరంగంలో నాయకత్వ పాత్ర వహించడమంటే ఇతరులందరిమీదా అన్ని రంగాలలోనూ 'అధికుడిని' అని అనుకోవడం కాదు. ఒకానొక నిర్దిష్ట పరిస్థితిలో ఎక్కువ సమాచారం ఉండేవాడే ఉపాధ్యాయుడు. ఆ నిర్దిష్ట సందర్భం దాటిపోగానే ఆ ఉపాధ్యాయుడు అందరితో సమానమైపోతాడు. లేదా విద్యార్థి అయిపోతాడు. బూర్జువాల నియంత్రణలోని విశ్వవిద్యాలయాలలో ఉపాధ్యాయ పాత్ర చాలా తరచుగా సాధారణీకరణ పొందుతుంది.

విద్యార్థుల మీద ఎల్లకాలానికీ అధికుడిగా ఉండే, ఆధిపత్యం వహించే స్థానంగా మారుతుంది. 'మీ ఇష్టం వచ్చింది నేర్చుకోండి' అనే బోధనా శైలిలో నాయకత్వం గురించిన ఈ గందరగోళం మాత్రమే కాదు, మరొక సమస్య కూడా ఉంది. ఆ స్థితిలో సాధారణంగా దూసుకుపోయే స్వభావం ఉన్న విద్యార్థులు అంటే, పైకి వెళ్లే, పురుష విద్యార్థులు తరగతి మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారు. అందరు విద్యార్థులూ నిజంగా భాగస్వామ్యం వహించడానికి ఉండే అవకాశాలను రద్దు చేస్తారు. ఈ రకంగా 'కట్టుబాట్లు లేని స్థితి' ని కల్పించడమంటే నిజంగా పెద్ద ఎత్తున కట్టుబాట్లు ఉన్న స్థితిని కల్పించడమే. నిజంగా జరిగేదేమంటే పెట్టుబడిదారీ సామాజికీకరణ పొందిన విద్యార్థుల స్వభావాలూ పాత్రలే తరగతి గదిని నిర్దేశిస్తాయి.

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యమైన విషయం ఏమంటే ఈ రెండు సందర్భాల్లోనూ పొరపాట్లు జరిగినమాట నిజమే గాని, ఆ పొరపాట్లు దురుద్దేశ్యపూరితమైనవి కావు. అవి రెండూ కూడా ఒక నిజాయితీ పూర్వకమైన ప్రయత్నానికి సూచనలే. ఆ ప్రయత్నం విప్లవకారులుగాను, ఉపాధ్యాయులుగాను, ఏకకాలంలో ఉండదలచుకున్న ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో భాగంగా వచ్చినవి. మొదటి తప్పేమో మార్క్సిస్ట్ భావాలను ఏదో ఒక రకంగా విద్యార్థులకు చేర్చాలనే తొందరపాటు ప్రయత్నం వల్ల వచ్చే నిరంకుశ బోధనా పద్ధతి. ఇటువంటి తొందరపాటుతనమే కొన్నిసార్లు మనచేత దుందుడుకు చర్యలు చేయిస్తుంది. అతి ముఖ్యమైన విప్లవ ఓరిమి లేకుండా చేస్తుంది. ప్రత్యేకంగా 1960లలో అదే జరిగింది. రెండో బోధనా పద్ధతి అంటే 'మీ ఇష్టం వచ్చింది నేర్చుకోండి' అనే బోధనా పద్ధతి రావడానికి రెండు అవకాశాలు ఉన్నాయి. మొదటిది, మనం ఏ ఉపాధ్యాయుల దగ్గర నేర్చుకున్నామో ఆ ఉపాధ్యాయులలాగా నిరంకుశులుగా మారిపోవద్దనే భయం. రెండోది, ప్రతి ఒక్కరిని సమానులుగా, సహచరులుగా చూడాలనే నిజాయితీతో కూడిన శ్రద్ధ.

విప్లవ బోధనలోని వైరుధ్యాలు

మరి ఎక్కువ నిరంకుశంగా ఉండే పద్ధతులు, అరాచకంగా ఉండే పద్ధతులు రెండూ సముచితమైనవి కాకపోతే ఒక విప్లవ మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడిగా ఉండాలంటే తీసుకోవలసిన వైఖరి ఏమిటి? సాంప్రదాయిక కళాశాల ఉపాధ్యాయులు బోధనను ప్రాథమికంగా పాఠ్యాంశాల రూపంలోనే చూస్తారు. మంచి ఉపాధ్యాయుడు కావడం అంటే చెబుతున్న పాఠ్యాంశంలో అంతకంతకు ఎక్కువ నైపుణ్యం సంపాదించడమే అనుకుంటారు. కాని, మార్క్సిస్టులుగా మనం సమర్థమైన బోధన అనే కర్తవ్యాన్ని భిన్నమైన దృక్పథం నుంచి చూడవలసి ఉంటుంది. మనం అందజేయదలచుకున్నది విప్లవ, మార్క్సిస్ట్ విశ్లేషణ అనేదీ, పెట్టుబడిదారీ భావజాలం కాదనేదీ సుస్పష్టమే. కాని ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఇంకా లోతైనది. భావాలు శూన్యంలో ఉండవని, ఒక నిర్దిష్ట, సామాజిక సందర్భంలోనే భావాలు ఉంటాయనే అవగాహన మార్క్సిజంలో మౌలికమైనది. దాన్ని బట్టి తేలేదేమంటే, భావాలను బోధించేటప్పుడు ఈ బోధన, శిక్షణ ఏ సామాజిక సందర్భంలో జరుగుతున్నదో అతి జాగ్రత్తగా గుర్తించాలి. అప్పుడు ఒక మార్క్సిస్ట్ ఉపాధ్యాయుడి కర్తవ్యం అత్యద్భుతమైన మార్క్సిస్ట్ విశ్లేషణను అభివృద్ధి చేయడం మాత్రమే కాదు, ఆ వస్తువును ఆ తరగతి గదిలోని నిర్దిష్ట పరిస్థితికి సంబంధించిన మార్క్సిస్ట్ విశ్లేషణను పరిగణనలోకి తీసుకొని అందజేయగల మార్గాలేమిటో ఆలోచించాలి. ఉపాధ్యాయుడి పాత్ర ఏమిటో, విద్యార్థి పాత్ర ఏమిటో, సామాజికీకరణ క్రమం ఎట్లా జరుగుతున్నదో, విప్లవ భావాలను గ్రహించకుండా చాలామంది విద్యార్థులను అడ్డుకుంటున్న తప్పుడు చైతన్యం ఏమిటో పరిగణనలోకి తీసుకోగలగాలి.

మార్క్సిస్ట్ ఉపాధ్యాయులుగా పెట్టుబడిదారీ సమాజంలో బోధనా, శిక్షణా క్రమంలో భాగం పంచుకుంటున్నప్పుడు మనం ఎదుర్కొనే మౌలిక వైరుధ్యం ఒకటి ఉంది. అదేమంటే, ఈ సమాజంలోని బోధనా, శిక్షణా క్రమం అంతా కూడా విద్యార్థులలో సహజంగా ఉన్న జ్ఞానాన్ని క్రమ పద్ధతిలో రద్దుచేయడానికి ఉపయోగించేదే. ఈ వాదనను వివరించడానికి కొన్ని ఉదాహరణలు ఇస్తాను.

1. మనుషులు సహజంగానే అపారమైన జ్ఞానం పొందే లక్షణం కలిగి ఉంటారు. మరి మన సమాజంలోనూ, ఇతర సమాజాలలోనూ మనుషులు సంకుచితంగా, గుడ్డిగా, బుద్ధిహీనులుగా ఎందుకు ఉన్నారంటే వారి ప్రవర్తనలోని కొరత వారిలో సహజ జ్ఞానం లోపించినందువల్ల కాదు. వర్గసమాజంలో మనుషుల జ్ఞానాన్ని ఉద్దేశ్యపూర్వకంగా అణచివేసినందువల్లనే ఇటువంటి ప్రవర్తన వస్తుంది.
2. మరి పెట్టుబడిదారీ సమాజం మనుషుల జ్ఞానాన్ని ఇలా ఎందుకు అణచివేయదలచుకుంటుంది? క్లుప్తంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ సాఫీగా సాగాలంటే మనుషులందరూ ఒక ప్రత్యేకమైన పద్ధతిలో శిక్షణ పొంది, సులభంగా క్రమశిక్షణకు లోబడగలిగిన శ్రామిక శక్తిగా మారాలి. అటువంటి శిక్షణ మనుషులలో స్పష్టమైన ఆలోచన, విశ్లేషణ అభివృద్ధి చెందడానికి వీలుకలిగించదు. అంతేకాదు, అది నిజానికి వారి ఆలోచనను వీలైనంత సంకుచిత మార్గాల్లోకి మళ్లిస్తుంది. ఇంకా చెప్పాలంటే అధికారంలో ఉన్నవారు తమ భావజాలపరమైన నియంత్రణను కొనసాగించాలంటే అసంఖ్యాక శ్రామిక ప్రజానీకం విమర్శనాత్మకంగా ఆలోచించకుండా ఉండడానికి శిక్షణ పొందాలి. మూర్ఖంగా, మూసపద్ధతిలో మాత్రమే ఆలోచన సాగించేందుకు శిక్షణ పొందాలి.
3. సాధారణంగానే మనం ఒక బాధామయ, నిరాశపూరిత పరిస్థితిలో ఉన్నప్పుడు స్పష్టంగా ఆలోచించడం కష్టమౌతుంది. ఈ సూత్రాన్ని ఆధారం చేసుకొని ఒక మనిషికి శిక్షణ ఇచ్చేటప్పుడు ఆ శిక్షణను భయంతో, సందేహంతో కలిపి ఇస్తే ఆ మనిషి విమర్శనాత్మక ఆలోచనను నియంత్రించడం సాధ్యమౌతుంది. ఉదాహరణకు అమెరికన్ పాఠశాలలు తమ నిరంకుశత్వంతో, పోటీతత్వంతో వర్గ, వర్ణ, స్త్రీ-పురుష భేదాల గురించిన అపోహలతో ఒక తరం తరువాత మరొక తరం విద్యార్థులను నిరంతరంగా వారి శిక్షణ, ఆలోచనలను ఒంటరితనంతో, నిరుత్సాహంతో, భయంతో కలగలిపి సాగించాయి. అందువల్లనే అమెరికన్ విద్యార్థుల గురించి జరిపిన చాల పరిశోధనలు వారు పాఠశాలలో ప్రవేశించినప్పుడు చాల స్పష్టంగా ఆలోచించగలిగేవారని, పాఠశాల ముగించే సమయానికి ఆ స్పష్టత లోపించిందని నిర్ధారించాయి. అంటే, ఏదైనా నేర్చుకోవడంలో సహజంగా ఉండే ఉత్సాహాన్ని మన సమాజంలోని శిక్షణ తుడిచి వేస్తుంది. అంతేకాదు, నేర్చుకోవడం

అనేది ఒక నిరుత్సాహపూరితమైన చాకిరీ అనిపించేటట్టుగా చేస్తుంది.

4. బాధ, నొప్పి ఆలోచనను వక్రీకరిస్తాయి అని అర్థమయితే, ఒక మనిషిని నిరంతరాయంగా బాధకు, నొప్పికి గురిచేస్తే, ఆ నిర్దిష్ట అనుభవంతో శిక్షణను కలగలిపితే ఆలోచనలను కలుషితం చేయడం సమర్థవంతంగా జరుగుతుంది. మనం ఒక ఇబ్బందికర స్థితిలో ఉన్నప్పుడు మనకు ఏదైనా సమాచారం అందితే అది మన మెదడులో తాళం వేసుకుని కూర్చుంటుంది. అది విశ్లేషణకు లొంగదు. వర్గీకరణకు లొంగదు. ఈ సమాచారానికి భిన్నమైన సమాచారాలను ఆ తరువాతి అనుభవాలు అందించినప్పటికీ ఈ తాళం వేసుకున్న సమాచారం వల్ల మనం కొత్త సమాచారాన్ని అంగీకరించలేం. విస్మరిస్తాం, వక్రీకరిస్తాం. 'కమ్యూనిజమూ, సోషలిజమూ చెడ్డవి' అనే భావనను అమెరికన్ పాఠశాలలలో ఎంత ఉన్మాదస్థాయిలో మన శిక్షణతో కలగలిపారంటే ఇవాళ సోషలిజానికీ, కమ్యూనిజానికీ అనుకూలమైన వాదనలు చేసి ఒప్పించడం చాలా కష్టమౌతుంది. అప్పటికే మన మనసులలో తాళం వేసుకుని కూర్చున్న భావాల వల్ల సోషలిజం, కమ్యూనిజం అనే సామాజిక వ్యవస్థలు ఎంత విలువైనవో, ఎంత అందమైనవో ఎంత స్పష్టంగా, నిర్దిష్ట ఉదాహరణలతో చెప్పినా స్వీకరించడం కష్టమౌతుంది.

5. మనలో సహజంగా ఉన్న జ్ఞానానికి అంటిపెట్టుకుని ఉండాలంటే, దాన్ని అభివృద్ధి చేయాలంటే, దాన్ని వాడాలంటే మొట్టమొదట మన ఆత్మగౌరవం సక్రమంగా ఉండాలి. మనకు ఆత్మగౌరవం లేకపోయినప్పుడు, ఎందుకూ పనికిరాననుకున్నప్పుడు, న్యూనతా భావం ఉన్నప్పుడు, అసమర్థుడిని అనుకున్నప్పుడు ఒక మనిషి జీవితమంతా ఒక సాధారణ నిరాశ వ్యాపించి ఉంటుంది. ఆ నిరాశ సమర్థమైన కార్యాచరణకూ, స్పష్టమైన ఆలోచనకూ గట్టి అవరోధంగా పనిచేస్తుంది. నిరాశలో మునిగిపోయినప్పుడు అధ్యయనం చేయడం ఎంత కష్టమో మనందరికీ అనుభవంలో ఉన్నదే. తలమీద దెబ్బ తగిలినప్పుడు మెదడు దిమ్మెక్కి ఆలోచన ఎలా అంతరిస్తుందో అలాగే నిరాశ వ్యాపించినప్పుడు కూడా స్పష్టమైన ఆలోచన లేకుండా పోతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వర్గ విభజన అనేది మౌలికమైనది. ఈ వర్గ విభజన ఫలితంగా పెట్టుబడిదారీ సమాజంలో మనుషులలో అత్యధిక భాగపు ఆత్మగౌరవాన్ని ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేయడం జరుగుతుంది. అలా ఆత్మగౌరవాన్ని పోగొట్టుకున్న మనుషులు సర్వత్రా వ్యాపించిన నిరాశతో అన్నిటినీ మౌనంగా అంగీకరించే పౌరులుగా మారిపోతారు. వారి జ్ఞానం మీదా, వారి స్పష్టంగా ఆలోచించగల శక్తి మీదా ఈ ఆత్మగౌరవ రాహిత్యం ఒక ఆటంకంగా పనిచేస్తుంది.

పెట్టుబడిదారీ సమాజంలోని ఉపాధ్యాయులు అందరూ ఆలోచన మీదా, శిక్షణ మీదా ఉన్న ఈ ఆటంకాలనూ, వైరుధ్యాలనూ ఎదుర్కొంటూనే ఉంటారు. మార్క్సిస్ట్ ఉపాధ్యాయులకు ఈ ఆటంకాలు మరింత తీవ్రమైనవి. ఎందుకంటే అటువంటి విశ్లేషణ తప్పుదుదనే ప్రమాదకరమైనదనే భావాలు అమెరికన్‌లలో నిండిపోయి ఉన్నాయి. అటువంటప్పుడు అసలు సాధారణంగా బోధన, ప్రత్యేకించి మార్క్సిస్ట్ విప్లవ బోధన అమెరికన్ సమాజంలో అత్యంత కష్టభరితమైన పని అవుతుంది. ఈ సమాజంలో ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలలో విప్లవాత్మక భావాలను బోధించడం సాధ్యం కాదనే ఒక ఓటమి ధోరణి, నిరాశ వ్యాపించింది అందువల్లనే. ఈ నిరాశా భావాలను అర్థం చేసుకోవచ్చు. కాని, ఈ వైరుధ్యాలు నిజానికి మన ఓటమి కావు. ఆ వైరుధ్యాలు మార్పు సాధ్యమేనని, అనివార్యమని సూచిస్తాయి. ఒకవైపేమో పెట్టుబడిదారీ విధానం బోధనను కష్టతరం చేయగా, ఆ వ్యవస్థ వల్లనే వచ్చిన సంక్షోభం విద్యార్థులలో ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలనే తపనను పెంచుతుంది. ఒకపక్కన అంతవరకూ జరిగిన పాఠశాల విద్య సంకుచితంగా, పరిమితంగా ఉండి మన బోధనా సామర్థ్యం మీద అడ్డంకులు విధిస్తుంది. మరొకపక్కన ప్రపంచాన్ని అర్థం చేసుకునే, దాన్ని మార్చడానికి అవకాశమిచ్చే విశ్లేషణ కావాలని విద్యార్థులు కోరుకునే తపన మన బోధనా అవసరాన్ని పెంచుతుంది. మార్క్సిస్ట్ ఉపాధ్యాయులుగా మనం ప్రపంచాన్ని అర్థం చేసుకునే ఒక సమర్థమైన మార్గాన్ని చూపించగలం. ఒక నిరాశామయ కాలంలో మార్పు సాధ్యమేననే ఒక అద్భుత ఆశావహ దృష్టిని ఇవ్వగలం.

మార్క్సిజాన్ని బోధించడం అంటే ఈ అన్ని వైరుధ్యాలతోనూ వ్యవహరించడం. అంతేకాదు సాధారణంగా ఉపాధ్యాయులు పట్టించుకోని చాలా సమస్యలను పరిష్కరించే శక్తియుక్తులు ఉపయోగించడానికి కూడా మనం సిద్ధపడాలి. ఆ సమస్యలేమంటే అ) పాఠశాల పరిస్థితులలో సాధారణంగా విద్యార్థులు పొందే ప్రతికూల సమస్యాత్మక సందర్భాలను తొలగించడం. ఆ) మన విద్యార్థులు తమ పాత పాఠశాలల నుంచి తీసుకుని వచ్చిన న్యూనతా భావాన్ని, నిరుత్సాహాన్ని తొలగించి, వారి నేర్చుకునే శక్తిని, ఆచరించే శక్తిని పెంపొందించడం. ఇ) అగ్రవర్ణ దురహంకారం, పురుషాధిపత్యం, కమ్యూనిజం పట్ల వ్యతిరేకత వంటి భావాలను మన విద్యార్థుల నుంచి తొలగించడం.

మార్క్సిస్ట్ బోధనా కృషి

ఇటువంటి బోధనా పద్ధతి గురించి కొన్ని ఉదాహరణలు, మనం ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించడానికి కొన్ని సూచనలు కింద ఇస్తున్నాను :

తరగతి గదిలో వాతావరణం : ఒక తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఎదుర్కొనే తక్షణ ప్రధాన సమస్య ఏమంటే విద్యార్థులలో చాలా మంది తాము ఏదో ఘోర విపత్తును అనుభవించడానికి సిద్ధపడుతున్నట్టుగా వస్తారు. వారు ఆ ఊహల వల్ల నిరాశ చెంది ఉంటారు. అలాగే తమ దైనందిన జీవితంవల్ల, పనుల వల్ల కూడా నిరాశ చెంది ఉంటారు. బహుశా ఉపాధ్యాయులమందరం మనం చెప్పబోయే విషయాల పట్ల ఉత్సాహంతో తరగతి గదివైపు చూసినప్పుడు ఆ గదిలో సగం మంది విద్యార్థులు నిరాశ నిండిన కనులతో మనవైపు చూడడం కనబడుతుంది. వాళ్లు మనం చెప్పే విషయాన్ని యాంత్రికంగా తమ పుస్తకాల్లో రాసుకుంటూ ఉంటారు. నిజానికి వాళ్ల మనసులు, హృదయాలు మరెక్కడో, మరేవో విషయాలు ఆలోచిస్తూ ఉంటాయి. ఈ విద్యార్థుల ఆసక్తిని అనుకూల దిశగా మలచడం ఎట్లా అనేది మనం నేర్చుకోవలసి ఉంటుంది. వారినేమీ అంతులేని ఆశాజీవులుగా మార్చాలని కాదు. వారిని వారి నిరాశ నుంచి బయటపడేసి మనం చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నది వినేలా చేయడం మాత్రమే మన కోరిక. అంతేకాదు, విప్లవోద్యమం అభివృద్ధి చెందడానికి ప్రధాన ఆటంకంగా ఉన్న ఓటమి

తత్వాన్ని, నిరాశావాదాన్ని ఎదిరించి పోరాడాలంటే ఇటువంటి కృషి అవసరం.

1. ఒక తరగతిని మొదలుపెట్టేటప్పుడు ఉండే గందరగోళాన్ని పోగొట్టడానికి ఉపాధ్యాయుడితో సహా ప్రతి ఒక్కరినీ మరొకరితో జత కట్టమని అడగండి. ఆ జత కట్టేవారు అంతకు ముందు ఒకరికొకరు తెలిసి ఉండకూడదు. వారు ఒకరికొకరు తమ పేర్లు చెప్పుకోవాలి. ఇటీవల తమ అనుభవంలోకి వచ్చిన 'కొత్త విషయాలు, మంచి విషయాలు' చెప్పుకోవాలి. దీని ఫలితం ఏమిటంటే ప్రతి ఒక్కరూ అనుకూలమైన విషయాలు మాట్లాడతారు. పేర్లు, వ్యక్తిగత సమాచారం ఒకరికొకరు పంచుకోవడం ద్వారా విద్యార్థులు ఒంటరితనం నుంచి బయటపడతారు.
2. తరగతి గదిని చిన్న చిన్న బృందాలుగా విభజించి విద్యార్థు లందరినీ తరగతుల గురించి, పాఠాల గురించి, పుస్తకాల గురించి తమ మనసు లోపల దాగిన భావాలన్నీ బయటపెట్టమనండి. ఇది 'చేదు సంగతులు' చెప్పడం. దీనికి ప్రతి ఒక్కరికీ సమానమైన సమయం ఇవ్వండి. గతంలో తరగతులతో తాము పొందిన ఇబ్బందులను చేదుగా, కోపంగా, నాటకీయంగా మాట్లాడే అవకాశం ఇవ్వండి.
3. పై కార్యక్రమం లాగానే విద్యార్థులను చిన్న చిన్న బృందాలుగా విభజించి ప్రతి ఒక్కరికీ సమానమైన సమయం ఇచ్చి వారికి ఎంతమాత్రం నచ్చని ఒక రచయిత రచనలమీద మాట్లాడమని అడగండి. ఆ రచయిత తరగతి గదిలో తమ మధ్య కూర్చుని ఉన్నట్టుగానే భావించుకుని మాట్లాడమనండి. వాళ్లప్పటికీ డర్ఖీమ్‌ను చదివి ఉంటారనుకోండి. డర్ఖీమ్ ఇక్కడ కూర్చుంటే మీరు ఏమడుగుతారు అని మాట్లాడనివ్వండి.
   ఈ రెండు కార్యక్రమాల వల్ల విద్యార్థులలో పాఠశాల గురించి, పాఠశాలలో చదివే విషయాల గురించి ఎటువంటి అభిప్రాయాలు ఉన్నాయో బయటపడుతుంది. ఈ కార్యక్రమాలు వారు చదివే విషయాల మీద విమర్శలుగానో, తరగతి గదులలో జరగవలసిన మార్పుల సూచనలుగానో గ్రహించనక్కరలేదు. అటువంటి వాటి గురించి తరువాత చూద్దాం.
4. తరగతి గదిలో తెలియకుండానే పెరిగిపోయే ఉద్రిక్తత నుంచి, విసుగుదల నుంచి బయటపడి, జరిగే చర్చ మీద ఆసక్తి పెరిగించుకునే విద్యార్థులను ప్రోత్సహించండి. అంటే, నవ్వడాన్ని, హాస్యాలాడడాన్ని ప్రోత్సహించండి. ప్రత్యేకంగా కొన్ని రోజులు ఏర్పాటు చేసి విద్యార్థులు ఒకరినొకరు వినోదపరచాలని చెప్పండి. ఒక చర్చలో వేడి పెరిగి, ఉద్రిక్తత వాతావరణం ఏర్పడినప్పుడు చర్చను కొనసాగించే బదులు విద్యార్థులను జతలుగా మార్చి వారి భావాలు చెప్పించండి.

తరగతి గదిలో ఒంటరితనం : వ్యక్తివాదాన్ని, పోటీతత్వాన్ని బోధించడం గురించి పెట్టుబడిదారీ విధానం ఎంత శ్రద్ధ వహిస్తుందంటే కలిసి పనిచేయడం అనేది 'మోసానికి' దారితీస్తుందని చెపుతారు. నిజానికి స్నేహపూరితమైన, సహకారపూరితమైన వాతావరణం ఎప్పుడైనా నేర్చుకోవడాన్ని, ఆలోచించడాన్ని అభివృద్ధి చేస్తుందని ఎన్నో సంవత్సరాలుగా అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ పెట్టుబడిదారీ విధానం ఈ సమష్టి శిక్షణను, ఆలోచనను వ్యతిరేకిస్తుంది. కాని సోషలిస్టులుగా మనం సమష్టి కృషికి ఉండే అపారమైన రాజకీయ ఆచరణాత్మక ప్రాముఖ్యతను గుర్తిస్తాం. సమష్టి కృషి అంటే నలుగురు కలిసి పనిచేయడం మాత్రమే కాదని, అంతకన్న ముఖ్యంగా, కలిసి పనిచేస్తున్న వారి మధ్య ప్రేమాదరాలు ఉండడమని మనం భావిస్తాం.

1. పాఠ్యాంశంలో ఒక తప్పనిసరి అంశంగా తరగతి గదిలో ఉన్న అందరి పేర్లు, అందరూ తెలుసుకోవాలని నిర్దేశించండి. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు మొత్తం తరగతి ముందు తమను తాము పరిచయం చేసుకోవాలి.
2. వీలైనన్ని ఎక్కువసార్లు తరగతి గదిని చిన్న చిన్న చర్చా బృందాలుగానో, సమష్టి పని బృందాలుగానో విడగొట్టండి. ఒక్కొక్క బృందానికి ఒక నిర్దిష్టమైన పని ఇవ్వండి. వాళ్లు కలిసి చదివేలా, కలిసి వ్యాసాలు రాసేలా ప్రోత్సహించండి. పంచుకొని పనిచేయడం అనే విలువను ప్రోత్సహించేలా పాఠ్యాంశాలు తయారు చేయండి.
3. విద్యార్థులందరూ ఒకరి సహాయం మరొకరు అర్థించేలా ప్రోత్సహించండి. 'పైకి ఆలోచించడం' అనేది మన భావాలను ఎట్లా స్పష్టం చేస్తుందో ఉదాహరణలతో చూపండి.
4. విద్యార్థులు వ్యాసాలు రాయడం కోసం చదవవలసిన రచనలను బృందాలుగా చదవమని ప్రోత్సహించండి. ప్రతి విద్యార్థి తాను చదవవలసినవన్నీ చదవాలి. అదే సమయంలో వాటిలో కొన్నిటిని ఇతరులకు బోధించగలగాలి.

తరగతి గదిలో పోటీ-అసమానత : మన విద్యార్థులలో పెంపకం క్రమంలో వచ్చిన పోటీతత్వాన్ని, తరగతి గదిలో సాంప్రదాయికంగా ఉన్న అసమానతలను సవాలు చేయాలంటే సాంప్రదాయిక బోధనా పద్ధతులకు ప్రత్యామ్నాయ నిర్మాణాలను రూపొందించాలి.

1. 'ఆలోచించు-విను' బృందాలు : విద్యార్థులను చిన్న చర్చా బృందాలుగా విడదీసి ప్రతి విద్యార్థికీ సమానమైన సమయం అవకాశమిచ్చి మాట్లాడమనాలి. ఒకరు మాట్లాడేటప్పుడు మరొకరు అడ్డుపడకూడదు. సహకరించే వ్యాఖ్యలైనా సరే, ఉండకూడదు. ఇది చూస్తే మరీ కట్టుబాట్లు పెట్టినట్టు అనిపిస్తుందేమో కాని మామూలుగా ఎవరైనా ఏదైనా ఎప్పుడైనా మాట్లాడగల చర్చలో కొంతమంది చొరవ ఉన్న, మాట్లాడగల విద్యార్థులే ప్రాధాన్యత వహిస్తారు. అంటే, మన తరగతి గదిలో మూడో ప్రపంచ దేశాల విద్యార్థుల కన్న శ్వేత జాతి విద్యార్థులు ఎక్కువగా మాట్లాడతారు. స్త్రీల కన్న పురుషులు ఎక్కువ మాట్లాడతారు. అందువల్ల అందరికీ సమాన సమయం ఇచ్చి ఒకరు మాట్లాడేటప్పుడు మరొకరు మాట్లాడ కూడదని నిర్దేశించాలి. చర్చలో ఆలోచించు, మాట్లాడు అనే పద్ధతివల్ల ప్రతి ఒక్కరూ తాము లోపల ఆలోచిస్తున్నది పైకి చెప్పే అవకాశం వస్తుంది. ఎవరూ అడ్డుపడకుండా మాట్లాడేవాళ్లు తమ లోలోపల ఉన్న ఆలోచనలను, భావాలను స్పష్టంగా చెప్పగలుగు తారు. ఇటువంటి పద్ధతి మీద ఒక్కోసారి ఫిర్యాదులు రావచ్చు. మాట్లాడడానికి భయపడేవాళ్లు ఈ పద్ధతి వద్దు అనవచ్చు. ఎక్కువ మాట్లాడదలచుకున్న వాళ్లూ ఈ పద్ధతి వద్దు అనవచ్చు. కాని, ఈ పద్ధతి ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తుంది. ఇటువంటి చర్చా పద్ధతి తరవాత, అలవాటైన సాంప్రదాయిక పద్ధతులు కూడా వాడవచ్చు. కాని, మొట్టమొదట మాత్రం ప్రతి ఒక్కరికీ మాట్లాడడం అలవాటు చేసే ఈ పద్ధతి వాడాలి.
2. పైన చెప్పిన కారణాల వల్లనే ఒకరితో ఒకరు మాట్లాడుకొనే అభ్యాసాలలో కూడా విద్యార్థుల మధ్య సమయాన్ని సమానంగా విభజించాలి. ఒకరినొకరు అడ్డుకోకుండా చూడాలి.

వస్తువులు ఏ దశలో సేవలుగా మారుతాయో, సేవలు ఏ దశలో వస్తువులుగా మారుతాయో, ఆ క్రమంలో పన్నుల విధానం ఎలా వ్యవహరిస్తుందో వివరిస్తున్నారు **తడకమళ్ల వివేక్**

సరుకులు - సేవలు : చెరుగుతున్న విభజన రేఖ

కొన్ని వివాదాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయని అంటారు. ఈ మధ్యనే రాష్ట్రరాజధానిలో టాక్సీకార్లు, బస్సులు అకస్మాత్తుగా సమ్మె చేసిన విషయం పాఠకులకు గుర్తుండి ఉంటుంది. విజిలెన్స్, వాణిజ్య పన్నుల శాఖలు జారీ చేసిన నోటీసులు ఈ సమ్మెకు కారణమని తెలుస్తోంది. వ్యాట్ పన్ను విధిస్తూ ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవలసిందిగా టాక్సీ, బస్సు యజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాయి. సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం కమిటీని నియమిస్తామని ఇచ్చిన నోటీసుల విషయంలో కఠినమైన వైఖరిని అవలంబించబోమని స్పష్టం చేయడంతో సమ్మె విరమణ జరిగింది.

బస్సులు, కార్లు లాంటి వాహనాలను అద్దెకు ఇచ్చినప్పుడు ఆ లావాదేవీలపై వ్యాట్ పన్ను పడుతుందా అనే అంశం చుట్టు కొంత వివాదం నెలకొని ఉంది. సాధారణంగా వ్యాట్ అనే అమ్మకపు పన్ను వస్తువుల విక్రయాలపై ఉంటుంది. వాహనాలను అద్దెకు ఇచ్చిన సందర్భంలో ఎలాంటి విక్రయం జరిగినట్టుగా మనకు కనిపించదు. అయితే వివాదం ఎందుకు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ వివాదాన్ని అర్థం చేసుకోవడానికి విషయాన్ని లోతుగా పరిశీలిస్తే తప్ప అవగాహన కాదు.

నలభై ఆరవ రాజ్యాంగ సవరణ ద్వారా సేవలుగా కనిపించే కొన్ని లావాదేవీలపై రాష్ట్రాలకు అమ్మకపు పన్ను విధించే అవకాశం రాజ్యాంగం కల్పించింది. ఇట్లా పొందిన అధికారాన్ని వినియోగించుకొని రెవెన్యూ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం రాష్ట్రాలు తమ అమ్మకపు పన్ను చట్టాలను ఆ వెంటనే సవరించాయి. వర్క్ కాంట్రాక్టులు, లీజు,హోటళ్లలో సప్లై చేసే ఆహారపదార్థాలు పైకి సేవలుగా కనిపించినప్పటికి అవి అమ్మకాలను పోలిన లావాదేవీలుగా అమ్మకపు పన్ను పరిధిలోకి చేర్చబడ్డాయి. అయితే రాజ్యంగ సవరణ రాజ్యాంగ విరుద్ధమని, ఈ సవరణ రాష్ట్రాలకు సేవలపై పన్నువేసే అధికారాన్ని కల్పిస్తుందని అందువల్ల ఈ సవరణ ఫెడరల్ విధానంలో ఉన్న 'అధికార విభజన' సూత్రానికి వ్యతిరేకమని వాణిజ్య వర్గాలు వాదించాయి. ఫలితంగా వివిధ రాష్ట్రాల్లో కోర్టు కేసులు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోయినాయి. చివరకు సుప్రీం కోర్టు గానన్‌డంకర్లీ కేసులో, బిల్డర్స్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పుల ఫలితంగా ఈ వివాదం ఒక కొలిక్కి వచ్చింది. తీర్పుల సారాంశం ఏమిటంటే వర్క్స్ కాంట్రాక్ట్ నైపుణ్యంతో కూడిన సేవగా కనిపించినప్పటికి, అందులో ఉపయోగించిన సరుకులు అమ్మకపు పన్ను పరిధిలోకి వస్తాయని, ఆ సరుకుల విలువపై రాజ్యాంగ సవరణ కల్పించిన అధికారం వల్ల రాష్ట్రాలు పన్ను వేయవచ్చని. మరో విషయమేమంటే కాంట్రాక్టులను విడదీసి అందులో సేవకు సంబంధించిన విలువను తీసేసి సరుకుల విలువపై అమ్మకపు పన్ను వేయవచ్చని ఈ తీర్పుల సారాంశం. ఇలా కాంట్రాక్టులను విడగొట్టడం, సరుకుల విలువపై అమ్మకపు పన్ను వేయడం రాజ్యాంగ వ్యతిరేకం కాదని కూడ తేల్చిచెప్పింది. ఇక లీజు విషయానికి వస్తే ఇక్కడ కూడా కొన్ని వివాదాస్పద అంశాలు కోర్టుల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అమ్మకపు పన్ను భాషలో లీజును 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ రైట్ టు యూజ్ గూడ్స్" అంటారు. ఒక వస్తువును/సరుకును ఒకరి నుండి మరొకరికి ఉపయోగం కోసం బదలాయించే హక్కుపై పన్ను వేయడమన్నమాట. ఇక్కడ 'హక్కు'ను 'కనపడనివస్తువు'గా భావించి, బదలాయింపును అమ్మకంగా పరిగణిస్తారు. బదలాయింపు కోసం చెల్లించే మొత్తం అమ్మకపు విలువగా భావించి గ్రహీతపై పన్నువిధించడం జరుగుతుంది. అయితే అంతర్‌రాష్ట్ర లావాదేవీల్లో ఏరాష్ట్రానికి ఈ పన్ను వేసే అధికారం ఉంటుందనే ప్రశ్న తలెత్తింది. సహజంగానే వివాద పరిష్కారం కోర్టు తీర్పుతో ముగిసింది.

---

3. విద్యార్థులకు ఇచ్చే అన్ని అభ్యాసాలలోనూ వీలైనంత వరకు ఉపాధ్యాయులుగా మనం కూడా పాల్గొనాలి. తరగతి గదిలో మనకు ఆ అవకాశం లేదని అనుకోకూడదు. మనకు ఇటీవల జరిగిన 'కొత్తవీ, మంచివీ' అందరిలాగానే మనమూ చెప్పవచ్చు. అలాగే 'చేదు విషయాలు' మాట్లాడడం, 'ఆలోచించు విను' అభ్యాసంలో మనం కూడా పాల్గొనవచ్చు.
4. బోధనా పద్ధతుల మీద చర్చించిన షేరీ వెబర్, బర్నాడ్ సోమర్స్ అనే రచయితలు ప్రతి తరగతి గదిలోనూ ఒక 'ఫిర్యాదుల, పొగడ్తల కమిటీ' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ పని ఏమంటే విద్యార్థులలో ఉండే అభిప్రాయాలనూ, విమర్శలనూ కలగలిపి ఎవరి పేరూ లేకుండా ఉపాధ్యాయులు దగ్గరికి తేవడం. అటువంటి అభిప్రాయాలూ విమర్శలూ ఉన్నప్పుడు విద్యార్థులు తమంతట తామే తన దగ్గరికి రావచ్చునని ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి. అయినా ఇటువంటి కమిటీ పద్ధతి ఉండడం వల్ల నేరుగా మాట్లాడలేని విద్యార్థులకు అవకాశం దొరుకుతుంది.

(మిగతా వచ్చే సంచికలో)

(మంత్లీ రివ్యూ ప్రెస్ ప్రచురించిన స్టడీస్ ఇన్ సోషలిస్ట్ పెడగాగీ (1978) పుస్తకం నుంచి) వీ

ట్వంటీ ఫస్ట్ సెంచరీ క్లాసిక్ ఫైనాన్స్ కేసులో ఇచ్చిన తీర్పు ద్వారా ఏ రాష్ట్రంలో 'హక్కుబదలాయింపు' ఒప్పందం జరుగుతుందో, ఆ రాష్ట్రానికే పన్నువేసే అధికారం ఉంటుందని, సరుకులు ఏ రాష్ట్రంలో ఉపయోగింపబడుతున్నాయన్నది ముఖ్యంకాదని ఈ తీర్పు సారాంశం. ఈ వివాదానికి తెరపడుతున్న సమయంలో మరో అంశం తెరపైకి వచ్చింది. అదేమిటంటే 'హక్కుబదలాయింపు' మాత్రమే ఈ లావాదేవీపై పన్ను వేయడానికి వీలుకల్పించదని, వస్తువు / సరుకును ఉపయోగించడానికి లబ్ధిదారుడు ఎలాంటి స్వేచ్ఛను కలిగి ఉన్నాడనేది కీలకమైన అంశం అని. ఈ అంశం ఆధారంగా టాక్సీల సమ్మెకు దారితీసిన పరిస్థితులను అర్థం చేసుకోవలసిఉంటుంది. ఐటి,ఇతర కంపెనీలు టాక్సీకారు, బస్సు యజమానులతో కుదుర్చుకున్న ఒప్పందాలు 'హక్కుబదలాయింపు' కోవకు చెందినవని అందుకే అవి వ్యాట్ పన్ను పరిధిలోకి వస్తాయని ప్రభుత్వశాఖల వాదన. టాక్సీ యజమానులు మాత్రం టాక్సీలు కేవలం కంపెనీ సిబ్బంది రవాణాకు ఉపయోగించబడ్డవని, రవాణా సౌకర్యం సేవ పరిధిలోకి వస్తుందని, తమ వాదనకు బలానిచ్చే అంశంగా వారు చెల్లిస్తున్న సేవపన్నును పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక వాణిజ్య లావాదేవీ సేవగాను, సర్వీసుగాను ఒకే సమయంలో ఉండే అవకాశంలేదని వాదించారు. ప్రభుత్వ శాఖలు మాత్రం లీజు అగ్రిమెంట్లను విశ్లేషించి టాక్సీకార్లు/బస్సుల అగ్రిమెంట్ అమలులో ఉన్నకాలంలో కంపెనీ యజమాన్యాలు ఆ వాహనాలపై పూర్తి స్వాధీనతను పొందారని, అందువల్ల వాటి ఉపయోగంపై హక్కును బదలాయించినట్టేనని (తాత్కాలికంగానైనా), ఈ 'హక్కు' 'కనపడని వస్తువుగా' (ఇన్‌టాంజిబుల్ గూడ్) భావించవచ్చని ప్రతివాదన చేసారు.

ఈ వివాదంలో వాద, ప్రతివాదనల బలాబలాల్ని అంచనావేయడానికి అందుబాటులో ఉన్న కొన్ని కోర్టు తీర్పులను పరిశీలించాలి. రాష్ట్ర హైకోర్టు విశాఖస్టీల్ కేసులో కొన్ని సూత్రాలను సూచించింది. ఒకవస్తువును కేవలం ఉపయోగం కోసం తీసుకోవడం ఆ వస్తువుపై పూర్తి స్వాధీనం పొందడం వంటిది కాదని, ఆ వస్తువును లీజుకు తీసుకున్న వ్యక్తి వస్తువు ఉపయోగం ద్వారా ఆర్థిక లబ్ధిని పొందుతున్నాడా లేదా అనే అంశాన్ని కూడ పరిశీలించవలసి ఉంటుందని పేర్కొన్నది. అంతేకాకుండా లీజుకు తీసుకున్న వస్తువుపై యజమానికి ఉన్న టైటిల్ (ఆస్తిహక్కు) తాత్కాలికంగా లబ్ధిదారుడికి సంక్రమిస్తుందా లేదా అనే అంశాన్ని కూడ పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. మరో విధంగా చెప్పాలంటే ఒక వస్తువును లీజుకు తీసుకున్న వ్యక్తి/సంస్థకు ఎలాంటి హక్కు సంక్రమించిందో తెలుసుకోవడం చాలా కీలకమైన అంశంగా తెలుస్తున్నది. ఒక వస్తువు లబ్ధిదారుడి ఆధీనంలో లేదా స్వాధీనంలో ఉందా అనే అంశం ఆ లీజు స్వభావాన్ని నిర్ధారిస్తుంది. ఈ సూత్రాన్ని అనుసరించి టాక్సీ యజమానులు కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను విశ్లేషించాల్సి ఉంటుంది. కొందరు టాక్సీ యజమానులు నియమిత సమయాల్లో కంపెనీ సిబ్బంది రవాణా సౌకర్యం కల్పించడానికి ఒప్పుకుంటే, మరికొందరు తమ వాహనాలను కంపెనీలకు స్వాధీనం చేసారు. ఈ తేడాను విస్మరించి పన్ను ప్రతిపాదన చేస్తే చట్టం పరీక్షకు నిలవకపోవచ్చు.

ఈ సందర్భంగా ఈస్టర్న్ షిప్పింగ్ కార్పోరేషన్ కేసులో కేరళ హైకోర్టు తీర్పు, ఢిల్లీ వ్యాట్ కమిషనర్ ఇచ్చిన నిర్ధారణ ఉత్తర్వులను కూడా పరిశీలించవలసి ఉంటుంది. షిప్పింగ్ కార్పోరేషన్ కేసులో, కార్పోరేషన్ వారు తమ పడవలను లీజుదారునికి ఇచ్చినపుడు అవి స్వాధీన స్వభావం ఉన్న ఒప్పందంగా ఉన్నదని, కార్పోరేషన్ వారు తమ సిబ్బందిని నిర్వహణకోసం ఉపయోగించినంత మాత్రాన ఆ పడవలపై లీజుదారుడు కేవలం అధీనాన్ని మాత్రమే పొందినట్లు భావించనక్కరలేదని తీర్పునిచ్చింది. అదే విధంగా ఢిల్లీ వ్యాట్ కమిషన్ నిర్ధారణ ఉత్తర్వులో ఒక ట్రావెల్ ఏజెన్సీ టాక్సీని అద్దెకిచ్చినపుడు అధీనపు హక్కును సంక్రమింపచేస్తున్నాడా లేదా స్వాధీనపు హక్కును ఇస్తున్నాడా అనే అంశంపైనే వ్యాట్ నిర్ధారణ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సర్వీస్ టాక్సీ చెల్లింపు ఈ లావాదేవీ స్వభావాన్ని నిర్ణయించడంలో ఎలాంటి ప్రభావం చూపదని, వ్యాట్ పన్ను వేయడానికి సర్వీస్ టాక్స్ చెల్లింపు అడ్డంకి కాదని పేర్కొన్నారు.

మరో సందర్భంలో కేరళ హైకోర్టు ఎస్కొటెల్ మొబైల్ కమ్యూనికేషన్స్ కేసులో ఇచ్చిన తీర్పును కూడా ఇక్కడ ప్రస్తావించవలసి ఉంటుంది. మొబైల్ ఫోనులో ఉపయోగించే 'సిమ్‌కార్డ్' వస్తువని, అమ్మకం జరిగినపుడు అమ్మకపు పన్నుకు అది లోనవుతుందని పేర్కొన్నది. ఆ క్రమంలో సిమ్‌కార్డుపై సర్వీస్‌టాక్స్ చెల్లింపు అమ్మకపు పన్ను విధించడానికి అవరోధం కాదని తీర్పునిచ్చింది. అంతేకాకుండ ఒకే లావాదేవీపై శాసన అధికారాలు కల్గిన భిన్న సంస్థలు (లోక్‌సభ/శాసనసభ) వారి అధికారాలకు లోబడి ఆ లావాదేవీల్లోని భిన్నపార్శ్వాలపై పన్ను విధించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఈ విధమైన పన్ను విధింపును 'డాక్ట్రిన్ ఆఫ్ ఆస్పెక్ట్ లెజిస్లేషన్' కూడ అనుమతినిస్తుందని వివరణ ఇచ్చింది. ఈ కారణం చేత సిమ్‌కార్డ్ అమ్మకాలపై చెల్లిస్తున్న సర్వీసుటాక్స్ అమ్మకపు పన్ను విధింపుకు అవరోధం కాదని స్పష్టం చేసింది. ఈ తీర్పును పంజాబ్-హర్యానా హైకోర్టు కూడా అనుసరించింది. అయితే ఈ తీర్పులు వచ్చిన తర్వాత బి.ఎస్.ఎన్.ఎల్. కేసులో సుప్రీంకోర్టు ఇందుకు భిన్నంగా వ్యాఖ్యానించడం గమనార్హం. సేవలు, వస్తువులు పరస్పరంగా భిన్నమైనవని అభిప్రాయ పడింది.

కోర్టు తీర్పులు, వివరణలు, భాష్యాలు, లోతుగా పరిశీలించినట్టయితే వస్తువులు-సేవల మధ్య ఉన్న విభజన రేఖ వివాదస్పదమైనదిగా, సాంకేతిక పరిజ్ఞానం ఉవ్వెత్తున పొంగి సామాన్యుడి జీవితంలోకి ప్రవేశించి ప్రభావితం చేస్తున్నశక్తిగా రూపొందుతున్న క్రమంలో ఏదశలో అవి తమ ఉనికిని కోల్పోయి సేవలుగా మారతాయో, సేవలుగా ఉనికి ఉన్నవి ఎక్కడ ఏ దశలో వస్తువులుగా మారతాయో రాబోయే కాలంలో సవాలుగా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ విషయంలో ఈ సవాలును ఎదుర్కోవడానికి అటు పరిశ్రమ, ఇటు ప్రభుత్వాలు సన్నద్ధమవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ మేధోపరమైన సేవగా గుర్తింపు ఉన్నప్పటికి, కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో వస్తువుగా పరిగణింపబడటం కొత్త పరిణామం. ఇందుకు టాటాకన్సల్టెన్సీ కేసులో కోర్టు తీర్పును ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఇలాంటి వివాదాలు ఇంకా ఎన్నో ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వివాదాల పరిష్కారానికి ఎంతో లోకజ్ఞానం, విజ్ఞత అవసరమని గుర్తించాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో మీరు మరోసారి టాక్సీలో ప్రయాణిస్తున్నపుడు మీరు వస్తువు(వాహనం) వినియోగంపై డబ్బు చెల్లిస్తున్నారా? లేక రవాణా సౌకర్యం పొందిన సేవకు చెల్లిస్తున్నారా అనే ప్రశ్న వేసుకుంటే కచ్చితమైన సమాధానం దొరకకపోవచ్చు. అందుకే కొన్ని వివాదాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయని అంగీకరించాల్సి ఉంటుంది. వీ

జీవించే హక్కు అనే మౌలిక హక్కును భారతదేశంలో కొందరు సంపన్నులకు మాత్రమే పరిమితం చేసి, పేద ప్రజలకు ఆ హక్కు లేకుండా చేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు **పులుగుజ్జు సురేష్**

జీవించే హక్కు లేదా?

భారత రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్‌లో పౌరులకు జీవించే హక్కును కల్పిస్తే, 49వ ఆర్టికల్‌లో తమ సంస్కృతికి, సంప్రదాయాలను కాపాడుకునే హక్కును కూడా కల్పించింది. ఇవి రెండు హక్కులు చాలా ముఖ్యమైనవి. మానవ జీవితంలో ప్రధానమైనవి కూడా. జీవించడం అంటే కేవలం ప్రాణంతో ఉండడం కాదు. ఆరోగ్యకరంగా, గౌరవప్రదమైన జీవితం పొందడం అని అనేక సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు తెలిపాయి. సుప్రీంకోర్టు తెలిపిన విషయాలలో ఒక్కటి కూడా అమలు జరగడం లేదు. ఆర్టికల్ 21, 49లు రెండు ఉల్లంఘించ బడుతున్నాయి. ఇది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. అయితే ప్రభుత్వం ప్రజా ప్రయోజన చట్టం (పి.ఐ.ఎల్.)ను అస్త్రంగా ఉపయోగించి, ఏదైనా దోచుకుంటున్నారు, ఏమయినా మాయం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం తీసుకువస్తున్న విధానాలు వారు అనుసరిస్తున్న వైఖరిని నిశితంగా పరిశీలిస్తే ఇంతకు ముందు పాశ్చాత్య దేశాలలో ఉన్నట్టు ఈ హోటల్‌కు నల్ల జాతీయులకు ప్రవేశం లేదు. ఫలానా ఉద్యోగాలు శ్వేత జాతులకు మాత్రమే అన్నట్టు వ్యవహరించిన తీరు, మనదేశంలో జీవించే హక్కు కొందరికి పరిమితం చేస్తారేమో అన్న అనుమానం కలుగుతుంది.

పేద ప్రజలకు ఎక్కడా బతకనివ్వడం లేదు. గ్రామాలకు గ్రామాలు ఎత్తేస్తున్నారు. ఏమంటే, అభివృద్ధి జరగాలంటే త్యాగం చెయ్యాలని పాలకులు హితబోధ చేస్తున్నారు. అభివృద్ధి జరుగుతున్నది ఎవరికి, త్యాగం చేస్తున్నది ఎవరు. ఎవరు ఎవరి కోసం త్యాగం చెయ్యాలి, ఎందుకోసం చెయ్యాలి. అసలు త్యాగం అంటే ఏమిటో నిర్వచించాల్సింది. ఈ మధ్యకాలంలో ప్రగతికి బదులుగా అభివృద్ధి అనే పదం బాగా వినబడుతున్నది. గతంలో ప్రభుత్వ నివేదికలు గానీ, ప్రభుత్వ కార్యాలయాలపైన గానీ, పాఠ్యపుస్తకాలలో ప్రగతి అనే పదం వినేవాళ్లం. ప్రభుత్వం వినిపించే పాటలలో కూడా ప్రగతి పథాన సాగుదాం వంటి వాక్యాలు వినబడేవి. ప్రగతికి, అభివృద్ధికి మధ్య చాలా దూరం ఉంది. ఇది మౌలికమైన తేడాలు ఉన్నాయి. ప్రగతి అంటే ఏదయినా ఒక ప్రాంతం, లేదా దేశం ఇపుడున్న స్థితి నుండి మెరుగైన స్థితికి పోవాలంటే ఆ ప్రదేశంలో ఉన్నవి ఏ ఒక్కటి నాశనం కాకుండా సమూలమైన మార్పు జరిగితే అది ప్రగతి. అభివృద్ధి అంటే ఇప్పుడున్న స్థితి నుండి మెరుగైన స్థితికి చేరుకోవడమే. కానీ ఇక్కడొక మౌలికమైన మెలిక ఉంది. ఈ స్థితి నుండి మెరుగైన స్థితికి వెళ్లేటపుడు ఆ ప్రక్రియలో ఏది నాశమైనా ఫరవాలేదు. కాని మార్పు రావాలి. ఇటువంటి సూత్రాలు ఆర్థిక సంస్కరణలు మొదలై, ప్రపంచబ్యాంక్ ఏర్పడిన నాటి నుండి అభివృద్ధి నివేదికలు, అభివృద్ధి సూచికలు అన్న పదాలు వినబడుతున్నాయి. దీని వల్ల సమాజానికి జరుగుతున్న నష్టం ఎవరు తీర్చలేనిది. ఉదాహరణకు జాతీయ రహదారి నిర్మాణంలో విస్తారమైన సామాజిక సంపదను కోల్పోయాం. ఇప్పుడు ప్రపంచబ్యాంక్ దగ్గర వేలాది కోట్ల రూపాయల అప్పు తెచ్చి, కిలోమీటర్‌కు రెండు కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న జాతీయ రహదారి చుట్టూ, లక్షల కొద్ది చింత చెట్లు ఉండేవి. వీటి నుండి కొన్ని లక్షల టన్నుల నాణ్యమైన చింతపండు లభించేది. వేలాది గ్రామాలు చింతపండు కొనేవి కాదు. ఎవరయినా కొంటే వాటిధర కిలో పది రూపాయలు మించలేదు. రహదారి నిర్మాణంలో చింత చెట్లన్నీ నరికివేసాక, మలేషియా చింతపండును దిగుమతి చేసుకొంటున్నాం. చింతపండు కిలో యాభై రూపాయలు అయ్యింది. రేపటి ధర ఎంత ఉంటుందో తెలియదు. అంచనాలకు కూడా అందదు. ఈ నష్టాన్ని పూడ్చడానికి ప్రత్యామ్నాయం ఆలోచించాలన్న స్పృహ లేకపోవడం విచారకరం. ఇంత జరిగినా ఆ రోడ్లపై ప్రయాణిస్తున్నది ప్రజలు కాదు, బహుళజాతి కంపెనీల వస్తువుల వ్యాపారం కోసం జరుగుతున్న రవాణా. రైలు మార్గాలలో కూడా గూడ్సు బండ్లకోసం ప్రత్యేక ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. ఇది భవిష్యత్తులో పెద్ద కంపెనీల ఉత్పత్తుల రవాణా కోసం, ఎక్కడా అంతరాయం కలగకుండా ఉండటానికి ఇప్పటి నుండే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వీటి నిర్మాణాల కోసం ప్రజాధనాన్ని ఎంతయినా వెచ్చించడానికి ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. వాటికి ఎంత సంపదనయినా నాశనం చేయడానికి వెనుకాడటం లేదు. ఇక్కడే జీవించే హక్కు హరించబడుతోంది. ప్రజల్ని అటవీ తీర ప్రాంతాలు, మైదాన ప్రాంతాలలో ఏ ఒక్క చోట కూడా ఉండనియ్యకుండా వెళ్లగొడుతున్నారు. పట్టణాలు, నగరాలలోని మురికివాడలు, గ్రామాలు ఒకటేమిటి అన్ని ప్రాంతాల నుండి అభివృద్ధి పేరుతో అసంఖ్యాక ప్రజల్ని తరిమి కొడుతున్నారు. అయితే ఏదయినా ప్రాజెక్ట్ నిర్మిస్తే, ఆ ప్రాజెక్ట్‌ల వల్ల నిర్వాసితులయ్యే వారికి భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు కల్పించి ఇవ్వాలని భూ సేకరణ, పునరావాస చట్టంలో చెప్పబడింది. ప్రజా ప్రయోజనం పేరుతో ఏదయినా సేకరిస్తున్నారు. కానీ పునరావాసం మాట మరచిపోవడం జరుగుతోంది. భారత దేశానికి అధికార మార్పిడి జరిగిన

తొలి రెండు దశాబ్దాలలో నాగార్జున సాగర్, భాక్రానంగర్ ప్రాజెక్ట్‌ల్లో నిర్వాసితులయిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. మరి ఇప్పుడు కట్టే ప్రాజెక్ట్‌లకు పరిహారం ఎప్పుడు అందుతుందో.

'భూమి' సమస్యే చాలా కీలకమని ప్రజాపక్షవాదులు, మేధావులు, దేశభక్తులు, జాతీయవాదులు, సామాజికవేత్తలు, పర్యావరణ వేత్తలు, పాతకాలపు రాజకీయ నాయకులు అనేక సందర్భాల్లో, ప్రత్యేక ఉద్యమాలు చేసారు. ప్రభుత్వంతో నక్సలైట్లకు జరిగిన చర్చల్లో కూడా 'భూమి'నే ప్రధాన ఎజెండాగా చర్చించారు. గద్దర్ వంటి ప్రజా గాయకుడు, వరవరరావు వంటి విప్లవ రచయితలు, వారు చేసిన అనేక ప్రసంగాలలో భూ సమస్యను ప్రస్తావించారు. భూమికోసం, భుక్తికోసం జరిగిన అనేక పోరాటాలలో ప్రజలను దండించి, వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లల్లో పెట్టిన సందర్భాలు కోకొల్లలు ఉన్నాయి. ఇందిరా గాంధీ పాలనలో త్రిపుర రాష్ట్రాలలో గిరిజనులు భూమికోసం చేసిన పోరాటం నుండి నిన్నటి నందిగ్రాం దాకా, ప్రజలు ఎవరైనా పాలకులు ఎవరైనా ప్రజలకు మాత్రం న్యాయం జరగడం లేదు. భూదాన నిర్మాత వినోభ భావే ఆధ్వర్యంలో భూదాన కార్యక్రమం జరిగింది. ఇదొక సామాజిక విప్లవం. భూస్వాములు ధనవంతుల చేతుల్లో ఉన్న భూమి ప్రజలందరికీ దక్కాలని మొట్టమొదటిసారి వినోభాభావే ఆధ్వర్యంలో వెదిరె రామచంద్రారెడ్డిగారు స్వచ్ఛందంగా భూదానం చేయగా, వినోభాభావే గ్రామ గ్రామం తిరిగి పేదలకు భూములు పంచారు. అదే విధంగా అనేక ఉద్యమాలలో నక్సలైట్లు, ఇతర కమ్యూనిస్టులు కూడా భూములను ప్రజల స్వాధీనం చేసారు. ఈ రోజు దీనికి పూర్తి భిన్నంగా జరుగుతున్నది. కొద్దో గొప్పో ప్రజల చేతుల్లో ఉన్న భూములను పూర్తిగా బహుళజాతి కంపెనీల వశం చేస్తున్నారు. నేటి అన్నదాతలు రేపటి వలస కార్మికులుగా మారబోతున్న పరిస్థితి నెలకొన్నది.

రాష్ట్రం, దేశం పాశ్చాత్య దేశాల బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ఇదొక అడ్డాగా మారింది. దేశం, రాష్ట్రం ప్రజల ప్రయోజనాలు మార్కెట్ వ్యాపారం కింద నలిగిపోయాయనడానికి అనేక అనుభవాలు ఉన్నాయి.

మురికివాడల్లో బతుకనీయరు

పారిశ్రామిక విప్లవం, ప్రాజెక్ట్‌ల నిర్మాణం, నిరుద్యోగం మొదలగు అనేక కారణాలతో బలవంతపు తప్పనిసరి, వలసలు పెరిగి నగరాలలో మురికివాడలు విస్తరించాయి. వాడ పేరులోనే ఉంది. వారి జీవితం మురికియంత దుర్గంధంతో భరించలేనంతగా ఉన్నదని, అయినా ఇళ్లల్లో పని మనుషులుగా, రిక్షాపుల్లర్లుగా, చెప్పులు కొట్టడం, రోడ్ల జైళ్లల్లో చిన్న చిన్న వస్తువులు, బండ్లపై వ్యాపారం చేయడం, పండ్లు అమ్మడం, మునిసిపాలిటీలో కాంట్రాక్టు కూలీలుగా పనులు చేసేవారు, రోజు కూలీలు వంటవారు ఈ మురికివాడల్లో నివసిస్తున్నారు. ఎక్కడెక్కడ నుండో వచ్చి కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు విడిచిపెట్టి పిడికెడు మెతుకుల కోసం ఆహారోత్పత్తులు శ్రమిస్తూ కడుపు గుడిసెలో, కాళ్లు బయట పెట్టుకుని బాత్‌రూమ్ తలపించే గదుల్లో నివసిస్తు ఎందుకు పనికి రాకుండా ఉండే స్థలాలైన మురికి పారే చెరువుల గట్లు, చిన్న చిన్న నదుల గట్లు ఒడ్డున వంటివాటిపై ప్లాస్టిక్ పేపర్లతో, రేకులతో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ఈ స్థలాలు ఇప్పుడు నగరం మధ్యలో ఉండడం వల్ల బహుళజాతి కంపెనీలు, పాలకుల దృష్టి ఈ స్థలాలపైపడింది. హైదరాబాద్ నగరంలో మూసీనదికిరువైపుల మురికి వాడలు ఉన్నాయి. ఈ నది వికారాబాద్ నుండి నల్లగొండ జిల్లాలోని వాడపల్లిలో కృష్ణా నదిలో కలుస్తుంది. హైదరాబాద్‌ను వరదల నుండి కాపాడడానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి ప్లాను ప్రకారం నిజాంసాగర్ నిర్మించి సాగరు నీరు హైదరాబాద్‌కు మంచినీరు వసతి కల్పిస్తుంది. అదనపు నీరు ఈ నది ద్వారా అనేక గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందిస్తూ కృష్ణా నదిలో కలుస్తుంది. అయితే ఇపుడు మూసినది ఆక్రమణలకు గురికాగా, హైదరాబాద్ సికిందరాబాద్‌లలోని మురుగు దొడ్లు, వ్యర్థ దుర్గంధ నీరు, పటాన్‌చెరు కంపెనీల నుండి కాలుష్యం వెదజల్లే వ్యర్థజలాలు మూసీలోకి వదులుతున్నారు. వీటినంతటినీ భరిస్తూ మూసీని కాపాడుకుంటూ వస్తున్న బస్తీవాసులను వెళ్లగొట్టి మూసీ ప్రక్షాళన పేరుతో మూసీనదిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, స్విమ్మింగ్ పూల్‌లు, పర్యాటకుల కోసం బోటింగ్‌లు నిర్మించాలని ప్రభుత్వం యోచించింది. పర్యావరణవేత్తలు, మానవహక్కుల సంఘాలు ఈ ప్రణాళిక హైదరాబాద్ నగరానికి ప్రమాదమని నిర్ద్వంద్వంగా తోసి పుచ్చడమే కాకుండా ఉద్యమం చేపట్టారు. అయినా ఆగకుండా కొందరి ప్రభుత్వ రాజకీయ దుండగుల సహాయంతో బలవంతంగా రాత్రికి రాత్రే ప్రజల్ని లారీల్లో ఎక్కించి, హైదరాబాద్ శివారుల్లో వదిలి వేశారు. సరయిన పునరావాసం కూడా కల్పించలేదు. వీరి జీవనాధారం నగరంపైనే ఆధారపడి ఉండడం వల్ల జీవితం గడపడం చాలా దుర్భరమై, అనేక ఇబ్బందులతో బతుకీడ్చుతున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆసియాలోనే అతి పెద్ద విమానాశ్రయంగా పేరొందిన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కొరకు ఐదు వేల ఎకరాలు భూసేకరణ జరిగింది. ఇపుడు ఎయిర్‌పోర్ట్ నిర్మించిన భూమి అక్కడి చిన్న సన్నకారు రైతులవి. పదకొండు గ్రామాల వారు వారి ఊళ్లు వదిలిపెట్టి పోవాల్సి వచ్చింది. ఐదు వేల ఎకరాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాలు వ్యవసాయ భూమి, ఇక్కడ గులాబీలు, ద్రాక్ష, కూరగాయలు, ఆకు కూరలు పండించేవారు. పావు ఎకరంలో గులాబీలు పండిస్తే నెలకు పదివేల రూపాయలు సంపాదించుకునేవారు. వీరి పని గంటలు కేవలం నాలుగు గంటలు. ఈ పొలాలు ఉన్నంతకాలం హైదరాబాద్ నగరానికి సగభాగం పూలు, కూరగాయాలు, తక్కువ ధరకు దొరికేవి. ఇపుడు ఇవన్నీ దూరమయ్యాయి. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం భూసేకరణ సమయంలో ప్రజల నుండి ఛత్రి, నివాస హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. హైదరాబాద్ నగరం నుండి పర్యావరణవేత్తలయిన ప్రొ. పురుషోత్తం రెడ్డి, డా. డి. నరసింహారెడ్డి, మానవ హక్కుల సంఘాల నాయకులు ఎస్. జీవన్ కుమార్, స్థానిక ప్రజలు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. ముత్యం రెడ్డి (నాగార్జునసాగర్ ఇతర ప్రాజెక్ట్‌ల నిర్వాసితులను నిశితంగా పరిశీలించిన వారు) నేను, నా మిత్రులు కలసి రాత్రుల్లో ప్రజల్ని చైతన్యం చేసాం. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరిగితే జరగబోవు పరిణామాలు తెలియజెప్పాం. ప్రభుత్వం మాత్రం ఎకరాకు నలభై వేల రూపాయలు నష్ట పరిహారం ఇచ్చి వారిని అక్కడ నుండి వెళ్లగొట్టాలని కంకణం కట్టుకుంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి

రెక్కలొచ్చాయి. ఎకరం పది నుంచి ముప్పై లక్షల వరకు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం ఎకరాకు నలభై వేలు ఇస్తామని భీష్మించుకు కూర్చుంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో అనేక అలజడులు, గందరగోళాలు నెలకొన్నాయి. ప్రభుత్వాధికారులు చాలా హడావుడి చేశారు. గ్రామాలు ఖాళీ చేయాలని బుల్డోజర్లు తెచ్చారు, పోలీసులతో కర్రపెత్తనం చేసారు. ఈ పరిస్థితిలో నేను వార్తలో పని చేస్తున్న మానేపల్లి లక్ష్మయ్య (సీనియర్ పాత్రికేయులు), ఆంధ్రప్రభలో పని చేస్తున్న అవధాని మొదలగువారందరు వెళ్లగా అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. హఠాత్తుగా అకాల మరణం, తాత ముత్తాల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని విడువలేక, భూమిపైనే ఉన్న మమకారంతో భూమి లోనికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న రైతులు, పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలకు, యువకులకు పెళ్లిళ్లు కాకపోవడం, పొలాల్లో రోజు కూలీలుగా పని చేస్తున్నవారు, రేపటి నుండి ఎక్కడ పనికిపోవాలో దిక్కుతోచక చనిపోయినవారు, దిగులు పడి మంచం పట్టిన వారు వంటి వాస్తవాలను ప్రధాన శీర్షికలో రాయడం, తరువాత ఊపందుకున్న ఉద్యమం మధ్య దళారులు ప్రజల ఆలోచనలు కలుషితం చేయడం, డబ్బు ఆశ చూపడం, లేదా బెదిరించడం, కొన్ని సందర్భాలలోనయితే రౌడీలు, పోలీసులు గ్రామాల్లోకెళ్లి బలవంతంగా ఖాళీ చేయించడం, హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. కొంతమంది రైతులకు కొద్దో గొప్పో డబ్బు ముట్టింది. దళారులు డబ్బు సంపాదించి, ఏమి చేయాలో దిక్కుతోచక గోదాం సంచుల్లో కట్టి పెట్టిన సందర్భాలు ఉన్నాయి. చాలామంది యువకులు మద్యం బారినపడ్డారు. కొన్ని కుటుంబాలు విడిపోయాయి. కొన్ని కుటుంబాలలో అలజడులు చెలరేగాయి. వారి సామాజిక నేపథ్యం పూర్తిగా విచ్ఛిన్నమయ్యింది. ఇక్కడి కూలీలు ఏ పని లేక నగరానికి వలసపోయారు. అక్కడి ప్రజలు ఏమయ్యారో పట్టించుకున్న వారు కరువయ్యారు. అయితే 2000లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి, స్థానికంగా ఉన్న హోంమంత్రికి ఒక్కొక్కరికి వెయ్యి ఎకరాల చొప్పున భూమి ఉన్నది. వారి భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వేలాది కోట్లు గడించారు. ప్రజలు మాత్రం తమ జీవితాలను పణంగా పెట్టారు.

గిరిజనులపై

నక్సలైట్ల ఏరివేత పేరుతో నల్లమలను గ్రేహౌండ్స్ తూర్పార పడుతున్నాయి. గిరిజనాభివృద్ధి పేరుతో అడవులలో ఉన్న సుఖంగా స్వచ్ఛమైన జీవితాన్ని అనుభవిస్తున్న గిరిజనులను బలవంతంగా మైదాన ప్రాంతానికి తీసుకువస్తున్నారు. గిరిజనుల జీవితం అడవి మీదనే ఆధారపడి ఉంటుంది. విస్తారమైన అటవీ సంపద వీరి స్వంతం దుక్కిదున్ని విత్తనం చల్లితే బ్రహ్మాండమైన దిగుబడి వస్తుంది వీరు పొలాల్లో. అక్కడి ఎరువులుగానీ, మందులుగానీ, బోర్లుగానీ అవసరం లేదు. ఎవరయినా పంట కోసుకు పోతారన్న భయం అవసరం లేదు. అడవిలో దొరికే నేరేడుపండ్లు, జామపండ్లు, గడ్డి, ఆకులు, జంతువులు వీరి ఆహారం. గొప్ప మానవ సంబంధాలతో, ఎవరికి కష్టమొచ్చినా ఒకరినొకరు ఆదుకుంటారు. ఒకరికి బాధకలిగితే ఆ గుంపు వారందరికీ బాధకలుగుతుంది. మానవ సంబంధాలు అంటే ఏమిటో అవి ఎలా ఉంటాయో వారి నుండి నేర్చుకోవాలని అనేకమంది చరిత్రకారులు చెప్పారు. అయితే అడవిలో ఉన్న టేకు, ఏనుగులు, పులులు, ఇతర అడవి జంతువుల వంటి సంపదను కొల్లగొట్టడానికి అక్కడ నివసించే గిరిజనులను మైదాన ప్రాంతాలకు పంపుతున్నారు. మైదాన ప్రాంతంలోకి వచ్చిన కొందరు గిరిజనులు ఎర్రగొండపాలెం, దోర్నాల, పుల్లల చెరువు వంటి చోట్ల ఉండలేక, చేయడానికి పనిలేకపోవడమే కాకుండా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు మైదాన సమాజానికి భిన్నంగా ఉంటాయి. వీరిపైన జరుగుతున్న సామాజికవెలివేతలు, పోలీసుల దాడులు, పనిలేకపోవడం, వీరి అలవాట్లు, ఇక్కడి పరిస్థితులతో ఏకం కాలేక తిరిగి అడవి బాట పట్టాల్సి వస్తోంది. ఆంధ్రా, ఒరిస్సా బోర్డర్‌లో బక్సైట్ విపరీతంగా ఉండడం శాపమయ్యింది. విశాఖపట్నం సమీప అడవుల్లో ఉన్న వజ్రాలు, బంగారు గనులను స్వాధీనం చేసుకోవడానికి అక్కడి ప్రజల్ని ఏరివేస్తున్నారు. వందల సంవత్సరాల నుండి దరిద్రాన్ని, కరువును అనుభవించిన పశ్చిమ ప్రకాశం జిల్లా వాసులకు వెలుగొండ ప్రాజెక్టులు ఒక వరమని భావించారు. అయితే కడప, రాజమండ్రి, గుంటూరు, విశాఖపట్నం వాళ్లు పేద ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని ఎకరం అయిదు వేల నుండి పదిహేను వేల వరకు కొనేసారు. వేలాది ఎకరాలు కడప జిల్లా వాసులు మైనింగ్ పేరుతో లీజుకిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణమైనపుడు నిజాంసాగర్ పొలాలన్ని ఏ విధంగా గుంటూరు కాపులు కమ్మ రెడ్ల వశమయ్యాయో అదే విధంగా వెలుగొండ ప్రాజెక్టులు పరీవాహక ప్రాంతమంతా కడప, రాజమండ్రి వాసులతో నిండబోతుంది. పశ్చిమ ప్రకాశం అందరికీ సుదూరంగా ఉండడం వల్ల అక్కడి ప్రజలను చైతన్యం చేసేవారే కరువయ్యారు. ఇప్పటికీ ఈ విషయం పట్ల పట్టించుకునే వారులేరు. దీనిపైన మీడియా కూడా సరయిన విధంగా స్పందించలేదు.

కోస్టల్ కారిడార్

దేశంలోనే అత్యంత పెద్ద ఓడరేవుగా చెప్పుకుంటున్న కృష్ణపట్నం ఓడరేవు తరువాత, చినగంజాల నుండి చీరాల ఓడరేవు వరకు 16 వేల ఎకరాల్లో కోస్టల్ కారిడార్ నిర్మించాలని, ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించాలని ఎస్.ఇ.జెడ్.లు ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇవి దేశ భవిష్యత్తుకు, దేశ రక్షణకు, భద్రతకు సంబంధించిందని, దీనికి ప్రజలు సహకరించాలని చెబుతూనే, స్పెషల్ కలెక్టర్‌ని భూసేకరణకు నియమించారు. ఎకరం పది లక్షలు ఉన్న భూమి ఒకటిన్నర కోటికి చేరింది. వేలాది మంది మత్స్యకారులు కోస్టల్ కారిడార్‌లో గల్లంతు కాబోతున్నారు. చెన్నై నుండి శ్రీకాకుళం వరకు ఏర్పాటు చేయ తలపెట్టిన కోస్టల్ కారిడార్ విశ్వరూపం విడతలు విడతలుగా అమలు జరుగుతోంది. కారిడార్ కోసం లక్షల ఎకరాలు భూ సేకరణ జరుగుతోంది. వాస్తవానికి అంత భూమి అవసరం లేదని అనుభవాలు నేర్పిన పాఠం. వేయి ఎకరాలలో విశాఖపట్నంలో నిర్మించిన విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అయిదు వందల ఎకరాలు ఖాళీగా పడి ఉంది. హైదరాబాద్ సమీపంలో గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్ మొత్తం యాభై ఎకరాలలో ముప్పై ఎకరాలు ఖాళీగా ఉంది. చీరాల, వెంకటగిరి, కొయ్యలగూడెం ల దగ్గర ఏర్పాటు చేస్తున్న వివిధ పార్కుల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. శంషాబాద్‌లో అయిదు వేల ఎకరాలలో ఏర్పాటు చేసిన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మూడు వేల ఎకరాలు ఖాళీగా ఉంది. అయితే పాలకులు వారి అవసరాలకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం

అధికంగా భూమి సేకరించి ప్రైవేట్‌గా లాభసాటి వ్యాపారం చేసుకుంటున్నారు.

ఇకపోతే ముప్పై శాతం జనాభా తీరప్రాంతంలో నివసిస్తోంది. సముద్రం ప్రజలకు అందిన ఒక వరం. ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వారు కూడా సముద్రం దగ్గరకెళితే అన్నీ మరిచిపోయి చావును వాయిదావేసి ఇంటికి వెళతారు. సముద్ర అలలతో, ఎగిరే కెరటాలకు వీస్తున్న చల్లటి గాలులలో తీరప్రాంతంలో నివసించే ప్రజలు సాయంకాలం పూట హాయిగా సముద్రం ఒడ్డున గడుపుతారు. బస్సులో లేదా స్వంత వాహనదారులకు పెట్రోల్ ఖర్చు తప్ప ఏ ఇతర ఖర్చులు ఉండవు. కుటుంబ సమేతంగా హాయిగా సేద తీర్చుకోవచ్చు. ఈ ప్రాంతంలో నీటి సమస్య ఉండదు. మూడడుగుల్లో మంచినీరు దొరుకుతుంది. కొంతమేర చేపల చెరువులతో కలుషితమైనా, ఇంకా మంచినీరు మిగిలి ఉంది. పది రూపాయలు జేబులో ఉంటే పిక్కలు, బురద మట్టలు, జెల్లలు ఎండ్రకాయలు, పీతలు, ఇతర సముద్రపు చేపలు కూరతో పుష్టిగా భోజనం చెయ్యొచ్చు. శాఖహారులకైతే చెప్పనవసరంలేదు. ఒక్క రూపాయితో గోంగూర, తోటకూర, పొన్నగంటికూర, చుక్కకూర, కొయ్యతోట కూర, మెంతుకూర, బచ్చలకూర వంటివి ఇంటిల్లిపాదికి సరిపోతుంది. ఇళ్లముందల ఉండే మునగచెట్లు ఉచితంగా దొరుకుతాయి. వలసలు రావడం తక్కువ కాబట్టి ఆరువందల నుండి వెయ్యి రూపాయల నెల అద్దెతో అన్ని సౌకర్యాలు గల ఇంట్లో నివాసించ వచ్చు. అన్ని కాలాల్లోను హాయిగా సుఖమైన జీవితం తీరప్రాంతంలో సాగించవచ్చు. మత్స్యకారులు చాలా విశ్వాసపాత్రులు, ఎవరికీ హాని తలపెట్టరు. ఇటువంటి వారితో కలిసి జీవించడం ఒక కొత్త అనుభవం. ఇవన్నీ కోస్టల్ కారిడార్‌లో బలికాబోతున్నాయి. మానవ సంబంధాలు, అక్కడ సంస్కృతి పూర్తిగా మారబోతోంది.

మనిషికి తాను జీవించిన మట్టిపైన, ఆ ప్రదేశంపైన అభిమానం ఉంటుంది. ఆ పరిసర ప్రాంతాల ప్రభావం కూడా చాలా ఎక్కువగానే ఉంటాయి. అక్కడి ప్రజలు ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, వనరులతోపాటు ఆ ప్రాంతపు జంతువులు, పక్షులు, వివిధ వర్గాలు, సాంస్కృతికం, సాహిత్యం మొదలైన వాటన్నిటిపైనా సంబంధాలు ఉంటాయి. చెట్టు, పుట్టా, అడవులు, నీరు, బావులు, కుంటలు, చెరువులు, స్మశానాలు వంటివాటిపైన విడదీయరాని ఏదో చెప్పలేని అనుబంధం ఉంటుంది. అంతకంటే ఎక్కువ ఆ పరిసరాలకు లోబడి ప్రజల జీవనం ఆధారపడి ఉంటుంది. సంప్రదాయ ప్రజలు, పుట్టినప్పటినుండి ఎక్కడికి వెళ్లని వారు కొత్త ప్రదేశంలో జీవించడం అంత సులభమైంది కాదు. ఎంతో ఎందుకు నగరాల నుండి గ్రామాలకు వెళితే పొద్దున చెంబు తీసికొని టాయిలెట్‌కు వెళ్లేవారి సంగతి పట్టణపోళ్లకు చాలా విచిత్రంగా కనబడుతుంది. వారిని చూసి నవ్వుతారు. ఆరుబయట మూత్ర విసర్జన చేయడం ఎలా ఉంటుందో వారికి అందనిది. అదే విధంగా గ్రామాలవారు పట్టణాలకు పోతే వారికిది మరో ప్రపంచంలా కనబడుతుంది. చిన్న బాత్‌రూంలో టాయిలెట్ కూర్చోవడం వారికి సాధ్యం కానిపని. చాలామంది గ్రామాల నుండి పట్టణానికి వచ్చిన వారికి ఈ సమస్యతోటి తిరిగి గ్రామాలకు చేరిన సందర్భాలనేకం ఉన్నాయి. ఇంత చిన్న విషయంలోనే ఎంత కష్టమైతే జీవితాన్ని మార్చుకోవడం ఎలా సాధ్యమవుతుంది.

హైదరాబాద్ నగరంలో సంపన్న వర్గం ఉండే ప్రదేశంలో రోడ్డు, విస్తరణ కోసం ఒక మాజీమంత్రి గారి ప్రహరిగోడను ఆనుకుని ఉన్న బాత్‌రూం గోడ కూల్చారు. దీనిని నిరసిస్తూ ఆయన రోడ్డుపైనే స్నానం చేస్తే, మూడు రోజులపాటు పతాక శీర్షికల్లో పెద్దవార్తగా అచ్చయింది. మరి కొన్ని లక్షల జీవితాలు రోడ్డునపడుతుంటే ఎన్ని పతాక శీర్షికలు కావాలి. అది జరగకపోగా సమస్యగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వం తమ ప్రభుత్వాన్ని నడిపించడానికి నిధుల కోసం ప్రజలకు సారాను తాపించి డబ్బు సంపాదిస్తోంది. మరోపక్క ప్రభుత్వ భూములను విక్రయిస్తోంది. ప్రజలు చిన్న గూడుకోసం స్థలం కావాలంటే లాఠీలతో కొరడా ఝుళిపిస్తుంది. కానీ బహుళజాతి కంపెనీలకు వేలాది ఎకరాలు ఉచితంగా కట్టబెడుతున్నది. విశాఖలో ఏర్పాటు చేస్తున్న లంకా బ్రాండిక్స్ కంపెనీకి రెండు వేల ఎకరాలను, ఎకరా ఒక్క రూపాయి చొప్పున అప్పజెపారు. కరెంట్, పెట్టుబడి, వడ్డీ రాయితీలనందించి ప్రోత్సహించడమే కాకుండా, యాభై కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. అదే విధంగా దేశంలో ఏర్పాటు చేయబోతున్న సెజ్‌లు, పార్కులు, కంపెనీలు, ఇతర ప్రాజెక్ట్‌లకు ఇవన్నీ అందించబోతోంది. ఈ కంపెనీలన్ని మన వనరులపైన ఆధిపత్యం సంపాదిస్తున్నాయి. గతంలో బ్రిటిష్‌వారు మన దేశీయ ముడిసరుకుతో బ్రిటిష్ దేశంలో వస్తువుగా మార్చి మళ్లీ మన దేశంలో విక్రయించి లాభాలు ఆర్జించేవారు. ఇప్పుడు మన ముడి సంపదను మన దేశంలోనే వస్తువుగా మార్చి మన ప్రజలకే అంటగట్టి లాభాలు గడించబోతున్నారు. దీని వల్ల విస్తారమైన మన సహజ సంపద తరిగిపోతుంది. కంపెనీల నుండి వెదజల్లే విషపదార్థాలు, జల, వాయువులను కలుషితం చేస్తాయి. వాటి ప్రభావం మన సమాజంపైన, ప్రజల జీవితాలపైన తీవ్రంగా ఉంటుంది. అప్పుడు ధరలు ఆకాశాన్నంటి ఉంటాయి. ఇప్పుడే నీరు కొని తాగాలి, డబ్బులుంటేనే బాత్‌రూం పోయాలి, ఏదయినా డబ్బుతోనే సాధ్యమవుతుంది. గతంలో లాగా శాస్త్రీయ పరిజ్ఞానం, కళలు, సకల సంపదలు మానవ కళ్యాణానికి గాక బహుళజాతి కంపెనీల లాభాల కోసం వెచ్చిస్తున్నారు. కాబట్టి సామాన్య మానవుడి బతుకు మరింత దుర్భరంగా మారే ప్రమాదం కూడా ఉంది. భూస్వామ్య వ్యవస్థలో ఉమ్మడిగా ఉన్న సమాజం ఒక్కటై, భూస్వాముల దోపిడీ పీడనకు ప్రతిఘటించారు. ప్రతిఘటనకు దూరం చేయడానికి సమాజాలను విడగొట్టి, మనిషికి మనిషికి మధ్య పెద్ద అగాథమేర్పరుస్తున్నాయి బహుళజాతి కంపెనీలు.

నేరాలు పెరిగాయి. రవాణశాఖ ఖర్చును పెంచారు. ఎప్పుడు ఏం జరుగుతుంతో తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రజలు తమ తాత ముత్తాల నుండి ఈ సంపదను కాపాడుకుంటూ వస్తుంటే, ప్రభుత్వం మధ్యలో చొరబడి, పోలీసు బలగాలతో జాతి సంపదనంతా బహుళజాతి కంపెనీల చేతుల్లోకి అప్పగిస్తోంది. అసంఖ్యాక ప్రజల ప్రయోజనాలకు గానీ, వారి అవసరాలు తీర్చడానికిగానీ, వారి భవిష్యత్తును గురించి గానీ ఆలోచించకుండా కంపెనీల అభివృద్ధే ప్రథమ లక్ష్యంగా చేసుకొని ప్రజలకు జీవించే హక్కుకు భంగం కలిస్తున్నాయి. దీని నుండి బయట పడడానికి ప్రజలు చైతన్యం కావాలనీ ఆశిస్తూ..... వీ

అన్ని రంగాలలో మహిళా సాధికారత ప్రశ్నార్థకం కాకుండా ఉండాలంటే మహిళల రాజకజీయ భాగస్వామ్యం పెరగాలనీ, రిజర్వేషన్లు ఆవశ్యమని అంటున్నారు **గుడ్డేటి నరేష్ కుమార్, లకావత్ బాలాజి**

మహిళా సాధికారికత - రిజర్వేషన్లు

ప్రపంచం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దిశగా దూసుకు పోతున్నప్పటికి మహిళల పరిస్థితి మాత్రం మారడం లేదు. గతంతో పోల్చుకున్నప్పుడు విద్యా, ఉద్యోగ, రాజకీయాధికారం విషయంలో మెరుగుదల కనిపించి వారు వేస్తున్న ప్రతి అడుగుకు అడ్డంకులెన్నో! సంకెళ్లు గమనాన్ని నిరోదిస్తాయి. వాటిని తొలిగిస్తే రెక్కలు వచ్చినట్లే, మహిళా స్వేచ్ఛ, స్వాతంత్రం, ఆర్థిక, రాజకీయాధికారాలు కూడా అలాంటివే. 'మహిళల స్థితిగతులు మెరుగుపడనిదే ఈ ప్రపంచ సంక్షేమానికి ఆస్కారంలేదు. పక్షి ఒంటి రెక్కతో ఎగరడం సాధ్యమయ్యేనా? ' స్వామి వివేకనంద ఒక సందర్భంలో పేర్కొన్నారు. సాంఘిక స్థాయిని పెంచే ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాలన్నింటిలో స్త్రీ తీవ్రమైన వివక్షకు గురౌవుతూనే ఉన్నది. తన శక్తికిమించిన బరువు బాధ్యతలతో పదునైన కత్తులమీద నడుస్తున్నట్లుగా ఉన్నాయి స్త్రీల జీవితాలు. మహిళ శారీరకంగా, మానసికంగా, భావపరంగా 'అబల' అనేది చాలా బలంగా సమాజంలో పాతుకుపోయింది. అందుకనే మన రాజ్యాంగం అన్ని రంగాలలో స్త్రీకి పురుషునితో సమానహోదా యిచ్చిన, అందరికంటే ఎక్కువ సాంఘిక అణచివేతకు గురయ్యేది స్త్రీలే. ఆమె సమాజంలో రెండవ తరగతి పౌరురాలుగానే గుర్తించబడుతుంది. 'ఆకాశంలో సగం నువ్వు, సగం నేను' మహిళలను ఉద్దేశించి మావో మహానీయుడు అన్న మాటలివి. కాని ఈరోజున ప్రపంచంలో ఎక్కడా మహిళల స్థితి ఉన్నతంగా లేదు. జనాభాలో సుమారుగా యాభై శాతం ఉన్న మహిళలు వ్యవస్థలో పురుషులతో పోలిస్తే ఎంతో వెనుకబడి ఉన్నారు.

రాజకీయ రంగంలో స్త్రీలు

స్త్రీల సమస్యలపై స్త్రీలు చాలా చురుకుగా సంఘటితంగా ఉద్యమాలు నడుపుతున్న కాలం ఇది. స్త్రీలు రాజకీయాల్లో పాల్గొనడం అనేది వారి జీవితాల్లో మార్పుకోసం సాగే ఒక అత్యున్నత పోరాటం. ఈ క్రమం ఆలస్యంగానైన ఇప్పుడు ప్రారంభం అయ్యింది. మహిళా ఉద్యమం, అక్షరాస్యత, సారాయి వ్యతిరేక ఉద్యమాలు స్త్రీల సమాఖ్యను ఓ ముఖ్య రాజకీయ చర్చనీయాంశంగా మార్చడంలో సఫలీకృతం అయ్యాయి. ఈ ఉద్యమాలు స్త్రీలను రాజకీయాల్లోకి, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లోకి తమ వాటాను హక్కుగా అడిగే విధంగా ప్రేరేపించగలిగాయి. అంతే కాక, చైతన్యంగల స్త్రీల ప్రవేశం రాజకీయాల్ని ప్రభావితంచేసి వాటిని నేరపూరితం కాకుండా కాపాడగలదనే నమ్మకం కూడా స్త్రీ ఉద్యమాల వలన కలుగుతున్నది.

మహిళా రిజర్వేషన్ బిల్లు - ప్రస్థానం

దాదాపు 15 సంవత్సరాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లు వ్యవహారం నడుస్తుందని చెప్పాలి. గతంలోనూ ఈ బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టడం జరిగింది. గతంలో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి గీతా ముఖర్జీ, మమతా బెనర్జీ వంటి నాయకులు చాలా ప్రయత్నాలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు సంపాదించడానికి పార్టీ పంక్తులకు అతీతంగా ఆలోచిస్తూ బృందాకారత్, సుస్మాస్వరాజ్‌లు పోషించిన పాత్ర కూడా మెచ్చదగినదే.

చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఉద్దేశించిన బిల్లు గత కొంతకాలంగా పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. 1996, సెప్టెంబర్‌లో దేవెగౌడ సర్కార్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని 81వ రాజ్యాంగ సవరణ బిల్లు అని పిలుస్తారు. ఈ బిల్లును సిపిఐ ఎంపీ గీతా ముఖర్జి నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించారు. ఈ కమిటీ 1996, డిసెంబర్‌లో తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. 1998, జూన్‌లో ఎన్.డి.ఎ. సర్కార్ ఈ బిల్లును పార్లమెంట్‌లో తిరిగి ప్రవేశపెట్టింది. దీనిని 84వ రాజ్యాంగ సవరణ బిల్లు అని పిలుస్తారు.

మళ్లీ ఈ బిల్లును ఎన్.డి.ఎ సర్కార్ 13వ లోక్‌సభలో 1999లో తిరిగి ప్రవేశపెట్టింది. 2002లోను, 2003లోను ఈ బిల్లు పాస్ చేయించాలని ఎన్.డి.ఎ సర్కార్ ప్రయత్నించి విఫలమయింది. 2004లో యు.పి.ఏ సర్కార్ తాము ఈ బిల్లును ఆమోదింప చేస్తామని హామిఇచ్చింది. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనికి ఆర్జెడి, ఎస్పీ పార్టీల దగ్గరినుంచి వ్యతిరేకత ఎదురవుతుంది. మహిళలు రాజకీయ రంగంలో చీకటి సంకెళ్ళలో మగ్గి మహిళా రిజర్వేషన్ బిల్లు రూపంలో స్వేచ్ఛ, సమానత్వాల వెలుగులోకి రావడానికి ఎన్.డి.ఏ. ప్రభుత్వం నుండి యు.పి.ఎ. ప్రభుత్వం వరకూ సుదీర్ఘంగా ఎదురుచూడడమే జరుగుతోంది. దేవెగౌడ ప్రభుత్వకాలంలో 1996, సెప్టెంబర్‌లో తొలిసారిగా మహిళాబిల్లుపై రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన నాటి నుంచి దేశంలో ఎన్నికలు జరిగిన ప్రతిసారీ మహిళాబిల్లు చర్చనీయాంశం అవుతోంది. ఈ బిల్లుకు వివిధ రాజకీయ పార్టీలు అనుకూలంగా ఉన్నట్లే ఉంటూ వెనుకడుగు

వేస్తున్నాయి. ఏకాభిప్రాయం పేరిట మహిళా రిజర్వేషన్లకు ఎగనామం పెట్టడం, అసలు బిల్లునే చట్టసభల్లో ప్రవేశపెట్టకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

రిజర్వేషన్లతోనే మహిళా సాధికారత ఒనగూరుతుందని 'యునిసెఫ్' ఎప్పుడో వెల్లడించింది. చట్టసభల్లో మహిళా సభ్యులు అధికంగా ఉన్న 20 దేశాల్లో పదిహేడు చోట్ల ఏదో ఒక రూపంలో రిజర్వేషన్లు ఉన్నాయని పేర్కొంది. పార్లమెంట్ ఉభయ సభల్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాష్ట్రపతిగా శ్రీ కె.ఆర్. నారాయణన్ మహిళా బిల్లుకు సత్వరం మోక్షం కల్పించాలంటూ, మహిళల భాగస్వామ్యం, సాధికారతలను సాధించాలని, స్త్రీల ప్రాతినిధ్యం పెరిగితే రాజకీయరంగ ప్రక్షాళన జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు.

మహిళలు – రాజ్యాంగ రక్షణలు

సామాజికంగా, ఆర్థిక, రాజకీయరంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణించడానికి ఎన్నో చర్యలు మన రాజ్యాంగంలో తీసుకోవడం జరిగింది.

- 73వ, 74వ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో స్త్రీలకు మూడింట ఒక వంతు స్థానాలను రిజర్వ్‌చేసింది. ఈ రిజర్వేషన్ పంచాయతీల్లో, మున్సిపాలిటీలలో అమలు జరుగుతుంది.
- పార్లమెంట్, శాసనసభల్లోనూ స్త్రీలకు మూడింట ఒక వంతు స్థానాలకు రిజర్వ్ చేయడానికి అవకాశం కల్పించే బిల్లు పార్లమెంట్ ముందుంది.
- ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమే.
- ఆర్టికల్ 15 ప్రకారం లింగ భేదం ప్రాతిపదికపై ఎలాంటి వివక్ష చూపరాదు.
- ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో అందరికీ సమానావకాశాల కల్పన.
- 39(ఎ) ఆర్టికల్ ప్రకారం – జీవన భృతికి స్త్రీ, పురుషులకు సమాన హక్కులున్నాయి.
- 44వ రాజ్యాంగ నిబంధన ప్రకారం ఉమ్మడి పౌర శాసనాన్ని (కామన్ సివిల్ కోడ్) రూపొందించాలి.
- ఆర్టికల్ 51 ఎ (ఇ) ప్రకారం – స్త్రీల గౌరవానికి భంగం కలిగించే ప్రతీ ఆచారాన్ని పౌరులు ఖండించాలి.
- ఆర్టికల్ 243 డి (3) ప్రకారం – ప్రతి పంచాయతీకి మూడింట ఒక వంతు స్థానాలను కేటాయించడం, సీట్లను రొటేషన్ ప్రాతిపదికన కేటాయించాలి.
- ఆర్టికల్ 243(4) ప్రకారం పంచాయతీలలో మూడింట ఒక వంతు ఛైర్ పర్సన్ పదవులను స్త్రీలకు కేటాయించాలి.
- ఆర్టికల్ 243 టి (3) ప్రకారం ప్రతి మున్సిపాలిటీలోను మూడింట ఒక వంతు స్థానాలను స్త్రీలకు కేటాయించాలి.
- ఆర్టికల్ 243 టి (4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల ప్రకారం మున్సిపాలిటీలలోను షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ జాతులకు, మహిళలకు ఛైర్ పర్సన్ పదవులకు రిజర్వ్‌చేయాలి.
- 1954లో స్పెషల్ మ్యారేజ్ యాక్టును, 1955లో హిదూ మ్యారేజ్ చట్టాన్ని, 1961లో వరకట్న నిషేధ శాసనాన్ని, 1976లో బాల్య వివాహాలను నిషేధిస్తూ వివాహ చట్టాన్ని, 1955లో హిందూ దత్తత చట్టాన్ని, 1956లో హిందూ సక్సెషన్ యాక్టును, 1961లో మెటర్నిటీ బెనిఫిట్ యాక్టును, 1976లో పురుషులతో స్త్రీలకు సమానంగా వేతనాలివ్వాలన్న చట్టాన్ని స్త్రీల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలను భారత రాజ్యాంగం రూపొందించింది.
- 1950 జనవరి 26న రాజ్యాంగం అమలు నుంచి స్త్రీల సంక్షేమంకోసం సంస్థాగత యంత్రాగాన్ని క్రమేణ స్థాపిస్తూవచ్చారు.
- 1953లో ఏర్పాటైన 'సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్'ను, 1967లో కేంద్రంలో 'సామాజిక సంక్షేమ శాఖ'ను, 1993లో 'నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్'ను ఏర్పాటు చేశారు.
- 1979 – 85 సంవత్సరాలను ఐక్యరాజ్యసమితి 'మహిళ దశాబ్దంగా' ప్రకటించింది.
- 2000 సెప్టెంబర్‌లో మాల్దీవులలో జరిగిన సార్క్ దేశాల సమావేశం 2001 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మహిళా సాధికారత సంవత్సరం'గా పాటించాలని పిలుపునిచ్చింది.

సార్క్ సమావేశంతో పాటు భారత ప్రభుత్వం కూడా '2001ని మహిళా సాధికారత సంవత్సరం'గా ప్రకటించింది.

భారత రాజకీయ రంగంలో స్త్రీలు

భారత రాజ్యాంగం అన్నిరంగాల్లో స్త్రీలకు సమానత్వం కలిగిస్తున్నది. స్త్రీల సంక్షేమానికి అనేక చట్టాలు చేయబడినాయి. కానీ స్త్రీల అసమానత్వం మాత్రం అన్ని రంగాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. మహిళలకు న్యాయం చేకూర్చేందుకు గత 50 సంవత్సరాల నుండి రాజ్యం అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ చట్టాలు రూపొందించింది. అమలులో ఉన్న చట్టాలకు ఎన్నో సవరణలు చేసింది.

ఉపాధ్యాయులుగా, వైద్యులుగా, ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్, అధికారులుగా మహిళలు క్రియాశీలక పాత్రలు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్‌లో, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రులుగా, రాష్ట్ర ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా అనేక మంది మహిళలు పనిచేశారు. పరిపాలనా దక్షురాలిగా కీర్తిపొందిన మన దేశ ప్రధాని ఇందిరాగాంధీ, రాజకీయ రంగంలో పేరుపొందిన విజయలక్ష్మిపండిట్, కెప్టెన్ లక్ష్మిసెహగల్, సరోజినిదేవి నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్, స్వరాజ్యలక్ష్మి, శారద ముఖర్జీ వంటి ఎందరో వనితలు ఏపదవినైనా, ఏపనినైనా సమర్థవంతంగా చేయగలరని నిరూపించారు. ఏవర్గానికి చెందిన స్త్రీలైనా, గ్రామ స్వరాజ్యంలో పంచాయతీరాజ్ సంస్థలకు తమ సామర్థ్యాన్ని నిరూపించుకో గలరనడంలో సందేహం లేదు. ఇప్పటివరకు ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, గోవా, అస్సాం, తమిళనాడు, పంజాబ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా మహిళలు పనిచేశారు.

భారత రాజ్యాంగం రెండు ముఖ్యమైన రాజకీయ హక్కులు మహిళలకు ప్రసాదించింది. అవి 1. ఓటు హక్కు 2. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు మొదలగు చట్ట సభలకు ఎన్నుకోబడే హక్కు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల కాలంలో రాజకీయాల్లోకి వచ్చి ఉన్నత స్థాయికి ఎదిగిన మహిళల సంఖ్య చాల తక్కువ. సాతంత్ర్యం

వచ్చిన రెండు దశాబ్దాల లోపే 1966లోనే ఇందిరాగాంధీ తొలి మహిళా ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ 60 ఏళ్ళ చరిత్రను గమనిస్తే ప్రస్తుత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్‌ను మినహాయిస్తే ఉన్నత పదవులు నిర్వహించిన మహిళలు కూడా తక్కువగానే కనిపిస్తారు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో ఉన్నత వర్గాలకు చెందిన కొద్ది మంది మహిళలు తప్ప రాజకీయాల్లో ఇతరులు రాణించలేకపోయారు. జవహర్‌లాల్ నెహ్రూ సోదరి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ తొలి మహిళా విదేశీ రాయబారి. ఆమె ఐక్యరాజ్య సమితి సాధారణ సభ మొదటి మహిళా అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. మొదటి మహిళా గవర్నర్ శ్రీమతి సరోజినీ నాయుడు, హర్యానా అసెంబ్లీకి స్పీకరయిన మొదటి మహిళ శ్రీమతి షన్నోదేవి, ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన ఏకైక ముస్లిం మహిళ రజియాబేగం మొదలైన వారితో ఇప్పటి పరిస్థితులను పోల్చిచూస్తే దశాబ్దాల క్రితమే మహిళల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది.

మహిళల ప్రాతినిధ్యం

స్వాతంత్ర్యానంతరం మహిళలకు అంత ప్రోత్సాహం లభించలేదు. అనేక చోట్ల ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటూ, వాటిని అధిగమించి రాజకీయాల్లో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారంటే అది వారి స్వయంకృషి, పట్టుదల వల్లనే సాధ్యమైంది. లోక్‌సభలో ఆదినుంచి మహిళా ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంటుంది. ఇప్పటిదాకా లోక్‌సభకు గరిష్ఠ సంఖ్యలో మహిళలు ప్రాతినిధ్యం వహించింది పదమూడవ లోక్‌సభలోనే. తొలి లోక్‌సభలో 22 స్థానాలతో ప్రారంభమైన మహిళా సభ్యుల ప్రస్థానం మూడవ లోక్‌సభకొచ్చేసరికి 34 సీట్లకు పెరిగింది. కానీ ఆతరువాత వారి సంఖ్య క్రమేపి పడిపోతు ఎమర్జెన్సీ అనంతరం 1977 ఎన్నికల్లో కనిష్ఠంగా 19 సీట్లకు పడిపోయింది.

లోక్‌సభ	కాలం	సీట్లసంఖ్య
మొదటి లోక్‌సభ	1952	22
రెండవ లోక్‌సభ	1957	27
మూడవ లోక్‌సభ	1962	34
నాలుగవ లోక్‌సభ	1967	31
ఐదవ లోక్‌సభ	1971	22
ఆరవ లోక్‌సభ	1977	19
ఏడవ లోక్‌సభ	1980	28
ఎనిమిదవ లోక్‌సభ	1984	44
తొమ్మిదవ లోక్‌సభ	1989	27
పదవ లోక్‌సభ	1991	39
పదకొండవ లోక్‌సభ	1996	40
పన్నెండవ లోక్‌సభ	1998	43
పదమూడవ లోక్‌సభ	1999	49
పద్నాల్గవ లోక్‌సభ	2004	44

ఎగువ సభ అయిన రాజ్యసభకు ఎన్నికైన మహిళల సంఖ్య కూడా చెప్పుకోదగిన రీతిలో లేదు. 1952వ సంవత్సరంలో 12 మందికి ప్రవేశం లంభించగా 1991లో 17 మంది మహిళలు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు అత్యధిక స్థాయిలో ఎన్నికైన మహిళా రాజ్యసభ సభ్యుల సంఖ్య 30కి మించలేదు.

పురుషులతో పోల్చిచూస్తే రాజకీయంగా మహిళల శాతం చాలా తక్కువ. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన 14 లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గిన మహిళా సభ్యుల జాబితాను చూస్తే స్త్రీలకు ఎంత తక్కువ ప్రాముఖ్యత నిస్తున్నారో అర్థమవుతుంది. చట్టసభల్లో మన దేశంలో ఏనాడూ స్త్రీల ప్రాతినిధ్యం 9 శాతానికి మించలేదు. మొట్టమొదటి లోక్‌సభకు 1952లో ఎన్నికలు జరిగాయి. అప్పుడు లోక్‌సభ స్థానాలు 499. వాటిలో 43 స్థానాలకు మహిళలు పోటీచేయగా 22 మంది విజయం సాధించారు. ప్రస్తుత లోక్‌సభలో మహిళాసభ్యుల సంఖ్య కేవలం 44. రాజకీయాల్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలన్న దోరణితో రాజకీయ పార్టీలు ఏనాడూ చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. చట్ట సభలకు ఎన్నికవుతున్న మహిళా ప్రతినిధుల సంఖ్య తక్కువే అయినా వారి గెలుపు శాతం మాత్రం పురుషులతో పోలిస్తే ఎక్కువే కావడం గమనార్హం. ఇప్పటి వరకు లోక్‌సభకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ఇది నిరూపితమైంది. 1957 ఎన్నికల్లో బరిలో దిగిన వారిలో గరిష్ఠంగా 60 శాతం మంది మహిళలు విజయం సాధించారు. ఆ తర్వాతి ఎన్నికల్లో అది 50 శాతానికి, తర్వాత 44.77 శాతానికి, 1996 ఎన్నికల్లో 6.51 శాతం కనిష్ఠస్థాయికి పడిపోయింది. అయినా, ప్రతిసారీ పురుషుల గెలుపు శాతం కంటే మహిళల గెలుపు శాతమే ఎక్కువ.

అయితే ఎన్నికైన కొద్ది మంది మహిళా సభ్యుల్లో కేంద్ర మంత్రి వర్గంలో స్థానం దక్కుతున్నది అతి కొద్ది మందికి మాత్రమే. 1952 నుంచి 1975 వరకు కేంద్ర మంత్రి వర్గంలో ఇద్దరంటే ఇద్దరే మహిళలకు స్థానం దక్కింది. 1980లో ఇందిరాగాంధీ నేతృత్వాన ఏర్పడిన మంత్రి వర్గంలో అసలు మహిళలే లేరు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కేబినెట్‌లో ఒకే ఒక మహిళకి స్థానం లభించింది.

ఎన్.డి.ఎ. అధికారంలో ఉండగా మహిళాసాధికారత కోసం చట్ట సభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ పరితపించి పోయింది. కానీ, తాను అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటినా మూడో వంతు రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలిపిందిలేదు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అంశం పుష్కరకాలంగా ముడిపడటం లేదంటూ కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి ఎం.ఎస్. గిల్ పేర్కొంటూ మహిళలకు రిజర్వేషన్లు తప్పనిసరి చేసే రాజ్యాంగ సవరణతో నిమిత్తం లేకుండా పార్టీలే ఎన్నికల వేళ తప్పని సరిగా మూడో వంతు మహిళా అభ్యర్థుల్ని బరిలోకి దింపేలా సాధారణ మెజారిటీలో ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరిస్తే సరిపోతుందన్నది ఆనాటి ఎన్నికల సంఘం ప్రతిపాదన. ఎన్నికల సంఘం ప్రతిపాదనపై ఏకాభిప్రాయం కుదిరితే దాన్ని పరిశీలించేందుకు సిద్ధమని ఉప ప్రధాని హోదాలో ఎల్.కె ఆద్వానీ 2003 మార్చిలో ప్రకటించినా ఏకాభిప్రాయం కుదరడం లేదని పేర్కొనడంతో ఆ అంశం ఆగిపోయింది. అసలు ఏదైనా బిల్లును చట్టసభల్లోకి ప్రవేశపెట్టాలంటే ముందస్తు ఏకాభిప్రాయం అవసరమని రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనబడలేదని నాయకులకు తెలియక పోవచ్చు.

'హమ్ హోంగే కామియాబ్' అంటూ స్త్రీల సాధికారతను ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పది సూత్రాల చార్టర్‌ను 2002లో గాంధీజయంతి నాడు ఆమోదించింది. రిజర్వేషన్ బిల్లు కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పొందుపరిచినా, ఎలక్షన్ మానిఫెస్టోలో పేర్కొన్నా, పై అంశంను గత నాలుగు సంవత్సరాలుగా ఇతర పార్టీల ఏకాభిప్రాయం కుదరడం లేదంటూ సాగదీసి ఆఖరుకు గత బడ్జెట్ సమావేశాలప్పుడు హడావిడిగా ఆఖరు రోజు రాజ్యసభలో బిల్లును ప్రవేశ పెట్టడం రాజకీయ పార్టీల నిబద్ధతను ప్రశ్నిస్తోంది. అయితే, మహిళా రిజర్వేషన్ బిల్లుపై యు.పి.ఏ భాగస్వామ్య పార్టీల్లోనే ఇంతవరకు ఏకాభిప్రాయం కుదరడం లేదు. యు.పి.ఎ. లోని రెండవ అతి పెద్ద పార్టీగా చెప్పబడే ఆర్జేడి (రాష్ట్రీయ జనతాదళ్) మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తుంది. శరత్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లు ఇప్పటికే బిల్లును వ్యతిరేకించడం వల్ల 'యాంటి ఫెమినిస్ట్'లుగా ముద్రపడింది. మహిళా రిజర్వేషన్లలో ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ, బి.సి. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కావాలన్నది వారి వాదన. మహిళా రిజర్వేషన్ల పేరిట అగ్రవర్ణ మహిళలకే పెద్ద పీట లభిస్తుందన్నది వారి ముఖ్యమైన అభ్యంతరం.

ఇప్పుడు మహిళలకు బిల్లు ప్రవేశపెట్టిన పార్టీలు, మహిళల బిల్లు పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న పార్టీలు కూడా ఏనాడు 33 శాతం స్థానాలను మహిళలకు ఇచ్చింది లేదు. మహిళా రిజర్వేషన్లకు సానుకూలంగానే స్పందిస్తున్నా బిల్లు ఆమోదించడం ద్వారా వచ్చే పరిణామాలు వారికి మింగుడు పడటం లేదనేది వాస్తవం. ఈ బిల్లును కాదంటే మహిళా రిజర్వేషన్ వ్యతిరేకులుగా ముద్ర పడుతుందని భయపడుతున్నారు. అందుకే పైకి అందరూ బిల్లును సమర్థిస్తున్నట్లుగా ప్రకటిస్తూనే అది చట్టం కాకుండా అడ్డుకుంటున్నారు. రాజకీయ పక్షాలు ఇలా ద్వంద ప్రమాణాలతో వ్యవహరించడానికి ఈ బిల్లు సూచించే రిజర్వేషన్ల పద్ధతే అసలు కారణం. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే మొత్తం చట్ట సభలలో రిజర్వేషన్ స్థానాలు 50 శాతానికి పెరుగుతాయి. అయిదు సంవత్సరాలకి రొటేషన్ అయ్యేలా చేస్తే ఏ సీటులోనూ ఎవరూ స్థిరంగా పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. రాజకీయంగా ఆ రంగం తీవ్ర అస్థిరతకు లోనవుతుంది. రిజర్వేషన్లు కల్పించే ఈ అస్థిరత్వమే రాజకీయ నేతల గుండెలలో గుబులు పుట్టిస్తుంది.

1992 డిసెంబర్ నాటి 73,74 రాజ్యాంగ సవరణలు పంచాయితీలు, పురపాలక సంఘాల్లో మహిళా కోటాకు మార్గం సుగమం చేశాయి. రికార్డుల స్థానిక సంస్థలకు అయిదేళ్ళకొకసారి ఎంపికయ్యే 32 లక్షల మంది సభ్యుల్లో మూడో వంతు మహిళలే. ఆ లెక్కన దేశవాప్తంగా వివిధ పంచాయితీలు, పురపాలక సంఘాల్లో పది లక్షలకు పైగా మహిళలు ఏలుబడి సాగిస్తున్నట్లుగా గణాంకాలు చాటుతున్నా, వాస్తవాలు అందుకు భిన్నంగా కొంత విస్మయం కలిగిస్తున్నాయి! మూడోవంతు పదవుల్లో మహిళలు కొలువు తీరినా వారిని కట్టుకున్నవారో, వారి తోడపుట్టినవారో లేదా ఇతర సంబంధీకులో పాలనలో చక్రం తిప్పుతున్నట్లు అధికార వర్గాలే చూచాయగా దృవీకరిస్తున్నాయి.

సామాజిక అవసరంగా మహిళా రాజకీయ రిజర్వేషన్లు

ఏళ్ళతరబడి సుప్తచేతనావస్థలో అలమటిస్తున్న పంచాయతీల్లో సృజన జాగృతి పురివిప్పితే అనేకనేక సమాజిక రుగ్మతలకు దానికదే ధీటైన పరిష్కారం కాగలదు. అంతేకాక ఆధిపత్యకులాలు అధికారం చెలాయిస్తున్న ఈ సమాజంలో పురుషులకు, స్త్రీలకు సమానత్వమేకాక మహిళల్లో కూడా ఈ సమానత్వ భావాలు నెలకొనాలి. నిజమైన మహిళా సాధికారత అంటే నిర్ణయాధికారంలో సమానవాటా దక్కడం. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయ అధికారంలో సమాన భాగం కోసమే కాదు, స్త్రీల గురించి సమాజంలోనూ, రాజకీయాల్లోనూ ఉన్న మూసపోత భావజాలాన్ని సైతం ఇది సవాల్ చేస్తుంది. ఇందు కోసమే అధికారంలో భాగస్వామ్యాన్ని మహిళలు కోరుతున్నారు. వివిధ పార్టీల మహిళా సంఘాలు ఎంతో చురుగ్గా పని చేస్తుంటాయి. మహిళా ఉద్యమ నిర్మాణంలో క్రియాశీల పాత్ర వహిస్తుంటాయి కానీ ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు మాత్రం తగినంతమంది కనిపించరు. ఈ వివక్ష ఎందుకు కొనసాగుతున్నదో ఆయా పార్టీల వర్గాలే చెప్పాలి.

ఎన్నో అంతరాలు, అవాంతరాలు, అసమానతలు నిండి ఉన్న నేటి నాగరిక సమాజంలో మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ల ఆవశ్యకత ఎంతో ఉంది. మహిళాదినోత్సవం మార్చి ఎనిమిది నాడు దాదాపుగా ప్రతి పార్లమెంట్ సమావేశాల ముందూ మహిళా రిజర్వేషన్ల అంశం తెరమీదకొస్తూనే ఉంది. మహిళా సాధికారత ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. రాజకీయ ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం చెప్పుకోదగిన రీతిలో లేదు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు ఇవ్వాలన్న డిమాండ్ నెరవేరనంతవరకు మహిళల సాధికారత కలగానే మిగిలిపోతుంది. అంతేకాక రాజకీయ పార్టీల దృక్పథంలోనూ, నేతల స్వభావంలోనూ మార్పురావాలి. ఈ దిశగా మహిళా ఉద్యమాలు రూపొంది బలోపేతం కావాలి. అయితే లక్ష్యాలే కాదు – వాటి సాధనకు అనుసరించే మార్గాలు సమున్నతంగా ఉండాలనే వారు మహాత్మాగాంధీ. గమ్యం చేరేందుకు దారులెన్ని ఉన్నా అట్టడుగుస్థాయిలో రగిలించగలిగితే యావత్ దేశానికే గొప్పమేలు జరుగుతుంది. ఉద్యమ స్ఫూర్తితో వనితాలోకం కదం తొక్కితే తమనితాము నిలబెట్టుకునే ప్రయత్నం, సంఘటితపడే చైతన్యం వివిధ ఉద్యమాల ద్వారా వ్యక్తీకరించవచ్చు.

ముగింపు

ఇతర రంగాలన్నింటిలో మహిళలు రాణిస్తున్నారు. కానీ, విధాన నిర్ణయాల్లో భాగస్వాములయినప్పుడే మహిళలకు సమానమైన గుర్తింపు లభిస్తుంది. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యంలో మార్పులేదు. అందుకు అనువైన సామాజిక, రాజకీయ వాతావరణం కూడా లేదు. 'ఉమెన్ నీడ్ వీల్స్ ఫర్ మొబిలిటి' రాజకీయాల్లో నిలదొక్కుకొని తనకు తానుగా నిలబడటమే ఈ స్థితిలో పురుషాధిక్యతను ప్రశ్నించే ప్రయత్నంగా గుర్తించాలి. స్త్రీల అణచివేత, దోపిడి సహజమని భావిస్తున్న ఈ సమాజంలో ఈ రాజకీయ భాగస్వామ్యం అంతిమ లక్ష్యం కావాలి. ఇది ఎవరో చేయాల్సిన పనికాదు. స్త్రీలందరూ సంఘటితంగా నిరంతర స్ఫూర్తితో తమను, ఈ సమాజాన్ని మార్చుకోవాలి. సమాజం రూపురేఖలను మార్చడంలో నూతన పాత్రను నిర్వర్తించాలి. వీ

పేదలపై ప్రయోగం - పెద్దలకు వైద్యం

అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో ఔషధ ప్రయోగాల వల్ల గత రెండేళ్లలో 49 మంది పసిపిల్లలు మరణించినట్లు తెలుస్తోంది. సమాచార హక్కు చట్టం ప్రాతిపదికగా ఒక స్వచ్ఛంద సంస్థ కోరిక మీదట ఈ వైద్య సంస్థ వివరాలు వెల్లడించింది. వివిధ వర్గాల ఒత్తిడి మేరకు, కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశం మేరకు ఎయిమ్స్ వెంటనే దర్యాప్తు కమిటీని నియమించింది. పసిపిల్లల మరణాలకు కారణం వారి వ్యాధులే తప్ప, తమ ప్రయోగాలు కాదంటూ వైద్య సంస్థ చేస్తున్న వాదనలోని సత్యాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. పాశ్చాత్య ఔషధ సంస్థలు మన దేశంలో ప్రయోగాలు జరపడానికి చాలా కారణాలున్నాయి. అమెరికాలో జరిగే వ్యయంలో నలభై శాతం తోనే మన దేశంలో ప్రయోగాలు సాగించవచ్చు. మన దేశంలో రోగులూ, ఆంగ్ల పరిజ్ఞానం గల వైద్యులు చౌకగానే లభిస్తారు. వచ్చే రెండేళ్లలో ఈ ప్రయోగ వ్యాపారం విలువ ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

సిమిపై నిషేధం పొడిగింపు

స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) పై నిషేధాన్ని సుప్రీం కోర్టు ఆగస్ట్ 25న పొడిగించింది. సిమిపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రత్యేక ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారించిన సుప్రీం కోర్టు ఆ ఉత్తర్వులపై విధించిన స్టేను పొడిగించింది. సిమిపై నిషేధాన్ని పొడిగిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఆ సంస్థకు 2001 సెప్టెంబర్ 27 వరకు అధ్యక్షునిగా వ్యవహరించిన షాహిద్ బదర్ వ్యతిరేకించారు. బదర్ తరఫున కోర్టులో న్యాయవాది కామిని జైస్వాల్ ప్రభుత్వ వాదనలను ఎదుర్కొన్నారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 24వ తేదీకి వాయిదా వేశారు.

కాశ్మీరీల స్వేచ్ఛాకాంక్ష!

కాశ్మీరీల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ అక్కడి ప్రజాసంఘాలు ఆగస్ట్ 25న శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌కు భారీ ర్యాలి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు జమ్మూ-కాశ్మీర్ లోయలోని పది జిల్లాల్లోనూ ప్రభుత్వం నిరవధిక కర్ఫ్యూ విధించింది. ఆగస్ట్ 24 అర్ధరాత్రి నుంచీ వివిధ సంఘాల నాయకులనూ, కార్యకర్తలనూ అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో అలిషా గిలానీ, మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్‌లు ఉన్నారు. ఆగస్ట్ 25 ఉదయం నిబంధనలను అతిక్రమించి లాల్‌చౌక్ వైపుకు దూసుకువెళుతున్న జమ్మూ-కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ అధినేత యాసిన్ మాలిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వ్యవహారానికి నిరసనగా ఆగస్ట్ 26న పూర్తి బంద్ పాటించాలని శ్రీనగర్ సమన్వయ కమిటీ పిలుపు నిచ్చింది. గవర్నర్ వోహ్రా నియమించిన కమిటీకి, అమర్‌నాథ్ సంఘర్ష్ సమితికి మధ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడడంతో జమ్మూలో బంద్‌ను మరో ఆరు రోజులు పొడిగించాలని సమితి నిర్ణయించింది. జమ్మూ-కాశ్మీర్‌లో సెల్‌ఫోన్ల ఎస్.ఎం.ఎస్.లపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై విధించిన స్టేను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు సుప్రీం కోర్టు న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఆగస్ట్ 25వ తీర్పు చెప్పింది. వరుస పరిణామాలతో కాశ్మీర్ అట్టుడుకుతోంది.

మావోయిస్టుల అణచివేతకు 'కోబ్రా'లు

నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టేందుకు పదివేల మందితో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. దాని పేరు 'కాంబట్ బెటాలియన్ ఫర్ రివల్యూట్ యాక్షన్ (కోబ్రా)'. సి.ఆర్.పి.ఎఫ్. ఆధ్వర్యం, నియంత్రణలో పనిచేసే ఈ సంస్థ ఏర్పాటుకు ఆగస్ట్ 27న ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన భద్రతా వ్యవహారాలపై మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. దేశ రాజధాని ఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఈ సంస్థకు నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల అన్నిటిలోనూ ప్రధాన కార్యాలయాలు ఉంటాయి.

అటు కోసినది... ఇటు మహానది

నేపాల్ నుంచి తరలివచ్చిన వరదనీరూ, మరోపక్క భారీ వర్షాలతో మొత్తంగా వరదల్లో చిక్కుకుని బీహార్ రాష్ట్రం అతలాకుతలమయ్యింది. ఆగస్ట్ 31 నాటికి 18 జిల్లాలు వరద తాకిడికి గురయ్యాయి. 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. రైల్వే ప్లాట్‌ఫారాలు, స్కూళ్ల పైకప్పులు, వరద బాధితులకు అప్పటికే పదిహేను రోజులుగా ఆవాసాలు అయ్యాయి. ఆహారం, మంచినీళ్ల కొరతే కాక రోగాల బారినపడి జనం విలవిలాడిపోతున్నారు. అలాగే సెప్టెంబర్ రెండూ మూడు వారాలలో కురిసిన భారీ వర్షాలకు మహానది పరీవాహక ప్రాంతాలలోని పదిహేడు జిల్లాలు వరద తాకిడికి గురయ్యాయి. సెప్టెంబర్ 20 నాటికి పదహారు మంది చనిపోగా, ఇరవై లక్షల మంది వరద బాధితులయ్యారు.

ఢిల్లీలో పేలుళ్లు

దేశంలోని ప్రధాన నగరాలు, వాణిజ్య కేంద్రాలు వరుస బాంబు దాడులతో అతలాకుతలమవుతున్నాయి. ఆగస్ట్ 13న ఢిల్లీలో రద్దీగా ఉండే మార్కెట్ స్థలాల్లో ఐదు చోట్ల ఈ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో ఇరవై నాలుగు మంది చనిపోగా, వంద మందికి పైగా గాయపడ్డారు. ఇండియన్ ముజాహిద్దీన్ సంస్థ ఈ పేలుళ్లకు బాధ్యత వహించింది. యు.పి.ఎ. ప్రభుత్వం ఏర్పాడ్డాక 2004 ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉల్ఫా జరిపిన పేలుళ్లలో పదహారు మంది బడిపిల్లలు మరణించిన ఉదంతం మొదటిది కాగా, 2005 అక్టోబర్ 29న ఢిల్లీలో జరిగిన మూడు పేలుళ్లు మొదలుకొని, మళ్లీ ఇప్పుడు దేశ రాజధానిలో జరిగిన పేలుళ్ల దాకా మొత్తం పదకొండు సార్లు ఈ తరహా బాంబు దాడులు జరిగాయి.

నేపాల్ ప్రధాని భారత పర్యటన

భారత్‌లో ఐదు రోజుల పర్యటనకోసం వచ్చిన నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ (ప్రచండ) సెప్టెంబర్ 15న ప్రధాని మన్మోహన్ సింగ్‌తో అధికారిక చర్చలు జరిపారు. రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, ఉప ప్రధాని అన్సారి, విదేశీ వ్యవహారాలశాఖమంత్రి ప్రణబ్‌ముఖర్జీ, ప్రతిపక్ష నాయకుడు ఎల్.కె. అద్వానితో ప్రచండ సమావేశమయ్యారు. అదే విధంగా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతో ఆయన చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఉభయ దేశాల సంబంధాల పటిష్ఠానికి తీసుకోవలసిన చర్యలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ప్రజాసామ్య తరహాతో పాటు సామ్యవాద పాలనకు బహుళ పార్టీల పోటీ అత్యవసరమని, అప్పుడే సమాజం గతిశీలంగా వ్యవహరించగలదని' పేర్కొన్నారు.

బుష్ లేఖ కలకలం

అమెరికాతో అణు ఒప్పందం వల్ల ప్రయోజనం లేదని ప్రధాని ఆయన మంత్రివర్గ అనుచరులు చెప్పిన మాటలు ప్రగల్భాలేనని తేలిపోయింది. అమెరికా కాంగ్రెస్‌కు ఆ దేశాధ్యక్షుడు బుష్ రాసిన లేఖ బయటపడడంతో అణు ఒప్పందం లోగుట్టు బయటపడింది. ఇన్నాళ్లూ వ్యతిరేకిస్తున్న వారి వాదనే చివరికి నిజమైనంది. 2006లో హైడ్ చట్టాన్ని ఆమోదించిన సమయంలో కాంగ్రెస్ సభ్యులు పలు సందేహాలు లేవనెత్తారు. వీటికి సవివరంగా సమాధానాలిస్తూ బుష్ యంత్రాంగం ఈ ఏడాది జనవరి 16న అప్పటి కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్ టామ్ లాంటోస్‌కు ఇరవై ఆరు పేజీల లేఖ పంపింది. ఇందులో వివరాలు రహస్యంగా ఉంచాల్సినవి కాకపోయిన అవి భారత్ సర్కార్‌ను కుదిపేసే అవకాశం ఉండడం వల్ల రహస్యంగా ఉంచాలని విదేశాంగ శాఖ సూచించింది. భారత్‌కు అమెరికా అణు పరిజ్ఞానాన్ని విక్రయించ బోదని ఆ లేఖలో స్పష్టం చేశారు. భారత్ మళ్లీ అణు పరీక్షలు నిర్వహిస్తే అణు సరఫరా నిలిపివేయాలని పేర్కొనడంతో అమెరికా అసలు రంగు బయటపడింది.

పాకిస్తాన్‌లో జడ్జీల పునఃనియామకం

పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ముషార్రఫ్ తొలగించిన అరవై మంది న్యాయమూర్తులలో ఎనిమిది మందిని ప్రభుత్వం తిరిగి నియమించింది. ఈ మేరకు సింధ్ హైకోర్టుకు చెందిన ఎనిమిది మంది జడ్జీలు బుధవారం కరాచీలోని గవర్నర్ హౌస్‌లో ప్రమాణం చేశారు. అంతేగాక సెప్టెంబర్ 30న మరో నలుగురు జడ్జీలను ప్రభుత్వం పున నియమిస్తుంది. లాహోర్ కోర్టు న్యాయమూర్తులైన వీరిచేత ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు.

హిల్లరీ మద్దతు ఒబామాకే

అందరి ఊహాగానాలను పటాపంచలు చేస్తూ హిల్లరీ క్లింటన్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్న బారక్ ఒబామాకు మద్దతు ప్రకటించారు. తన లక్షలాది మద్దతుదారుల సమక్షంలో ఆమె ఈ ప్రకటన చేశారు. డెమోక్రాట్ల తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి ప్రైమరీ ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లుగా ఒబామాతో పోటీపడ్డ హిల్లరీ క్లింటన్ ఎట్టకేలకు బరినుంచి వైదొలిగారు. అయితే ఉపాధ్యక్ష పదవి ఆశించినప్పటికీ ఆ స్థానానికి జోసఫ్ బిడెన్ పేరు ఖరారు కావడంతో ఆమె కొంత నిరాశ చెందారు. దీంతో డెమోక్రాట్ల మధ్య భేదాభిప్రాయాలు వస్తాయని అంతా ఊహించినప్పటికీ హిల్లరీ మాత్రం చివరికి ఒబామాకే మద్దతు ప్రకటించారు.

పాక్ అధ్యక్షుడిగా జర్దారీ ఎన్నిక

పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) అధ్యక్షుడు, మాజీ ప్రధాని దివంగత బేనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ జర్దారీ పాకిస్తాన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి మాజీ సైనికాధ్యక్షుడు జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ ఆగస్ట్‌లో రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఎన్నికలు జరిగాయి. పార్లమెంట్‌లో పోలైన 426 ఓట్లలో 291 ఓట్లు జర్దారీకి వచ్చాయి. పాకిస్తాన్ ముస్లిం లీగ్ అభ్యర్థి సయీద్ ఉజ్ ఉమాన్ సిద్దిఖీ 111 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. దీంతో అధ్యక్ష, ప్రధాని పదవులు రెండూ పిపిపి కే లభించినట్టయింది.

అణు ఒప్పందానికి ఎన్ఎస్‌జి ఆమోదం

భారత్-అమెరికా అణు ఒప్పందానికి, భారత్‌తో అణు వాణిజ్యం చేయడానికి అవసరమైన మినహాయింపులకు 45 అణు సరఫరా దేశాల కూటమి (ఎన్ఎస్‌జి) ఆమోదం తెలిపింది. అణు వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందం (సిటిబిటి) పై సంతకం చేయనప్పటికీ భారత్‌తో అణు వ్యాపారం చేయడానికి ఎన్ఎస్‌జి సభ్య దేశాలు అంగీకరించాయి. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో సెప్టెంబర్ 4 నుంచి 6 వరకు మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరిగాయి.

భయాందోళనల మధ్య బిగ్‌బ్యాంగ్ ప్రయోగం

ప్రపంచ వినాశనానికే హేతువన్న వదంతులు, ఆందోళనల నడుమ విశ్వం పుట్టుక రహస్యాలు తెలుసుకునే లక్ష్యంతో బిగ్‌బ్యాంగ్ ప్రయోగపు తొలి అంకం సెప్టెంబర్ 10న విజయవంతంగా పూర్తయింది. ఈ ప్రయోగానికి సుమారు 770 కోట్ల డాలర్లు ఖర్చవుతుంది. వేలాది మంది శాస్త్రవేత్తలు ఈ ప్రయోగంలో భాగస్వాములయ్యారు. అయితే ఈ ప్రయోగం వల్ల కృష్ణబిలాలు పుట్టుకొస్తాయని కొందరు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి అంకం విజయవంతం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చావెజ్ హత్యకు అమెరికా కుట్ర

వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ను హత్య చేసేందుకు జరుగుతున్న కుట్రకు అమెరికా సహాయ సహకారాలు అందిస్తోందని ఆ దేశ విదేశాంగ మంత్రి నికోలస్ మదురో ఆరోపించారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే మూడు రోజుల్లోగా దేశం విడిచి వెళ్లాలని వెనిజులా విధులు నిర్వర్తిస్తున్న అమెరికా రాయబారిని చావెజ్ ఆదేశించారు.

అమెరికా ఎంబసీపై ఆత్మాహుతి దాడి

యెమెన్ దేశ రాజధాని సనాలోని అమెరికా రాయబార కార్యాలయం పై బుధవారం ఉగ్రవాదులు కారుబాంబులు, రాకెట్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓ భారతీయ మహిళతో సహా 16 మంది మరణించారు. మృతుల్లో ఆరుగురు యెమెన్ సైనికులు, నలుగురు పౌరులు ఆరుగురు ఉగ్రవాదులు ఉన్నట్లు ఆ దేశ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్‌కు చెందిన రాణి కృష్ణన్ నాయర్ (26) ఉగ్రవాదులకు, సైనికులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో తూటాలకు చిక్కుకొని బలయ్యారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 ఆగస్ట్ నుండి 20 సెప్టెంబర్ వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**
ఆదిలాబాద్	10	–	28	–	–	–	11	7	–	2	29	30	41	–	–	–	2	4
హైదరాబాద్	–	–	32	–	–	–	6	19	–	–	46	51	–	–	–	–	22	–
కరీంనగర్	7	3	50	–	–	–	7	–	–	–	14	21	20	–	–	–	7	3
ఖమ్మం	6	–	33	–	–	–	5	4	–	12	30	21	69	–	–	–	–	1
మహబూబ్‌నగర్																		
రంగారెడ్డి	6	–	26	–	–	–	3	15	1	11	26	25	12	–	–	–	9	–
నిజామాబాద్	–	–	44	–	–	–	10	–	–	16	7	34	–	–	–	–	–	–
నల్గొండ	1	–	42	–	–	–	4	11	–	–	22	94	11	–	–	–	–	–
శ్రీకాకుళం	–	–	9	–	–	–	12	–	–	–	26	17	22	–	–	–	–	–
తూర్పు గోదావరి	–	–	34	–	–	–	7	6	–	–	42	49	8	–	–	–	6	–
గుంటూరు	10	2	1	–	–	–	28	3	–	2	45	52	3	–	–	–	3	–
కృష్ణా	4	–	21	–	–	–	12	–	1	4	28	27	3	–	–	–	4	4
విజయనగరం	2	–	10	–	–	–	6	4	–	–	18	21	4	–	–	–	–	5
విశాఖపట్నం	–	–	12	–	–	–	–	3	–	1	17	7	4	–	–	–	–	4
చిత్తూరు	–	–	12	–	–	–	12	6	–	2	56	–	20	–	–	–	–	–
ప్రకాశం	–	–	10	–	–	–	3	7	–	7	42	–	8	–	–	–	–	5
*ఇతర జిల్లాలు	5	–	65	–	–	–	11	11	–	13	40	41	42	–	–	–	2	–
మొత్తం	**51**	**5**	**409**	**–**	**–**	**–**	**137**	**96**	**2**	**166**	**488**	**530**	**267**	**–**	**–**	**–**	**55**	**26**

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు :
హైదరాబాద్ – డి. విజయభాస్కర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; కరీంనగర్ – ఎల్. సంతోష్; నల్గొండ – డి. మహేష్;
నిజామాబాద్ – ఎం. నర్సయ్య; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; శ్రీకాకుళం – సుధీర్; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; కృష్ణా – బి. రమేష్‌బాబు;
తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; ప్రకాశం – ఎన్. రవికుమార్; చిత్తూరు – పలమనేరు బాలాజి; * ఇతర జిల్లాల సమాచారం

వీక్షణంలో వ్యాపార ప్రకటనల గురించి....

వీక్షణం ప్రతి సంచికలోనూ అచ్చవుతున్న ప్రభుత్వ ప్రకటన గురించి, ఇటీవల అచ్చయిన కొన్ని వ్యాపార ప్రకటనల గురించి కొందరు గౌరవనీయ మిత్రులు తమ అభ్యంతరాలను, సందేహాలను వ్యక్తం చేశారు. అటువంటి అభ్యంతరాలే, సందేహాలే మరికొందరు మిత్రులలో, అభిమానులలో కూడ ఉండవచ్చు.

ఏ పత్రిక అయినా అచ్చువేసే వ్యాపార ప్రకటనలతో ఆ పత్రికకు ఏకీభావం ఉండాలనే నియమమేమీలేదు. ఆ వ్యాపార ప్రకటనలను స్వీకరించడమాలేదా అన్నది పత్రిక ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. పత్రికారంగ ఆర్థిక స్థితికి సంబంధించిన విషయం. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం అమ్మకాల ఆదాయం మీద మాత్రమే ఆధారపడి ఏ పత్రికా నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం పత్రిక ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మాత్రమే పూరించగలుగుతుంది. అందువల్లనే పత్రికారంగం సాధారణంగా వ్యాపార ప్రకటనల ద్వారా ఆ లోటును పూరించుకోవడం మాత్రమే గాక లాభాలు కూడ చేసుకుంటుంది. వీక్షణం వంటి ప్రత్యామ్నాయ పత్రికలకు లాభాల సంగతి అలా ఉంచి, కనీస మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులయినా కావాలి. అందుకోసం కొన్ని వ్యాపార ప్రకటనలనయినా అంగీకరించకతప్పదు.

ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలన్నిటినీ పెద్ద పత్రికలు, పాలకపార్టీ ఆశ్రిత పత్రికలు, పైరవీకారులు కబ్జా చేస్తున్నారని, ఆ ప్రకటనల విధానంలో పారదర్శకత ఉండాలని, చిన్న పత్రికలకు ప్రాధాన్యత ఉండాలని ఎంతో కాలంగా ఆందోళన జరిగిన ఫలితంగా కొన్ని సంవత్సరాల కింద ప్రభుత్వ ప్రకటనలలో చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంతభాగం కేటాయించాలనే నిబంధనలు అమలులోకి వచ్చాయి. అందువల్ల వీక్షణంకు వస్తున్న ప్రభుత్వ ప్రకటన చిన్న పత్రికల హక్కుగా వస్తున్నదే తప్ప వీక్షణంలో అచ్చయ్యే రచనల మీద ప్రభావం వేయగలిగినది కాదు. నిజానికి ఆ ప్రకటన వల్ల వీక్షణం తన వైఖరిలో ఎప్పుడయినా ఏ మెతకవైఖరినయినా ప్రదర్శించి ఉంటే ఎవరయినా దాన్ని ఎత్తిచూపి సరిదిద్దవచ్చు.

పత్రిక నిర్వహణ కొరకు వ్యాపార ప్రకటనలను స్వీకరించకతప్పని దుస్థితిలో అవి రచనల మీద ప్రభావం వేయకుండా జాగ్రత్త పడడం తప్ప ప్రస్తుతానికి మరేమీ చేయగల అవకాశం లేదు. వ్యాపార ప్రకటనలను ఎంతమాత్రం స్వీకరించబోమని ప్రకటించాలంటే పత్రికకు విస్తారమైన ప్రజాసంఘీభావం ఉండాలి. అది ఆర్థిక స్వావలంబనగా మారగలిగిన స్థితి ఉండాలి. లేకపోతే కొంతకాలం విరాళాలమీదనో, అప్పుల మీదనో నడిపి ఆ తర్వాత పత్రికను ఆపివేయడం మినహా మరోమార్గం లేదు. ఈ అంశాలను పాఠకుల, అభిమానుల దృష్టికి తీసుకురావడం మా బాధ్యతగా భావిస్తున్నాం.

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.

ఫాక్స్, ఫోన్ : 040-66843495, ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com

సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

RNI Regn.No.APTEL/2003/11482 • Published 29/09/2008 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

ఈ నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.



ఈ రోజు నాకు కొత్త జీవితం దొరికింది. ఈ నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. మధ్యలోనే ఆరిపోతుందనుకున్న నా జీవితానికి నిండు నూరేళ్ళు ప్రసాదించిన రాజీవ్ ఆరోగ్యశ్రీకి కృతజ్ఞతలు

- రాష్ట్రంలో 7.5 కోట్ల మంది పేదలకు ఉచిత వైద్యం
- ప్రమాదకరమైన గుండె జబ్బులు, క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధులతో పాటు సుమారు 850 రకాల వ్యాధులకు చికిత్స
- ప్రతి మండలానికి విస్తరించనున్న 108 అంబులెన్స్ సేవలు
- ఇంతవరకూ 190 కోట్ల రూపాయలతో 45 వేల శస్త్రచికిత్సలు





ప్రియమైన సోదరసోదరీమణులారా!

పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. లక్షలాదిమందికి కొత్త జీవితాన్నిచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నాం. పేదల ఆరోగ్యమే నాకు మహా భాగ్యం. ఈ తృప్తి చాలు...

మీ వై.యస్.రాజశేఖర రెడ్డి.

జారీచేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

R.O.No. 464'/Sou/Advt.I/2008-09

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao